

# సూర్యదేవర రామ్ మోహన రావు

Your Favorite Novelist

79th Novel

Author of Highest Number of Novels In Telugu



© Suryadevara Ram Mohan Rao
all novels are under Copy Right Act

# స్త్రీ విజయం వెనుక పురుషుడు

For My eNovels : www.kinige.com

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125వ నవలకు చేరువవుతున్న మీ అభిమానరచయిత
**The Number One Best Selling Author**


# సూర్యదేవర
# రామ్‌మోహనరావు


# స్త్రీ విజయం వెనుక పురుషుడు


Ph : 2438659

**సత్యవాణి పబ్లికేషన్స్**

మాచవరం, విజయవాడ – 520 004.

# STHRI VIJAYAM VENUKA PURUSHUDU

(Serialised in 'Swathi' weekly)

By
**SURYADEVARA RAM MOHANA RAO**
Sri Venkata Anantha Sai Nilayam
Plot No.63, Road No.71
Nava Nirman Nagar, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
**SATYAVANI PUBLICATIONS**
Machavaram, Vijayawada - 520 004
Phone : 9652488668

Edition : **2020**

Price :
**₹. 150-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
Vijayawada.

# స్త్రీ విజయం వెనుక పురుషుడు

ప్లాజా స్టార్ హోటల్.

సమయం సాయం సమయం.

ఎ.సి. రెస్టారెంట్‌లోని కార్నర్ టేబుల్.

ఆ టేబుల్‌కి అటు ఒకరు, ఇటు ఒకరుగా అక్కడ సమావేశమైన ఇద్దరు ఏవో ఫైనాన్షియల్ మేటర్ గురించి గుంభనగా చర్చిస్తున్నారు.

ఆ ఇద్దరిలో ఒకరు ప్రకాశరావుగారు.

ఆయన నగరంలోని ఒక కార్పొరేట్ బ్యాంకుకి ఎం.డి. వయసు అరవై పైనే. ఆజానుబాహుడు. తగిన లావు, వైట్ అండ్ వైట్ సూట్‌లో చాలా హుందాగా, గంభీరంగా వున్నాడు. ఆయన డ్రస్సేకాదు. జుత్తుకూడా తెలుపే.

ఆయన ఎదురుగా కూర్చున్న యువతి పేరు వెన్నెల.

ఆత్మీయులు ఆమెను వెన్నా అని పిలుచుకుంటారు.

అది చిన్నప్పట్నుంచి ఆమె ముద్దుపేరు.

వెన్నెల అంటే వెలుగునిచ్చేది.

యస్... ఆమె ప్రజన్స్‌తో ఆ ఎ.సి. రెస్టారెంట్‌కే వెలుగు వచ్చినట్టుంది. మసక వెలుగులో కూడా చాలా కళ్ళు ఆమెనే చూస్తున్నాయి. ఆమె అందం చూసి ఆమెకా పేరు పెట్టారా, లేక పేరుపెట్టాక ఆమెకా అందం వచ్చిందా అంటే చెప్పటం కష్టం.

ఆమె వయసు పాతిక.

ఇండియాలోనే యువ మహిళా ఇండస్ట్రియలిస్ట్‌గా మోస్ట్ పాపులర్ ఫిగర్. ఆమె అందం అయస్కాంతం. ఆమె చూపులు చురకత్తులు.

అందానికి నిర్వచనం ఆమె.

అందని అగాదం వంటిది ఆమె అంతరంగం.

తన డ్రీమ్‌లాండ్ ప్రాజెక్ట్ గురించి ఆమె క్లుప్తంగా వివరిస్తుంటే ఆసక్తిగా విన్నాడు ప్రకాశరావు. అబ్బురపడ్డాడు. తల విదిలించాడు. 'ఈ అమ్మాయిని అర్థంచేసుకోవటం చాలా కష్టం. హైసొసైటీ డైనమిక్ లేడీ మాత్రమే కాదు. ఆమె ఆలోచనలు, పథకాలు కూడా ఆ రేంజ్‌లోనే వున్నాయి. వెరీ వెరీ ఇంట్రస్టింగ్ లేడీ' మనసులోనే అనుకున్నాడు ప్రకాశరావు.

ఆమె అడిగిన విషయాలకు అంగీకరిస్తున్నట్లుగా తలవూపుతూ ఆమె ముఖంలోకి చూసి కళ్ళజోడు సవరించుకున్నాడు. ఆమె కూడా వైట్ గ్లాసెస్ కళ్ళజోడు ధరించి వుంది. అది ఆమె ముఖానికి మరింత శోభను సంతరిస్తోంది.

"ఓ.కె. మిస్ వెన్నెల! ఐ అండర్‌స్టాండ్. బట్! సెక్యూరిటీ చాలదు. మరింత సెక్యూరిటీ కావాలి. మా పెట్టుబడి జాగ్రత్త కోసం" కుండ పగలగొట్టినట్టు నిర్మొహమాటంగా అడిగాడాయన.

"పెట్టుబడా... సార్! నేనడిగింది లోన్" గుర్తుచేసింది.

ఆ బ్యాంకర్ ముఖంలో అదే చిరునవ్వు. కొంచెంకూడా షాక్‌లేదు. రిలాక్స్‌గా సీట్‌కి జేరబడుతూ ఆమె వంక చూశాడు.

"యస్. టెక్నికల్‌గా అది లోనే... మీ చేతికి రాగానే పెట్టుబడి అవుతుంది. లాభాలొస్తే సరి. లేకపోతే మాకూ కష్టమేకదా? కృషీ బ్యాంకు కాస్తా దుఃఖ బ్యాంకు అయినట్టు" అంటూ చిన్న నవ్వు విసిరాడు.

వెన్నెల కూల్‌గా వింది.

అతడు చెప్పిన హోటల్‌కి వచ్చి యిలా కలవటంతో–

అతడిది పైచేయి అయింది.

తనదే తప్పు... కానీ అవసరం కూడా తనది. తప్పదు.

"మీరు ఇంట్రస్ట్ ఎలా వేస్తారు? ఐ మీన్... వడ్డీ?" అడిగింది.

అతను చెప్పాడు.

ఆమె ఫేస్ ఫీలింగ్స్ అనూహ్యంగా మరాయి.

"మీది బ్యాంకా, మాఫియానా?" నిర్మొహమాటంగా అడిగింది.

అతడిలో కాస్త అసహనం.

"నో! నో... మాఫియా అనటం ఏం బాగాలేదు. చూడమ్మా! మా బ్యాంక్ లావాదేవీలన్నీ చాలా సరళంగా వుంటాయి. మీకెలాంటి ప్రాబ్లమ్స్ ఉండవు. మా బ్యాంకు ఎంబ్లమ్ మీద కేప్షన్ ఏమిటో తెలుసా? నో ప్రాబ్లమ్స్" అంటూ ప్రాబ్లమ్ తీరిపోయినంత రిలీఫ్‌గా చూశాడాయన.

ఆయన చూపులు తన ఫేస్ నుంచి తను వేసుకున్న డ్రస్‌వైపు జారటం వెన్నెల గమనించింది. తన అందం, ఆకర్షణ సరైన డ్రస్‌ల సెలక్షన్ అన్నీ వైరైటీగా, స్టన్నింగ్‌గా వుంటాయి.

టాప్ బిజినెస్ మేన్ అయిన యుగంధర్ కూతురుగా కాకుండా స్వశక్తితో ఎదిగిన యువతిగా ఆమెకి వ్యాపార వర్గాల్లో మంచి పేరు, గౌరవం వుంది.

"సారీ ప్రకాశరావుగారూ! మీ వడ్డీ నాకు కుదరదు. మరో బ్యాంకు చూసుకోమంటారా?" చిన్న జర్క్ ఇచ్చి చూసింది. నిజానికి తన ప్రాజెక్టుకి అప్పుకోసం తిరగని బ్యాంకులేదు. ఏ బ్యాంకూ ధైర్యంచేసి తనకు లోను

యివ్వటానికి ముందుకు రాలేదు. ఆ విషం తెలిసినట్టు ప్రకాశరావు తొణకని చిరునవ్వుతో–

"మీరు చాలా బ్యాంకుల్ని సంప్రదించారు. నాకు తెలుసు. చివరి ప్రయత్నంగా మా వద్దకొచ్చారు. మీ డ్రీమ్‌లాండ్ ప్రాజెక్ట్ రాజధానికి హైలెట్‌గా నిలుస్తుంది. ఐ నో దట్. మీకు మరో విషయం కూడా ముందే చెప్తున్నాను. మీరడిగిన లోన్‌కి మీరు తనఖా పెడతామంటున్న ఆస్తులు సరిపోవు" సూచించాడు.

"మీకింకా కావాలా?"

"కొండాపూర్‌లో మీరు కట్టిన సిలికాన్ వ్యాలీ పెట్టండి సరిపోతుంది."

వెన్నెల బి.పి. ఒక్కసారిగా డౌనయింది.

ఒళ్ళంతా చల్లబడుతున్నట్టనిపించింది.

"అదెలా కుదురుతుంది? ఆ సిలికాన్ వ్యాలీమీద హెచ్.ఎఫ్.డి.సి. బ్యాంక్ మార్టిగేజ్ వుంది. ఆ విషయం మీకు తెలీందికాదు" అంది చిన్నగా.

"తెలుసు. తొంభైకోట్లు తీసుకున్నారు. ఆ డబ్బు మేం చెల్లించి సిలికాన్ వ్యాలీని మా తనఖా కిందికి తెస్తాం" చాల స్థిరంగా తన అభిప్రాయం చెప్పాడు ప్రకాశరావు.

ఇబ్బందిగా చూసింది వెన్నెల.

"నా లైఫ్‌ని రిస్క్‌చేసుకుని ఆ సిలికాన్ వ్యాలీని కట్టి సక్సెస్ అయ్యాను. అది నా ప్రాణం. దాన్ని ఇలాంటి రిస్క్ ప్రాజెక్ట్ కోసం తనఖా పెట్టలేను" అంది.

"వాస్తవం నాకు తెలుసు. మీ స్థానంలో నేనున్నా అంతే. కోటీశ్వరుడి కూతుర్నివై వుండికూడా అతడి నుంచి ఒక్క పైసా కూడా ఆశించకుండా స్వశక్తితో మీరీ స్టేజ్‌కి వచ్చారు. గ్రేట్! నిజానికి మీ స్థానంలో నేనుంటే ఈ డ్రీమ్ ప్రాజెక్ట్‌ని మర్చిపోయేవాడిని. ఇప్పటికే బంగారం లాంటి ప్రాజెక్టులు కట్టారు. చాలవా? జీవితంలో యవ్వనం అనేది వసంతం లాంటిది. హాయిగా లైఫ్‌ని ఎంజాయ్ చేయక ఇన్ని రిస్కులు, టెన్షన్‌లు అవసరమా... పెద్దవాడిగా నా సలహా అనుకో."

"మీ సలహాకి థాంక్స్. ప్లాన్డ్‌గా వర్క్‌చేసి సక్సెస్‌లను చేజిక్కించుకోడంలోనే నాకు ఆనందం. అందుకోసం రిస్క్ తీసుకోడానికి వెనుకాడను. ఓ.కె. సిలికాన్ వ్యాలీని తనఖా పెడతాను... తర్వాత?" ఇంకా ఏమిటన్నట్లు చూసింది.

"కోలేటరల్ సెక్యూరిటీగా మీ భాగస్వాముల ఆస్థులు కూడా సెక్యూరిటీగా పెట్టాలి."

మరోసారి బి.పి. డౌన్ అయింది వెన్నెలకి.

"అదెలా?... నా ఆస్థుల విషయంలో రిస్క్ తీసుకోగలను. పార్టనర్స్... వాళ్ళెందుకు రిస్క్ తీసుకుంటారు? అదీ నాకోసం?" అడిగింది.

"ఈ ప్రాజెక్టులో కూడా వాళ్ళని భాగస్వాముల్ని చేస్తే... తప్ప కుండా తీసుకుంటారు. నిజం చెప్పాలంటే, ఇంత పెద్ద ప్రాజెక్ట్ మీద రిస్క్ చేయటం నాకిష్టంలేదు. పార్టనర్స్ వుంటే మేమిచ్చే లోన్‌కి భద్రత ఎక్కువ కదా! మరో విషయం కూడా చెప్తాను.

పందొమ్మిదివందల ఎనభైఒకటో సంవత్సరంలో ఏడుగురు వ్యక్తులు కలిసి కేవలం పదివేల రూపాయల పెట్టుబడితో ఒక పడకగదినే ఆఫీస్‌గా మార్చి ప్రారంభించిన సంస్థ ఇన్ఫోసిస్. ఇప్పుడది ఏ స్టేజిలో వుందో తెలుసా? కంపెనీ పది రూపాయల షేరు పదివేలు దాటి చాలా కాలమైంది. అదీ టీమ్ వర్క్ అంటే. నీ ప్రాజెక్ట్‌లో కూడా భాగస్వాములుంటే సక్సెస్ రేట్ ఎక్కువుంటుదని నా అభిప్రాయం" వివరించాడాయన.

సరిగ్గా ఇదే విషయం వెన్నెల మదిలోనూ వుంది.

ఒంటరిగా కంటే భాగస్వాములతో కలిస్తేనే ప్రాజెక్ట్ గ్రాండ్ సక్సెసవుతుంది. ఈ విషయం సిలికాన్ వ్యాలీ అప్పుడు అనుభవం అయింది. ఇప్పుడు మాత్రం ఒంటరిగా...తనే ఎందుకు ఎదురీదాలి? ఈ ప్రాజెక్ట్‌లో కూడా పార్టనర్స్‌ని కలుపుకుని ముందుకు పోవటమే మంచిది.

ఆమె ఆలోచనలో పడిందని గుర్తించాడు ప్రకాశరావు.

"వెన్నెల – ప్రాజక్ట్ నీది, వ్యాపారం నీది. అఫ్‌కోర్స్! పార్టనర్స్ వున్నా లేకపోయినా మీకున్న ఇమేజ్‌ని దృష్టిలో వుంచుకుని, మీ ఒక్కరి కయినా లోన్ యిప్పిస్తాను. అయినా నీ శ్రేయుస్సు కోరి అలా

సలహాయిచ్చాను. ఎనీవే – రాత్రికి ఆలోచించి ఉదయం ఏ విషయం ఫోన్ చేసి చెప్పు" అంటూ సీట్లో చిన్నగా కదిలాడు.

"ఇంత తక్కువ టైంలో..."

"నిర్ణయం తీసుకోడానికి ఒక్క క్షణం చాలు. డబ్బనేది జీవనదిలా అలా ప్రవహిస్తూనే వుండాలి. అప్పుడే లాభాల పంట పండుతుంది. మూటకట్టి మూలన పెడితే నష్టమే. చివరిగా ఓ సలహా ఇచ్చి నేను బయలుదేరనా?"

"చెప్పండి."

"ఇప్పటికైనా ఈ ప్రాజెక్ట్ ఐడియాని వదిలిపెట్టు. పెద్దవాడిగా, వెల్‌విషర్‌గా చెపుతున్నాను. డిగ్రీ చదివే వయసులోనే కోట్ల ఆస్తులు ఆర్జించావు. పేరు ప్రతిష్ట అన్నీ వున్న నిన్ను చూస్తే నగరంలోని అమ్మాయిలు అసూయ పడేంతగా ఎదిగావు. ఈ ప్రాజక్ట్ సక్సెసయితే నీకు కొత్తగా వచ్చేది ఏమీ లేదు. కాని ఫెలయితే సంపాదించిందంతా పోగొట్టుకుంటావ్. అఫ్‌కోర్స్! వీధిన పడవనుకో. మీ నాన్నగారి ఆస్తి ఎలాగూ వుంది" అంటూ ఆగాడు.

"నాన్నగారి ఆస్తా....ఆ టాపిక్ వద్దు ప్లీజ్! ఈ రోజు నేనీ స్థాయిలో వున్నానంటే కారణం రిస్క్ తీసుకుని కష్టపడి పనిచేయటమే. మరోసారి రిస్క్ తీసుకోడానికి భయపడను" అంది వెన్నెల.

ఉన్నట్టుండి పైకి లేచాడు ప్రకాశరావు.

"లెటజ్‌గో..." అంటూ బయటకు అడుగులు సారించాడు.

అతన్ని అనుసరించింది వెన్నెల.

ఒక యువరాణిలా ఆమెలో అందం, ఠీవి చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. రెస్టారెంట్‌లోని అనేక జతల కళ్ళు సూర్యుడి వైపు వాలేపొద్దు తిరుగుడు పుష్పాల్లా ఆమె వెంటే అనుసరిస్తున్నాయి.

నడుస్తూనే ప్రకాశరావు ఆమెకు మాత్రమే విన్పించేలా గొంతు తగ్గించి మాట్లాడుతూనే వున్నాడు.

"వెన్నెల...బిల్‌గేట్స్ నుంచి అంబానీ దాకా అంత సక్సస్ సాధించారంటే కారణం రిస్క్ తీసుకోబట్టే. కాదనను...అలాగే సరైన టైంలో తీసుకునే

రిస్క్ మాత్రమే సక్సస్‌నిస్తుంది. టైమింగ్ వెరీ ఇంపార్టెంట్. టైమింగ్ మిస్సయితే ఫెయిల్యూర్ సునామీలా మీదకు విరుచుకుపడి తుడిచేస్తుంది. అంచేత బాగా ఆలోచించుకో, జీవితంలో హేపీ లైఫ్ కావాలో, అతిపెద్ద రిస్క్ కావాలో...ఛాయిస్ ఈజ్ యువర్స్...బై....."

అప్పటికే ఇద్దరూ పార్కింగ్‌లోని వచ్చేసారు.

ప్రకాశరావు తన కార్లో కూర్చున్నాడు.

డ్రయివర్ కారుని పోనిచ్చాడు.

చివరి క్షణంలో కూడా అయన మనసులో ఏముందో ముఖంలో చదవాలని ఆమె చేసిన ప్రయత్నం ఫలించలేదు. అలా నిర్వికారంగా ముఖాన్ని వుంచి, మనసులో విషయాలు ముఖంలో ప్రతిఫలించకుండా జాగ్రత్త పడ్డం అందరికీ సాధ్యం కాదు. వయస్సు, వ్యాపారం, అనుభవం ఇవి మూడూ పండిన వాళ్ళకే అది సాధ్యం. అందుకే ప్రకాశరావు విషయంలో ఆయన అసలు ఉద్దేశం గాని, తన పట్ల నిజమైన అభిప్రాయం ఏమిటనే విషయం గాని ఆయనతో అంత సేపు కూర్చున్నా అంచనా వేయలేక పోయింది వెన్నెల.

ఆలోచిస్తూనే తన కారులో కూర్చుని డోర్ మూసింది.

డ్రయివర్ కారుని పోనిచ్చాడు. ఆమె కారు గేటులోకి వచ్చేసరికి ప్రకాశరావు కారు అప్పటికే ట్రాఫిక్‌లో అదృశ్యమైంది.

* * * * *

ముఖ్యమంత్రి నివాసం.

గేట్‌లోని వస్తున్న తెల్లటి కారుని చూడగానే అక్కడి సెక్యూరిటీ గార్డులు సెల్యూట్ చేసారు. ఆ కారులో వున్నది. కె.ఎస్.నందా. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ. ఢిల్లీ కేడర్‌కు చెందిన ఐ.ఎ.ఎస్. ఆఫీసర్.

ముఖ్యమంత్రులు మారినా ఆయన అదే పోస్ట్‌లో వున్నాడంటే కారణం ఆయన నిజాయితీ. వృత్తిలో ఆంకిత భావం.

కారు దిగి లోనకొచ్చిన నందా–

సి.యం. ఆఫీస్‌లోకి అడుగు పెట్టాడు.

అక్కడ ప్రభాకర్ ఆయన్ని విష్ చేసాడు.

ప్రభాకర్ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు. అతడు సి.యం.కి మిత్రుడు గాబట్టి స్పెషల్ పోస్ట్ కొట్టేయటం ముందునుంచీ నందాకు నచ్చలేదు. ఎంతో శ్రమించి సివిల్స్‌లో ఫస్ట్ ర్యాంక్ పొందిన తను రాజకీయ నాయకులకు, వారి మిత్రులకి తల వంచి పని చేయాల్సిరావటం...ఈ ప్రజాస్వామంలోని అతి దరిద్రమైన విచిత్రం అన్పించేది.

లోక్‌సత్తా జయప్రకాష్‌నారాయణ్‌లా తనూ ఐ.ఎ.ఎస్.కు రాజీనామా చేయాలనిపించినా ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు అడ్డువడ్డాయి.

"హలో మిస్టర్ నందా...ప్రస్తుతం ఎలా వుంది మీ గుండె?" తన సహజ ధోరణిలో పలకరించాడు ప్రభాకర్. అతడిదో విచిత్ర తత్వం. పరిపాలనా విషయాల్లో గాని, ఇతర లావాదేవీల్లోగాని కటువుగా వుండే అతను ఇతరుల ఆరోగ్యం విషయంలో మాత్రం చాలా సున్నితంగా వుంటూ పరామర్శిస్తుంటాడు.

"ఐయామ్ ఫైన్...." చెప్పాడు నందా.

"ప్రస్తుతం నా గుండెకొచ్చిన డోకా ఏంలేదు. పైగా గుండెపోటు వచ్చి మూడేళ్ళు దాటిందిగా. ఈ కాలంలో గుండెపోటు, తలపోటు ఒకేలా మారాయి. అయినా మంచి ట్రీట్‌మెంట్స్ వున్నాయి. నో ప్రాబ్లం. రోజూ వాకింగ్ చేస్తున్నాను. స్మోకింగ్ రోజుకి రెండు సిగరెట్లు మాత్రమే" అంటూ నవ్వాడు నందా.

సడెన్‌గా సీరియస్‌గా చూసాడు ప్రభాకర్.

"ఐయామ్ సారీ నందా! మీకో బేడ్ న్యూస్" అన్నాడు.

నందాకు అర్ధమైపోయింది.

తనకు ట్రాన్స్‌ఫర్...తట్ట బుట్ట సర్దుకుని తిరిగి ఢిల్లీ వెళ్ళాలి. ప్రభాకర్ అదే చెప్పాడు.

"మీ ఫీలింగ్స్‌ని అర్ధంచేసుకోగలను నందా సాబ్! కొన్ని మన చేతుల్లో లేవు. ఆ విషయం మీకూ తెలుసు. ఇప్పుడు మీరు ఓ సిగరెట్ కాలిస్తే మంచిదనుకంటాను. రండి– అలా బయట లాంజ్‌లో కూర్చుందాం" అంటూ

సిగరెట్ ఆఫర్ చేసాడు ప్రభాకర్. కాదనలేదు నందా. లాంజ్‌లో కూర్చుని సిగరెట్లు ముట్టించుకున్నారు.

"ఆ బంజారాహిల్స్ కాంప్లెక్స్ మీ కొంప ముంచింది. నాకు తెలుసు" చెప్పాడు ప్రభాకర్.

"ఆ కాంప్లెక్స్ ఎవరిదో మీకు తెలుసు. ఆయన ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి క్లోజ్. అంతమాత్రాన మన సి.యం. గారికి శతృవా ఏంటి? ఆ ఫైల్‌ని కాస్త చూసీ చూడనట్టు వదిలేయండి అని చెప్పినా మీరు వినలేదు.

నన్నడిగితే ఆ ఓనర్‌దీ తప్పులేదండి. ఇక్కడ సినీఫీల్డ్ అంతగా విస్తరించకముందు ఎప్పుడో అతడికీ, ఒ సంగీత దర్శకుడికి కలిపి రికార్డింగ్ థియేటర్ కోసం రోడ్డు పక్కన స్థలం కేటాయించి యిచ్చారు. కొన్ని పరిస్థితుల్లో అక్కడ రికార్డింగ్ థియేటర్ నిర్మాణం జరగలేదు. ఇప్పుడేమో ఇంట్లోనే రికార్డింగ్ థియేటర్ పెట్టుకునే స్థాయికి టెక్నాలజీ పెరిగింది. మీకు తెలిసేవుంటుంది. ఎ.ఆర్. రెహమాన్ ఇంట్లోనే పాటల్ని రికార్డ్ చేస్తారు. మరి అంత తక్కువ స్థలం రికార్డింగ్ థియేటర్‌కి సరిపోయాక, మిగతా స్థలాన్ని వాళ్ళు ఏం చేసుకోవాలి? పైగా ఇప్పుడా స్థలం విలువ కోట్లు పలుకుతోంది. అందుకే అక్కడ వాళ్ళు మల్టీప్లెక్స్ కట్టుకున్నారు. గిట్టని వాళ్ళు చేసిన రాద్ధాంతంతో ఈ గొడవ కోర్టుదాకా వెళ్ళింది. దాన్ని మీరు పట్టించుకోవద్దండి అంటే మీరు విన్నారు కాదు.

ఆ కాంప్లెక్స్ ఓనర్‌కి సినీరంగంలో వున్న పలుకుబడి యింతాఅంతా కాదు. అనవసర శతృత్వాలు మన సి.యం.గారికి నచ్చవు. పైగా చాలా పెద్ద స్థాయితో వత్తిడి వచ్చిండి..." అంటూ అడిగాడు ప్రభాకర్.

"ఎవరు? ఆ హెచ్.ఎన్.సి. వాళ్ళేగా?"

(హెచ్.ఎస్.సి. – హై సొసైటీ క్లబ్)

ఈ క్లబ్ కార్యకలాపాలేమిటో, ఎంత పవర్ పుల్లో నందాకే కాదు ప్రభాకర్‌కి... ఇంకా చెప్పాలంటే కీలక పదవుల్లోని చాలామందికి తెలుసు. నందా ఖచ్చితంగా గెస్ చేయటం చూసి గుంభనగా నవ్వాడు ప్రభాకర్.

"అవును. తెలివిగలవాడిని. అందుకేగా ఐ.ఎ.యస్. అయ్యావే. నేనూ సివిల్స్ రాసాను. కాని విధి చూసావా? నీకంటే పైస్థాయిలో నన్ను వుంచింది. ఒప్పుకుంటాను. నాకు జనాకర్షణ లేదు. నీ స్థాయి తెలివీ లేదు. అయితే లాయల్టీ ఒక్కటే వుంది. దాని రాయల్టీ ఇప్పుడు దొరికింది. ఎనీవే ఢిల్లీ నీకు బాగా నచ్చేప్లేసేగా! పైగా స్టేట్‌కన్నా సెంట్రల్ పాలిటిక్స్ మరింత రంజుగా వుంటాయి" అంటూ చిన్న నవ్వు విసిరాడు.

అసలే గాయం నొప్పి. దాన్ని పుల్లతో పొడిచినట్టయింది ప్రభాకర్ మాటలు. సహజంగానే నందాకు చాలా బాధేసింది.

"అంటే నా వృత్తిధర్మాన్ని సరిగా నిర్వర్తించినందుకు నాకిస్తున్న అవార్డాయిది? రానీ...నేరుగా సి.ఎం.తోనే మాట్లాడతాను" అన్నాడే రోషాన్ని ప్రదర్శిస్తూ. అయినా ఎద్దేవా చేసాడు ప్రభాకర్.

"మనది చైనాలా కమ్యూనిస్టు దేశం కాదు. అధికాలు ఏంచెప్పినా అదే వేదం అనటానికి. లుక్! నందా! అధికారం వుందని అన్నిటా రూల్స్ పాటించకూడదు. ఇప్పుడు సి.ఎం.తో మాట్లాడి ఏమిటి లాభం? నేను చెప్పింది ఫైనల్ అని తెలీదా? అయినా మంచి పేరు తెచ్చుకున్నావ్. ఇంకో అయిదేళ్ళకి రిటైరవుతావ్. ఈ టెన్షన్స్ అన్నీ అవసరమా చెప్పు. మళ్ళీ హార్ట్ అటాక్ రావచ్చు. రిటైరయ్యాక హేపిగీ ఏ గోవాలోనో సెటిలవ్వు. ప్రశాంతంగా వుంటుంది" అన్నాడు.

ఇక వారించకుండా చిన్నగా తలవూపి-

మౌనం వహించాడు నందా.

తన బదిలీ వెనక కారణాలు తనకి తెలీనివి కావు. తనలాంటి అత్యంత సమర్థుడ్ని కూడా సి.ఎం. వదులుకున్నాడంటే ఈ హెచ్.ఎస్.సి. వాళ్ళు ఎంతో పవర్ ఫుల్లో అర్థమవుతోంది. వాళ్ళ గురించి తనూ విన్నాడు కాని పెద్దగా పట్టించుకోలేదు. తనలాంటి స్ట్రిక్ట్ అధికారి వాళ్ళకి అక్కర్లేదు. అందుకే తప్పించారు. ఈ దేశం ఎన్నాళ్ళకి బాగుపడుతుంది? సమాధానం దొరకని పిచ్చి ప్రశ్న.

చికాగ్గా బయటికెళ్ళిపోయాడు నందా.

మరునాడే ట్రాన్స్‌ఫర్ కాగితాలు నందా చేతికి అందాయి. తన బదిలీ వెనక వున్న ప్రధానహస్తం అది టైగర్ యుగంధర్‌ది అని తెలుసు. మీడియాతోబాటు అనేక వ్యాపారాలు గల మిడాస్ గ్రూప్ ఛైర్మన్ యుగంధర్‌ని టైగర్ యుగంధర్‌గా ఎందుకు పిలుస్తారో నందాకు ఇప్పుడు అర్థమైంది.

* * * * *

ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామి ఐ.టి. సంస్థ-

'ఇండో కంప్యూటర్స్' సంస్థ.

కేవలం పన్నెండేళ్ళలో జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా పేరు తెచ్చుకున్న ఆ సంస్థకి ప్రెసిడెంట్ విశాల్.

ఉషోదయ వేళ-

బంజారాహిల్స్ రోడ్లమీద బిజీ ఆరంభమైంది.

ఉదయమే జాగింగ్ చేస్తున్న విశాల్ రోడ్ నంబర్ ఎనిమిదిలోకి తిరిగాడు. అక్కడికి దగ్గర్లోనే వుంది ఇండో కంప్యూటర్స్ కాంప్లెక్స్. జాగింగ్ ముగించుకువచ్చిన విశాల్ తన తండ్రి రంగనాథ్ చాంబర్‌లోకి అడుగుపెట్టాడు.

అప్పటికే లేచి కూర్చుని చూస్తున్న రంగనాథ్ విశాలను చూసి దరహాసం చేశాడు. కొడుకును చూసినప్పుడంతా ఆయన మనసు చివుక్కు మంటుంది. నలభై ఏళ్ళకు దగ్గరపడ్డాడు. ఇంకా విశాల్ పెళ్ళి చేసుకోడు. అసలు చేసుకుంటాడో లేదో కూడా తెలీదు. అదే ఆయన దిగులు.

"డాడ్. మీరిప్పుడు ఆరోగ్యంగా కన్పిస్తున్నారు" ఆయన ఎదురుగా కూర్చుంటూ కామెంట్ చేసాడు విశాల్. అది అబద్ధమని యిద్దరికీ తెలుసు. పాతబడిపోయిన బ్లాక్ అండ్ వైట్ ఫోటోలో నెరిసిన తల వెంట్రుకలు, కొద్దిగా ముతలు పడిన ముఖం రంగనాథ్‌లో వయసుతోబాటు తను ఈ స్థాయికి ఎదగటానికి మానసికంగా ఎంత కష్టపడ్డాడో తెలుపుతోంది.

"విశాల్! హెచ్.ఎస్.సి. క్లబ్‌లో నీకు సభ్యత్వం దొరికాక చాలా బిజీఅయిపోయావు. కేవలం ఫోన్‌లమీదే మాటలు. ఈ మొబైల్స్ వచ్చాక

మనుషుల మధ్య పరిచయాలు, బంధాలు తగ్గిపోతున్నాయి" అంటూ పేపరు పక్కన పెట్టాడు రంగనాధ్.

చిన్నగా నవ్వాడు విశాల్.

ఎంత ప్రయత్నించినా రంగనాధ్‌కి హెచ్.ఎస్. క్లబ్‌లో స్థానం లభించలేదు. తనకి గాకుండా తన కొడుక్కి ఆ అవకాశం రావటం రంగనాధ్‌కి రుచించలేదు. తండ్రి ఫీలింగ్స్ విశాల్‌కి కొత్తగాదు. ఆఫీస్‌బోయ్ ఇద్దరికీ టీ ఇచ్చి వెళ్ళాడు.

టి సిప్‌చేస్తూ కొడుకువంక చూసాడు రంగనాధ్.

"మీ అమ్మ పోయాక, చెల్లాయి పెళ్ళి జరిపించాక ఇక ప్రస్తుతం నాకు మిగిలిన బంధం నువ్వొక్కడివే. మిగతావన్నీ ఆర్థిక సంబంధాలే. ఆఫ్‌కోర్స్! టి.వి. మ్యాగజైన్‌లు నాకు కంపెనీ ఇస్తున్నాయనుకో.

"ఓ డాడ్!" అంటూ తండ్రి మాటలకి అడ్డం వచ్చాడు విశాల్.

"మీరు నా పెళ్ళి విషయానికే వస్తున్నారని అర్థమైంది. ప్లీజ్...కొంత టైం పడుతుంది. తప్పసఱ" అన్నాడు.

"ఓ.కె – అవునూ. రాజధానితో సహా రాష్ట్రాన్ని ఏలేది పరోక్షంగా మీ హెచ్.ఎన్. క్లబ్‌వాళ్ళేగా" అంటూ టాపిక్‌ని డైవర్ట్ చేసాడు రంగనాధ్.

"ఇప్పుడా టాపికి అవసరమా డాడ్?" ఖాళీ కప్పు పక్కన పెడుతూ అడిగాడు విశాల్.

"అనవసరమని నేననుకోడంలేదు. చూస్తున్నావ్‌గా. రింగ్‌రోడ్డనీ, టౌన్‌షిప్‌లనీ స్థలాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేసారు. చివరకు హైదరాబాద్ కూడా ముంబయిలాగా మారిపోతుందా అన్పిస్తోంది. అభివృద్ధి జరగాల్సిందే. కాని దాంతోబాటు తలెత్తే సమస్యల మాటేమిటి? వలసల వల్ల మురికివాడలు, డబ్బువల్ల మాఫియాలు, రోజంతా ట్రాఫిక్ జామ్‌లు, డబ్బున్నా మనశ్శాంతిలేని పరిస్థితులోస్తున్నాయి. ఇదంతా మీరు ఆలోచించారా? అభివృద్ధిని ఎప్పుడూ ఒకేచోట కాన్సన్‌ట్రేట్ చేయకూడదు. అది ప్రజలందరికీ నష్టం. వంద, నూట ఏభైఏళ్ళు లక్ష్యంగా ఆలోచించి బ్రిటిష్‌వాళ్ళు ఏ పనయినా చేసేవారు. మన వాళ్ళు కనీసం పది, ఇరవైఏళ్ళ విజన్ కూడా వూహించలేకపోతున్నారు."

"నిజమే... కాని నేను క్లబ్‌లో చేరింది ఈ మధ్యనే. క్లబ్‌లో అందరికన్నా చిన్నవాడ్ని కూడా నేనే. ప్రస్తుతం మీరు మీ ఆరోగ్యంమీద కాన్సన్‌ట్రేట్ చేయటం మంచిది."

"ఇదీ పాయింటే... ఈ మధ్యే ఒళ్ళు ఒణకటం మొదలయింది. పార్కిన్‌సన్స్ అని న్యూరాలజిస్టు చెప్పాడు. ప్రస్తుతానికి టాబ్లెట్స్ నేను వేసుకోడమే. భవిష్యత్తులో న్యూరోసర్జరీ, అది స్టెమ్‌సెల్స్‌తో వస్తే ఫరవాలేదు. లేకపోతే రానురాను బ్రతుకు నరకమే. ప్రాణం పోదు.

రొనాల్డ్‌రీగన్‌ది ఇంకా దారుణమైన జబ్బు. అల్జీమర్స్. ఆయన ఎనభై నాలుగో ఏటనుంచి ఒకప్పుడు తను అమెరికా ప్రెసిడెంట్ అనీ నాన్సీరీగన్ తన భార్య అని కూడా తెలీని స్టేజీ. అతడి కొడుకు ఒకేమాటన్నాడు. నౌ హి యీజ్ ఎ ఫ్రీబర్డ్. ఆ నరకం ఎవరికీ రాకూడదు. అలాంటి స్టేజి రాకముందే నేను వెళ్ళిపోవాలి."

తండ్రి మాటలకి కాస్త విసుగ్గా చూసాడు విశాల్.

"ఇప్పుడవన్నీ ఎందుకు డాడీ! ఇంతకాలం ఐ.టి. రంగంలో మీ వూహల్ని సాకారం చేసుకొని కోట్లకు పడగలెత్తారు. ఆ వూహల్ని ఇప్పుడు అనారోగ్యంవైపు మళ్ళిస్తే ఎలా? ఎలాంటి జబ్బునయిన తగ్గించగల మందులు అందుబాటులోకి రానున్నాయి" అంటూ తండ్రికి నచ్చచెప్పే ప్రయత్నం చేసాడు.

"నువ్వు పూజను వదులుకున్నట్టేనా?" ఈసారి టాపిక్‌ను అటుడైవర్ట్ చేసాడు రంగనాథ్.

పూజ విశాలని గర్ల్‌ఫ్రెండ్.

ఆమెనయినా పెళ్ళి చేసుకుంటాడని ఆశించాడు రంగనాథ్. కాని పూజ ధోరణి వేరు... వ్యాపారంకన్నా తనపైనే శ్రద్ధ చూపాలనే మనస్తత్వం. కెరీర్ కన్నా వ్యక్తిగత బంధాలకి అధిక ప్రాధాన్యతనిస్తుంది. ఆడదాని చుట్టూ తిరిగిన మగాడు తనకు తెలిసి ఎవడూ బాగుపడలేదు. అందుకే ఆమెతో తెగతెంపులు చేసుకున్నాడు విశాల్.

కొడుకు మౌనం చూసి-

భారంగా నిట్టూర్చాడు రంగనాథ్.

"ఇలా గాళ్‌ఫ్రండ్స్‌ని మార్చుకుంటూపోతే ఎలా? ఏ అమ్మాయి అయినా అటెన్షన్ కోరుకుంటుంది. మనం వీలయినంతవరకు చూపాలి. కనీసం నటించాలి. తనని అశ్రద్ధచేసే పురుషుడ్ని ఏ స్త్రీ క్షమించదు, నువ్విప్పుడు హెచ్.ఎస్. క్లబ్ మెంబర్‌వి. వయసు... ఇప్పటికే ఏజ్ బారయింది. నువ్వు పెళ్ళి చేసుకోవాలి" తన అభిప్రాయం చెప్పాడు.

"క్లబ్‌కి నా పెళ్ళికి సంబంధం లేదు."

"ఉంది విశాల్. హెచ్.ఎస్. క్లబ్ రాజకీయాలు నడుపుతోంది. పార్టీలకు విరాళాలు ఇస్తుంది. ఛారిటీ సంస్థలూ నడిపిస్తుంది. అలాగే క్లబ్ సభ్యత్వం వారసత్వంగా కూడా వస్తుంది. నీకు తెలుసో లేదో టైగర్ యుగంధర్ తన తండ్రి స్థానంలోకి వచ్చాడు. అలాగే నీకు కొడుకు పుడితే వారసుడొచ్చాడన్న తృప్తి నాకు వుంటుంది."

"మీరు హెచ్.ఎస్. క్లబ్‌కి ఎందుకింత ప్రాధాన్యతనిస్తారు?"

"పవర్...." వెంటనే చెప్పాడు రంగానాథ్.

"పవర్ అనేది గ్రేట్. కష్టపడి ఐ.ఎ.యస్. చదివిన ఆఫీసర్ కూడా సంతకంరాని రాజకీయనాయకుడు మంత్రి అయితే ఆ మంత్రి మాటలకి కట్టుబడి పనిచేయాలి. చదువు ఆఫీసర్‌దయినా, పవర్ మంత్రిగారిది. అర్థమైందా? హెచ్.ఎస్. క్లబ్ పవర్ అలాంటిది. ఇప్పుడు నువ్వు మేయర్‌కి ఫోన్‌చేస్తే ఏమవుతుంది?"

"సెక్రటరీ అడుగుతుంది. అవసరం అనుకుంటే మేయర్‌కి ఇస్తుంది."

"కాదు... నీ పేరు వినగానే నిన్నేమీ అడగకుండా డైరెక్ట్‌గా మేయర్‌కి కనక్షనిస్తుంది. మీ క్లబ్ గురించి, దాని సభ్యుల గురించి అందరికీ తెలుసు. క్లబ్ పవరేమిటో నీకు తెలీకపోడమే ఆశ్చర్యంగా వుంది. ఓసారి నువ్వు యుగంధర్‌ని కలిసి మాట్లాడు. జస్ట్ ఫార్మాలిటి."

"ఆయన వెరీ బిజీ... సాధ్యంకాదనుకుంటా."

"ఆ మాటకొస్తే నువ్వూ బిజీనే... ఎంత బిజీగావున్నా తప్పదు. నేను ఫోన్‌చేసి ఆ ఏర్పాటు చేస్తాను. నీకు యుగంధర్ కుతూరు వెన్నెల తెలుసా?"

"ఓసారి అవార్డ్ ఫంక్షన్‌లో చూసాను. వెరీ బ్యూటీ అండ్ వెరీ స్మార్ట్."

"యస్... బ్యూటీ ప్లస్ బ్రెయిన్స్ వుండే ఆడవాళ్ళకి ఆవే డెడ్లీ వెపన్స్. తండ్రితో విభేదించి లా చదివి ఆపై రియల్ ఎస్టేట్స్ నుండి నేడు ఫ్యాషన్ స్టోర్స్ వరకు స్వంతంగా ఎదిగిన డైనమిక్ లేడీ. ఆమె తల్లికి యుగంధర్ చాలా కాలం కిందటే విడాకులిచ్చేసాడనుకో. ఇప్పటికే నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్న రసిక చక్రవర్తి" అంటూ చివరలో చిన్న చిరునవ్వు విసిరాడు రంగనాధ్.

"మీ ఉద్దేశం సూటిగా చెపితే బాగుంటుంది." అడిగాడు విశాల్.

ఒక్కమాటలో చెప్పాలంటే నువ్వు వెన్నెలతో పరిచయం చేసుకోమంటాను. అమ్మాయిల్ని డీల్ చేయటంలో "ఎక్స్‌పర్ట్‌వి" కదా. మీ పరిచయాన్ని పెళ్ళివరకు తీసుకురాగలిగితే నిజంగానే నువ్వు ఎక్స్‌పర్‌వని సంతోషిస్తాను" మనసులో మాట చెప్పేసాడు రంగనాధ్.

లేచి బయటికొచ్చేసాడు విశాల్.

అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో వుంది అతని పర్సనల్ హౌస్ కం ఆఫీస్. తిరిగి జాగింగ్ ఆరంభించిన విశాల్ దారి పొడవునా తండ్రి మాటల్ని రివైండ్ చేసుకుంటూ ఆలోచిస్తూనే వున్నాడు.

"రెండు కార్పొరేట్ సంస్థలు కలిస్తే ఇంకా లాభమనా లేక వెన్నెల లాంటి అమ్మాయి అయితేనే తనకు కరక్టనా!" ఏ ఉద్దేశంతో తండ్రి ఈ ప్రతిపాదన చేసాడో తేల్చుకోకముందే అతను ఇంటికి చేరుకున్నాడు.

జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానం ఒకటి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. సుమారు ఆరువందల కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతోంది. ఆ విమానంలో కేంద్ర సహాయ ఆరోగ్యశాఖ మంత్రి శివకృష్ణ ప్రయాణిస్తున్నారు. ఆయన పక్కసీట్లో కూర్చున్న వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ఎమ్.ఎల్.ఏ. నిరంజన్.

రాజ్యసభ సీటు కొట్టేసి, మంత్రిపదవి దక్కించుకున్న శివకృష్ణని గడసరి మనిషి అంటారు. పైగా బి.సి.కి చెందటం, ఒకే పార్టీలో అంటిపెట్టుకు వుండటం ఇంతకాలానికి కలిసొచ్చి మంత్రిపదవి వరించి అప్పులన్నీ తీరి, ఆస్తులు పెరగసాగాయి.

ఇక ఎమ్.ఎల్.ఎ. నిరంజన్‌కి రాష్ట్రరాజకీయాల్లో మంచిపేరు వుంది. అతని తండ్రి మధుసూదన్‌రెడ్డి. ఆయన ఓ ప్రముఖ బ్యాంక్‌కి ఛైర్మన్. ఎంతో పలుకుబడి, హోదావున్న వ్యక్తి. నిజానికి పేరుకి పక్కన రెడ్డి కూడా చోటుచేసుకోవాలి. కాని నిరంజన్‌కి ఆదర్శభావాలు ఎక్కువ. అందుకే కీర్తిశేషులు అంజయ్యగారిలాగే తన పేరులో కూడా కులం తెలీకూడదని రెడ్డిని తొలగించాడు.

శివకృష్ణ, నిరంజన్‌ల సంభాషణ–

రాజకీయాలవైపు మళ్ళింది.

"నిన్ను చూస్తే బాధగా వుంటుంది నిరంజన్. మీ నాన్నగారికున్న పలుకుబడికి నీకు ఎప్పుడో మంత్రిపదవి దక్కాల్సింది. కాని నువ్వు ఎదగటం నీపార్టీలోనే కొందరికి ఇష్టంలేదు. నువ్వు పదవులకోసం పాకులాడవు. నీకు జనంలో మంచి ఫాలోయింగ్ వుంది. దాన్ని కేష్ చేసుకోవు. నన్ను చూడు, పైసా ఖర్చులేకుండా మంత్రినయ్యాను" అన్నాడు శివకృష్ణ.

"నిజమేనండి. మన డెమోక్రసీలో ఎన్ని కలతో పనిలేకుండానే ఎవరయినా ప్రధానమంత్రి కావచ్చు. ఆ తరువాత ఆరుమాసాల్లోపల లోక్‌సభకో, రాజ్యసభకో ఎన్నిక కావటం తప్ప దనుకోండి. మేధావులకోసం ఉద్దేశించేగదా రాజ్యసభ" అంటూ నవ్వాడు నిరంజన్.

శివకృష్ణ భుజాలు తడుముకోకుండా వుండలేకపోయాడు.

'తను మేధావికాదని ఇతని ఉద్దేశమా, లేక బి.సి. కోటా నుంచి రాజ్యసభకి వెళ్ళి మంత్రినయ్యానని వెక్కిరింపా..., తనలో తను ఆలోచించుకున్నాడు.

"నిరంజన్... చిన్నవాడివి. అనుభవం తక్కువ నీకు. చూడు ఈసారి మీ నాన్నగారు నిన్ను ఎం.పి.గా నిలబెడతారు. ఏదోరోజు ఆయన నిన్ను

సి.యం.ని చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అదంతా జరగాలంటే డబ్బుకావాలి. ఆదర్శం వుండాల్సిందే. అదే సమయంలో డబ్బు కావాలి. మంచి పనులు డబ్బులు రాల్చవు" హితబోధ చేస్తున్నట్టు చెప్పాడు.

"ఐ డోన్ట్ కేర్. అబౌట్ మనీ...." నిర్లక్ష్యంగా బదులిచ్చాడు నిరంజన్.

"అవున్లే" అంటూ తలూపాడు శివకృష్ణ.

"మీకు డబ్బుకి లోటేముంది...? పైగా మీ నాన్నగారికి హెచ్.ఎస్. క్లబ్ సపోర్ట్ వుంది" అన్నాడు.

ఆ మాటలు నిరంజన్‌కి రుచించలేదు.

విమానం హైదరాబాద్‌లో లాండయింది.

శివకృష్ణ అందరితోబాటు హడావుడిగా వెళ్ళడం గమనిస్తూనే వున్నాడు నిరంజన్. హడావుడీ, ఆర్భాటాలు నిరంజన్‌కి నచ్చావు. తన తండ్రి ఏర్‌పోర్ట్‌కి కారు పంపిస్తానంటేనే వద్దన్నాడు.

ఇప్పటికీ తన తండ్రిమీద వ్యతిరేకతతోనే తను బ్రతుకుతున్నాడు. ఆదర్శంగా బ్రతకాలను కుంటాడు తను. ఆదర్శాలు కూడు పెట్టవంటాడు ఆయన. తమాషా ఏమంటే, ఆదర్శాల్ని నమ్ముకుని తను ఏమీ సాధించలేకపోయాడు. పైగా ఆయన పలుకుబడిముందు తన ఆదర్శాలు చాలా మటుకు తలవంచక తప్పలేదు.

ఏర్‌పోర్ట్ నుంచి బయటికొచ్చి టాక్సీని పిలిచాడు. టాక్సీ బయలుదేరింది. అక్కడున్న చాలామంది యువతలు తనని ఆసక్తిగా చూడ్డం నిరంజన్ గమనిస్తూనే వున్నాడు. తను రాజకీయ నాయకుడేగాని, తన వేషధారణ అలా వుండదు. ఒక కార్పొరేట్ కంపెనీ సి.ఇ.ఓ.లా పాంటుషర్టు కాళ్ళకు షూస్‌తో చాలా ఆకర్షణీయంగా వుంటాడు.

ఎల్‌కెజి నుంచి అమెరికాలో హర్వర్డ్ యూనివర్శిటీలో ఎం.బి.ఎ. చేసేదాకా అన్నీ తన తండ్రి మధుసూదనరెడ్డి ఇష్టప్రకారామే జరిగింది. నిజానికి తను సోషయాలజీ – చదవాలనీ సమాజానికి సేవ చేయాలని ఆశించాడు. కాని తన మాట నెగ్గలేదు.

ఇక తప్పదని బ్యాంకింగ్ రంగం నుండి రాజకీయ రంగంవైపు తను వచ్చాక, ఇక సర్పంచ్ నుంచి ఎమ్.ఎల్.ఎ. దాకా తను ఎదగడానికి కారణం తన తండ్రే. ఆఖరుకి తన భార్య సిఫా ఫాస్ట్‌లైఫ్ రాసలీలు మీడియాలో రావడంతో, ఆమెకు విడాకులు ఇప్పించటంలో కూడా తెరవెనుక సూత్రధారి తన తండ్రే.

రాజకీయాల్లో మంచి చేయాలన్నా కష్టమే. ఈ విషయం ఇప్పటికే అర్థమైంది నిరంజన్‌కి. అవినీతి, ఆలసత్యంబంధుప్రీతితో భారతదేశం అనే దొడ్డ వృక్షం ఎప్పడో పుచ్చిపోయింది. బాగుపడే సూచనలు కనుచూపు దూరంలో కానరావటంలేదు. తన తండ్రి మధుసూదనరెడ్డితో బాటు, టైగర్ యుగంధర్‌తో తనకి మీటింగ్ వుంది. అందుకే రెండ్రోజులముందే ఢిల్లీ నుంచి వచ్చేస్తున్నాడు.

ఆలోచనలు ఎక్కువయ్యేకొద్దీ అతడి చేతులు మెల్లగా ఒణకటం ఆరంభించాయి. ఒణుకు తగ్గటానికి చేతుల్ని కాళ్ళమీద బలంగ ఆన్చుకున్నాడు.

టాక్సీ పరుగుతీస్తూనే వుంది.

* * * * *

ఇంపోర్టెడ్ బ్లాక్ మెర్సిడైజ్ బెంజ్‌కారు సిటీ వీధుల్లో స్మూత్‌గా పరుగుతీస్తోంది. వెనకసీట్లో కూర్చున్న యుగంధర్ అంతవరకు తను చూస్తున్న ఫైల్‌మూసి ఒసారి బయటకు చూసాడు.

సిటీలో ట్రాఫిక్ చూస్తుంటే తనకు ఆశ్చర్యం వేస్తుంది.

రోడ్లపై విపరీతమైన రద్దీ.

రద్దీ అభివృద్ధి జంట కవుల్లాంటివి.

తన చిన్నప్పుడు ఇవే రోడ్లమీద ఇంత ట్రాఫిక్ వుండేదా? లేదు సైకిళ్ళు, ఒకటి రెండు బైక్‌లు, ఎప్పుడోగాని కన్పించని కార్లు–

తను పుట్టిన హైదరాబాద్ ఇంత హైటెక్‌గా మారటం నిజంగానే తనకి గర్వంగా అన్పిస్తూంటుంది. ప్రపంచంలో ఎన్నో గొప్ప నగరాలున్నాయి.

ఆయా నగరాలకు వెళ్ళినప్పుడు లేని ఆనందం హైదరాబాద్‌లో కలుగుతుంది. ఎందుకంటే, దీని అభివృద్ధి వెనక తన హస్తం కూడా ఉంది కాబట్టి.

యుగంధర్ వయసు అరవై అయిదేళ్ళు. కాని చూడ్డానికి నలభై అయిదు మించి వుండవనిపిస్తుంది. నిత్యం వేళ్ళ తప్పకుండా వ్యాయామం, ఆహార నియమాలు పాటించటం, రోజూ పండ్లు తినడం, ముఖ్యంగా ఎంత టెన్షన్ వచ్చినా నవ్వుతూ ఆలోచించటం, ఆపైన జెనెటిక్స్ ఇవన్నీ కలిపి అతడ్ని యవ్వనం నుండి వృద్ధాప్య ఛాయలకు పోకుండా కాపాడుతున్నాయి. ఎప్పుడూ వైట్ అండ్ వైట్ డ్రస్ అతడి ట్రేడ్ మార్క్.

కింగ్‌కన్నా కింగ్‌మేకర్ గొప్పవాడని ఆయనకు తెలుసు. అందుకే ఏనాడూ ఆయన రాజకీయాల్లోకి డైరక్ట్‌గా అడుగు పెట్టలేదు. కాని తెరవెనుక డైరక్షనంతా ఆయనదే. రాజకీయ నాటకాన్ని ఎక్కడ మలుపు తిప్పాలో కథ ఎలా రసవత్తరంగా నడిపించాలో అంతా అతనికి పాలతో పెట్టిన విద్య.

ఆయన పక్కన కాస్త ఎడంగా కూచునుంది ఆయన పర్సనల్ సెక్రటరీ స్టెల్లా. ఆమె ఆంగ్లో ఇండియన్. మంచి హైటు, చక్కని ఫిజిక్‌తో రెడ్ రోజాలా వుంటుంది. కాని డ్రెస్‌లమీద అంతగా ఆసక్తి వున్నట్టు కన్పించదు. పైగా యుగంధర్‌కి లేడీస్ వీక్‌నెస్ గురించి విన్నాక సింపుల్‌గా వుండటం అలవాటు చేసుకుంది.

అయితే–

బిజినెస్–సరదా ఇవి రెండూ భిన్న సిద్ధాంతాలు కలిగిన వేరు వేరు పార్టీల్లాంటివని అవి కలవకపోవడమే బెటరని యుగంధర్ విశ్వాసం.

తన పి.ఎ. స్టెల్లా బయోడేటా ప్రకారం ముప్ఫైదాటినా ఆమె ఇంకా పెళ్ళి చేసుకోలేదు ఎందుకు? ఆలోచిస్తున్నాడు యుగంధర్.

యుగంధర్‌కి నాలుగో పెళ్ళి షీబాతో జరిగింది.

మొదటి భార్య సత్యవతి విడాకులకు ఒప్పుకోకపోవడంతో తను ఇస్లాం మతంలోకి మారి, మెహరున్నీసాను చేసుకున్నాడు. ఆ తర్వాత మొదటి భార్యతోసహా ముగ్గురు భార్యలకి కోర్టుబయటే సెటిల్ చేసుకుని తను నాలుగో భార్యగా షీబాను చేసుకున్నాడు.

ముంబాయిలో టాప్‌మోడల్ షీబా. డబ్బుంటే దబ్బున పడిపోయే టైపు. అందుకే యుగంధర్ బుట్టలో ఇట్టే పడిపోయింది.

సిగ్నల్ దగ్గర కారు ఆగటంతో ఆలోచనలనుంచి బయటపడ్డాడు యుగంధర్.

"స్టెల్లా. మన మూవీస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గంగాధర్‌తో రేపు అప్పాయింట్‌మెంట్ ఫిక్స్‌చెయ్యి" సూచించాడు.

ఆమె ఇబ్బందిగా చూసింది.

"సారీసర్. మీ షెడ్యూల్ రేపు చాలా బిజీ" గుర్తు చేసింది.

"తప్పదు. ఎలాగొలా అడ్జస్ట్‌చెయ్యి. అన్నట్టు మన లీగల్ అడ్వయిజర్ మనతో రానక్కర లేదు. గంగాధర్, నేను జస్ట్ ఇద్దరమే మాట్లాడుకోవాలి" సీరియస్‌గా చెప్పాడాయన.

యుగంధర్‌కి చెందిన మిడాస్ గ్రూప్ మొత్తం త్వరలో కొలాప్స్‌కానుందని పూహాగానాలు వినిపిస్తున్నాయి. సాధారణ స్థాయినుంచి కేవలం ముందుచూపే ప్రధాన పెట్టుబడిగా ఒక మహాసామ్రాజ్యంలా విస్తరించాయి తన వ్యాపారాలు. ఇప్పుడు ఒక్కొటీ నష్టాల బారిన పడుతున్నాయని ఖంగుతిన్నాడు యుగంధర్.

సత్వర చర్యలు చేపట్టకపోతే చాలానష్టం కలుగుతుందని తెలుసు. అంటే టాప్ ర్యాంక్ వాళ్ళలో లూజర్స్ స్థానంలోకి విన్నర్స్‌ని... కనీసం విన్ చేస్తారన్న నమ్మకం వున్న వాళ్ళని తేవాలి.

"ఆ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గంగాధర్ రికమెండేషన్‌తోనే జనరల్ మేనేజర్‌గా ప్రశాంత్ వచ్చాడు. తను మేధావి అనుకుంటున్నట్టున్నాడు తప్పుడు నిర్ణయాలు, స్టోరీ మ్యూజిక్ కెమెరా ఇలా పలుశాఖల్లో వేలు పెట్టడంవల్ల సినిమాలు వరస ఫ్లాప్. ప్రశాంత్‌ని తప్పించాలి. సినిమా అంటే చింతపండు, నిమ్మకాయల వ్యాపారం అనుకుంటున్నాడు, స్టుపిడ్" మనసులో మాటల్ని పైకే అనేసాడు.

"అతను గంగాధర్ చెంచా. బహుశా ప్రశాంత్‌ని గంగాధర్ వెనకేసుకురావచ్చు" అంది స్టెల్లా.

"ఆ పరిస్థితే వస్తే ప్రశాంత్‌తో బాటు గంగాధార్ కూడా బయటికి పోతాడు."

"సార్... రవీందర్ విషయంలో కూడా...." మధ్యలోనే ఆపేసింది స్టెల్లా. ఆ మాత్రం చాలు. యుగంధర్ అర్ధం చేసుకోగలడు. కంపెనీలో రవీందర్‌ది సెకండ్ పొజిషన్. తన తర్వాత తనంతటివాడు. అలాంటి వ్యక్తిమీద రిపోర్ట్ చేయడం సాధారణ విషయం కాదు.

"డోన్ట్‌వర్రీ. అతనికంత గట్స్‌లేవు" అన్నాడు సీరియస్‌గా.

ఇక మౌనం వహించింది స్టెల్లా.

యుగంధర్‌కి తెలుసు. రవీందర్ విషయంలో ఆమె హెచ్చరిక తుఫాన్ సమయంలో రేవు ప్రాంతాల్లో ఎగురవేసే ఒకటోనెంబర్ జండా లాంటిది.

కారు స్మూత్‌గా పరుగుతీస్తూనే వుంది.

ఉన్నట్టుండి ఏదో గుర్తుకొచ్చినట్టు నవ్వుతూ చూసింది స్టెల్లా.

"సార్. మీకి విషయం తెలుసా? ఈసారి వెన్నెల సేవీ పత్రిక కవర్ పేజీకేక్కింది" అంది.

"అలాగా!" నమ్మలేనట్టు చూసాడాయన.

"సేవీ... హైసొసైటీ లేడీస్‌కోసం నడిచే మంత్లీకదూ? చాలా ప్రిస్టేజి విషయమే. కొంపదీసి ఏ బికినీలోనో ఫోజివ్వలేదుకదా?" అంటూ చిన్నగా నవ్వాడు.

బ్రీఫ్‌కేస్‌లోంచి పత్రికతీసి అతడి చేతిలో వుంచింది స్టెల్లా. అప్‌టుడేట్ విషయాల్లో స్టెల్లా ఫాస్ట్ అని మెచ్చుకుంటాడు ఇందుకే. అఫ్‌కోర్స్ ఆమె ఎదురు లేదు.

కవర్ పేజీ చూసాడు.

బ్లాక్ ప్యాంట్ టక్‌చేసిన తెల్లటి షర్టుతో కార్పొరేట్ సి.ఇ.ఓ. లెవల్‌కు తగ్గట్టు చాలా డిగ్నిఫైడ్‌గా ఫోజిచ్చింది వెన్నెల. బ్యాక్‌డ్రాప్‌లో కొండలు, అడవి సముద్రం. వెన్నెల ముఖ్యంగా పత్రికకే అందం వచ్చినట్టనిపించింది. పబ్లిసిటీ ఎలా తెచ్చుకోవాలో తన కూతురికి బాగా తెలుసు అనుకున్నాడు మనసులో.

ఆ ఫోటో చూస్తుంటే అందంగా... గ్రేస్‌తో... కాన్ఫిడెన్స్‌తో అచ్చం తనలానే వుంది వెన్నెల. ఆమెకి శరత్‌చంద్రకి ఎంత తేడా? ఎన్నో విషయాల్లో ఖచ్చితంగా అంచనా వేయగలిగిన తను వెన్నెల తెలివితేటల్ని అంచనా వేయలేకపోయాడు.

ఆమె లా కాలేజీలో చేరినప్పుడు లా పూర్తి చేయలేదనుకున్నాడు.

కాని స్టేట్ ఫస్ట్ వచ్చింది. అలానే ఆమె చేతిలో పైసాలేకుండా రియల్ ఎస్టేట్ రంగంలో అడుగుపెడుతున్నట్టు తెలిసి తెలివితక్కువ పిల్ల అని నవ్వుకున్నాడు.

ఏదోరోజు నాన్నా డబ్బుకావాలి అని తన ముందుకు వస్తుందని వూహించాడు. కాని తన వూహల్ని తల్లకిందులు చేస్తూ రియల్ ఎస్టేట్ రంగంలో అనూహ్యంగా ఎదిగింది. అదీ కోటీశ్వరుడి కూతురిగా కాకుండా స్వశక్తితో ఒక ఆడపిల్ల ఈ స్టేజీకి ఎదగటం అంటే నాట్ ఎ జోక్. అందుకే అప్పుడప్పుడూ ఆమె విషయంలో గర్వపడుతుంటాడు.

తనని చూసి నాలుగేళ్ళయింది.

ఆ రోజు ఇప్పటికీ తను మర్చిపోలేదు.

సడెన్‌గా తనను చూడ్డానికొచ్చింది.

ఆమెతో తల్లి సత్యవతి పోలికలు కొద్దిగానే వున్నా తన హైటు ముఖవర్చను, తన పోలికలు ఆమెలో కొట్టొచ్చినట్టు చూసి గర్వం అనిపించింది.

సత్యవతితో తనకు విడాకులయ్యాక వెన్నెల కస్టడీ తల్లికే లభించటంతో తను సత్యవతి దగ్గరే పెరిగింది. అందుకే తమ మధ్య పూర్తిస్థాయి అనుబంధాలు లేవు. కాని వారి జీవనభృతి తను ఇస్తూ వస్తున్నాడు కోర్టు ఆర్డరు ప్రకారం.

ఆమెను చూడగానే డబ్బు అవసరమై వచ్చిందేమో అనుకున్నాడు.

"డాడీ నాకు డబ్బు కావాలి" అని అడిగితే ఎంతయినా యిచ్చేవాడు. కాని ఆమె వచ్చింది డబ్బు కోసం కాదు. తన గ్రూఫ్ ఆఫ్ కంపెనీలో ఏదో ఒక జాబ్ యిమ్మని అడిగింది. ఉద్యోగం చేస్తూ ఒక్కోమెట్టు ఎక్కాలని

ఆశపడుతున్నట్లు చెప్పింది. ఆమె మాటలు తనకు నవ్వు తెప్పించాయి. చాలా సిల్లీగా అన్పించాయి.

ఆమె తన సొంత కూతురు. తన తెలివితేటలు ఆమె పుణికిపుచ్చుకున్న సంగతి గుర్తించ లేకపోయాడు. ఆమెను అంచనా వేయలేకపోయాడు. ఎంత పొరబాటు చేసాడో ఇప్పుడు అర్థమయింది. ఉద్యోగం విషయంలోనే ఆమెకూ తనకూ మాట పట్టింపు వచ్చింది.

పెళ్ళీడు వచ్చింది. మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను హాపీగా వుండు. నీకి ఉద్యోగాలు, కంపెనీ వ్యవహారాలు ఎందుకు అని ఆ రోజు తను ఇచ్చిన సలహా తలుచుకుంటే నవ్వువస్తోంది. వెన్నెలకి రోషం ఎక్కువ. తన రక్తమే కదా, మాటా మాటా పెరిగింది. మాటల బాణాలు సంధించి తనతో వాగ్వివాదానికి దిగింది.

నిజానికి మహిళలు ఉద్యోగాలు చేయకూడదనో పనికిరారనో, ఆలోచన తనకి ఏనాడూలేదు. కేవలం ఒ తండ్రిగానే ఆలోచించాడు. తన కూతురు ఉద్యోగం చేయాలా? ఆమెకి ఎందుకు ఈ కంపెనీ టెంక్షన్‌లు. పెళ్ళి చేసుకుని హాపీగా వుండొచ్చుకదా. అలా ఒక తండ్రిగానే ఆలోచించాడు. కాని విడిపోయారు. అంతే–మళ్ళీ తన ముందుకు రాలేదామె. తన నుంచి ఒక్క రూపాయి కూడా సాయం తీసుకోకుండానే ఈరోజు ఈ స్థాయికి వచ్చిందని తలచుకున్నప్పుడల్లా ఒక తండ్రిగా తన ఒళ్ళు పులకరిస్తుంది గర్వపడుతుంటాడు.

"సార్. మీరేదో ఆలోచనలో వున్నట్టున్నారు" స్టెల్లా పలకరింపుతో గతంనుంచి బయట పడ్డాడు యుగంధర్.

"యస్. వెన్నెల గురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు ఫ్రాంక్‌గా.

"సేవీలో వెన్నెల ఇంటర్వ్యూ కూడ వచ్చింది సార్. మీ గురించి చాలా గొప్పగా చెప్పింది" అంది.

"దటీజ్ మై డాటర్" అన్నాడు నవ్వుతూ యుగంధర్.

స్టెల్లా ఇంటిముందు కారాగింది.

ఆమె కారు దిగి డోర్ మూసింది.

"సార్! రేపు ఉదయం పదకొండుగంటలకి మధుసూదన రెడ్డితో అపాయింట్‌మెంట్ వుంది" కారులోకి చూస్తూ గుర్తుచేసింది.

తల వూపాడు యుగంధర్.

కారు ముందుకు కదిలి తమ ఇంటి దిశగా పరుగు ఆరంభించింది. యుగంధర్ మధుసూదనరెడ్డి గురించి ఆలోచిస్తున్నాడు. తమ హెచ్.ఎస్. క్లబ్‌లో మధుసూదన్‌రెడ్డికి చాలా గౌరవం వుంది. తన కొడుక్కి ఎం.పి. సీటు కావాలంటున్నాడు. అది కష్టం ఏమీకాదు కానీ... చూడాలి.

హెచ్.ఎస్. క్లబ్‌లో ఇండైరెక్ట్‌గా ప్రెసిడెంట్ పొజిషన్ యుగంధర్‌ది. తండ్రి రాజా ఫణిచంద్ర మరణంతో ఆయన స్థానం యుగంధర్‌కి లభించింది. ఆస్తులు కరిగిపోయినా తిరిగి పైకి వచ్చిన వ్యక్తి తను. హెచ్.ఎస్. క్లబ్‌లో తన పొజిషన్ చూసి తండ్రిగారి ఆత్మ శాంతించవచ్చు కాని పర్సనల్‌గా యుగంధర్‌కి హెచ్.ఎస్. క్లబ్ పెద్దగా సంతోషం కలిగించదు. అందుకు వేరే కారణం వుంది.

* * * * *

జూబ్లీహిల్స్‌లో ఒంటరిగానే వుంటోంది వెన్నెల.

గ్రాండ్ వ్యూ అపార్ట్‌మెంట్స్‌లో డూప్లెక్స్ అపార్టుమెంట్ నెంబర్ టూనాట్ టు ఆమె నివాసం. ఎదురుగా కాసుబ్రహ్మానందరెడ్డి పార్కు రోడ్డు మధ్య డివైడర్ మీద పెట్టిన చెట్లు చక్కని వ్యూ.

ఆకాశం మబ్బుపట్టి సన్నని జల్లు పడుతోంది బయట.

కిటికీ పక్కన నిలబడి రిలాక్స్‌గా అటే చూస్తోంది వెన్నెల.

తన డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం పగలంతా బిజీగా గడిపింది. ఇప్పుడే కాస్త రిలాక్సయింది. ఆలోచిస్తూ వచ్చి సోఫాలో కూర్చుంది. ఎఫ్.ఎమ్. రేడియోలోంచి 'ఇన్నాళ్ళకు గుర్తొచ్చానా వాన, ఎన్నాళ్ళని దాక్కుంటావే పైన' పాట వినసొంపుగా వస్తోంది.

ఆ పాట వింటూంటే వెన్నెల చాలా ఉల్లాసంగా వుంది.

ఇంతలో వేడివేడి పకోడి చేసి ప్లేటులో తెచ్చి ఆమె ముందుంచింది పనిమనిషి మీనాబాయి. తనకన్నా రెండేళ్ళు పెద్దది కావచ్చు. అవటానికి

పనిమనిషయినా అక్కలా చూసుకుంటుంది వెన్నెల. ఎందుకంటే, తను ఒంటరి జీవితానికి అలవాటుపడ్డాక తన ఆలనాపాలనా అన్నీ కనిపెట్టుకుని చూస్తోంది ఆమె. అందుకే మీనాబాయి కూడ వెన్నెల ముందు చాలా స్వతంత్రంగా వుంటుంది.

"ఏమిటి వెన్నెలా... టి.వి నో, డి.వి.డి. వేసుకుని సినిమానో చూడకుండా ఈ మధ్య ఎఫ్.ఎమ్. వింటున్నారు?" పక్కనే నిలబడుతూ అడిగింది మీనాబాయి.

"పకోడి చాలా బాగుంది. ఏ టైంలో ఏంతింటే బాగుంటుందో నీకు తెలిసినంతగా ఎవరికీ తెలీదు మీనా?" పకోడీ. తింటూ మెచ్చుకుంది వెన్నెల.

"నా ప్రశ్నకు ఇది సమాధానంకాదు" అంది నవ్వుతూ మీనాబాయి.

"ఎఫ్.ఎమ్. గురించేగా. ప్రయివేట్ వాళ్ళ రాకతో మంచి క్వాలిటీ ఇస్తున్నారు. భూమి గుండ్రంగా వుందన్నట్టు మళ్ళీ రేడియోలు పాపులర్ అవుతున్నాయి. పాతకాలం యల్ పి రికార్డు పోయాయి. కాని ఇప్పుడు మళ్ళీ గుండ్రంగా వుండే సి డి లు రాలేదా? అలాగన్నమాట. టి.వి. దెబ్బకు రేడియో అవుటే అనుకున్నారు. ఎఫ్.ఎమ్. వచ్చి మళ్ళీ రేడియోకి పాపులారిటీ తెచ్చింది. ఫ్యాషన్లేకాదు. ఒక్కోసారి టెక్నాలజీ కడా వెనక్కి ముందుకి వెళు తోంది" అంటూ వివరించింది వెన్నెల.

పని ముగించుకుని మీనాబాయి ఇంటికెళ్ళిపోయింది.

ఆమెను చూసి అక్కడ సెక్యూరిటీగార్డ్ బలరాం ఆశ్చర్యపోయాడు. వరంగల్ నుంచి వచ్చిన బలరాం సిన్మాల్లో విలన్ వేషాల కోసం ఇంకా ప్రయత్నిస్తూనే వున్నాడు. ట్రై అండ్ ట్రై అంటిల్ యుడై అని అది అతడి ఫార్ములా. ఒంటరిగా వుంటున్న వెన్నెల అంటే అతనికి చాలా యిష్టం. అది ప్రేమో, కామమో అతడికే తెలీదు. కాని తన స్థాయి తెలుసుగాబట్టి తన ఫీలింగ్స్‌ని తెలీనీయడు. రోజులు గడవాలి గాబట్టి ఓ ప్రయివేట్ కంపెనీ తరపున ఇక్కడ సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు.

అతడ్ని సమీపించగానే–

పలకరింపుగా నవ్వింది వెన్నెల.

"మేడం... కారు తీయకుండా నడిచి వస్తున్నారు. బయట వర్షం పడుతోంది." అన్నాడు బలరాం.

"బలరాం... నేను రెయిన్‌కోటు వేసుకున్నాను. నో ప్రాబ్లం. రిలాక్స్‌గా కాస్సేపు అలా తిరిగిరావాలనిపించింది" చెప్పింది.

తనను కలిసే ప్రతి మనిషి పేరును బాగా గుర్తుపెట్టుకుంటుంది వెన్నెల. పేరు పెట్టి పిలవటం ఎదుటివారికి ముఖ్యంగా దిగువస్థాయివారికి చాలా సంతృప్తినిస్తుందని ఆమెకు తెలుసు.

ఆమె నోటివెంట తన పేరు పలకటం-

తన అదృష్టంగా భావించాడు బలరాం.

"అదేమిటి మేడం. మీరిలా ఒంటరిగా తిరగటం ఏం బాగలేదు. మీరు బాడీగార్డుని పెట్టుకోవాల్సిందే. మీరిప్పుడు ఫెమస్ పర్సన్. బయట జనం గుర్తుపడితే లేనిపోని గోల. కనీసం నన్నయినా పర్సనల్ బాడీగార్డుగా పెట్టుకోండి మేడం. అందం, వయసు, డబ్బువున్న మీకు ఎవరయినా హాని తలపెట్టొచ్చు."

"ఓహ్ బలరాం" అంటూ అతడి మాటల్ని మధ్యలోనే అడ్డుకుంది వెన్నెల.

"డోన్ట్‌వర్రీ. ఈమధ్య నేను కరాటే క్లాసులకు వెళుతున్నాను. మరీ అవసరం అనుకునప్పుడు తప్పకుండా బాడీగార్డ్ పోస్ట్ నీకే ఇస్తాను. ఇంతకీ నీ సినిమా విలన్ ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయి? ఎవరికన్నా రికమండ్ చేయమంటావా?"

"ఆ పని చేసి పుణ్యం కట్టుకోండి మేడం. అలాగయినా నేను తొందరగా విలన్ని అయిపోతాను."

"సినిమా విలన్" అంటూ అతడి మాటల్ని సవరించి నవ్వేస్తూ గేటుదాటి బయటికొచ్చేసింది వెన్నెల.

రోడ్ వెంట నడవసాగింది.

హైదరాబాద్‌లో తనో పి.ఎ.జి.ఇ.-3 పర్సన్. పైగా యుగంధర్ వారసురాలు. మిస్ ఇండియా పోటీకి వెళితే ఖచ్చితంగా కిరీటం కొట్టేసేంతటి

అందం. తనను చూసి ఆడవాళ్ళే అసూయపడుతుంటారు. బలరాం చూపులు ఇంకా తనను వెంటాడటం గమనిస్తూనే వుంది... జస్ట్ ఆకర్షణ.

అయినా ఈ మధ్య తనను కూడా ఒంటరితనం బాగానే వేదిస్తోంది. కామాన్ని జయించిన వారు మహాత్ములు అంటారు. తను మహాత్మురాలు కావాలని కోరుకోడంలేదు. అలాగని గీత దాటేంత చంచల మనస్కురాలూ కాదు. వర్షం పెరగటంతో ఆమె ఆలోచనలు చెదిరిపోయాయి. దాంతో పరుగెత్తుకొంటూ వెనక్కు వచ్చేసింది. లక్కీగా ఆమె వెనక్కు రావటం బలరాం చూడలేదు.

ఫ్లాట్‌కి చేరుకుని రిలాక్స్‌గా బెడ్‌మీద పడుకుంది. ఆలోచనలు తిరిగి బలరాం వైపు మళ్ళాయి. మనిషి చాలా మంచివాడే. కాని అతడి చూపులకి అర్థం ఏమిటి? తన మీద ఆకర్షణా? అదే నిజమైతే తనలోని ఆకర్షణ ఏమిటి? డబ్బా... అందమా... గుణమా... ఒకవేళ తన దగ్గర డబ్బు లేకపోయినా కూడా అతనిలాగే చూస్తాడా?

డ్రస్ అవతలి వాళ్ళ కోసం, ఫుడ్ మనకోసం అన్నట్టు–
మగాళ్ళు అలా తనను తినేసేలా చూస్తున్నారంటే–
ఆ చూపులు వాళ్ళు తనకిస్తున్న కాంప్లిమెంట్స్‌కిందే లెక్క.
కానీ ఆ కాంప్లిమెంట్స్ కాస్తా కంప్లయింట్స్‌గా మారితే?
ఆడదానికి శత్రువు కూడా – అందమే.
ఆలోచనల మధ్య మెల్లిగా–
నిద్రలోకి జారుకుంది వెన్నెల.
గాఢనిద్రలో ఉన్నట్టుండి విచిత్రమైన కల.

తనను ఎవరో బెడ్‌మీద కట్టేస్తున్నారు. అతను బలరాం. వికటంగా నవ్వుతున్నాడు. తప్పించుకోవాలని తను గింజుకుంటోంది.

“బలరాం! నువ్వు చాలా మంచివాడివనుకున్నాను. ఏమిటిది? నీ విలన్ వేషాలు నా దగ్గర కాదు” అరుస్తోంది.

“ఏయ్ వెన్నెల!” ముఖంలో ముఖం పెట్టి క్రూరంగా అడుగుతున్నాడు బలరాం.

"నీకు రోషం ఎక్కువే. మగజాతిని అణగదొక్కాలని పుట్టిన కామదేవతవి. నీకోసం ఎందరు పిచ్చాళ్ళవుతారో నాకు తెలీదు. కాని నేను పిచ్చాడ్నికాను. మిస్ యూనివర్స్ అంత అందం నీది. డబ్బు కోసం నిన్ను ఆశగా చూస్తున్నాను కుంటున్నావు కదూ? నాకెందుకే డబ్బు? నువ్వు కావాలి. నీ అందం కావాలి. నీలాంటి అందాల బొమ్మని ఒక్కసారి మనసారా పొందితే చాలు. తర్వాత ఉరికంబమైనా సంతోషంగా ఎక్కేస్తాను. ఐ లవ్ యూ... ఐ వాంట్ యూ... తప్పించుకోలేవు...." వికటంగా నవ్వుతూ మీదికొస్తున్నాడు బలరాం.

భయంతో కెవ్వున అరిచింది వెన్నెల.

కాని నోరు పెకలటంలేదు.

అంతే-

సడెన్‌గా మెలుకూ వచ్చేసి దిగ్గున లేచి కూర్చుంది. ఒళ్ళంతా చెమటలు. గుండె వేగంగా కొట్టుకొంటోంది.

"మైగాడ్... కలా!" చుట్టూ చూస్తూ తనలో తను అనుకుంది.

ఆశ్చర్యం వేసింది.

కలలకు, మన ఆలోచనలకు సంబంధం వుంటుందంటారు. అది నిజమేననిపించింది. బెడ్ దిగి మంచినీళ్ళు తాగింది. రాత్రి చాలా పొద్దుపోయింది. ఇప్పుడు గుర్తొస్తోంది. పడుకునే ముందు తను ఫ్లాట్ డోర్స్ లాక్ చేసుకోలేదు. గబగబా వెళ్ళి లాక్ చేసుకుని వచ్చింది. తిరిగి బెడ్ మీదకు పోబోతూ అలా కిటికి పక్కకు వచ్చి కర్టెన్ తొలగించి చూసింది.

బయట ఇంకా సన్నటి జల్లు పడుతూనే వుంది.

గేటు దగ్గర షెడ్‌లో నిలబడి సిగరెట్ దమ్ముకొడుతూ కన్పించాడు సెక్యూరిటీ గార్డు బలరాం. కర్టెన్ వదిలి వెనక్కి వచ్చి పడుకుంది గాని, మిగిలిన రాత్రి చాలావరకు నిద్రకు దూరమైంది.

* * * * *

హైదరాబాద్ మేయర్ రాంరెడ్డి.

రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తి.

ఆరడుగుల మూడంగుళాల ఎత్తున చూడ్డానికి వహిల్వాన్‌లా వుంటాడు. కాలేజి రోజుల్లో స్టూడెంట్ రౌడీగా తిరిగిన మనిషి. అప్పటి కొట్లాటల్లో బుగ్గ మీద పడ్డగాటు తాలూకు మచ్చ ఇప్పటికీ అలాగే వుంది. ప్లాస్టిక్ సర్జరీతో ఆ మచ్చ తొలగించుకోమని చాలామంది చెప్పిచూసారు. కాని అతనా పని చేయలేదు. 'హమ్‌కో అచ్ఛాహై భాయ్. ఇది నా లక్కీ మచ్చ' అంటూ నవ్వేస్తాడు.

లా పూర్తికాగానే బార్ కౌన్సిల్లో సభ్యత్వం తీసుకున్నాడు గాని, కోర్టు మెట్లు ఎక్కలేదు. ఎందుకంటే సరిగ్గా అప్పుడే ఒక ప్రముఖ వ్యక్తి ప్రాంతీయ పార్టీపెట్టడం ఆ నటుడి వీరాభిమానిగావటంతో పార్టీలో చేరి ఆ వెనకే వెంటనే కార్పొరేటర్‌గా ఎన్నిక అవటం జరిగిపోయాయి.

రాజకీయాల్లో చేరినప్పుడు డబ్బు సంపాదనే ముఖ్యం అనుకున్నాడు. కాని డబ్బుకన్నా పవర్ ముఖ్యం అని తొందరలోనే అర్థం చేసుకున్నాడు. అనవసరమైన వారిని కాకాపట్టడం నేర్చుకున్నాడు. వారి గురించి బాగా వూదటం కూడా నేర్చుకున్నాడు.

న్యూస్ రిపోర్టర్లకు జీతాలు ఇచ్చినట్టు ప్రాంతీయ వార్తలు రాసేకంట్రిబ్యూటర్లకు జీతాలు వుండవు. లైనుకింత అనిస్తారు. ఈ సంగతి తెలుసు. అన్ని పేపర్ల కంట్రిబ్యూటర్స్‌ని కవర్ చేసుకున్నాడు. వాళ్ళకి బీర్‌లు, బార్‌లు... కవర్లో డబ్బులు అందించి తన గురించి చక్కగా పబ్లిసిటి ఇప్పించుకొని ఆ ఇమేజ్‌తో మేయర్ పదవిలోకి వచ్చేసాడు.

మరో విశేషం ఏమంటే, రాంరెడ్డి ఇంకా బ్రహ్మచారే. కాలేజి రోజుల్లో ప్రేమ సిన్మాలు చూసిచూసి తనూ ఓ అమ్మాయిని ప్రేమించేసాడు. కాని ఇతన్ని రౌడీగా వూహించుకుని ఆ పిల్ల ఇతని ప్రేమను తిరస్కరించింది. అంతే! ఆ రోజు ఒట్టు పెట్టుకున్నాడు. ఇక జీవితంలో ప్రేమలేదు, పెళ్ళిలేదు అని. అలాగని సరసం తెలీని విరసాంగుడనుకుంటే పొరబాటే. అప్పట్లో పెద్దాపురం నుంచి మొదలయిన అతడి రాసలీలలు వెరైటీ ఈజ్ ది స్పైస్ ఆఫ్ లైఫ్ అన్నట్టు ఆ విషయాల్లో పెద్ద గ్రంథసాంగుడే.

అటువంటి మేయర్ రాంరెడ్డి ఎప్పటిలానే ఈ రోజు కూడా తన చాంబర్ కొచ్చి కూర్చున్నాడు. సిగరెట్ పొగను రింగు రింగులుగా

వదులుతున్న రాంరెడ్డి ఎదురుగా అతని సెక్రటరీ ఆల్‌ఫ్రెడ్ కూర్చునాడు. వాళ్ళిద్దరూ కలిసే లా చదువుకున్నారు. మంచి ఫ్రెండ్స్. ఇద్దరి టేస్ట్‌లు ఒక్కటే. ఆల్‌ఫ్రెడ్‌కు పెళ్ళయింది. అయినా అమ్మాయిల పిచ్చి. రాంరెడ్డితో బాటు పారిస్, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్‌లలో తనూ పర్యటించాడు. అమ్మాయిల విషయంలో ఫారినర్స్ బెస్ట్ అని అతడి పర్సనల్ ఒపీనియర్.

సిగరెట్ ఆస్ట్రేలో కుక్కి ఆల్‌ఫ్రెడ్‌ని చూసాడు రాంరెడ్డి.

"చూడు... రేపు ఉదయం మధుసూదన్‌రెడ్డి, టైగర్ యుగంధర్ సమావేశం వుంది. ఆ మీటింగ్‌కి మనం కూడా వెళుతున్నాం." అన్నాడు.

"మనమా... నేనెందుకు అనవసరంగా. థాయ్‌లాండ్ ఇంకో ట్రిప్ వెళ్ళదామా చెప్పు. హేపీ. ఆ పిగర్స్‌ని మర్చిపోలేక పోతున్నాను. అక్కడి కొచ్చే రష్యా భామలు నిజంగా అప్సరసలు" అంటూ తప్పించుకోవాలని చూసాడు ఆల్‌ఫ్రెడ్.

విసుగ్గా చూసాడు రాంరెడ్డి.

"ఎప్పుడూ అదే గోలా? నీ కన్నా నేనే నయంలా వుందే. పెళ్ళికాకపోయినా కొంచెం కంట్రోల్లో వుంటా. నీకేం పోయేకాలం. ఇంట్లో పెళ్ళాం, పిల్లలూ వుండి. చూడు– ఈ నగరానికి నేను ప్రథమపౌరుడ్ని అయినా అంతా నామ్ కే వాస్తే. నిజానికి నడిచేది, నడిపించేది అంతా హెచ్.ఎస్. క్లబ్బు వాళ్ళు. సమజయిందా? మనం పైకి ఎదగాలంటే, వాళ్ళతో టచ్‌లో వుండాలి. అవునూ– ఆ యుగంధర్ కూతురు ఏదో డ్రీమ్ ప్రాజెక్ట్ కట్టే ఆలోచనలో వుందట. నిజమేనా?" అడిగాడు?" అడిగాడు.

"అవును. నేనూ విన్నాను. ఎంతయినా యుగంధర్ కూతురు గదా. ఆమెకి బ్యాంకర్లు జి.హెచ్. ఎమ్.సి. కూడా అందరి సహకారం వుంది" చెప్పాడు ఆల్‌ఫ్రెడ్.

వికవికా ఓ నవ్వు విసిరాడు రాంరెడ్డి.

"అరె ఆల్‌ఫ్రెడ్! నీకు శృంగారం అబ్బినంతగా రాజకీయం అబ్బలేదు. రాజకీయం అంటేనే రాక్షసంగా జనానికి కీడు చేసే ఓ యంత్రాంగం అంటూ పరుచూరి బ్రదర్స్ ఏదో సినిమాలో డైలాగ్ రాసిన గుర్తు.

ఇప్పుడూ అన్ని పనులూ చకచకా జరిగిపోయాయనుకో... ఆ పిల్ల ఏమనుకుంటుంది? అబ్బో. ఈ ప్రభుత్వం ఎంత మంచిదో అనుకుంటుంది. మనకి కనీసం ఒక్క థాంక్స్ కూడా చెప్పదు. అదే ఎక్కడో పుల్ల పెట్టి పదిసార్లు తిప్పించామనుకో– చచ్చినట్టు నా దగ్గరకొస్తుంది. ఎంతయినా మనం తన కో స్టూడెంట్స్ గదా! ఒకే కాలేజీలో కలిసి లా చదివినవాళ్ళం. సమస్యను మనమే సృష్టించి ఆమె యిబ్బందిలో వుండగా మనం రంగంలోకి దిగి రిస్క్ తీసుకుని హెల్ప్ చేసినట్టు బిల్డప్ ఇచ్చామనుకో– ఆమె ముందు మన ఇమేజ్ పెరుగుతుంది" అంటూ తన మనసులో మాట బయటపెట్టాడు రాంరెడ్డి. ఆ మాటలు వింటూంటే ఇంకేదో వుందనిపించింది ఆల్‌ఫ్రెడ్‌కి అందుకే–

"ఆ తర్వాత?" అంటూ ప్రశ్నించాడు.

మరోసారి వికవికా నవ్వాడు రాంరెడ్డి.

"నీ బుర్రలో ఏ బల్బు వెలిగిందో వూహించగలను. వెన్నెలని ప్రేమించి, పెళ్ళి ప్రపోజ్ చేయటమో లేక ఒక రాత్రికి రమ్మని అడగటమో చేస్తానని కదూ నీ డౌటు. నో నో... అంతకుమించి అందగత్తెలు ఎందర్ని చూళ్ళేదు? నా ప్లాన్ అది కానేకాదు. వెన్నెల ద్వారా, యుగంధర్‌కు, ఆయనద్వారా హెచ్.ఎస్. క్లబ్‌కు దగ్గరవ్వాలని నా యోచన."

"యోచన అయితే బాగుందిగాని తండ్రీ కూతుళ్ళ మధ్య అంతగా సంబంధాలు లేవని విన్నాను. వాళ్ళ మధ్య మాటల్లేవట."

"అది నిజమో, అబద్ధమో ఎవరికి తెలుసు. పుకారు కూడా కావచ్చు."

"అయినా నీకు పైసలకి లోటులేదు. ఆ హెచ్.ఎస్. క్లబ్ మీద కన్నెందుకు?"

"నాకు డబ్బు కాదు... పవర్ కావాలి. పవరుంటే ఏమయినా చేయొచ్చు. ముఖ్యంగా ఆడవాళ్ళు. పవరున్న మగాడికి ఇట్టే పడిపోతారు. డబ్బుకి పడేది మామూలు ఆడాళ్ళు. పవరుంటే హై సొసైటీ ఆడవాళ్ళు కూడా పడతారు. ఈ మధ్య నా మనసు వాళ్ళమీదకు లాగుతోంది."

"వెన్నెలపై కూడానా?"

"ప్రస్తుతానికయితే లేదు. పడితే వద్దంటామా ఏమిటి? ఆ పిల్లతో చాలా మర్యాదగా వుండాలి. అది టైగర్ కూతురు. మన ప్లాన్ ఏమాత్రం బెడిసికొట్టినా మన పునాదులు కదులుతాయి. గుర్తుందిగా? టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడు. ఆమె ఫైల్స్ ఎక్కడెక్కడ వున్నాయో తెలుసుకో. మొదటిపుల్ల అక్కడ వేద్దాం అడ్డు. ఆ తర్వాత చూడు ఆట ఎలా రక్తి కట్టిస్తానో. వెన్నెలతో మానసికంగా ఆడే ఆట ఫిజికల్‌గా కంటే వందరెట్లు ఆనందంగా వుంటుంది. వెళ్ళి ఆ పని చూడు" అంటూ రిలాక్స్‌గా సీటుకి జేరడి కళ్ళు మూసుకున్నాడు రాంరెడ్డి.

ఆల్‌ఫ్రెడ్ వెళ్ళిపోయాడు.

రాంరెడ్డి కళ్ళముందు వెన్నెల రూపం మెదులుతోంది.

"ఏం ఫిగర్‌బే... బే ఫికర్‌గా వున్న ఆ ఫిగర్‌కి ఇక ఫికర్ లే... నేను పైకెళ్ళాలంటే ఇక నా లిఫ్ట్ వెన్నెలయే" అనుకున్నాడు.

అతడికి అద్నాన్ సామి 'లిఫ్ట్ కరాదే...' పాట గుర్తొస్తోంది. పైకి చూడటానికి రౌడీలా కన్పిస్తాడుగాని రాంరెడ్డికి హిందీలో నాటి ముఖేష్ నుంచి నేటి హిమేష్ రేషమియ్యా వరకు, తెలుగులో అయితే కె.వి. మహదేవన్, ఇళయరాజా, కీరవాణి వరకు మ్యూజిక్ డైరెక్టర్లు నేపథ్య గాయకుల గురించి పూర్తి అవగాహన, పట్టు వుండటం చాలా విచిత్రం.

అందమైన అమ్మాయిని చూస్తే చాలు. ఏదో ఓ పాట గుర్తొచ్చేస్తుంది రాంరెడ్డికి. బహుశ ఈ అలవాటే అతడిలో సినిమా సంగీత పరిజ్ఞానాన్ని పెంచి వుండాలి. కానీ అతడి ముఖంమీద గాటు చూస్తే ఆడాళ్ళు భయపడతారు.

వెంటనే ఒక నిర్ణయానికొచ్చేస్తూ–

అపోలో ఆస్పత్రికి ఫోన్ చేసాడు.

ఫోన్ లిఫ్ట్ చేసిన ఆపరేటర్‌తో ప్లాస్టిక్ సర్జన్‌కి కనక్షనివ్వమన్నాడు. తన ముఖంమీది కత్తిగాటు తొలగించుకోవాలనే ఆలోచన ఇన్నాళ్ళకి ఇంత సడెన్‌గా కలగటం తనకే ఆశ్చర్యం అన్పించింది.

❋ ❋ ❋ ❋ ❋

డ్రింక్ సిప్‌చేస్తూ ఆమెవంక చూసాడు రవీందర్.

విశాలమైన వాటర్ బెడ్‌మీద అలవోకగా పడుకుని అతడ్నేచూస్తోంది శ్వేత. ఆ పేరు ఎలా పెట్టారోగాని నిజంగా శ్వేతనాగులా మిలమిల మెరిసిపోయే అందం ఆమెది. వయసు ఇరవై రెండు.

పొడవైన కాళ్ళు, నీలికళ్ళు. అద్భుతమైన ఫిగర్. సిల్కునైటీలో ఆమెలో సెక్స్ అప్పీల్ ఉట్టిపడుతోంది. జుత్తు పొడవుగా, దట్టంగా కరిమబ్బులా వుంటుంది. ఆ జట్టునుంచి వచ్చే సుగంధపరిమళం రవీందర్‌కి చాలా యిష్టం. పదేపదే వేళ్ళతో జుట్టు సవరించుకోవటం ఆమె అలవాటు.

టైగర్ యుగంధర్‌తో ఆమెకు శారీరక సంబంధం వుందని ఒక పుకారు తనూ వినానడు. ఆమెతో మాట్లాడుతుంటే అప్పుడప్పుడు అది నిజమేనేమో అన్పిస్తుంటుంది.

ఆమె పూర్తిపేరు శ్వేతా మీనన్. ముంబయిలో హాట్ మోడల్. ఆమె రవీందర్‌ని పెళ్ళాడి సంవత్సరం దాటింది. యాభై దాటిన రవీందర్‌కి ఆమె పెళ్ళాంగా వచ్చిందంటే కారణం అతడ్ని మోహించి మాత్రం కాదు. అతడికున్న డబ్బు పవర్... కేవలం వాటిని చూసే పెళ్ళి చేసుకుంది.

తన మొదటి పెళ్ళానికి విడాకులిచ్చి మరీ తన వయసులో సగం కూడా లేని శ్వేతను చేసుకున్నాడతను. ఆమెను చేసుకున్నాక తనలో గ్లామర్ పెరిగిందని అతడిలో ఓ విచిత్రమైన ఫీలింగ్.

"రవీందర్ నీకో విషయం తెలుసా?" అతడ్నే కవ్వింపుగా చూస్తూ అడిగింది శ్వేత.

"నువ్వు చెప్తేగదా తెలిసేది" అంటూ గ్లాస్ ఫినిష్ చేసి పక్కన పెట్టాడు.

"నీలాంటి పెద్ద వయసు మగాడు నాలాంటి కుర్రపిల్లను పెళ్ళిచేసుకుంటే వచ్చే లాభం ఎమిటి?"

"తెలీదు. నువ్వే చెప్పు."

"ముసలివాడికి మళ్ళీ యవ్వనం వస్తుంది."

"ఏయ్. నాది నడివయసు. ముసలివాడ్ని కాదు. అయినా నువ్వు చెప్పిన లాజిక్ నిజమైతే నా గ్లామర్ పెరగినప్పుడు నీ గ్లామర్ తరగాలిగా. కాని అదేం లేదే!"

"అదే సీక్రెట్. నా అందం వూటబావిలాంటిది. తోడేకొద్దీ యవ్వనం వూరుతూనే వుంటుంది."

"షిట్. నీతో మాటల్లో నెగ్గలేం" అంటూ లేచివచ్చి ఆమె పక్కన వాటర్ బెడ్‌మీద కూర్చున్నాడు. అతడి ఒళ్ళోకి ఎగపాకి గుండెలమీద అరచేత్తో మృదువుగా రాస్తూ గోముగా అడిగింది.

''ఇంతకీ ఆ విషయం ఏం చేసావ్? ప్లాన్ ఎప్పుడు మొదలుపెడతావ్?" అంటూ.

పజిల్‌గా చూసాడు రవీందర్.

"ఏ ప్లాను...? ఓ... టైగర్ యుగంధర్ గురించా?" అనడిగాడు.

యుగంధర్ పేరు వినగానే–

ఆమె నీలికళ్ళలో విచిత్రమైన కోపాన్ని అతడు గమనించాడు.

"ఛాన్స్‌లు పదేపదే చెప్పిరావు రవీందర్. వచ్చిన ఛాన్సును మిస్ చేసుకునేవాడు పనికిరాని దద్దమ్మ" అంది.

"నేను దద్దమ్మను కాను" చెప్పాడు.

అతనికిది కొత్తకాదు.

యుగంధర్ పేరు వింటే చాలు శ్వేత శ్వేతనాగులా బుస కొడుతుంది. పిల్లి కళ్ళు చీకట్లలో ఎలా వుంటాయో ఆ మాదిరి ఆమె నీలికళ్ళు మారిపోతాయి. కోపంతో ఆమె ముఖం కుంకుమపువ్వు అద్దినట్టు ఎర్రగా మారిపోతుంది.

ఆమెకు యుగంధర్ మీద పట్టరాని కోపం. అందుక్కారణం మాత్రం ఇంతవరకూ బయటపెట్టలేదామె. తన అనుమానం అయితే శ్వేతను వాడు కాని వదిలేసి వుండాలి. ఇలాంటి విషయాల్లో యుగంధర్ సిద్ధహస్తుడన్నది తనకు తెలిసిన నిజమే. ఖచ్చితంగా అలాంటిదేదో జరిగి వుండకపోతే ఈ శ్వేత అప్పుడప్పుడూ యిలా అరుణవర్ణంలోకి మారాల్సిన అవసరంలేదు. గతంలో రెండు మూడుసార్లు డైరక్ట్‌గానే అడిగిచూసాడు. కాని తన కోపానికి అలాంటి సంబంధాలేమీ కారణం కాదని ఆమె బ్లంట్‌గా తిరస్కరించిందే కాని కోపానికి కారణం మాత్రం చెప్పలేదు. ఇక విసిగి తనూ అడగటం మానేసాడు.

రవీందర్ సాధారణ వ్యక్తి ఏమీ కాదు.

యుగంధర్‌కి చెందిన గ్రూప్‌లో చాలా కంపెనీలకు అతడు మేనేజింగ్ డైరక్టర్. గ్రూప్‌లో సెకండ్ రేంక్ అతడిదే. మోడలింగ్ ఫీల్డ్‌లో శ్వేతకు అనేకమందితో పరిచయాలు, బాయ్‌ఫ్రెండ్స్ వుండేవాళ్ళని తెలుసు. ఆమె గతం గురించి పట్టించుకోకుండా కేవలం ఆమె అందం, చలాకీతనం చూసే పెళ్ళి చేసుకున్నాడు. కాని అదేమిటోగాని ఆమె తన భార్య అయినప్పట్నుంచి తనకే తెలీని విచిత్రమైన ఫీలింగ్. ఆమె అందమైన శరీరంతో వేరేవారు... ఆ ఫీలింగే కంపరం కలిగిస్తోంది. ఇప్పుడామె తనతో బుద్ధిగా వుంటోందనే అనుకుంటున్నాడు. అయితే పెళ్ళికి ముందు ఆమె ఎవరితో తిరిగినా పట్టించుకోని తనలో పెళ్ళితో ఆమె తన సొంతంకాగానే ఇప్పుడీ ఫీలింగ్స్ ఏమిటో తనకే అర్థంకాదు. బహుశ యుగంధర్‌తో కూడా ఆమెకి గతంలో శారీరక సంబంధం వుండొచ్చన్న భావనలోంచే తనలో యుగంధర్ మీద జెలసీ కలిగి వుండాలి. అసూయ, ద్వేషం మంచివి కావని తెలిసి కూడా ఇప్పుడు తను యుగంధర్ అంటే ఎలర్జీగా ఫీలవుతున్నాడు.

టెన్షన్ తగ్గించుకోవడానికి అతను సిగరెట్ ముట్టించుకున్నాడు. అతను ఎప్పుడు సిగరెట్ కాలుస్తాడో శ్వేతకు బాగా తెలుసు.

"రవీ... నేను తూట్లు పొడవమంది యుగంధర్ కోటకి. ఇక్కడ వాటర్ బెడ్‌కి కాదు" అంది నవ్వుతూ.

"వాటర్ బెడ్ కాలుతుందనేగా నీ బాధ. డోన్ట్‌వర్రీ. యాష్‌ట్రే వాడుతున్నాగా" అన్నాడు రవీందర్ పొడిగా.

తిరిగి తనే అన్నాడు.

"నువ్వు మరీ హర్రీ అవుతున్నావ్. యుగంధర్ కంచుకోట అని మర్చిపోకు. వేటగాడికి ఓపిక అవసరం. అది లేకపోతే ఒక్క పిట్టా దొరకదు. అలాగే యుగంధర్ కోటకు బీటలు తీయాలంటే టైం కావాలి" చెప్పాడు.

"నిజమే. కాని యుగంధర్ అసాధ్యుడు. అతను పసిగట్టటకముందే పని పూర్తవ్వాలి. ఎన్ని డామ్‌ల లాకులు తెరిచి నీళ్ళు వదిలితే అతను మునిగిపోతాడో ముందు తెలుసుకో. ఆ తర్వాత మన పని సులువవుతుంది."

రవీందర్ లేచి అటు యిటు పచార్లు చేస్తున్నాడు.

ఫ్రెష్‌గా ఇంకో సిగరెట్ వెలిగించాడు.

శ్వేత ఎప్పుడూ యింతే!

చాలా ఫాస్ట్‌గా వుంటుంది... అన్ని విషయాల్లోనూ. అందుకే ఆమె తనకు అంతగా నచ్చుతుంది.

"ఏయ్ శ్వేతా! ఒక స్మగ్లర్ మైండ్‌లా నువ్వు చాలా ప్లాన్డ్‌గా ఆలోచిస్తావ్! నన్నడిగితే నువ్వు మగాడిగా పుట్టుండాల్సింది. పొరబాటున ఆడదానివయ్యావ్" అన్నాడు ఆమెను చూస్తూ.

"నోనో... నాకిలాగే బాగుంటుంది. నాలోని మగాడి ఆలోచనలకు నా ఆడతనం ఓ వజ్రాయుధం. టు ఇన్ వన్! బెస్ట్ కిల్లర్ కాంబినేషన్ కదూ?" అంటూ ఫక్కున నవ్వింది.

జలజల ముత్యాలు జాలువారుతున్నట్టుండే ఆ నవ్వంటే అతడికి చాలా యిష్టం. రవీందర్ మైండ్‌లో ఒక విషయం సుడులు తిరుగుతోంది.

అదేమంటే–

మిడాన్ గ్రూప్‌కి చెందిన డిస్టిలరీ ఫాక్టరీ ఒకటుంది. ఆ ఫాక్టరీవల్ల ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. జల కాలుష్యంతో ఆ ప్రాంతంలో వ్యాధులు పెరిగి జనాలు యిబ్బందులు పడ్డారు.

ఆ ప్రాంతంలో పోలీసులకు లొంగిపోయిన మాజీ నక్సలైట్ ఒకడు అక్కడి ప్రజల్ని కూడగట్టి డిస్టిలరీకి వ్యతిరేకంగా ఉద్యమం నడిపాడు. కోర్టుల కేసు నడిచింది. డిస్టిలరీకి కూడ తెలుసు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? మూతపడిన మీ డిస్టిలరీ ఫ్యాక్టరీ గురించా?" అడిగింది శ్వేత.

అవునన్నట్టు తలూపాడు.

"కోర్టు అర్డరు ప్రకారం బాధిత కుటుంబాలకు భారీగా నష్టపరిహారం చెల్లించాల్సి వుంటుంది. పైగా డిస్టిలరీ మూతపడ్డంతో అక్కడ ఆదాయం పోయి నష్టాలు మిగిలాయి. నష్టాన్ని పూడ్చుకోవాలంటే అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. ఆ స్థలం అయితే చాలా విలువైంది. అక్కడ

అపార్ట్‌మెంట్స్ లేపి ఫ్లాట్స్ అమ్ముకుంటే నష్టాల్ని అధిగమించే అవకాశం వుంది. కాని భూగర్భజలాలు కలుషితం కాబట్టి తాగునీటి సమస్య. ఫ్లాట్స్‌కి తగిన రేటు రాకపోవచ్చు. యు నో... ఇప్పుడు జలకాలుష్యానికి జనం భయపడుతున్నారు" అన్నాడు.

"కాలుష్యం లేనిదెక్కడ? అభివృద్ధి, కాలుష్యం ఇవి రెండూ తోడు దొంగల వంటివి సైన్స్ సాధించే ప్రగతికి రెండో కోణం కాలుష్యం తప్పదు. గుడ్డు పగలగొట్టకుండా ఆమ్లెట్ వేయలేం గదా!"

"డామిట్! ఏమో అనుకున్నాను నువ్వు చాలా కర్కోటకురాలివి."

"నో... నాటెటాల్! నేను ప్రాక్టికల్ మనిషిని. నీకో విషయం తెలుసా? అసలు ఆ ఫాక్టరీ చుట్టుపక్కల కంపెనీలు పెరిగి భూమి ధరలకు రెక్కలు వచ్చినప్పుడే జాగ్రత్తపడాల్సింది. కనీసం భూజలా కలుషితమైనట్టు సమస్య దృష్టికొచ్చినప్పుడే డిస్టలరీని మరో చోటకు తరలించి ఆ స్థలంలో రియల్ ఎస్టేట్ వెంచర్స్ వేసుంటే ఇప్పుడీ ప్రాబ్లమ్ వుండేదికాదు. పైగా కలుషిత నీటిని భూమిలోకి వదలటం పొల్యూషన్ బోర్డు నియమాల ప్రకారం నేరం."

"యస్. ఏంచేస్తాం? రాజకీయాలయితే మేనేజ్ చేయొచ్చు ఇది చట్టపరమైన సమస్య అందుకే యుగంధర్ కాస్త ఉక్కిరి బిక్కిరవుతున్నాడు ఇలా జరుగుతుందని నాకు తెలుసు. అందుకే వదిలేశాను. మిడాన్ గ్రూప్‌కి నే వేసిన తొలిదెబ్బ ఇది. గ్రూప్‌లో ఒక్కో కంపెనీ నష్టాల్లోకి జారుతోంది. అలా జారేలా నేనే చేస్తున్నాను."

అతడి మాటలకు పులకిస్తూ–

అతడ్ని లాగి పక్కన కూర్చోబెట్టుకుని–

తల ఒడిలో వుంచుకుని ముఖం వంక చూసింది.

తన మాటల్ని కంటిన్యూ చేశాడు రవీందర్.

"శ్వేతా! యుగంధర్ మీద నీ పగకి కారణం ఏమిటో నాకు తెలీదు. కాని నా పగకి కారణం మాత్రం నాకు తెలుసు" అన్నాడు.

"ఏమిటా కారణం?" వెంటనే అడిగింది.

"ఒకప్పుడు వాడికి నీతో శారీరకంగా వున్న సంబంధం. అది నేను భరించలేక పోతున్నాను." అని పైకి చెప్పాలనుకున్నాడు. కాని చెప్పక పోవటమే మంచిదని విరమించుకున్నాడు.

"లీవిట్! యుగంధర్‌కి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో మూడింట ఒక వంతు సపోర్ట్ మాత్రమే వుంది. మిగిలినవాళ్ళు అతడి తప్పులు వెదుకుతున్నారు. భారీగా నష్టాలు రావచ్చని భయపడుతున్నారు. వాళ్ళంతా అదనుకోసం చూస్తున్నారు. టైమ్ వచ్చిందంటే కాటేయకుండా వదలరు. లోపాయకారిగా వాళ్ళని కూడగట్టే ప్రయత్నంలో వున్నాను" చెప్పాడు.

ఉత్సాహంగా చూసింది శ్వేత.

"కిపిటప్ రవీ! నీ ప్రయత్నం ముమ్మరం చెయ్యి. అదృష్టం తలుపును ఒక్కసారి తడితే దురదృష్టం తీసేవరకూ తడుతూనే వుంటుందట. ప్రస్తుతం అదృష్టం మనవైపు దురదృష్టం యుగంధర్ వైపు వుంది. మనం అదృష్టం కోసం తలుపు తెరవటానికి రెడీగా వుండాలి" అంది ఉత్సాహంగా.

ఆమెకిప్పుడు చాలా ఆనందంగా వుంది.

కొందరికి శాడిజంలోని ఆనందం మరెందులోనూ లభించదు. ఆ కోవకు చెందిన యంగ్ అండ్ బ్యూటిపుల్ లేడీ శ్వేత. మగాడి అందం, తెలివి, స్నేహం ఇవేమీ ఆమెకు శృంగారంలో కిక్ కలిగించలేవు. కేవలం పవర్... అధికారం వున్న మగాళ్ళతోనే ఆమెకు కిక్ లభిస్తుంది. మోడలింగ్ రంగంలో ప్రవేశించిన తొలినాళ్ళలోనే తనలోని ఈ నైజాన్ని ఆమె గుర్తించేది.

అసలు ఏరికోరి రవీందర్‌నే ఆమె పెళ్ళిచేసుకోడానికి తగిన కారణం వుంది. ఆ కారణం యుగంధర్. ముల్లును ముల్లుతోనే తీయాలి అన్న సామెతగా ఆమె ఇతడ్ని ఎంచుకుంది. యుగంధర్ మీద విజయం సాధించటం అంటే తనకి ఆక్సిజన్ మాస్క్ లేకుండా ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత ఆనందం.

అవసరానికి ఏవేవో ప్రామిస్‌లు చేసేసి వాటిని నిలుపుకోని మగాళ్ళంటే శ్వేతకు అసహ్యం. పైగా శ్వేతకు చేసింది అలాంటిలాంటి ప్రామిస్‌కాదు. తన రాణిని చేసుకుంటానన్నాడు. మోజు తీరేదాకా వాడుకున్నాడు. చివరికి తనను నిర్ధాక్షిణ్యంగా వదిలేసి మరో మోడర్ షిబాను పెళ్ళిచేసుకున్నాడు.

దాంతో తనను కాదన్న ఆ యుగంధర్ మీద కసి పెంచుకుని అతడ్ని దెబ్బతీయటం కోసమే రవీందర్‌ని బుట్టలో వేసుకుని అతని పెళ్ళానిగా ఇక్కడ అడుగుపెట్టింది.

తను యుగంధర్‌ని చేసుకుంటే నంబర్ వన్ క్వీన్ అయ్యేది. ఆ ఛాన్స్ పోయింది కాబట్టి ఇప్పుడు కింగ్‌నే మార్చాలనుకుంది. రవీందర్ కింగ్ అయితే తనేగా క్వీన్!

"నౌ ది గేమ్ స్టార్ట్స్" అనుకుంటూ అతడి ఒడిలోంచి లేచి కూర్చుని అతడి నుంచి సిగరెట్ తీసుకుని ముట్టించుకుంది.

ఆమెకు ఎంతో సంతోషం కలిగినప్పుడే–

తప్పకుండా సిగరెట్ కాలుస్తుందని రవీందర్‌కి తెలుసు.

* * * * *

అది దిల్‌సుక్ నగర్‌లోని ఓ ప్రముఖ బార్ అండ్ రెస్టారెంట్. బార్ డీలక్స్ సెక్షన్‌లో కార్నర్ టేబిల్ వద్ద విడిగా ఇద్దరు వ్యక్తులు కూర్చునున్నారు. ఇద్దరిలోనూ ఒకతను ఆజాను బాహుడు, భారీ విగ్రహం. ఏజ్ కూడ కొంచెం ఎక్కువే. రెండో వ్యక్తి యువకుడు. చూడ్డానికి నీట్‌గా, అందంగా చాలా బావున్నాడు.

ఆజానుబాహుడు వెయిటర్‌ని పిలిచి మరో లార్జ్‌పెగ్ ఓల్డ్‌మాంక్ రమ్, సోడా పట్రమ్మని ఆర్డర్ చేశాడు.

అతడి ఎదురుగా వున్న యువకుడి పేరు అనూప్. అతను లాయరు. అతడి గ్లాస్‌లో వుంది రాయల్ ఛాలెంజ్ విస్కీ కొద్దికొద్దిగా సిప్‌చేస్తూ ఆజానుబాహుడి రమ్ గ్లాస్‌వంక చూస్తున్నాడు.

"ఏమిటి చూస్తున్నారు?" అడిగాడా వ్యక్తి.

"ఏం లేదూ... మీ స్థాయికి ఓల్డ్‌మాంక్ సూట్ కావటంలేదు. ఒక రౌండ్ వైట్ రమ్ తాగొచ్చుగా?" అనడిగాడు అనూప్.

చిన్నగా నవ్వాడతను.

"కరక్టే. కాని కాలేజ్ డేస్‌నుంచి ఓల్డ్‌మాంక్ నా ఓల్డ్ ఫ్రెండ్ అయిపోయిందే. ఎలా వదులుకోను? ప్రపంచంలోని డార్క్ రమ్ముల్లో థర్డ్

బెస్ట్‌గా వచ్చింది ఓల్డ్‌మాంక్. ఐ లై కిట్. బట్! రేటు పెంచేసారనుకో. ఐ శాటిస్‌ఫైడ్. నా పద్ధతి ఇంతే. సింపుల్‌గానే వుంటాను. కాని ఇప్పుడిదే దెబ్బ కొట్టేట్టుంది" అన్నాడు.

తల వూపాడు అనూప్.

"ఇంతకీ మీ ప్రాబ్లమ్ ఏమిటో చెప్పలేదు" గుర్తుచేశాడు.

"ఫీజు గురించి మీరేమీ ఆలోచించక్కర్లేదు. ఇచ్చుకుంటాను. నా సమస్యని మీరే పరిష్కరించగలరు" చెప్పాడతను.

"నేను మాత్రమే సాల్వ్ చేయగలనని ఎందుకనుకున్నారు?"

"ఎందుకంటే వెన్నెలతో మీ పరిచయం గురించి నాకు తెలుసు గాబట్టి. మీ మాట ఆమె వింటుంది గాబట్టి. మీ మాట ఆమె వింటుంది గాబట్టి."

అర్థంకాలేదు అనూప్‌కి.

తాగుతున్న విస్కీ గొంతుకి అడ్డం పడుతున్నట్టనిపించింది. ఒక్క గుక్కలో తాగేసి, గ్లాసు పక్కనపెట్టి ఆశ్చర్యంగా చూసాడు.

"మధ్యలో ఆమె పేరేందుకు?" అడిగాడు.

"సమస్య అక్కడే వుంది గాబట్టి."

"సారీ... నేనామెను చూసి రెండేళ్ళయింది."

"నేను నమ్మను."

తన వ్యక్తిగత జీవితంలోకి ఇతరులు తొంగిచూడ్డం అనూప్‌కి అస్సలు నచ్చని విషయం. తన ముందున్నది మరో మనిషి అయితే సమాధానం మరోలా వుండేది. కాని తన ముందున్నది తన క్లయింట్... తను లాయరు. ఇది తన వృత్తి... ఇది కూడా వ్యాపారం లాంటిదే. వ్యాపారంలో కోపతాపాలకు తావుండకూడదు.

బేరర్ ఆజానుబాహుడి లార్జ్ పెగ్ రమ్, సోడా రెండూ తెచ్చిపెట్టాడు. తిరిగి గ్లాసులు ఫుల్ అయ్యాయి. ఆయనది ఓల్డ్ మాంక్, అనూప్‌ది రాయల్ ఛాలెంజ్ విస్కీ.

"ఓ.కె... కం టుది పాయింట్. సమస్య ఏమిటి...?" అడిగాడు అనూప్.

అతడి కళ్ళముందు వెన్నెల మెదులుతోంది.

చాలారోజుల తర్వాత–

ఈ పెద్దమనిషి మళ్ళీ వెన్నెలని గుర్తుచేసాడు.

విస్కీ కొంచెంతాగి పక్కన పెట్టి–

అతను చెప్పటం ఆరంభించాడు.

"జూబ్లీహిల్స్ వద్ద మాదాపూర్‌లో అయ్యప్ప సొసైటీ కాలనీ వుంది తెలుసుగా?"

"తెలుసు."

"అక్కడ మూడువందలగజాల ప్లాట్లు వరసగా నాలుగు ఖాళీగా పడున్నాయి. అవి నావే. వాటిని పందొమ్మిదివందల ఎనభైరెండులో నలభైవేలకి కొన్నాను. ప్రస్తుతం అక్కడ గజం స్థలమే లక్షన్నరకు పైగా పలుకుతోంది. హైటెక్‌సిటీ పుణ్యమా అని ఇక్కడి భూములధరలకి రెక్కలొచ్చిన సంగతి మీకు తెలీందికాదు.

అయితే అక్కడున్నవన్నీ ఒక ట్రస్టుకు చెందిన స్థలాలు. వివాదగ్రస్తమైన స్థలాలు కొన్ని కోర్టు తీర్పుకోసం ఎదురుచూస్తున్నాయి. ఈ పరిస్థితిలో అక్కడ లాండ్ సీలింగ్‌ని తెచ్చి ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన వాటిని క్రమబద్ధకరించి, మిగులు భూముల్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఇది అమలుకానుందని నమ్మకంగా తెలిసింది. ఈ విషయం లీకవటంతో, అక్కడి స్థలాలకు బ్యాంకులు లోనివ్వటం కూడా నిలుపుచేసాయి.

స్వయంగా అయితే ఈపాటికే నేను నా నాలుగు ప్లాట్లలోనూ నిర్మాణం పనులు మొదలుపెట్టాలి. కాని నా వ్యాపారాలు దెబ్బతిని, నష్టాల్లో వున్నాను. గోరుచుట్టుమీద రోకలిపోటులా ఇప్పుడే లాండ్ సీలింగ్ ఒకటి. అమ్ముకుందామన్నా, లోన్లు ఇవ్వని స్థలాలమీద ఎవరూ ఆసక్తి చూపటంలేదు. ఆ పైన అయినకాడికి అడుగుతున్నారు.

ఇదిలావుంటే నేను వెన్నెలకి చెందిన ఫైనాన్స్ కంపెనీలో పదిలక్షలు అప్పు తీసుకున్నాను. నా ఆర్థిక పరిస్థితి బాగలేకపోవటం, అక్కడి స్థలాల

పరిస్థితి తెలుసుకున్న వెన్నెల నాకు ఫోన్ చేసింది... బాకీ కోసం వత్తిడి చేసింది. నాలుగు ప్లాట్లనీ తనకి అమ్మేయమంది. చివరికి ఒక అగ్రిమెంటుకొచ్చిన మాట నిజమే. తన చేతిలో రియల్ఎస్టేట్ వ్యాపారం ఎలాగూవుంది గాబట్టి ఆ స్థలంలో ఆమె అపార్ట్‌మెంట్స్ నిర్మించి, ప్లాట్స్‌ని అమ్ముకుంటుంది. నా చేతికి ప్రస్తుతం యాభైలక్షలు, అంటే నేను బాకీపడ్డ పదిలక్షలకి వడ్డీలేకుండా మాఫీచేసి, మిగతా నలభైలక్షలు నా చేతికిస్తానంది ఓ.కె. ప్లాట్స్ బిజినెస్ అయ్యాక సెవంటీ, థర్టీ పర్సంట్‌గా షేర్ చేస్తానంది. థర్టీ పర్సంట్ అంటే స్థలం ఖరీదు ప్రస్తుత మార్కెట్ విలువకన్నా నాకు చాలా తక్కువ ముడుతుంది. ఇక్కడ మా యిద్దరికీ బెడిసింది.

నేను ఆర్థిక సమస్యల్లో ఉన్నమాట నిజమేగాని, అయినకాడికి ఇచ్చుకోలేనుకదా. నేను సిక్స్‌టీ పార్టీ అడిగాను. నో అంటోంది. నాకు ముప్ఫైశాతం మించి పైసా ఇవ్వనంటోంది... ఇలాంటి విషయాల్లో ఆమె తండ్రి యుగంధరే ఎంతోనయం. ఎలాగో మేనేజ్ చేయగలిగేవాడ్ని. ఈ అమ్మాయి వెరీ క్లవర్, జగమొండి. నేనడిగిన పర్సంటేజ్‌కి ఒప్పుకోకపోగా 'నా ఆఫర్‌కి ఒప్పుకుంటావా, వడ్డీతోసహా పదిలక్షలు తెచ్చి కడతావా' అంటూ వత్తిడి తెస్తోంది. లేదంటే కేసు వేస్తానంటోంది. నన్ను భలే ఇరుకునపెట్టి చంపుతోందయ్యా ఈ పిల్ల" అంటూ కాస్సేపు చెప్పటం ఆపాడతను.

"ఇంతకీ మీరుమనుకుంటున్నారు? నన్నేం చేయమంటారు?" తన గ్లాస్ ఫినిష్‌చేసి పక్కన పెట్టేస్తూ అడిగాడు అనూప్.

"ఏంలేదు. నాకు పార్టీ అక్కర్లేదు. కనీసం ముప్ఫైఅయిదు శాతం చాలు. నువ్వు వెన్నెలతో మాట్లాడాలి" చెప్పాడతను.

"ఆమె నామాట వింటుందనుకోను. ప్రయత్నిస్తాను."

"మీ స్నేహం కొనసాగుతోందిగా?"

"లేదులే."

"అంటే... వెన్నెల మరో బాయ్‌ఫ్రెండ్‌ని పట్టిందా?"

"ఆ విషయం నాకు తెలీదు. నావరకు అయితే మా మనసులు కలవలేదు. ఫ్రెండ్స్‌గానే విడిపోయాం."

"గుడ్... ఆడవాళ్ళు మెట్రో రైళ్ళలాంటి వాళ్ళు. ఒకటి మిస్సయితే వెంటనే మరోటి వస్తుంది. కాని అంత అందగత్తెని, తెలివైన పిల్లని చూస్తూ చూస్తూ ఏ మగాడూ వదులుకోడు. ఇప్పుడు వెన్నెల కోటీశ్వరి. అంతా ఆమె స్వార్జితం. తండ్రి నుంచి ఏమీ తీసుకోలేదు. వెరీక్లవర్. నేనయితే ఖచ్చితంగా వదిలేవాడ్నికాను. ఏం చేస్తాం. ఎవరికెంత రాసిపెట్టివుంటే అంత. కనీసం ఫోన్‌లో అయినా మాట్లాడుకుంటారా?"

అతను కొంచెం ఓవర్ చేస్తున్నాడనిపించింది అనూప్‌కి. అతను ఆడవాళ్ళని మెట్రో రైళ్ళతో పోల్చటం అస్సలు నచ్చలేదు. అలాగని అతన్ని తనేమీ అనలేదు. ఎందుకంటే అతను చాలాకాలంగా తన క్లయింట్.

"ఎప్పుడన్నా ఫోన్ చేస్తూంటాను" అన్నాడు పొడిగా.

"ఫోన్ కాదుగాని, డైరక్ట్‌గా కలిసి మాట్లాడు. ఒప్పించు. నువ్వు చెప్తేనే వింటుంది. ఓకే అయితే నా ఆర్థిక సమస్యా తీరుతుంది. ఆమె సైట్‌లో వెంటనే కన్‌స్ట్రక్షన్ పనులు ఆరంభించుకోవచ్చు."

"ఓ.కే. మీ లాయర్‌గా వెళ్ళి మాట్లాడటం నా బాధ్యత. కాని రిజల్ట్ విషయంలో గ్యారంటీ ఇవ్వలేను."

బిల్ కట్టేప్పుడు అతను టిప్‌గా ఐదొందల రూపాయల నోటు అదీ అందరూ చూసేలా యివ్వటం అనూప్ గమనించాడు. ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న అతడిలో ఇంకా ఫాల్స్ ప్రెస్టేజ్ పోలేదు. కొందరు అంతే.

బార్‌లోంచి బయటికొచ్చాడు.

అతను ఆటోలో వెళ్ళిపోయాడు.

అనూప్ తన కారులో బయలుదేరాడు.

చాలారోజుల తర్వాత మరోసారి వెన్నెల మూలంగా డిస్ట్రబ్ అయ్యాడు. ఈ మధ్య వర్తిత్వానికి ఆ పెద్దమనిషికి తను మాటివ్వకుండా వుంటే బాగుండేదేమో అన్పించింది. కాలేజి రోజుల్లో వెన్నెలతో పరిచయం గుర్తుకొచ్చింది. అప్పట్లో తను బైక్‌మీద కాలేజికి వచ్చేవాడు. వెన్నెల విమానంలాంటి పెద్దకారులో వచ్చేది. మొదట చిన్న చిన్న పరిచయాలతో

ఆరంభమై, తర్వాత బాగా ఫ్రెండ్స్ అయిపోయారు. తమని చూసిన వాళ్ళంతా లవర్స్ అనుకునేవారు. కారు వదిలేసి తన బైక్‌మీద వచ్చేది. చాలా హేపీగా బైక్‌మీద తిరిగేవాళ్ళం. తను బైక్ తోలుతుంటే తనవెనక కూర్చుని, అల్లరి చేయటమంటే వెన్నెలకి చాలా యిష్టం.

అంతా బాగుంటే తర్వాత ఏం జరిగేదో తెలీదుగాని, తను ఆమెను ఇష్టపడి పెళ్ళిచేసుకోవాలని ఆశపడినమాట నిజమే. తన ప్రేమను గురించి ఆమెకు చెప్పాలని, పెళ్ళి ప్రసావన తేవాలని అనుకుంటున్న టైంలోనే ఆమె తన తండ్రితో గొడవపడి వచ్చేసింది. ఆ తర్వాత కొద్ది రోజులు ఆమె ఎక్కడవుందీ కూడా తనకు తెలీదు. తెలిసేసరికే ఆమె బిజీపర్సన్ అయిపోయింది. ఇటు తను లాయర్ ప్రాక్టీసు కేసులు, కోర్టు బిజీ... ఆ తర్వాత తమ మధ్య దూరం పెరుగుతూనే వచ్చింది. తనూ బ్రహ్మచారి. ఆమె కూడా ఇంకా పెళ్ళిచేసుకోలేదు.

ఒకవిధంగా చెప్పాలంటే, వెన్నెల సక్సెస్ ఆమెను తనకు దూరం చేసిందని అప్పుడప్పుడూ అనుకుంటూ వుంటాడు. తమాషా ఏమంటే, మనసు ఒకర్ని ఇష్టపడినా, శరీరం మరొకర్ని కోరుకుంటుంది. తనకు పెళ్ళికానంత మాత్రాన శృంగారానికి దూరంగా వుంటున్నాడనుకుంటే పొరబాటే.

బహుశ వెన్నెల తన జీవితంలోకి వచ్చుంటే మరో అమ్మాయి ముఖం చూసేవాడు కాదేమో. తనకి ఎందరో అందగత్తెలతో సంబంధాలు వున్నాయి. కాని మనసు వెన్నెలనే ఇష్టపడుతుంది ఎప్పుడూ. ఎందుకంటే వాళ్ళలో అందం మాత్రమే వుంది.

కాని వెన్నెలలో గుణం వుంది.

ఆడపిల్ల అందానికి పెట్టని ఆభరణం గుణం అంటారు. మంచి గుణం. అది ఆమె సొంతం. అందాన్ని డబ్బుతో కొనుక్కోవచ్చు. గుణాన్ని కొనుక్కోలేం. ఆమె గుణవంతురాలు కాబట్టే యిప్పటికీ తనలో అలాగే నిలిచిపోయింది.

ప్రస్తుతం తనకయితే ఆమె ముందు కెళ్ళడం ఇష్టంలేదు. కాని ఆ పెద్దమనిషి ముందు కమిటయ్యాడు గాబట్టి తప్పదు. ఫోన్‌చేసి చూడాలి రమ్మంటుందో వీలుకాదంటుందో.

అతడి ఆలోచనలు ఓ కొలిక్కి రాకముందే–

కారు ఇంటికి చెరుకుంది

✻ ✻ ✻ ✻ ✻

సహజంగానే పార్టీలు మీటింగులు అంటే ఎం.ఎల్.ఎ. నిరంజన్‌కు ఇష్టం వుండదు. అయినా తన తండ్రి మధుసూధన్‌రెడ్డి ప్రోద్బలం గాబట్టి ఆయనతో వెళ్ళక తప్పలేదు. అదీ టైగర్ యుగంధర్‌తో సమావేశం అంటే మాటలుకాదు. అక్కడ ఆయన తననో చిన్న పిల్లాడ్ని చూసినట్లు చూడ్డం నిరంజన్‌కి అస్సలు నచ్చలేదు.

రాష్ట్ర రాజకీయ వర్గంలోనూ, ప్రజల్లోను కూడా ఎమ్మెల్యేగా తనకి మంచి పేరు వుంది. కాని వాళ్ళకి అది అక్కర్లేదు. మీటింగ్ చాలాసేపు నడిచింది. తను మాట్లాడింది తక్కువే.

అసలు మాట్లాడనిస్తేగా. సింహాల మధ్యన మేకపిల్లలా అయింది అక్కడ తన పరిస్థితి. మీటింగ్ మధ్యలోనే తనకి చేతుల ఒణుకు ఆరంభమైంది. ఎవరూ గమనించకుండా చాలా జాగ్రత్తపడ్డాడు.

ఎలాగో మీటింగ్ ముగించుకుని బయటపడేసరికి చాలురా బాబు అన్పించింది. ప్రాణానికి చాలా హాయిఅన్పించింది. అసలు తనను సి.యం.ను చేయటం తన తండ్రికి ఇంత పట్టుదల ఏమిటో అర్థంకాదు. ఒకవేళ ఆయన ప్లాన్ ప్రకారమే రేపు తను సి.యం. అయినా రిమోట్ వాళ్ళ చేతుల్లోనే వుంటుంది. తనను ఉత్సవ విగ్రహంలా వుంచి ఆడిస్తారు.

ప్రజలకు మంచి చేయాలని తనకి వున్నా వాళ్ళు చేయనివ్వరు. సహకరించరు. పక్కా కమర్షియల్ మనుషులు వాళ్ళు. అందుకే ఏదో ఫార్మాలిటీగా తండ్రివెంట వెళ్ళాడేగాని ఈ విషయంగా అతడితో ఫ్రస్టేషన్ స్టార్టయి చాలాకాలమైంది.

ఆ కోపంలోనే ఎవరూ చూడకుండా ఒంటరిగా వీధిలోకొచ్చేసాడు. అంతక్రితమే వీధిలైట్లు వెలిగాయి. చినుకుచినుకు వర్షం పడుతోంది. వెంట సెక్యూరిటీ, మెషిన్‌గన్స్ హడావుడీ లేకుండా నడుస్తున్న అతన్ని ఎవరూ గుర్తుపట్టలేదు.

అవును. కార్లు, బార్లు, గన్‌మెన్‌ల వలయం, పార్టీకార్యకర్తల హడావుడి వుంటేగాని జనం రాజకీయనాయకుల్ని గుర్తించలేక పోతున్నారు. తనలో తను చిన్నగా నవ్వుకున్నాడు.

ఉన్నట్టుండి మళ్ళీ చేతులు ఒణకటం ఆరంభించాయి.

ఇక లాభంలేదని పక్కనే వున్న కాయిన్ బాక్స్ వద్దకెళ్ళి ఒక రూపాయి కాయిన్ వేసి ఒక నంబర్‌కి డయల్ చేసాడు. అవతల ఎవరో ఫోన్‌లిఫ్ట్ చేసారు.

"నేను ఎమ్మెల్యే నిరంజన్ మాట్లాడుతున్నాను. మేనేజర్‌ని పిలు" చెప్పాడు.

క్షణం తర్వాత మేనేజర్ లైన్లోకొచ్చాడు.

"నేను వస్తున్నాను" సింపుల్‌గా ఒకేమాట చెప్పి ఫోన్ పెట్టేసాడు నిరంజన్. వెంటనే అటుగా వస్తున్న ఆటో ఆపి ఎక్కి అబిడ్స్‌లోని ఒక హోటల్ పేరు చెప్పాడు. ఆటో కదిలింది.

ఇప్పుడు నిరంజన్ వెళుతున్న చోటు అక్కడ జరిగే చీకటి కార్యకలాపాల గురించి ఏ టీ వీ ఛానల్ వాళ్ళు లేదా పత్రికా విలేఖర్లు అతడ్ని గమనించి ఫోలో అయినా ఉదయంకంతా అదో సెన్సేషనల్ న్యూస్ అయిపోతుంది.

బట్–మీడియాలో అందరికీ నిరంజన్ అంటే మంచి గౌరవం. ఇంతవరకు బయటకు తెలిసి అతగాడిమీద బేడ్ రిమార్క్సు లేవు. ఆటో డ్రయివర్‌కి మాత్రమే డౌటుకొట్టింది.

ఇతన్ని ఎక్కడో చూసాను. ఎక్కడ? ఫోటోలోనా నిజంగానే ఎక్కడన్నా చూసాడా? తీవ్రంగా ఆలోచిస్తూనే ఆటో నడుపుతున్నాడుగాని ఖచ్చితంగా గుర్తుపట్టడం సాధ్యంకాలేదు. ఆటో వేగంగా అబిడ్స్ దిశగా పరుగుతీస్తూనే వుంది. అదే సమయంలో సన్నగా వర్షం జల్లు కూడా పెరిగింది.

* * * * *

పై సంఘటన జరిగిన సరిగ్గా మూడున్నర గంటల తర్వాత–

అంటే రాత్రి సుమారు పదకొండు గంటల ప్రాంతం.

వీధుల్లో చాలావరకు రద్దీ తగ్గిపోయింది.

సన్నటి వర్షంజల్లు ఆగిఆగి పడుతూనే వున్నాయి.

గౌస్ నడుపుతున్న ఖరీదైన కారు అబిడ్స్‌లోని చిన్న సందులోకి తిరిగింది. అది పార్క్ ఇన్ హోటల్ వెనకసందు.

హోటల్ వెనుక గేటుకు సమీపంలో కారాపాడు గౌస్.

కొంతదూరంలో కరెంట్‌పోల్ కింద స్ట్రీట్‌లైన్ వెలుగులో ముగ్గురమ్మాయిలు కన్పిస్తున్నారు. ముఖానికి పౌడర్, దట్టంగా లిప్‌స్టిక్, సిల్కు చీరలు మల్లెపూలతో... చూడగానే వాళ్ళని సెక్స్ వర్కర్లుగా గుర్తుపట్టేసాడు గౌస్.

అతను ప్రస్తుతం మధుసూదన్‌రెడ్డి మనిషేకాని గతంలో అతను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో యస్పైర్యాంక్ వరకు పనిచేసిన మనిషి. పెద్ద మొత్తంలో జీతానికి మధుసూదన్‌రెడ్డి ఆఫర్ చేయటంతో జాబ్‌కి వాలంటరీగా రిటైర్మెంట్ తీసుకుని వచ్చేసి మధుసూధన్‌రెడ్డి గ్రూప్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.

అప్పట్లో మధుసూధన్‌రెడ్డికి ఒక నమ్మకమైన మనిషి అవసరమయ్యాడు. డిపార్ట్‌మెంట్‌తో తనకున్న పరిచయాల మూలంగా బాగా ఎంక్వయిరీ చేసాకే మధుసూధన్‌రెడ్డి గౌస్‌ని తన కంపెనీలోకి తీసుకున్నాడు. ఇప్పటికీ సిటీలోని పోలీసువర్గాల్లో గౌస్‌కి తెలిసినవాళ్ళు చాలా మంది పనిచేస్తున్నారు.

పెద్ద హోటళ్ళ కథలు అంత చప్పున వెలుగుచూడవు. ఆ మధ్య పార్క్ ఇన్ హోటల్ గురించి పేపర్లలో కొన్ని కథనాలు చదివాడు గౌస్. వ్యభిచారం... బార్‌లో అశ్లీల నృత్యాలు... డ్రగ్స్ సప్లయ్... ఇలా చాలా... అయితే ఆ హోటల్‌కి తలకాయల అండ వుంది గాబట్టి వార్త పడ్డ మర్నాడే తమకు పబ్లిక్‌లో ఇమేజ్ దెబ్బ తినకూడదని తూతూమంత్రంగా హోటల్‌మీద రైటింగ్‌చేసి, కొన్ని జంటల్ని వ్యభిచార నేరంకింద అరెస్ట్‌చేసి చేతులు దులుపుకున్నారు పోలీసులు. ఇతర నేరాలమీదకు దృష్టి సారించలేదు.

ఆలోచిస్తూనే తలత్రిప్పి చూసాడు గౌస్.

వెనకసీట్లో గంభీరంగా కూర్చున్నాడు మధుసూదన్‌రెడ్డి.

"సార్! మీరు కూడా వస్తారా?" అడిగాడు.

"అక్కర్లేదు. నువ్వే మేనేజ్ చేసిరా" అంటూ కళ్ళు మూసుకున్నాడాయన.

గౌస్ కారు దిగి డోర్ మూసాడు.

అతను హోటల్ బాక్‌గేట్‌ను సమీపిస్తూండగా వీళ్ళకోసమే ఎదురుచూస్తున్నట్టు యస్సై రంగనాథ్ హడావుడిగా బయటకొచ్చాడు.

"ఈ విషయం బయట ఎవరికీ తెలీదుగదా...?" అడిగాడు గౌస్.

"లేదు. అందుకేగా హోటల్ నుంచి స్టేషన్‌కి ఫోన్‌రాగానే ముందు నీకు ఫోన్‌చేసి విషయం చెప్పాను. ఆ వెంటనే ఇక్కడికి రాగానే మేనేజ్ చేసాను. డోంట్‌వర్రీ. కార్లో మధుసూదన్ రెడ్డిగారున్నారా?" అడిగాడు రంగనాథ్.

"ఉన్నారు."

"పలకరించి రానా?"

"వద్దొద్దు. ఆయన చికాకులో వున్నారు. ముందు మనం లోనకెళ్దాం పద."

ఇద్దరూ లోనకి ప్రవేశించారు.

పై అంతస్థులోని టు నాట్ త్రి రూంకి గౌస్‌ని తీసుకెళ్ళాడు రంగనాథ్. గది బయట ఇద్దరే పోలీసులు నిలబడున్నారు. హోటల్ మేనేజరు కంగారుగా చూస్తున్నాడు. రంగనాథ్ వెంటవచ్చిన నలుగురు పోలీసులు హోటల్ ముందు ఆవరణలో జీప్ దగ్గరే వుండిపోయారు. కావాలనే వాళ్ళని అవాయిడ్ చేసేసాడు రంగనాథ్.

లోన విశాలమైన డబుల్ రూం అంతా చిందరవందరగా వుంది. ఫ్లోర్‌మీద అస్తవ్యస్తంగా వున్న దుస్తుల్లో ఒక నీగ్రో యువతి వెల్లకిలా అచేతనంగా పడుంది. ఊపిరి కష్టంగా తీసుకుంటోంది. దృఢమైన మనిషి. పక్కన పాలిథిన్ ప్యాకెట్టు డిస్పోజబుల్ సిరంజిలు వున్నాయి.

పక్కనే డబుల్‌కాట్ మీద లుంగీతో పడున్న వ్యక్తి కూడ స్పృహలో లేడు. వూపిరి ఆగి ఆగి తీసుకుంటున్నాడు. అతను ఎవరోకాదు ఎమ్మెల్యే నిరంజన్.

"పొజిషనేమిటి?" పరిస్థితి గమనిస్తూ అడిగాడు గౌస్.

"పల్స్ ఒకే. గౌస్. ప్రస్తుతానికి వీళ్ళ ప్రాణాలకేమీ ప్రమాదం లేదు. కాని లేట్‌చేస్తే విషమించవచ్చు. అంబులెన్స్‌ని పిలవనా?" అడిగాడు రంగనాధ్.

"కాస్త ఆగు. నీగ్రో అమ్మాయే కొకైన్ తెచ్చుంటుంది. పర్సనల్ యూజ్ కాబట్టి పోలీసు కేస్ పెట్టినా జైలుశిక్ష పడుతుంది. అదే వ్యాపారం కిందయితే నాన్ బెయిలబుల్ అఫెన్స్... నీకు తెలీందేముంది? నార్కోటిక్స్ అండ్ సైకో ట్రాఫిక్ డ్రగ్స్ ఆక్ట్ చాలా కఠినమైంది. నీవల్ల చాలా ఉపకారం జరిగింది రంగనాధ్. థాంక్స్. కేసు బుక్ చేయక్కరలేదు. ఆల్రెడీ ఓ కార్పొరేట్ ఆస్పత్రి వాళ్ళతో మాట్లాడాం. వాళ్ళు అంబులెన్స్ పంపిస్తున్నారు. నిరంజన్‌తోబాటు, నీగ్రో యువతినీ ఆస్పత్రిలో చేర్చుదాం" అన్నాడు గౌస్.

పెద్దవాళ్ళతో వ్యవహారాలు ఎంత ఫాస్ట్‌గా వుంటాయో రంగనాధ్‌కి అర్ధమవుతోంది.

గౌస్ చెప్పినట్టుగానే కాస్సేపట్లోనే వచ్చేసింది అంబులెన్స్ వ్యాన్. ఎవరికీ తెలియకుండా నిరంజన్‌ని, నీగ్రో యువతిని అంబులెన్స్‌లోకి చేర్చారు.

యస్సై రంగనాధ్‌కి కొంత డబ్బిచ్చాడు గౌస్. అలాగే విషయం తెలిసిన కొందరు హోటల్ సిబ్బందిని కూడా మేనేజ్ చేసాడు. అలా విషయం బయటకు పొక్కకుండా మేనేజ్ చేసి కారు వద్దకొచ్చాడు.

"అంతా ఓ,కే.నా?" పొడిగా అడిగాడు మధుసూదన్‌రెడ్డి.

"ఓ.కే.సర్. అందర్నీ మేనేజ్ చేసాను. కాని అందరినోళ్ళు నొక్కలేంకదా. పొరబాటున ఎవడు నోరు జారినా మీడియాలో ఈ వార్త వచ్చేసే ప్రమాదం వుంది" చెప్పాడు.

"నా భయం కూడా అదే. వాడి ప్రాణానికేం ప్రమాదంలేదు నాకు తెలుసు. ఇలా ఎన్నిసార్లు జరగలేదు? ఆస్పత్రి బయటికొచ్చాక, ఇక డ్రగ్స్

జోలికి పోనంటాడు. కాని మానడు. వాడు డ్రగ్ ఎడిక్ట్. ఏం చేయను? ఈసారి ఏదైనా డి ఎడిక్షన్ సెంటర్‌లో చేర్పించేయాలి. ఎప్పుడూ ఓకన్నేసి వుండమని వాడిమీద ప్రయివేట్ డిటెక్టివ్‌ని కూడా వుంచుతాను. నువ్వు మాత్రం ఈ విషయం లీక్ గాకుండా చూసుకో. చాలా ముఖ్యం. లీకయితే హెచ్.యస్. క్లబ్‌లో నా పరువు పోతుంది. ఎంత ఖర్చయినా ఫరవాలేదు. లీక్ గాకుండా చూసుకో. అంబులెన్స్ బయలుదేరింది. పద...." అన్నాడు మధుసూదన్‌రెడ్డి.

"ఓ.కే. సార్" అంటూ కారు స్టార్ట్ చేసాడు గౌస్.

వేగంగా పరుగు తీస్తున్న అంబులెన్స్ వెనకే-

తన కారునీ వేగంగా పోనీయసాగాడు.

అదే సమయంలో-

హోటల్ ముందునుంచి బయలుదేరిన పోలీస్‌జీప్ వేగంగా మెయిన్ రోడ్డులోకి వచ్చి కారుని ఫాలో చేసింది.

పావుగంట ప్రయాణంలోనే వాహనాలు సిటీలోనే ప్రముఖమైన హాస్పిటల్‌కు చేరుకున్నాయి. నిరంజన్‌ని, ఆ నీగ్రో యువతిని ఎమర్జెన్సీలో చేర్పించేవరకూ యస్సై రంగనాథ్ కూడా మధుసూదన్, గౌస్‌లవెంటే వున్నాడు.

నిరంజన్‌ని, ఆ యువతిని పరీక్షించిన డాక్టర్లు కూడా భయపడాల్సిందేమీలేదని, ప్రాణాలకు ముప్పులేదని, కొకైన్ ప్యూర్‌స్టఫ్ వాడటం వల్ల స్పృహ తప్పారనిఇన్‌టైంలో ఆస్పత్రికి తీసుకురావటంచేత లక్కీగా వాళ్ళు సేఫ్ అని చెప్పారు.

ట్రీట్‌మెంట్ ఆరంభించాక కూడా మధుసూదన్‌రెడ్డి, గౌస్‌లు అక్కడే వుండిపోయారు. యస్సై రంగనాథ్ మాత్రం శలవు తీసుకుని తన స్టాఫ్‌తో జీపులో బయలుదేరాడు.

అతడి బుర్రలో కొత్త ఆలోచనలు రూపుదిద్దుకోనారంభించాయి. ఈ ప్రపంచంలో డబ్బు సంపాదించాలనుకునే ప్రతి మగాడికి ఎవరి కారణాలు వాళ్ళకి వుంటాయి. సంపాదన వేరు, అతిగా సంపాదించాలనుకోవటము

వేరు. అఫ్‌కోర్స్. సంపాదించే విధానాల్లో సక్రమమని, అక్రమమని రెండు విధానాలున్నాయి.

అది వేరనుకోండి. ఇక్కడ రంగనాథ్‌కి సంబంధించినంతవరకూ సంపాదనకి లోటులేదు.

అవసరాలు ఎక్కువైనప్పుడు మనిషి డబ్బుకోసం నీతినియమాలకు తిలోదకాలిచ్చేస్తాడు.

అతడికి యస్సైగా మంచి జీతం, ఆపైన మామూళ్ళ రూపంలో కూడా ఎక్కువ మొత్తమే వస్తుంది. కాని మనిషి విలాసాలకు అలవాటుపడితే ఎంత వచ్చినా చాలదు. రంగనాథ్‌కి సంబంధించినంతవరకు అతడిలో బలమైన వీక్ పాయింట్లు రెండు. అందులో మొదటిది ఖరీదైన ఫారిన్ విస్కీ రెండోది లేడీస్ వీక్‌నెస్.

కొత్త కొత్త ఫిగర్‌లకోసం లీవుపెట్టి మరీ అతను పెద్దాపురం, మండపేటలకు టూర్లు చేస్తుంటాడు. ఈమధ్యే మండపేటలోని ఓ కంపెనీలో ఒకమ్మాయి తగిలింది. కలర్ ఫుల్ యంగ్‌లేడీ. రంగనాథ్‌కి బాగానచ్చింది. పరిస్థితి బాగోక వృత్తిలోకి వచ్చిందిగాని, రావాల్సిన పిల్లకాదు. వుంచుకుంటే వచ్చేయటానికి రెడీగా వుంది. చిన్నిల్లు సెటప్ అంటే మాటలా... డబ్బు కావాలి. ఆమెను అన్నివిధాలా సంతోషపెట్టాలిగా. ఎలా... డబ్బు... మనీ మేక్స్ మెనీ థింగ్స్. తనతో పర్మనెంట్‌గా ఆమెను వుంచుకోడానికి ఇప్పుడో అవకాశం కలిసొచ్చింది. దీన్ని వుపయోగించుకుంటే... గౌస్‌కి ద్రోహం చేస్తే?

గౌస్‌తో వ్యవహారం ఎంత ప్రమాదమో తనకి తెలీందికాదు. కాని డబ్బు కావాలంటే తప్పదు. రిస్క్ చేయాలి. దారిలో దిగిపోయి జీప్‌ను పంపించేసాడు. కాయిన్ బాక్స్ నుంచి మేయర్ రాంరెడ్డి పర్సనల్ సెక్రటరీ ఆల్‌ఫ్రెడ్‌కి ఫోన్ చేసాడు.

మేయర్ రాంరెడ్డికి మధుసూదన్‌రెడ్డికి పరోక్షంగా పడవని రంగనాథ్‌కి బాగా తెలుసు. వాళ్ళిద్దరూ వేర్వేరు పార్టీలకు చెందినవాళ్ళు. నిరంజన్ గురించి రాంరెడ్డికి చెప్పటమంటే కోతికి కొబ్బరికాయ ఇచ్చినట్టే. తను కోరిన డబ్బివ్వటానికి అతను వెనుదీయడు.

ఆల్‌ఫ్రెడ్‌తో మాట్లాడాడు. బేరం కుదిరింది. డబ్బు తీసుకుని స్వయంగా ఆల్‌ఫ్రెడ్ ఉదయం వచ్చి కలుస్తానన్నాడు.

హేపీగా సిగరెట్ ముట్టించుకుని అటుగా వచ్చిన ఆటోఎక్కేసాడు రంగనాథ్.

ఇప్పుడు మనం ఎక్కడ చూసినా పార్టీలను నమ్ముకుని ఆస్థులు పెంచుకుంటున్న వాళ్ళే కన్పిస్తారు. కాని మనకు స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్ళలో పరిస్థితి వేరు. పార్టీల కోసం, ప్రజల కోసం ఉన్నదంతా ఖర్చు చేసిన మహానుభావులు ఎందరో! స్వార్థమంటే తెలీని దేశభక్తులు వాళ్ళు. సమసమాజ నిర్మాణం కోసం పాటుపడిన వాళ్ళు అటువంటి వారిలో ఒకడు రామరాజు.

ఒకనాడు హైదరాబాద్‌కు కాస్త దగ్గరలో వున్న గజ్వేల్ ఒక సంస్థానం. ఆ సంస్థానాధీశడు జమీందార్ రామరాజు.

కమ్యూనిజం ప్రభావంతో తనకున్న వందల ఎకరాల భూమిని బీదలకు దానం చేసిన వితరణ శీలి. అయితే–

చివరకు షామీర్‌పేట, ఉప్పల్ వంటి చోట అయిదెకరాలు మాత్రం తన ఏకైక వారసుడు నటరాజ్‌కు మిగిల్చి, ఆయన పైకి వెళ్ళిపోయాడు. తండ్రి మిగిల్చిన ఆ అయిదెకరాల్లోనూ షామీర్ పేటలోని మూడెకరాలూ అమ్మేసి ఆ డబ్బుతో తార్నాకలో పెద్ద భవంతి కట్టుకుని మార్బుల్‌స్టోన్స్ వ్యాపారంలోకి దిగాడు నటరాజ్. ఇది పదేళ్ళ కిందటి మాట. ఇప్పుడున్నంత నిర్మాణాల డిమాండ్ పదేళ్ళ క్రితం లేకపోవడంతో అప్పట్లో నష్టాలో పడిన కంపెనీ ఇంకా కోలుకోలేదు. తన తండ్రి వద్ద గుమాస్తాగా పనిచేసిన ధర్మభిక్షం కొడుకు విఠల్, నటరాజ్‌నే నమ్ముకుని ఇంకా అతడి దగ్గరే పి.ఎ.గా పనిచేస్తున్నాడు.

అయిదడుగుల పది అంగుళాల ఎత్తుండే నటరాజ్ చూడగానే ఆకట్టుకునే రూపం. దానికి తగ్గట్టుగానే అతడికి మంచి డ్రస్ సెన్స్ కూడావుంది. మనిషిలో ప్రాక్టికల్ భావాలు ఎక్కువ.

ఇవాళ అతడికి–

వెన్నెలతో డిన్నర్‌కి అప్పాయింట్‌మెంట్ వుంది.

కొద్ది రోజుల కిందట ఒక బ్యాంకర్స్ సమావేశంలో అతడికి వెన్నెలతో పరిచయం జరిగింది. అందిస్తే అల్లుకుపోయే రకం నటరాజ్. ఆమెతో స్నేహం పెంచుకుని దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నాడు.

బ్లాక్ ప్యాంట్ మీద బ్లూషర్టు టక్ చేసి-

బ్లాక్ షూస్‌లో ఎగ్జిక్యూటివ్‌లా తయారయ్యాడు.

"అరె విఠల్! డ్రస్ ఎలా వుంది?" అద్దంలో తన రూపాన్ని చూసుకుని మురిసిపోతూ పి.ఎ.ని అడిగాడు.

అతను కాస్త ఇబ్బందిగా చూసాడు.

"సార్! మీరు వెళ్ళేది డిన్నర్‌కి. అదీ అమ్మాయితో... అంతేగాని, బిజినెస్ మీటింగ్‌కి కాదు. సింపుల్‌గా ఇన్‌షర్ట్ తీసేసి, షర్టు చేతులు కొద్దిగా మడవండి. కాజువల్ లుక్ వస్తుంది" సజస్ట్ చేసాడు విఠల్.

"గుడ్ ఐడియా! ఇంత చిన్న విషయం కూడా మర్చిపోయాను చూడు" అంటూ ఇన్‌షర్టు తీసేసాడు.

మనిషి చాలా బాగుంటాడు నటరాజ్. అందులో సందేహంలేదు. అతను గనక మోడలింగ్ ఫీల్డ్‌కి వెళితే ఎంతో పైకి వచ్చుండేవాడు. తెలుగు సిన్మాలకి అయితే పనికిరాడు గాని, అదే ఏ మహేష్‌భట్ వంటి హిందీ డైరక్టర్ దృష్టిలో పడుంటే ఎప్పుడో హీరో అయిపోయేవాడు. నటరాజ్‌లోని వెస్టర్న్ లుక్‌పై విఠల్‌కి చాలా నమ్మకం. అది నిజం కూడా.

"సో... ఇక నేను బయలుదేరుతున్నాను" కారు తాళాలు అందుకుంటూ చెప్పాడు నటరాజ్.

"ఓ.కే. సర్! బెస్టాఫ్ లక్."

"థాంక్స్! అన్నట్టు వీలయితే నైట్‌కి వెన్నెల నాతో ఇక్కడికొస్తుంది. రాజీని వంటచేసి వెళ్ళమను.

"అలాగే సార్!"

నటరాజ్ బయటికెళ్ళిపోయాడు.

అతడి కారు వెళ్ళిపోతున్న సౌండ్ విన్నాక-

వెను తిరిగాడు విఠల్.

ఆ ఇంట్లో వంటమనిషి పేరు రాజేశ్వరి. అంతా రాజీ అని పిలుస్తారు. విఠల్ వెనుతిరిగే సరికి రాజీ కనిపించింది.

"ఓ- నువ్విక్కడే వున్నావా? రా కూర్చో!" అన్నాడు సోఫాలో కూర్చుంటూ.

"అంతా వింటూనే వున్నాలే. వెన్నెల అమ్మాయిగార్ని లైన్‌లో పెట్టేసినట్టేగా? ఏమైనా లేడీస్‌ని పడేయటంలో సార్ టాలెంట్ వేరు" అంది వగలుపోతూ.

"ఏమిటీ... నిన్ను నేను పడేసినట్టా? పిచ్చి మొగమా- వెన్నెల విషయంలో సార్ ఉద్దేశం వేరు. ఆమెకి లైన్ వేసేది లవ్ కోసం కాదు. ఫైనాన్స్ కోసం. మన బాస్‌లో వున్నది మామూలు నెత్తరు కాదు. రాచరికపు నెత్తురు. కమాండింగు డిమాండింగు ఒకరు చెప్పక్కర్లేదు" అన్నాడు విఠల్.

"అవునవును. మన సారుకేంటి. అందగాడు, డబ్బున్నవాడు. లైనువేస్తే ఎలాంటి పిల్లయినా పడిపోవాల్సిందే!" అంటూ లోనకెళ్ళిపోయింది రాజేశ్వరి.

నవ్వి వూరుకున్నాడు విఠల్.

పిచ్చిది- దానికేం తెలుసు తమ బాస్ ఆర్థిక పరిస్థితి నానాటికి దిగజారుతోందని. చదవటానికి ఎం.బి.ఎ. చదివాడు నటరాజ్. మనిషికి చదువు ఒక్కటే చాలదు పైకి రావటానికి, అదృష్టం కూడా వుండాలన్నది విఠల్ నమ్మకం. ఆ రెండోది లేకపోబట్టే మైనస్‌లో పడ్డాడు నటరాజ్. నష్టాల నుంచి కోలుకోలేక గింజుకుంటున్నాడు.

ఇప్పుడు అతను కష్టాల నుంచి బయటపడాలంటే, ఎవరో ఒకరు చేయి అందించాలి. ఆ చేయి వెన్నెలది కావాలని నటరాజ్ కోరిక. పడితే పట్టాడు చింతకొమ్మనే పట్టాడు. అన్నట్టు అతడు ఎంచుకున్న వెన్నెల నిజంగా చింతకొమ్మలాంటిదే. కాని ఆ కామిని ఎంతవరకు చేయి అందిస్తుందన్నది తేలాలి.

ఆలోచిస్తున్నాడు విఠల్.

ఒకసారి మధ్యాహ్నం లంచ్‌కి వెన్నెలని ఇంటికి తీసుకొచ్చాడు నటరాజ్. అప్పుడు ఆమెను తను చూసాడు. తనను, రాజేశ్వరిని, ఇక్కడ మిగిలిన పనివాళ్ళని కూడా ఆమె ఎంతో మర్యాదగా చూసింది. కొంచెం కూడా గర్వం లేదు. పనివాడు, యజమాని అనే బేధం లేకుండా అందర్నీ సమ దృష్టితో చూడ్డం అందరికీ సాధ్యం కాదు. ఎంతో ఉన్నతమైన సంస్కారం కలిగి వుండాలి. ఆ సంస్కారం, తెలివితేటలు వెన్నెలలో పుష్కలంగా వున్నాయి.

ఈజీగా ఫైనాన్స్ దొరకాలంటే డబ్బున్న అమ్మాయిల్ని లైన్లో పెట్టుకోవడం మంచి సులువైన మార్గమని నమ్మే వ్యక్తి నటరాజ్. గతంలో చాలా మందిని ట్రైచేసి కొంత సక్ససయ్యాడు కూడా. ఇప్పుడు వెన్నెల. అయితే ప్రేమ– దోమా అంటూ మిగిలిన అమ్మాయిల్ని ఫూల్స్‌ని చేసినంత ఈజీకాదు వెన్నెల విషయంలో. ఆమె అంత గమ్మున రాలే వూపు కాదు. ఒకవేళ రాలితే... అప్పుడు సీనే మారిపోతుంది. నటరాజ్‌కి దశ తిరిగినట్టే.

నిజంగా దశ తిరుగుతుందా?

ఏమో?!

ఆయన వెన్నెలతో వచ్చేసరికి తను స్టడీగా వుండాలి గాబట్టి ఎక్కువ పుచ్చుకో కూడదనుకుంటూ రాయల్ ఛాలెంజ్ విస్కీ ఒక లార్జ్ పెగ్ వేసుకుని మెల్లగా సిప్ చేయసాగాడు విఠల్.

నటరాజ్ బ్రాండ్ రాయల్ ఛాలెంజ్.

విఠల్ పోసుకు తాగినా అతనేమీ అనడు.

ఆలోచిస్తూ మందుకొడుతున్న విఠల్ చివరకు అనుకున్నాడు.

"పొరబాటున బాస్ పరిస్థితి తల్లకిందులయితే... అయితే ఏముంది? తన బ్రతుకు చీప్ లిక్కరే.

* * * * *

స్టార్ హోటల్ డిమ్‌లైట్ల మధ్య ఒక టేబిల్ ముందు వెన్నెలకి ఎదురుగా కూచున్నాడు నటరాజ్. ఆమెను చూస్తుంటే నటరాజ్ కళ్ళముందు కాశ్మీర్ ఆపిలు పండు మెదులుతోంది. రోజు రోజుకి వెన్నెలలో గ్లామర్ పెరుగుతోంది

అన్పిస్తోంది. ఇవాళ మరీను... సాంప్రదాయంగా చీర జాకెట్‌లో కళ్ళు చెదిరే అందం.

వ్యాపారంలో నష్టాల్లో వున్న నటరాజ్ అంటే వెన్నెలలో సానుభూతి వుంది. అయినా తన ఇబ్బందులకు కృంగిపోకుండా ఎప్పుడూ జోకులేసి నవ్వుతూ, నవ్విస్తూండే నటరాజ్ అంటే ఆమెకు ఇష్టం. ఎంతవరకూ ఇష్టం అంటే జస్ట్ స్నేహం వరకే. అయితే-

ఆమె తనపట్ల చూపే అభిమానాన్ని, సానుభూతిని మరోలా అర్థం చేసుకున్నాడు నటరాజ్. ఆమెను మరింత ఆకర్షించి లవ్‌లో పడేయాలన్న తలంపుతో తరచూ ఫోన్లు చేయటం, డిన్నర్‌కనీ, లంచ్‌కనీ ఆమెను ఆహ్వానించటం చేస్తుంటాడు.

ఆమెది బిజినెస్ మైండ్. విస్తరిస్తున్న తన వ్యాపారాల గురించి తప్ప మరో ధ్యాస వుండదు. ఎప్పుడూ బిజీగా, టెన్షన్‌గా తిరిగే ఆమెకు మెంటల్‌గా రిలాక్సేషన్ కావాలి. ఎంతో కొంత టైం తీసుకుని నటరాజ్ వద్దకి రావటానికి కారణం అదే. ఆమె దృష్టిలో ఇది జస్ట్ ఫ్రెండ్‌షిప్ మాత్రమే. కానీ అతడి దృష్టిలో ఇది లవ్. తనమీది ప్రేమతోనే తను లంచ్‌కి ఆఫర్ చేస్తే కాదనకుండా వస్తోంది అని నటరాజ్ అనుకుంటున్నాడు. ఎంత త్వరగా ఆమె లైన్‌లో పడితే అంత త్వరగా తన అప్పులు తీరిపోతాయన్నది అతడి ధ్యాస.

"సో! ఏదో చెప్పాలనుకుని ఆగిపోయావ్?" గుర్తుచేసింది వెన్నెల.

"యస్! అదే... నీ గురించి సేవీ పత్రికలో చదివాను. సహజంగా ఆడవాళ్ళ పత్రికల్ని పట్టించుకోను. కానీ ముఖచిత్రం నీది కావటం చూసి, కొని చదివాను. నీ ఇంటర్వ్యూ సూపర్! నీ ఆలోచనలూ, అభిప్రాయాలూ అద్భుతం. నిన్నెలా అభినందించాలో తెలీటంలేదు." ఉత్సాహంగా చెప్పాడు. తీరా చెప్పాక అన్పించింది ఆమె పొగడ్తలకు పడే మనిషి కాదని తెలిసి కూడా పొగిడి తప్పుచేసానా అని.

ఆమె మాత్రం సింపుల్‌గా "థాంక్స్" అని నవ్వుకుంది.

"అన్నట్టు నీ డ్రీమ్ ప్రాజక్టు ఎంతవరకూ వచ్చింది?" టాపిక్ డైవర్ట్ చేయటానికి అడిగాడు.

"సైట్ అలాట్‌మెంట్ కోసం చూస్తున్నాను. పేపర్ వర్క్ జరుగుతోంది" చెప్పింది.

"వివరాలు చెప్పవా? ఎంతయినా నీకు ఫ్రెండ్‌నే గదా?"

"అంత ఆసక్తి దేనికి? నీ ఫీల్డ్ వేరుకదా?"

"అవుననుకో. జస్ట్ ఇంట్రస్ట్."

"ఓ.కె. అడిగావు గాబట్టి నా డ్రీమ్‌లాండ్ ప్రాజక్టు గురించి చెబుతాను. ఇది చాలా భారీ ప్రాజక్ట్. నగరవాసులు కష్టపడుతున్నారు. డబ్బు సంపాదిస్తున్నారు, కూడబెడుతున్నారు. దైనందిన జీవితంలో ఎన్నో సమస్యలు, చికాకులు, టెన్షన్‌తో మనశ్శాంతి లేని జీవితాలు. అటువంటి వారికి టెన్షన్స్ మర్చిపోయేలా ఆనందంతో ఒక కొత్త ప్రపంచంలో కొంత సమయం గడిచేలా చేయటం సాధ్యపడుతుందా అనే ఆ ఆలోచనలనుంచి పుట్టిందే ఈ డ్రీమ్‌లాండ్ ప్రాజక్ట్. పిల్లలూ, పెద్దలూ అంతా ఎంజాయ్ చేసేలా డిస్నీలాండ్ తరహాలో అంత గొప్పగా పేరువచ్చేలా హైద్రాబాద్ నగరవాసులకు డ్రీమ్‌లాండ్ నిర్మించాలన్నది నా ఆశయం.

నాకు పర్యావరణం పచ్చదనం అంటే చాలా యిష్టం. కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న సిటీ లైఫ్ నుంచి ఒక ఛేంజ్‌గా ప్రకృతి ఒడిలో వాళ్ళని కొంత రిలాక్సయ్యేలా సంతోషపరిచేలా చేయటం ఈ ప్రాజక్ట్ ఉద్దేశం. దీనికోసం వికారాబాద్ వద్ద స్థలం సేకరించటం జరుగుతోంది. ఆ పని పూర్తికాగానే అక్కడ కృత్రిమ బీచ్, నేచురల్ ఫారెస్ట్, నైట్‌థీమ్స్. ఒకటేమిటి? అన్ని హంగులతోనూ మరో డిస్నీలాండ్ అన్పించేలా నా డ్రీమ్‌లాండ్ నిర్మాణం సాగుతోంది.

నా ఆశయానికి అభినందించిన సెంట్రల్ ఫారెస్ట్ విభాగం ప్రత్యేక అనుమతి మంజూరు చేసింది. ఇతర శాఖలనుంచి కూడా పర్మిషన్లు లభిస్తున్నాయి. ముఖ్యంగా బిజీ లైఫ్‌లో మనశ్శాంతిని కోల్పోయిన ప్రజలు సైక్రియాట్రిస్ట్‌లు, సైకలాజిస్ట్‌ల వద్దకు పరుగెత్తకుండా నా డ్రీమ్‌లాండ్‌లో ప్రశాంతతనీ, విశ్రాంతిని అనుభవించాలన్నది నా కోరిక. ఆశయం చాలా పెద్దదే. అనుకున్నట్టు అంతా జరిగితే ఆదాయం కూడా అలాగే

వుంటుందనుకో. అందుకే ఈ ప్రాజక్ట్ కోసం చాలా రిస్క్ చేస్తున్నాను" అంటూ వివరించింది వెన్నెల.

"రిస్క్ దేనికి?" ఆశ్చర్యంగా అడిగాడు నటరాజ్.

అతడా ప్రశ్న అడగటంలోనే అతడి అమాయకత్వం ఆమెకు అర్ధమవుతోంది. ఇంత భారీ ప్రాజెక్ట్‌లో రిస్కులుండవని ఎలా అనుకుంటున్నాడు?

"డబ్బు మిస్టర్ నటరాజ్! ఈ ప్రాజక్ట్‌కి అయ్యే ఖర్చు ప్రాథమిక అంచనా ప్రకారం మూడువందల కోట్లు. ఇప్పటికే నా అస్థులు చాలా తనఖాపెట్టాను."

"ఇంత భారీ ప్రాజక్ట్ చేపట్టటం అవసరమా? ఒకవేళ ఫెయిల్ అయితే?"

"నీ రెండు ప్రశ్నలు రెండు కోణాల్ని సూచిస్తున్నాయి నటరాజ్! మొదటిది అవసరమా అని... అవసరం గాదు. ఇది నా లక్ష్యం. చేసి చూపాలి అనే పట్టుదల. ఇక రెండో క్వశ్చన్. ఫెయిలయితే ఏమిటి పరిస్థితి అని. నో ప్రాబ్లమ్. ఫెయిలయితే మళ్ళీ జీరోకి వస్తాను. అంతేగానీ రోడ్డున పడను. సక్ససయితే నిరంతర లాభాలతో బాటు నా పేరు శాశ్వతంగా వుంటుంది."

"నీలో ఈ మొండితనం ఏమిటో నాకు ఇప్పటికీ అర్థంకాదు. ఒక టాప్ రేంజ్‌కి వెళ్ళి చతికిలబడితే– ఆఫ్‌కోర్స్... నీ మాటల ప్రకారమే జీరోకి పడిపోయి తిరిగి కోలుకోవటం సాధ్యమే అనుకుంటున్నావా?"

ఈ ప్రశ్నకి వెంటనే బదులు చెప్పలేదు వెన్నెల.

అసలు తన గురించి ఇతనేమనుకుంటున్నాడు?

ఆమెలో సడెన్‌గా మొలకెత్తిన ప్రశ్న యిది.

అంటే ఇతను మార్బుల్ స్టోన్స్ వ్యాపారంలో నష్టపోయి ఇప్పటికీ కోలుకోలేక ఉక్కిరి బిక్కిరవుతూ తన ప్రాజెక్టుల్నీ, వ్యాపారాన్ని కూడా మార్బుల్ స్టోన్స్ వ్యాపారంతో పోల్చు కుంటున్నాడా?

అది కూడా కాదు.

అసలితను తన గురించి ఎందుకింత నెగిటివ్‌గా ఆలోచిస్తున్నాడు? తనమీద ఇతడిలో వున్నది ఫ్రెండ్షిప్పా... లవ్వా... కోరికా...? మొత్తానికి ఏదో మనసులో వుంది. లేకపోతే తన గురించి ఇంతగా ఫీలవ్వాల్సిన పనిలేదు.

"నో ప్రాబ్లమ్ నటరాజ్! నేను ఆరంభించే ఏ ప్రాజక్టయినా అది సక్సెసవుతుందన్న నమ్మకం ఏర్పడితేనే ఆరంభిస్తాను. ఇంతవరకూ సక్సెస్‌లే గానీ ఫెయిల్యూర్స్ ఏర్పడితేనే ఆరంభిస్తాను. ఇంతవరకూ సక్సెస్‌లేగానీ ఫెయిల్యూర్స్ చూడలేదు. కాబట్టి యిది ఫెయిలవుతుందని అనుకోను" అంది.

"ఓ.కె. ఓ.కె... నువ్వు సక్సెస్ కావాలనే ఆశిస్తాను. బట్! ఒకవేళ జీరో పరిస్థితి వస్తే మీ డాడీ సాయం చేయరా?" మరో ప్రశ్న వేశాడు నటరాజ్.

"ఆయన ఇచ్చినా నేను తీసుకోను."

"ఇది అర్థంలేని మాట. ఆయన నీ తండ్రి. ఏ తండ్రీ కూడా బిడ్డల పతనాన్ని చూస్తూ వూరుకోలేడు. ఆయన ముందుకొచ్చి సాయంచేస్తానన్నా నువ్వు కాదని అంటే అంతకన్నా...."

"వెయిట్ వెయిట్! ఈ ప్రాజెక్ట్ నన్ను నష్టపరుస్తుందనే బలమైన అభిప్రాయానికి ఎలా వస్తున్నావ్?"

"నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావ్ వెన్నెల. నేను నష్టం గురించి ఆలోచించటం లేదు. నీ బాగు గురించి, నీ క్షేమం గురించి ఆలోచిస్తున్నాను. కొండంత అండగా నీకు నీ తండ్రి వున్నాడు. చిన్న మాట పట్టింపు కోసం నువ్వు ఆయనకు దూరంగా వుంటాననటం... ఏమో... నాకు నచ్చలేదు."

"ఆడది అబల అనీ, యింటికే తప్ప ఉద్యోగాలకి, వ్యాపారాలకి ఆడది పనికిరాదనే ఆయన పాతకాలం అభిప్రాయాలు కూడా నాకు నచ్చలేదు. ఆయన పులి అయితే ఆ పులి కడుపున పుట్టిన ఆడపులిని నేను. బ్రతికితే పులిలాగే బ్రతుకుతాను."

ఆమెకు కోపం వచ్చిందని గ్రహించాడు నటరాజ్.

తను ఇంతగా చొరవ తీసుకుని ఆమె పర్సనల్ విషయాల్లో వేలు పెట్టడం పొరబాటని అర్థమవుతోంది. అందుకే...." సారీ! అయాం సారీ!" అన్నాడు వెంటనే.

"ఇట్స్ ఓ.కె." అంటూ నవ్వేసిందామె.

ఇంతలో వాళ్ళు ఆర్డర్‌చేసిన ఐటమ్స్ అన్నీ టేబిల్‌మీదికి చేరాయి. ఇద్దరూ భోంచేయటం ఆరంభించారు. ఎంత కోపం వచ్చినా కొద్ది క్షణాల్లోనే తిరిగి కూల్ అయిపోవటం వెన్నెలకి అలవాటు. ఎంతో కృషి చేస్తే గాని యిలా కోపాన్ని కంట్రోల్‌లో వుంచుకోవటం సాధ్యంకాదు. తను బిజినెస్‌లు ఆరంభించిన తొలినాళ్ళలోనే తన షార్ట్ టెంపర్‌మెంట్ తనను చిక్కుల్లో పడేస్తోందని గ్రహించింది వెన్నెల. వ్యాపార రంగంలో పట్టుదల వుండాల్సిందేగాని కోపతాపాలు మంచిది కాదు. అందుకే కోపాన్ని నిగ్రహించుకోవటం అలవర్చుకుంది.

నటరాజ్‌కి ఆమెను ఎలా అర్థంచేసుకోవాలో తెలీక-

ఇంకా కన్‌ఫ్యూజన్‌లోనే వున్నాడు.

ఆమె ముక్కుసూటి మాటలకి మనసులో కొంచెం హర్టయ్యాడు కూడా. ఆ విషయం గ్రహించిన వెన్నెల వాతావరణాన్ని తేలికపర్చటానికి తనే అతడికి కూరలు వడ్డించింది.

"నటరాజ్! ఒక ఫ్రెండ్‌గా నా మీద అంత శ్రద్ధ చూపిస్తున్నావు. నా బాగు కోరుకుంటున్నావ్. థాంక్స్! నీ ఫీలింగ్స్‌ని అర్థం చేసుకోగలను. మా డాడీ గొప్ప బిజినెస్ మేన్. ఆయన జీన్సే నాలోనూ వున్నాయి. ఏదో సుఖంగా బ్రతికేస్తున్నాం అన్నట్టుగా అందరిలా బ్రతికేయటం నాకు ఇష్టం వుండదు. స్వతంత్రంగా నేనేమిటో నిరూపించుకోవాలనేది నా ఆశయం. అందుకే డాడీనుంచి సాయం పొందాలనిగాని, అటువంటి పరిస్థితి రావాలనిగానీ నేను ఎప్పుడూ కోరుకోను" అంటూ వివరణ యిచ్చింది.

"ఓ.కె. నీ అభిప్రాయం క్లియర్‌గా వుంది. పంతాలు, పట్టింపులకు రక్తసంబంధం అడ్డుకాదని అర్థమవుతోంది. బట్... హెచ్...ఎస్. క్లబ్‌కి మీ డాడీ తర్వాత వారసురాలివి నువ్వేగా. అది కూడా వద్దంటావా?" అడిగాడు.

తినడం ఆపి తమాషాగా చూసింది వెన్నెల.

"అలా అని ఎవరు చెప్పారు?" అడిగింది.

"ఎవరూ చెప్పలేదు. నేనే అడుగుతున్నాను. ఆయన వారసురాలిగా నువ్వు గాని, నీ భర్తగాని ఆ స్థానం పొందిన అర్హత కలిగిన వాళ్ళవుతారు. కాదా?"

"లేదులేదు. ఇట్స్ రాంగ్. నాకో అన్న వున్నాడు. పేరు శరత్‌చంద్ర. నీకు తెలీదా...?"

"నిజంగా తెలీదు...."

"అదే విచిత్రం. డాడీ పేరు, నా పేరు తెలిసినంతగా శరత్ పేరు ఎవరికీ తెలీదు. ఎందుకంటే, వాడింకా తండ్రిచాటు బిడ్డలాంటివాడు. సొంతంగా ఏమీ చేయకుండా డాడీ కంపెనీ వ్యవహారాలు చూసుకుంటున్నాడు. అందుకే వాడికి ప్రత్యేక గుర్తింపు రాలేదు. ఇక నీ డౌట్సు గురించి.

చూడు నటరాజ్! హెచ్.ఎస్. క్లబ్ రూల్స్ ప్రకారం తండ్రి తర్వాత ఆ స్థానం కొడుక్కి వస్తుంది. అందులో స్త్రీలకి సభ్యత్వంలేదు. నీ మాటలప్రకారం... నాకు గాని, నాకు కాబోయే భర్తకుగాని సభ్యత్వం దొరకదు" అంది అతడి ఫీలింగ్స్‌ని గమనిస్తూ. ఎందుకంటే అతడి ఫీలింగ్స్‌ని గమనిస్తూ. ఎందుకంటే అతడి మనసులో ఏముందో ఆమె వూహించేసింది.

ఆమె ఇచ్చిన ఇన్ఫర్‌మేషన్‌తో అప్‌సెట్ అయ్యాడో ఏమిటోగాని తర్వాత మౌనం వహించాడు. ఇద్దరూ లంచ్ ముగించి లేచారు. బిల్లు తనే పేచేసింది వెన్నెల.

ఇద్దరూ కారులో బయలుదేరారు.

దారి పొడవునా అతను ముభావంగానే వున్నాడు. చెప్పాలనుకున్న విషయం చెప్పలేకపోతున్నాడనే ఫీలింగ్ అతడి ముఖంలో వుంది. అది ఏమై వుంటుందో వెన్నెల వూహించగలదు. అందుకే తానుగా అతడికి అవకాశం కల్పించకూడదని సైలంట్‌గానే వుండిపోయింది.

నటరాజ్ భవంతి గేటుముందు కారాపింది వెన్నెల.

అతను కారు దిగలేదు.

"ఏమిటాలోచిస్తున్నావ్?" అడిగింది.

"ఏం లేదు" పొడిగా చెప్పాడు.

"దెన్?"

"వెంటనే వెళ్ళిపోవాలా? ఓ గంట నాతో స్పేర్ చేయొచ్చుగా. బెడ్ రూంలో వైన్ వుంది. ఇంట్లో ఎవ్వరూ లేరు...."

"నీ మనసులో వేరే ఉద్దేశం వుంది... సారీ."

అందం, డబ్బు, పవర్ యుగంధర్ కూతురు. ఇదిచాలు. తనపట్ల మగాళ్ళ ప్రవర్తన ఎలా వుంటుందో ఇంటర్‌లోనే తెలుసుకుంది. కాలేజీలో పూర్తిగా అర్థమైంది. తను గోల్డ్ ఫిష్‌కాదు– మగాళ్ళ గాలానికి చిక్కటానికి. నటరాజ్ కూడా చివరికి ఇలా బయటపడిపోయాడు.

ఆమె సారీ చెప్పాక కూడా అతను కారు దిగలేదు.

"వెన్నెలా! నువ్వు నన్ను అపార్థం చేసుకోకు. నువ్వంటే నాకు చాలా యిష్టం. ఆ విషయం నువ్వు గ్రహించే వుంటావు. ఆస్థి విషయంలో నీ లెవల్‌కి తగినవాడ్ని కాకపోవచ్చు. కాని మనిద్దరిదీ బెస్ట్ జోడీ. ఐ వాంట్ టు మేరీయూ" ఇంతకన్నా మంచి సందర్భం రాదనుకున్నట్టున్నాడు. మనసులో మాట బయటపెట్టేసాడు.

అతడి మాటలు విని ఒక్కసారిగా–

ఫక్కున నవ్వేసింది వెన్నెల.

తను సీరియస్‌గా చెప్తుంటే ఆమె నవ్వటం–

ఉడుక్కుంటూ చూసాడు నటరాజ్.

"ఎందుకు నవ్వుతావ్?" అడిగాడు.

''మరి? నవ్వకుండా ఎలా వుండగలను?'' నువ్వు నన్నిష్టపడుతున్నావన్న, ప్రేమిస్తున్నాను అని చెప్పినా నమ్మేయటానికి అయాం నాటె ఫూల్. నీ ఆర్థికపరిస్థితి నీకన్నా నాకే బాగా తెలుసు. నా నెట్‌వర్క్ అలాంటిది. వ్యాపారంలో పైకి రావాలంటే కృషి, పట్టుదల అవసరం. అవి నీలో లేవు. ఈ రోజుకీ లాభాల సంగతి అటుంచి, వ్యాపారంలో నష్టాలు పూడ్చుకోవడం చేతకాలేదు డబ్బున్న అమ్మాయిని చూసి పెళ్ళిచేసుకుంటే ఆర్థిక సమస్యలనుంచి బయటపడొచ్చన్న ఆలోచనేగాని కష్టపడి ఆర్థికపరిస్థితిని మెరుగుపరుచుకునే దిశగా కృషి సాగటంలేదు.

చూడు నటరాజ్! ఒక లక్ష్యం కోసం శ్రమించే నాలాంటి వాళ్ళకి ప్రేమ, పెళ్ళి రెండూ అడ్డంకే. అందుకే ఇంకా నేనిలా ఒంటరిగానే వుండి పోయాను. అంతేగాని నీలాంటి మగాడు దొరక్కకాదు. నేను నీకు దొరికే చేపనుకాదు. అంచేత అలాంటి ఆలోచనలు మానేసి బి ఎ గుడ్‌ఫ్రెండ్" అంది.

కుండ పగలగొట్టినట్టు ఆమె అంత సూటిగా మాట్లాడేసరికి నటరాజ్‌కి తల తిరిగినంత పనయింది. చటుక్కున కారుదిగి డోర్ మూసి లోనకు చూసాడు.

"అయాం సారీ వెన్నెలా! నిన్ను హర్ట్ చేసుంటే క్షమించు" అన్నాడు.

"ఏయ్. హర్టయింది నేను కాదు, నువ్వు. టేకిటీజీ. నువ్వు కోరుకున్న టైపు అమ్మాయి దొరికితే ఓ.కే. ప్రయత్నించు. తప్పులేదు. అలాగని వ్యాపారాన్ని అలక్ష్యంచేస్తే పూర్తిగా మునిగిపోతావు. కాలం ఎవరికోసం ఆగదు. నీకు ఆర్థికపరంగా సూచనలు, సలహాలు ఏమన్నా కావాలంటే ఫోన్ చెయ్యి. నా వంతు సాయం తప్పకుండా చేస్తాను. స్టిల్‌యు ఆర్ మై బెస్ట్ ఫ్రెండ్" అంది.

మబ్బు విడిపోయినట్టయింది నటరాజ్‌కి.

ఆమెను చూసి నేర్చుకోవాల్సింది చాలా వుందనిపించింది.

"థాంక్యూ వెన్నెలా! నేనేమిటో అర్థమయ్యేలా చెప్పావ్. రాయల్ ఫ్యామిలీ లేడీగా నువ్వు రాజసం నిలబెట్టుకున్నావ్. రాయల్ ఫ్యామిలీకి చెందిన వాడినై వుండి కూడా చీప్‌గా ఆలోచిస్తూ కాలం వృధా చేసుకున్నాను. నీ స్నేహం అపూర్వం. నువ్వు నా ఆర్థిక సలహాదారుగా వుంటానంటే అంతకన్నా అదృష్టంలేదు. థాంక్స్" అన్నాడు.

"దెన్ ఇట్స్ ఓ.కె. సీయు... బై."

కారును ముందుకు దూకించింది వెన్నెల.

మెర్సిడైజ్ బెంజ్ కారు మెత్తగా దూసుకుపోతోంది.

ఆమె ఆలోచిస్తోంది.

నటరాజ్ మంచివాడు, అందగాడు. కాని హీరో కాదు. జీరో సెల్ఫిష్. స్వతంత్ర భావాలుగాని, ఒక లక్ష్యంగాని, పట్టుదలగాని ఏమీలేని మనిషి. ఇకనయినా మారితే... అదృష్ట వంతుడు.

ఆమె ఆలోచనలు తిరిగి తన తండ్రి యుగంధర్‌వైపు మళ్ళాయి. సాధారణంగా ఆయన గురించి ఆలోచించదు. తనకో తండ్రి వున్నాడన్న సంగతే మర్చిపోడానికి ప్రయత్నిస్తుంది. ఎందుకంటే బ్లడ్ రిలేషన్ చాలా బలమైంది. కన్నతండ్రిగా ఆయనకన్నా ఆత్మీయుడు తనకు ఈ ప్రపంచంలో ఎవరూలేరు. ఆయన్ని గుర్తుచేసుకుంటే చూడాలనిపిస్తుంది. అది తనకి ఇష్టంలేదు. పట్టుదల విషయంలో ఆయనకి తనేమీ తీసిపోదు. కూతురంటే నువ్వు రా తల్లీ! నా పేరు నిలబెట్టావు" అంటూ ఆయనే వచ్చి తనను అక్కున చేర్చుకుని అభినందించాలి. అదే తన ఆశ. నిజంగా మమకారం వుంటే ఈపాటికే ఆయన రావాలి. రాలేదంటే తనని ఎదిరించానన్న కోపం ఇంకా తీరలేదని అర్థం.

ఈ సమస్య పరిష్కారం కావాలంటే తనో, ఆయనో ఓ మెట్టు దిగిరాక తప్పదు. అందుకు ఇద్దరూ సిద్ధంగా లేరు. తామిద్దర్నీ కలపాలని ప్రముఖులు చాలామంది ప్రయత్నించి ఫెయిలయ్యారు. విసిగి వూరుకున్నారు. అన్న శరత్‌చంద్ర వున్నాడంటే వాడికి తన విషయమే పట్టదు. ఈ పరిస్థితుల్లో నటరాజ్ ఇప్పుడు డాడీని గుర్తుచేసాడు.

ఆయన్ని ఓసారి చూడాలని మనసు పీకుతోంది. బయట ఆయన్ని చూసి కూడా అయిదారు మాసాలయింది.

ఆమె ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చేలోపలే–

కారు తన ఆఫీస్ కట్టడాన్ని చేరుకుంది.

* * * * *

ఐక్యరాజ్యసమితిలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు సభ్యత్వం ఉన్నప్పటికీ శాశ్వత సభ్యత్వం కలిగిన దేశాలను వేళ్ళమీదే లెక్కపెట్టవచ్చు. వాటిలో ఆమెరికాదే అగ్రస్థానం అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

హై సొసైటీ క్లబ్ తీరు కూడా అచ్చం అలాంటిదే.

హెచ్.ఎస్. క్లబ్‌లో అనేకమంది హై సొసైటీ సభ్యులున్నా శాశ్వత సభ్యులు కొద్దిమందే. అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు, కోశాధికారి ఇలా కీలక పదవులు వీరి దగ్గరే వుంటాయి. ఈ కీలక వ్యక్తులంతా సామాన్యులు కారు. మాజీ సంస్థానాధీశులు, జమీందార్లు, రాజవంశాలకు చెందిన వాళ్ళు. మళ్ళీ వీరిలో అతికీలకమైన వ్యక్తి మన్సూర్ ఆలీఖాన్.

బంజారాహిల్స్ రోడ్ నంబర్ పన్నెండులో ఒక ఆర్ట్‌గ్యాలరీ వుంది. దాని పేరు డావిన్సీ ఆర్ట్ గ్యాలరీ. అది నిజాం వంశస్థుడయిన మన్సూర్ ఆలీఖాన్‌కి చెందినది. పురాతన కాలంనాటి ఎంతో విలువయిన పెయింటింగ్స్ అక్కడ వున్నాయి.

మన్సూర్ ఆలీఖాన్‌కి చిత్రలేఖనం అంటే ప్రాణం. స్వయంగా ఆయన మంచి పేరున్న చిత్రకారుడు. అందుకే డావిన్సీ ఆర్ట్‌గ్యాలరీలో ఆయన చిత్రాలతోబాటు అనేక కళాఖండాలు ప్రదర్శనకు ఉంచబడ్డాయి. అప్పుడప్పుడూ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లు, యువచిత్రకారుల కోసం వర్క్‌షాప్‌లు తరచూ అక్కడ నిర్వహించబడుతూంటాయి.

హెచ్.ఎస్. క్లబ్ సభ్యులు కూడా తమ వంశాల్లో తరతరాలుగా వున్న ఎన్నో కళాఖండాల్ని, అపురూప వస్తువుల్ని డావిన్సీ గ్యాలరీలో వుంచారు. తమ గతవైభవ చిహ్నాలకు డావిన్సీ గ్యాలరీ ఓ తీపి గుర్తుగా వాళ్ళు భావిస్తూంటారు. జనం కూడా విశేషంగా వచ్చి చూసిపోతూంటారు.

డావిన్సీ ఆర్ట్‌గ్యాలరీ హెచ్.ఎస్. క్లబ్ తరపున పనిచేస్తోంది. దాని నిర్వహణ బాధ్యత ఖర్చు అంతా క్లబ్‌వారే చూసుకుంటారు ఇక సందర్శకులనుంచి టికెట్ రూపేణా వసూలయ్యే సొమ్ము నిర్వహణ భారాన్ని కొంత తగ్గిస్తూంటుంది.

విశాలమైన ప్రాంగణంలో, ఎత్తయిన సువిశాలమైన ఆర్ట్‌గ్యాలరీలో ఎన్నో గదులు, హాళ్ళు, సమావేశమందిరాలు వున్నాయి. పెయింటింగ్ పాడవకుండా కట్టడంలో చాలా భాగం ఏ.సి.గా మార్చబడింది.

అటువంటి ఆ ఆర్ట్‌గ్యాలరీకి మేనేజరుగా ఈ మధ్యనే వచ్చిన వ్యక్తి మెహబూబ్. ఆర్కియాలజీలో పి.జి.చేసి, డిప్లొమా తీసుకున్న వ్యక్తి. పురాతత్వశాఖలో కూడా కొంతకాలం పనిచేసాడు. చరిత్ర అంటే ఎంతో

ఇష్టం. అప్పగించిన పనిని బాధ్యతగాచేసే వ్యక్తి. అందుకే నవాబూ వంశానికి చెందిన మన్సూర్ ఆలీఖాన్ సాధారణంగా మ్యూజియం డైరక్టర్లకిచ్చే జీతానికి మూడింతలు జీతం ఆఫరిచ్చి మరీ మెహబూబ్‌ని నియమించుకుని, బాధ్యతలు వప్పగించాడు. అయితే అతడి స్కిల్స్‌చూసి ఉద్యోగమిచ్చిన మన్సూర్ ఆలీఖాన్‌కి మెహబూబ్ మనసు తెలీదు. నిజానికి మెహబూబ్ అత్యాసలకుపోయే మనిషి. స్వార్థపరుడు.

అతడు జాబ్‌లో చేరిన నెల్లోనే ఆ గ్యాలరీలో ఒక సెక్షన్ అతడికి అర్థంకాలేదు. అది కట్టడం తూర్పు భాగంలోని ఒక రూమ్. నిజానికి అది రూమ్ కాదు, ఒక మినీ కాన్ఫరెన్స్‌హాల్.

ఎంట్రన్స్ డోర్ దాటగానే ఒక గది కనిపిస్తుంది. నాలుగు సోఫాలతో సింపుల్‌గా, నీట్‌గా కనిపిస్తుంది. దాన్ని ఆనుకొని సెకండ్ డోర్ రంగూన్ టేక్ వుడ్‌తో తయారుచేయబడిన ద్వారబంధం, తలుపులు చక్కని పనితనంతో కూడి కళాత్మకంగా ఆకట్టుకుంటాయి.

ఆ డోర్ తెరవగానే కనిపిస్తుంది మినీ కాన్ఫరెన్స్‌హాల్. అక్కడ ఎటుచూసినా అరిస్టోక్రిటిక్ లుక్ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. రిచ్‌నెస్‌కు మారుపేరా అనిపిస్తుంది. ఎంతో ఖరీదయిన ఫర్నిచర్. అటు ఇటు పాతిక మంది కూర్చోడానికి అనువుగా రౌండ్ టేబుల్, దానికితగ్గ కుషన్‌ఛేర్స్, నేలంతా మనసుదోచే విలువైన కార్పెట్. ఎయిర్ కండిషన్ చేయబడిన స్పెషల్ ఛాంబర్ అది. అంతేకాదు, ఫుల్ సౌండ్ ప్రూప్. డోర్ మూస్తే లోన మాటలు బయటకి వినపడవు.

బయటినుంచి చూస్తే లోన ఇంత హంగామా వుందని ఎవరూ వూహించలేరు. మెహబూబ్‌కే మొదట అర్థంకాలేదు. తర్వాత ఆర్ట్‌గ్యాలరీ బోర్డ్‌మెంబర్స్ అప్పుడప్పుడూ అక్కడ సమావేశం కావటంచూసి ఆ ఛాంబర్ వాళ్ళకోసమే అనుకున్నాడు. కాని అసలు విషయం అదికాదనే సంగతి మూడుమాసాల తర్వాతగాని అతడికి అర్థంకాలేదు.

చాలా కాలంగా అక్కడ పనిచేస్తున్న ఒక అటెండర్ ద్వారా ఆ రహస్యాల్ని రాబట్టుకో గలిగాడు. అదేమంటే హెచ్.ఎస్. క్లబ్‌లో దిగ్గజాలు అనదగ్గ శాశ్వత సభ్యులు తొమ్మిదిమందీ ఇక్కడే సమావేశమవుతారట.

అంటే క్లబ్ సర్వసభ్య సమావేశాలు బయట ఎక్కడో జరుగుతూ వుంటాయి. శాశ్వతసభ్యుల కీలక సమావేశాలకు మాత్రం ఆర్ట్‌గ్యాలరీ కేంద్రం.

అసలు హెచ్.ఎస్. క్లబ్బు గురించి చాలా మందికి తెలీదనే చెప్పాలి. తెలిసిన వాళ్ళకక్కూడా దానిమీద సరయిన అవగాహనలేదు. అంత సీక్రెట్ మెయింటేన్ చేస్తారు క్లబ్ వాళ్ళు. కీలక వ్యక్తుల సమావేశాలు ఇక్కడ జరుగుతాయని తెలిసినప్పుడు కూడా మెహబూబ్‌కి పెద్దగా ఆసక్తి లేదు. కాని ఈమధ్యే ఒక ఫ్రెండు మూలంగా ఈ క్లబ్ గురించి, మెంబర్స్ గురించి ఆసక్తికరమైన విషయాలు చాలా తెలిసాయి. అదేమంటే, మన రాష్ట్రం, మన రాజధానీ నగరం అంతా హెచ్.ఎస్. క్లబ్ వాళ్ళ ఫవర్ అండ్ మనీతో నడుస్తున్నాయట. రాష్ట్ర రాజకీయాల్ని ప్రభావితం చేస్తాయట.

ఈ విషయాలు వినగానే మెహబూబ్‌కి తన రొట్టెవిరిగి నేతిలో పడిందనిపించింది. అంతటి గొప్ప వ్యక్తుల కీలకసమావేశాలకు ఆర్ట్ గ్యాలరీ కేంద్రం. తనక్కడ పనిచేస్తున్నాడు. కాస్త చొరవచూపిస్తే– చాలు సీక్రెట్‌గా హెచ్.ఎస్. క్లబ్ వాళ్ళ నిర్ణయాలను తను వినొచ్చు. విన్న వాటిని ఎలా కేష్ చేసుకోవాలో కూడా తనకు తెలుసు.

అందుకోసమని ఒక మాస్టర్ ప్లాన్ వేసిన మెహబూబ్ తనకు తెలిసిన మిత్రుడి ద్వారా వైజాగ్ నుంచి ఒక వ్యక్తిని పిలిపించాడు. రహస్యంగా మైక్రోఫోన్లు, ఇయర్ బగ్స్ సెట్‌చేయటంతో అతను మాస్టర్. అతని పేరు విక్కీ. స్మగ్లర్స్‌తో సంబంధాలున్న వ్యక్తి.

ఎవరూ రాని టైం చూసుకుని విక్కీతో స్పెషల్ ఛాంబర్‌లో అడుగుపెట్టాడు మెహబూబ్.

"చూడు విక్కీ! అక్కడ నా ఆఫీస్‌రూం చూసావ్‌గదా? ఇక్కడ చిన్న శబ్దం వచ్చినా అక్కడ నాకు వినిపించాలి. అర్థమైందిగా?" అంటూ ఏం చేయాలో విక్కీకి వివరంచాడు మెహబూబ్.

"డోన్ట్‌వర్రీ సాబ్. ఇది చిటికెలో పని" అంతా పరికించి చూస్తూ చెప్పాడు విక్కీ.

"ఏమిటి చూస్తున్నావ్?"

"ఇక్కడ సీక్రెట్ మైక్ పెట్టాలిగదా. ఈ టేబిల్‌కి చిన్న హోల్ చేస్తేచాలు. ఫిక్స్ చేసుకోవచ్చు."

"చంపావ్‌పో. నా పీకలమీదకొచ్చే పనిచేయకు. ఇక్కడ అన్నీ చరిత్రతో ముడిపడిన విలువైన వస్తువులు. ఈ టేబుల్ పదిహేడో శతాబ్దానికి చెందింది. చిన్న గీత పడినా మన్సూర్ ఆలీఖాన్ సాబ్ నా పీక కోస్తారు. ఇక్కడ ఏదీ డామేజ్‌గాకుండా, పనయ్యేలా చూడు."

"ఓ.కె. సాబ్. వెయిట్ మినిట్" అంటూ గోడకు వేలాడుతున్న ఒక పెయింటింగ్ వద్దకెళ్ళాడు. చక్కటి లాండ్ స్కేప్ పెయింటింగ్. పువ్వులమీద తుమ్మెదలు ఎగురుతున్నాయి. ఒక తుమ్మెదమీద షర్టుబటన్ అంతవున్న నల్లటి మైక్రోఫోన్‌ని అతికించాడు విక్కీ. అది ఎంతగా కలిసిపోయిందంటే దగ్గరగా నిలబడి చూసినాకూడా అది తుమ్మెద అనుకుంటారు గాని దానిమీద ఏదో అతికించినట్టు ఎవరూ కనిపెట్టలేరు.

"ఓ.కె. సాబ్. మీ పని అయిపోయింది" చెప్పాడు.

"అప్పుడేనా?" తెల్లబోయాడు మెహబూబ్.

"చెవికి పెట్టుకునే రిసీవింగ్ బగ్ మీ జేబులో వుందిగా. దాన్ని పెట్టుకుని ఓసారి తలుపుమూసి ఈ కట్టడం చుట్టూ తిరిగిరండి. అక్కడ నేనుచేసే సౌండ్స్ మీకు వినబడుతున్నాయో, లేదో వచ్చి చెప్పండి."

"ఓ.కే."

తలుపుమూసి బయటికెళ్ళిన మెహబూబ్ అయిదు నివిముషాల తర్వాత లోనకొచ్చాడు. బయట అతను ఎంతదూరం తిరిగినా ఇక్కడ విక్కీ చేస్తున్న ఈలపాట అతనికి వినబడుతూనే వుంది. అందుకే మెహబూబ్ ముఖం అనందంతో ట్యూబ్‌లైట్‌లా వెలిగిపోతోంది.

"థాంక్యూ విక్కీ... చాలు, కమాన్, నీకివ్వాల్సిన బాలన్స్‌సొమ్ము ఇచ్చేస్తాను పద" అన్నాడు ఉత్సాహంగా.

"ఇంతకీ ఇక్కడ ఏం జరుగుతుంది?" బయటకువస్తూ అడిగాడు విక్కి.

“విక్కీ! ఇది హైదరాబాదు, మీ విశాఖపట్నంకాదు. ఇంతటితో ఈ విషయాన్ని నువ్వు మర్చిపోవడం మంచిది” అంటూ ఛాంబర్ లాక్ చేసుకుని, తన ఆఫీస్‌వైపు అడుగులేసాడు మెహబూబ్. తనకి రావలసిన బాలన్స్ అమౌంట్ కోసం అతడ్ని అనుసరించాడు విక్కీ.

మెహబూబ్ కళ్ళముందు అందమైన భవిష్యత్తు కనబడుతోంది. ఇకనుంచి హెచ్.ఎస్. క్లబ్ రహస్యాలన్నీ తన జేబులో వుంటాయి. వాటిని కేష్ చేసుకోవటానికి మార్గాలు తన బుర్రలో వున్నాయి. ఇకనుంచి తనకు వద్దంటే డబ్బు.

ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ ఆఫీస్ రూంకి వచ్చి విక్కీకి డబ్బులు ఇచ్చి పంపించేశాడు. తన సీట్లో రిలాక్‌గ్గా కూర్చున్నాడు.

నిజానికి ఇది తన భవిష్యత్తు కోసం అతడు వేసుకున్న నిచ్చెనో లేక తన కోసం తనే తవ్వుకున్న గొయ్యో అనేది భవిష్యత్తులోగాని తెలీదు.

❊ ❊ ❊ ❊ ❊

ఆడదాని ఓరచూపులో–

జగాన ఓడిపోని ధీరుడెవ్వడో – అని ఓ సినిమా పాట. ఈ పాటకు అర్థం ఏమిటో తన వాలుచూపుల పవరేమిటో విజృంభనకి బాగా తెలుసు. ఆమె నమ్మకం తిరుగులేనిది. అందుకే ఈ జీగానే ఆమె చూపుల వలలో చిక్కి ఆమె బుట్టలో పడిపోయాడా కుర్రాడు.

అతడి పేరు మల్లిక్.

శరత్‌చంద్రలాంటి చలివిడిముద్దకి తను భార్య కావలసింది కాదని చాలాసార్లు ఫీలవుతూ వుంటుంది విజృంభన. కాకిముక్కుకి దొండపండు అంటారు.

ఆమె దృష్టిలో తను దొండపండు అయితే అతడు కాకి. ఆపైన సర్దుకుపోయే టైపుకాదు తను. అందం ఎలాగూలేదు. కనీసం పడకమీద కూడా తనను పట్టించుకోకపోవటం ఆమెకు చిరాకు రప్పిస్తుంటుంది.

తనకు పెళ్ళికి ముందునుంచీ మగాళ్ళతో పరిచయాలు ఎక్కువ. పెళ్ళయ్యాక తగ్గించుకుంది. కాని తన గతం గురించి తెలిసో, మరేదన్నా

కారణమో తెలియదుగాని పెళ్ళయిన కొత్తలో వున్న హుషారు, మోజు ఇప్పుడు అతనికి తనమీద లేదు.

కారణం అతను చెప్పడు. మానసికంగానే కాదు– శారీరకంగా కూడా దూరమవు తున్నాడు. ఒకే ఇంట్లో వున్నా భార్యాభర్తలమధ్య వుండాల్సిన అనుబంధం తమమధ్య లేదు. సత్రంలో బసచేసిన అపరిచితుల్లాగే మిగిలిపోతున్నారు.

అయినా కోరికల్ని అణచుకుని కొంతకాలం ఓపికపట్టి చూసింది. అతనిలో మార్పు రాలేదు. ఎంతకాలమిలా?

కోరికల్ని బలవంతంగా అణచివేస్తే అది మానసిక వ్యాధిగామారి యాంగ్జయిటీ న్యూరోసిస్‌గా గాని, ప్యానిక్ డిజార్డర్స్‌గాగాని మారి జీవితాన్ని అల్లకల్లోలం చేస్తాయని ఏదో పత్రికలో చదివింది. అందుకే ఇక భర్తమీద ఆధారపడకుండా తన కోరికల్ని తీర్చుకోవటానికి తన మార్గం తను చూసుకుంది.

ఈ మధ్యనే శరత్‌చంద్ర వద్ద పర్సనల్ అసిస్టెంట్‌గా ఓ కుర్రాడు చేరాడు. అతడి పేరే మల్లిక్. వయసు పాతికలోపు. హుషారయిన కుర్రాడు. మేడంలాంటి బంగారు చేప కోరి తన చేతిలోపడ్డం తన అదృష్టంగా భావించాడు మల్లిక్. అంతే. ఆమె కోసం ఒకరోజు శలవుపెట్టేసాడు.

మసాజ్ ట్యాంక్‌వద్ద హోటల్ గోల్కొండలో రూం నంబర్ వన్నాట్ ఫోర్ ఇప్పుడు వాళ్ళిద్దరికి సర్గధామంగా మారింది.

"మల్లిక్... ఓ మాట అడగనా?" అతనికి ఎడంగా జరిగి కుర్చుంటూ అంది.

"చెప్పు."

"నా కోసం నువ్విలా అప్పుడప్పుడూ లీవులుపెట్టక తప్పటంలేదు. నాకు మొగుడు నీకు బాస్ అయిన శరత్‌చంద్రకు నీమీద డౌట్ రావటం లేదా?"

"రాదు. మనం చెప్పే కారణం సరయినదే అని నమ్మించగలిగితే ఎవరికీ డౌట్‌రాదు."

"సో... అబద్దాల చక్రవర్తివన్నమాట...." అంటూ నవ్వింది.

"నీకోసమే... ఆమాత్రం రిస్క్ చేయకపోతే ఎలా?" అన్నాడు సింపుల్‌గా.

"ఓ.కె... నువ్వెప్పుడూ బాస్‌తోనే వుంటావుగదా. ఆయనకి ఎవరన్నా గాళ్‌ఫ్రండ్ వుందా?"

"లేదు లేదు. నాకు తెలిసి లేదు. వుంటే ఈపాటికి నా నోటీస్‌కి రాకుండా వుండదు. అయినా అతిలోకసౌందర్యవతిలా యింట్లో నువ్వు వుండగా మరో పిల్లని చూడాల్సిన అవసరం ఆయనకేముందని?"

"అలా అనుకుంటే నేను నీ కౌగిట ఎందుకు చిక్కాను?"

"బాగుంది. ఎవరి అభిరుచి వాళ్ళది. నాకు తెలిసి బాస్‌కి ఏ అమ్మాయితోనూ ఎఫైర్‌లేదు."

తనతో మాట్లాడుతున్నాకూడా–

అతడి చూపులు తన బాడీని సర్వేచేయటం ఆమె గమనిస్తూనే వుంది. తన బాడీలోని ప్రతి అంగుళం ఒక ఖజురహో శిల్పంలాంటిది. మగాడు కోరుకునే సంపూర్ణమైన అందాలు తన బాడీలో అనేకచోట్ల నిక్షిప్తమై వున్నాయి. ఆ విషయం తనకు తెలుసు. మల్లిక్ యిప్పుడు తన సొగసులకు గులాం. ఏం చెప్పినా వింటాడు, ఏం చేయమన్నా చేస్తాడు.

"నేను నిన్ను ఏరికోరి ఎంచుకోవటానికి రెండు కారణాలున్నాయి. అదేమిటో చెప్పుకో చూద్దాం" మరులుగొలిపే చూపులు విసురుతూ ముద్దగా అడిగింది.

"వెరీ సింపుల్. ఒకటి నేను అందంగా వుంటాను. రెండు నేను కోడెవయసు కుర్రాడ్ని" సులువుగా చెప్పేసాడు.

"కాదు... నేను నిన్నే ఎంచుకోవడానికి కారణం మొదటిది నాకు సుఖం యివ్వని నా భర్తమీద కసితీర్చుకోవటానికి. ఆయన అసిస్టెంట్‌వయిన నిన్ను ఎంచుకున్నాను. నీతో సంబంధం వుందని తెలిస్తే ఆయన తట్టుకోలేడు.

ఇక రెండో కారణం. ఆయన పర్సనల్ విషయాలు ఎప్పటికప్పుడు నాకు చెప్పే సరయిన మనిషి కావాలి. ఆ ఛాన్స్ ఆయన పి.ఏ.గా నీకు తప్ప ఎవరికీ లేదు. అందుకే నిన్ను ఎంచుకున్నాను" అంది.

మల్లిక్ కంగారుపడ్డాడు.

"ఆయనకి తెలిస్తే ఖచ్చితంగా నన్ను చంపేస్తారు" అన్నాడు భయంగా.

"ఇప్పట్లో తెలీదులే భయపడకు. నేనున్నాగా... నాకో విషయం చెప్పు. మా మామ యుగంధర్ ఫోన్‌చేసి తండ్రీ కొడుకులు ఏం మాట్లాడుకుంటారో ఆ విషాయాలు గుర్తుపెట్టుకుని నాకు చెప్పాలి."

"ష్యూర్... తప్పకుండా చెప్తాను."

"వెన్నెల ఎప్పుడన్నా ఫోన్ చేస్తుందా?"

"నాకు తెలిసి ఎప్పుడూ చేయలేదు. ఒకవేళ చేస్తే ఏం మాట్లాడుకున్నారో విని తప్పకుండా చెప్తాను."

"గుడ్... అలర్ట్‌గా వుండాలి. నా మనిషివని తెలీకూడదు. డబ్బు అవసరమైతే నన్నడుగు. యిస్తాను." అంటూ అతడికి దగ్గరగా జరిగింది విజృంభన.

ఆమాత్రం చాలు అతడికి ఆమెను కౌగిట బంధించుకోడానికి. వాళ్ళిద్దరి అక్రమసంబధాన్ని చూళ్ళేకలైటు ఆరిపోయింది.

ఈ మధ్యనే విజృంభనలో ఒక భయం చోటుచేసుకుంది. ఆ భయానికి కారణం వెన్నెల. యుగంధర్‌కి కూతురుకి దగ్గరయ్యే ఆలోచన వుందేమోనని డౌట్. వాళ్ళిద్దరూ ఎప్పటిలా దూరంగా వుంటేనే తనకు మంచిది.

యుగంధర్‌గాని, వెన్నెలగాని యిద్దరిలో ఎవరు దగ్గరవ్వాలని కోరుకున్నా ఆ తండ్రీ కూతుళ్ళను ఇక ఎవరూ వేరుచేయలేరు. వెన్నెల చాలా తెలివయింది. ఆమె తలుచుకుంటే తన భర్త శరత్‌చంద్ర స్థానం డౌన్ అవుతుంది. శరత్‌చంద్రను అడ్డంపెట్టుకుని చక్రం తిప్పాలను కుంటున్న తన ఆశలు మట్టికొట్టుకుపోతాయి.

అందుకే ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకోవాలని నిర్ణయించుకుంది.

అలా తెలియాలంటే శరత్‌చంద్ర మీద నిఘా అవసరం. ఆ పనికి మల్లిక్‌ని ఎంచుకుని ఆమె విజయం సాధించింది. ఎలా అంటే మల్లిక్ ఇప్పుడు ఆమె అందానికి బానిస.

ఆమె ఈ నిర్ణయానికి రావటానికి కారణం–

తన భర్త శరత్‌చంద్ర మీద నమ్మకం పోవటమేనని వేరే చెప్పక్కర్లేదు. దేనికీ పరుగులుతీసే అలవాటు అతడికి లేదు. కాని విజృంభనకి వుంది. భవిషత్తు గురించి ఎప్పుడూ కలలుకంటూ వుంటుంది.

యుగంధర్ చనిపోయినా లేక రిటైర్‌మెంట్ తీసుకున్నా శరత్‌చంద్ర ఆ స్థానంలోకి వస్తాడు. ఆ విధంగా యుగంధర్ వ్యాపార సామ్రాజ్యానికి తను రాణి అవుతుంది. దేశంలో తనో స్టార్‌గా వెలిగిపోతుంది. కెమెరా ఫ్లాష్‌లైట్ అంటే తనకు వీక్‌నెస్. సెలబ్రిటీ స్టేటస్‌ని బాగా లైక్‌చేస్తుంది.

అందుచేత తను కోరుకున్నట్లు జరగాలంటే తన భర్తకన్నా తనే ఒక అడుగు ముందుండాలి. అప్పుడే తెలివిగా పావులు కదిపి అరచేతిలో స్వర్గం జారిపోకుండా కాపాడు కోవచ్చు. మల్లిక్ కౌగిట క్రమంగా తనను తాను మర్చిపోయింది విజృంభన. ఆమె ఆలోచనలు కూడా ఆగిపోయాయి.

* * * * *

'మూన్ లేబొరేటరీస్' అదొక మందుల కంపెనీ. కార్పొరేట్ సంస్థ. దీని ముఖ్య కార్యాలయం బేగంపేట రోడ్‌లో వుంది. ఆ సంస్థకి ఛైర్మన్ డాక్టర్ భువనచంద్ర.

హైదరాబాద్‌ని ఫార్మాసిటీగా మార్చటంలో అతడి ప్రతిభ ఎంతో వుందంటారు. మూన్ లేబొరేటరీస్ తయారుచేసే మందులకి విదేశాల్లో కూడా నుంచి పేరు, డిమాండ్ వుంది. ఫార్మా రంగంలో ఇండియాలోని టాప్ టెన్ కంపెనీల్లో మూన్ లేబొరేటరీస్ ఒకటి.

డాక్టర్ భువనచంద్ర చాలా సరదా మనిషి. ఎన్ని టెన్షన్‌లు ఉన్నా, ఎంత పని వత్తిడి వున్నా, ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ, అందరితో కలివిడిగా తిరిగే స్వభావం. వయసు అరవైకి దగ్గర పడింది. చేయెత్తు భారీ మనిషి.

ప్రస్తుతం ఆయన తన ఛాంబర్‌లోని విశ్రాంతి గదిలో బోర్లా బెడ్ మీద పడుకుని వున్నాడు. వంటిమీద డ్రాయరు మాత్రం వుంది. నడుంమీద బ్లూ కలర్ టవల్ వేసుకున్నాడు.

ఆయన పక్కన వున్న యువతి పేరు గ్రీసీ.

వయసు ముప్పై మించదు. అయిదడుగుల ఆరంగుళాల ఎత్తున చక్కటి రూపం. ఆమెకు బషీర్‌బాగ్‌లో కేరళ ఆయుర్వేద పద్ధతిలో మసాజ్ సెంటర్ వుంది. ఆమె చేతికింద పదిమంది పనిచేస్తున్నారు.

తను ఓనరై వుండి కూడా స్వయంగా తనే ఆయనకు మసాజ్ చేయటానికి వస్తోందంటే, అందుక్కారణం తను స్థిరపడ్డానికి తన మసాజ్ పార్లర్‌ను విస్తరించుకోడానికి ఉదారంగా ఆయన చేసిన ఆర్థిక సహాయమేకారణం.

మొదట్లో తను ఆయనకు మసాజ్ చేస్తున్నప్పుడు ఆయన తొందర పడతాడేమో అనుకుంది. నిజానికి ఆయన చొరవ చూపించి వుంటే తను లొంగిపోయేదే. ఎందుకంటే ఆయన అండ వుంటే డబ్బు, పవరు రెండూ వున్నట్టే. డబ్బు మగాడి వయసుని తెలీనీయదు.

కాని ఆయన అలాంటి వ్యక్తికాదు.

చాలా గొప్ప వ్యక్తిత్వం గల మనిషి.

ఆయన సిటీలో వుంటే వారంలో మూడు రోజులు తప్పనిసరిగా తను వచ్చి మసాజ్ చేసి వెళ్ళాల్సిందే. పైగా చేతికొచ్చినంత డబ్బిచ్చి పంపిస్తుంటాడు. కేరళ ఆయుర్వేద పద్ధతిలో చేసే ఆమె మసాజ్ అంటే భువనచంద్రకి చాలా ఇష్టం. రకరకాల నూనెలు, తైలాలు, మూలికలు కలగలిపిన ఆయిల్‌ని వంటికి పట్టించి, ఒక రిథమ్‌ప్రకారం మసాజ్ చేస్తుంది. ఆమె చేతివేళ్ళ మహత్యం ఏమిటో గాని, తనలోని టెన్షన్ నుంచి రిలీఫ్ అయినట్టు ఫీలవుతాడాయన.

ఆమె మసాజ్ చేస్తూండగా పిచ్చాపాటీ మాట్లాడుకోవటం అలవాటే. పైగా ఆయన ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడే టైపు.

"గ్రేసీ... హైదరాబాద్ బాగా డెవలప్ అయింది కదూ?" ఆమె పొడవాటి చేతి వేళ్ళు తన మెడ దగ్గర సుతారంగానూ, అప్పుడప్పుడూ బలంగానూ వత్తి మసాజ్ చేస్తుండగా ఆ సుఖానికి పులకిస్తూ అడిగాడు ఆయన.

"అవును సర్!" అందామె.

"పోను పోను ముంబయి తర్వాత ఇదే పెద్ద సిటీ అవుతుందను కుంటాను."

"పెరగటం మంచిదేగాని, దానివల్ల యిబ్బందులు కూడా వున్నాయి."

"యస్! సిటీకి వలసలు పెరుగుతాయి. చెట్లు కొట్టేసి ఎక్కడి కక్కడ కట్టడాలు చేపట్టడం వలన వేడి పెరుగుతోంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లు, క్రైంరేట్ కూడా గణణీయంగా పెరుగుతోంది. కాని తప్పదు. అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. నాకు తెలుసు. మీ కేరళ చాలా హాయిగా, ప్రశాంతంగా వుంటుంది. కాని ఏం లాభం? అక్కడ ఉద్యోగ అవకాశాలు లేక గాడ్స్ ఓన్ కంట్రీ అని కీర్తింపబడే స్వస్థలాన్ని వదిలేసి, పాపం మీ వాళ్ళు బ్రతుకుతెరువు కోసం చాలా మంది వలస దారి పడుతున్నారు."

"నేనూ అలా వచ్చిందాన్నే గదా? అక్కడి ప్రభుత్వాలకు ముందు చూపు లేదు. పైగా చిన్న రాష్ట్రం. ఏం చేస్తాం? మా వాళ్ళు కూడా ఇప్పుడిప్పుడే కళ్ళు తెరుస్తున్నారు లెండి. టూరిజం, పారిశ్రామికీకరణ, ప్రైవేటు భాగస్వామ్యం లాంటి వాటిమీద శ్రద్ధ చూపిస్తున్నారు. ఇక్కడ హైదరాబాద్‌లో మాత్రం డబ్బున్నా కూడా మరీ బిజి బిజీ గజిబిజి లైఫ్ అయిపోయింది. బాగా డబ్బు సంపాదించుకున్నాక ఎప్పటికైనా మా స్వస్థలానికి వెళ్ళిపోయి ఎప్పటిలా ప్రశాంతంగా జీవనం గడపాలని ఆశ సార్!"

"మంచిదే! ఉన్నవూరు కన్నతల్లి అన్నారు. దేశ విదేశాలు తిరిగినా పుట్టి పెరిగిన వూరును ఎవరూ మర్చిపోకూడదు. ఇక్కడ వచ్చిన చిక్కేమిటంటే, అభివృద్ధి సమంగా విస్తరించాలి. అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితం కాకూడదు. దురదృష్టవశాత్తు ఇక్కడ జరుగుతోంది అదే మన రాష్ట్రంలో ఇంకా చాలా పట్టణాలున్నాయి. కాకినాడ, కర్నూలు, బెజవాడ, అనంతపురం ఇలా చాలా చెప్పుకోవచ్చు. ప్రతిచోట ఐ.టి., బి.టి. ఫార్మా. ఇంకా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించే కర్మాగారాలు. ఇలా ప్రతి చోట వచ్చేలా చూడాలి. అప్పుడే వలసల్ని అరికట్టవచ్చు. వలసల్ని అరికట్టగలిగితే నగరాల్లో జనసాంద్రత తగ్గుతుంది."

"యు ఆర్ కరక్ట్ సర్!"

ఆమె మసాజ్ చేస్తూనే వుంది.

ఇద్దరి మధ్య మాటలు ఆగిపోయాయి.

కాని భువనచంద్ర ఆలోచిస్తూనే వున్నాడు.

ఒక పక్క జంట నగరాల్లో భూముల ధరలు చుక్కలనంటుతున్నా, సామాన్యుడి జీవన ప్రమాణాలు రోజు రోజుకు పడిపోతున్నాయి. సంపద పెరిగే ప్రతిచోటా పేదరకం, టెంక్షన్లు, క్రైంరేటు కూడా పెరిగిపోతూంటాయి.

ముంబయిలో జరుగుతోంది అదే. రేపు ఇక్కడి పరిస్థితి అలాగే మారబోతోంది.

వచ్చే మీటింగ్‌లో ఇదే విషయాన్ని టైగర్ యుగంధర్‌తోను, మన్సూర్ ఆలీఖాన్‌తోను చర్చించాలి. కాని వాళ్ళు ఒప్పుకుంటారా? అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ఆ పెద్దమనుషులు తన ప్రతిపాదనల్ని తిరస్కరించినా ఆశ్చర్యం లేదు.

* * * * *

హైదరాబాద్‌లో డాక్టర్ భువనచంద్ర ఆలోచనల్లో మునిగి వున్న అదే టైంలో సరిగ్గా అక్కడికి ఏడు వందల పది కిలోమీటర్ల దూరంలో వున్న విశాఖపట్నంలో–

ఒక స్టార్ హోటల్లో బసచేసి వున్న మనీష్ అగర్వాల్‌కి కూడా డాక్టర్ భువనచంద్రకి వచ్చిన ఆలోచనలాంటిదే వచ్చింది. ఆయన కూడా హెచ్.ఎస్. క్లబ్ సభ్యుడే. ఎన్నో వ్యాపారాలు, కోట్ల టర్నోవర్. పుట్టి పెరిగింది వ్యాపారవేత్తగా. స్థిరపడింది అంతా హైద్రాబాద్‌లోనే.

అటువంటి మనీష్ అగర్వాల్‌కి వైజాగ్ బాగా నచ్చింది. ఇంత మంచి నగరం ఇంకా ఎందుకు డెవలప్ కాకూడదు? పక్కన కాకినాడ ఎందుకు పెరగటంలేదు. ఆంధ్రాలో ఏ నగరానికీ లేనంతగా హైదరాబాద్ ఒక్కటే శరవేగంతో ఎందుకు పెరిగిపోతోంది? పెరుగుదలను మిగతా నగరాలక్కూడా విస్తరించకపోతే అది అభివృద్ధి ఎలా అవుతుంది? విశాఖను అభివృద్ధి చేస్తే ఇది కూడా మహా నగరమవుతుంది. ఇక్కడ టూరిజాన్ని బాగా డెవలప్ చేయొచ్చు.

టైగర్ యుగంధర్ తర్వాత స్టేట్ నుంచి సెంట్రల్ వరకూ అంతటి పలుకుబడి తనకూ వుంది. ఈసారి మీటింగ్‌లో ఇతర నగరాల అభివృద్ధికి సంబంధించిన అంశాన్ని తీసుకురావాలి.

ఎలా చేస్తే బాగుంటుంది.

పట్టుదలగా ఆలోచిస్తూనే వున్నాడు మనీష్ అగర్వాల్.

* * * * *

మనిషి ఎంతయినా సంపాదించవచ్చు.

ఎంతటి గొప్పవాడయినా కావచ్చు.

కాని నిండు నూరేళ్ళు అతడు సంపూర్ణ ఆరోగ్యవంతుడు కాలేకపోతున్నాడు. కారణం ఏమిటి? ఏమిటి అని ప్రశ్నించుకుంటే వచ్చే సమాధానం ఒకటే. స్వయం కృతాపరాధం.

అవును. ఖచ్చితంగా స్వయంకృతమే.

దైవం తనకిచ్చిన జీవితాన్ని నిండు నూరేళ్ళు అనుభవించకుండానే వ్యసనాలకు బానిసయిన మనిషి మధ్యలోనే వెళ్ళిపోతున్నాడు.

మత్తుపానీయాలు డ్రగ్స్, నార్కోటిక్స్ ఇవన్నీ మన ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయని తెలిసి కూడా వాటికి లొంగిపోతున్న వారి సంఖ్య తక్కువేమీకాదు.

సరదాకి కొందరు, అసంతృప్తి, బాధల్ని మర్చిపోవడానికి కొందరు మనోవ్యాకులానికి మందుగా కొందరు బ్రెయిన్ నుంచి డోపమైన్ విడుదల కోసం ఎక్కువ మంది వీటిని ఆశ్రయించి ఇల్లు ఒళ్ళు గుల్ల చేసుకుంటున్నారు. వీటికి అలవాటుపడి మన ఆరోగ్యాన్ని మనవే చేతులారా పాడుచేసుకుంటున్నామని వేరే చెప్పక్కర్లేదు. వ్యసనాలు గొప్పవారిని కూడా భ్రష్టు పట్టిస్తాయనటంలో సందేహం అక్కర్లేదు. వాటికి ఎంత దూరంగా వుంటే అంతమంచిది.

ఈ విషయాలన్నీ ఎమ్మెల్యే నిరంజన్‌కు తెలీనిదనుకుంటే పొరబాటే. అతడికి అన్నీ తెలుసు. మరి తెలిసికూడా ఎలా అలవాటుపడ్డాడంటే మనం ముందే చెప్పుకున్నట్టు ఏదో కారణంలేకుండా మనిషి ఏపనీ చేయడు.

తండ్రి మధుసూదన్‌రెడ్డి కోట్లకు పడగలెత్తిన వ్యక్తి. ఆయన కొడుగ్గా నిరంజన్‌కి ఏలోటూ లేదు. జీవితం సాఫీగా సాగిపోవాలి. అయినా అతను డ్రగ్స్‌కి అలవాటు పడ్డాడంటే అందుక్కారణం అతడి మనసులో నెలకొన్న అసంతృప్తి. తను చేతకానివాడు అనే న్యూనతాభావం.

సహజంగా నిరంజన్ చాలా మంచివాడు, సహృదయుడు. తను ఒక్కడే సుఖపడితేచాలదు అంతా సుఖంగా, క్షేమంగా వుండాలని ఆశిస్తాడు. పదిమందికి మేలుకోరటమేకాదు, మేలుచేయాలని చూస్తాడు. సమాజం బాగుంటేనే, మనిషి బాగుంటాడని నమ్ముతాడు.

అలాగని తనేదో మహాత్మాగాంధీలా, బాబాసాహెబ్ అంబేత్కార్‌లా కందుకూరి వీరేశలింగంలా యిలా మహాపురుషుల సరసన చేరేంత గొప్ప గొప్ప పనులు, త్యాగాలు చేయాలని అతడి ఉద్దేశ్యంకాదు. చేతనయినంతగా తన జీవితం పదిమందికీ ఉపయోగపడాలనీ, ప్రజాసేవ చేయాలనీ, వారి కష్టాలు పంచుకోవాలని ఆశించాడు.

కాని వాస్తవంలో జరిగింది వేరు. అతడు ఆశపడినదేదీ జరగలేదు. జరగలేదు అనేకన్నా, తండ్రి మధుసూదనరెడ్డి అతనిష్టప్రకారం జరగనివ్వలేదు అంటేనే బాగుంటుంది.

ఏం చేయాలన్నా మనసులో ఆశవుంటే చాలదు.

చొరవ, ధైర్యం కావాలి. ఇవేలేవు అతడికి.

రాకుమారుడయిన సిద్ధార్థుడికి ఏం లోటుందని...? ప్రజల కష్టాలకు చలించి, వారికి మంచిమార్గం చూపే దారిని వెదుక్కుంటూ? భార్యాబిడ్డల్ని, రాజ్యాన్ని వదిలి అడవికి వెళ్ళి పోయాడు. అలా వెళ్ళగలిగాడు గాబట్టే బౌద్ధమతం ప్రచారంలోకి వచ్చింది. బుద్ధుడిగా ప్రసిద్ధుడయ్యాడు. మంచి ఆలోచనలు మనసులో వుంటేచాలదు. వాటిని చేయగల సంకల్పబలం, మనోబలం కూడ అవసరం.

అది నిరంజన్‌లో లేకపోవడంతో తండ్రి గొడుగులోంచి బయట పడలేక అక్కడే ఒదిగిపోక తప్పలేదు. తన ఇష్టాలకు వ్యతిరేకంగా, తండ్రి ఇష్టాలకు అనుగుణంగా తన జీవితం నడపటం అతడికి చాలా బాధగా

వుంది. ఆ బాధనుంచి ఏర్పడిన అసంతృప్తి ఫలితమే అతడ్ని డ్రగ్స్‌కి అలవాటుపడేలా చేసింది.

మొదట తండ్రిమీద కోపాన్ని, తనలోని అసంతృప్తిని మర్చిపోడానికి చిన్నగా మొదలయిన డ్రగ్స్ అలవాటు చివరకు అది లేకపోతే ఉండలేని పరిస్థితికి చేర్చింది.

నిజానికి ఈపాడు అలవాటు మానేయాలనే చాలాసార్లు అనుకున్నాడు. స్వచ్ఛంధంగా చేస్తేనే ప్రజాసేవకాదు. రాజకీయాల్లో వుంటూ కూడా ప్రజాసేవ చేయొచ్చని ఆశించాడు. కాని ఇక్కడ ప్రజాసేవ ముసుగులో సాగుతున్న స్వార్ధ రాజకీయాలు చూసి చలించిపోయాడు. ఎన్నికల్లో గెలిచినా ఎమ్మెల్యే పదవి అతడికి సంతోషం కలిగించలేదు. ఇంతలో వదిలేస్తాడనుకుంటే ఇప్పుడు తను ఎం.పి.నో లేదా సి.ఎం.నో చేయాలని చూస్తున్నాడు మధుసూధనరెడ్డి.

ఈ పరిస్థితుల్లోనే తనలోని మెంటల్ బాలన్స్‌ని తట్టుకోడం కోపం ఆ రోజు శృతిమించి తీసుకున్న కొకయిన్ ఆస్పత్రిపాలయ్యేలా చేసింది అతడ్ని.

డ్రగ్స్‌కి నిరంజన్ బానిసయ్యాడన్నది నిజం.

ఆరోజు ఓవర్ డోస్‌లో లక్కీగా బ్రతికాడుగాని లేకపోతే అయిపోయేవాడే. పైగా అంత జరిగినా మీడియా దృష్టిలో పడకపోవటం డబుల్‌లక్ అని చెప్పాలి. మూడురోజుల తర్వాత ఆస్పత్రినుంచి ఇంటికొచ్చేసాడు.

ఇంటికొచ్చిన రెండో రోజునే నిరంజన్‌కి అర్ధమైంది తను ఇంచుమించుగా హౌస్ అరెస్ట్‌లో వున్నాడని. ఒంటరిగా తనను బయటకు వెళ్ళనీయటంలేదు. ఇంటికాపలా వుంది. తన కదలికలమీద నిఘా వుంది.

ఆరోజు ఉదయం తన గదిలోకి వచ్చిన తండ్రిని ఇబ్బందిగా చూసాడు నిరంజన్. "డాడీ! నాకిదేం నచ్చలేదు" అన్నాడు.

"ఏం నచ్చలేదు!" చిన్నగా నవ్వుతూ ఎదురుగా కూర్చున్నాడు మధుసూదన్‌రెడ్డి.

"నామీద నిఘా వుంచటం నచ్చలేదు."

"నువ్వు డ్రగ్స్‌కి అలవాటుపడ్డం నాక్కూడా నచ్చలేదు."

"సారీ. ఇకమీద జాగ్రత్తగా వుంటాను."

"నాకు నమ్మకంలేదు. నువ్వు సాధారణ వ్యక్తివికాదు. నా వ్యాపార సామ్రాజ్యానికి ఏకైక వారసుడివి. ఆపైన ఇప్పుడు ప్రజాప్రతినిధివి. నువ్విలా డ్రగ్స్‌కి అలవాటుపడి ప్రాణంమీదికి తెచ్చుకుంటే నేనేం కావాలి? పరువు, మర్యాదలు ఏంకావాలి? అదృష్టం బాగుంది గాబట్టి మీడియా దృష్టిలో పడలేదు. నువ్వొక డ్రగ్స్ ఎడిక్ట్‌వని పేపర్లకెక్కితే నీ ఫ్యూచర్ ఏమవుతుందో ఆలోచించావా? రాజకీయంగా నీకెంతో భవిష్యత్తు ఇవ్వాలని నేను చూస్తుంటే, చేతులారా నాశనం చేసుకునే పనులు చేయటం బాగుందా?"

"స్వతంత్రంగా ఏమీ చేయలేకపోతున్నావనే బాధ నాకుంది డాడీ. నేను కోరుకున్న జీవితంలోకి నన్నెళ్ళనివ్వలేదు. కనీసం మనశ్శాంతిగా వుండాలని డ్రగ్స్ తీసుకుంటున్నాను. ఆమాత్రం స్వాతంత్ర్యం కూడా లేకపోతే...."

"షటప్... మనశ్శాంతి డ్రగ్స్‌లో దొరకదు. వాటికి ఆలవాటుపడి, నిన్ను నువ్వే చంపుకోకు. నీ మానసిక సంఘర్షణ అర్థంలేనిది. ప్రజాసేవ అంటే ప్రజల్లోకి వెళ్ళిపోయి సేవచేయటం అనుకుంటున్నావా? గవర్నమెంటే సర్వీస్‌ఛార్జ్ అని వసూలు చేస్తోంది. నువ్వేమిటి ఫ్రీసర్వీస్ చేస్తానంటూ వితండవాదం? యు ఆర్ ఎ ఫూల్. నువ్వొ రూపాలు సంపాదించు అందులో ఓ పావలా ప్రజలకోసం ఖర్చుపెట్టు. అదిచాలు నువ్వు ఆపద్బాంధవుడవని, ప్రజల మనిషివని పేరు తెచ్చుకోడానికి.

అయినా నువ్వు సాధారణ వ్యక్తి వనుకుంటున్నావా గన్‌మెన్‌ని, కారుని వదిలేసి నడుచుకుంటూ వీధుల్లోకి వెళ్ళిపోడానికి... ఇకమీదట నువ్వు ఒంటరిగా పోకూడదనే నేనీ జాగ్రత్తలు తీసుకున్నాను. బి.ఎ.గుడ్ బోయ్."

"నా భవిష్యత్తు ఏమిటి?"

"నేను నిన్ను ఒక్కోమెట్టు ఎక్కించి సింహాసనంమీద కూర్చోబెట్టే ప్రయత్నంలో వున్నాను. నువ్వు చతికిలబడకుండా సహకరించు చాలు.

వచ్చే ఎలక్షన్లలో నీకు ఎం.పి. సీట్ కోసం ప్రయత్నిస్తున్నాను. నీ ఎదురుగానే టైగర్ యుగంధర్‌తో మాట్లాడాను. ఆయన ఓకే అన్నారు మర్చిపోయావా. ఒకవేళ ఎం.పి.సీటు రాకపోతే స్టేట్‌లో పావులు కదిపి నిన్ను సి.ఎమ్.ని చేస్తా."

"ఆపని మీరే చేయొచ్చుగా. మీకులేని పదవీ వ్యామోహం నాకెందుకు?"

"నాకు పదవీ వ్యామోహం లేదని చెప్పిన మూర్ఖుడు ఎవడు? నాకూ వుంది. కాని నాకు మధుమేహం, బి.పి, ఇలా నలభైయ్యేళ్ళకే కొన్ని జబ్బులు పదవికన్నా ముందే వచ్చిచేరాయి. వీటితో రాజకీయాల్లో నిలబడలేకే ఆ అవకాశం నీకు కల్పిస్తున్నాను. అర్థమైందా?

"అర్థమైంది డాడ్! కాని టైగర్ యుగంధర్‌కి నా అలవాట్లు తెలిసినా సీటు ఇప్పిస్తారా?"

"ఏమిటి? ఇదేదో నువ్వే వెళ్ళి చెప్పేలా వున్నావే" ఖంగుతింటూ చికాగ్గా అరిచాడాయన.

"తెలిస్తే ఆయన ఖచ్చితంగా సీట్ ఇప్పించడు. నువ్వు డ్రగ్స్ అలవాటు పూర్తిగా మానేసేవరకూ నా కంట్రోల్లోనే వుంటావు."

"నేను మానేస్తాను."

"మానలేవని నిర్ధారణ అయిపోయింది. అందుకే ఈ నిర్ణయం. నాకు తెలిసిన డాక్టర్‌ని పిలిపించాను. ఆయన డి ఎడిక్షన్ సెంటర్ నడుపుతున్నాడు. ఆయనే నీకు ట్రీట్‌మెంట్ చేస్తాడు. సైకియాట్రిస్ట్‌ల పర్యవేక్షణ లేకుండా, నీకు నువ్వుగా ఈ వ్యసనాన్ని మానుకోలేవు. డ్రగ్స్ తీసుకుని ఈసారి నువ్వు పోలీసులకి చిక్కితే అరెస్ట్ అవుతావు. ఆపైన రాజకీయంగా నీకు రెస్ట్ తప్పదు. ఆ పరిస్థితి రాకుండా జాగ్రత్తపడుతున్నాను నువ్వు సహకరించక తప్పదు.

తండ్రిమీద విపరీతమైన కోపం ముంచుకొచ్చింది నిరంజన్‌కి. కోపంతోబాటు, చేతులు ఒణుకు కూడా ఆరంభమైంది. సరిగ్గా అప్పుడే వైట్ కోటుతో ఒక డాక్టరు లోనకొచ్చాడు.

"చేతులు ఒణుకుతున్నాయా? నీ ప్రాబ్లం నాకు తెలుసు. నేను బాగుచేస్తాను" అన్నాడాయన.

"ప్రాబ్లమా?"

"నీ మెడికల్ ఫైల్ చదివాను. డోన్ట్‌వర్రీ... అండ్ డోన్ట్ హర్రీ. రైట్?" అంటూ నిరంజన్ ఎదురుగా కూర్చున్నాడు డాక్టర్.

* * * * *

"నీకు ఈ మధ్య పరధ్యాన్నం అధికం అవుతోంది. తొందరగా పెళ్ళి చేసుకుంటే మంచిది." కారు తాళాలు చేతికి ఇస్తూ కామెంట్ చేస్తున్న మీనాబాయి మాటలకి చిరుకోపంతో చూసింది వెన్నెల.

"నా పరధ్యానం పెళ్ళి గురించి కాదు. కంపెనీ పనుల గురించి. అయినా నేను ఆఫీస్‌కి బయలుదేరుతుంటే పెళ్ళి ప్రస్తావన తెస్తావ్ బుద్ధుందా?" అంది.

"నాకు బుద్ధుంది గాబట్టే చెపుతున్నాను. నీకు బాధ్యతలు పెరిగాయి. దగ్గరగా పక్కన తోడులేకపోతే కష్టం. పెళ్ళిచేసుకో."

"పక్కన నువ్వు వున్నావుగా నా మంచిచెడ్డలు చూసుకోడానికి. నామీద అధికారం చెలాయించటానికి ఒక మగాడ్ని తెచ్చుకోనవసరంలేదు."

"వెన్నెలా...."

"మీనా ప్లీజ్. పొద్దుటే నా మూడ్ పాడుచేయకు. నేను బయలుదేరుతున్నాను. సాయంత్రం నేను వచ్చేవరకు ఫ్లాట్‌లోనే వుండు. తాళం పెట్టి ఎక్కడికీ వెళ్ళకు."

"వెళ్ళన్లేగాని... నువ్వు మాత్రం తొందరగా పెళ్ళిచేసుకోవాలి."

"ఓ షిట్... నాకంటే ముందు నీకు చేయాలి. మరీ పెళ్ళిపిచ్చి పట్టుకుంది నీకు" అంటూ ఫైల్స్ తీసుకుని విసవిసా బయటకొచ్చేసింది వెన్నెల.

చిన్నగా నవ్వుకుంటూ తలుపు మూసుకుంది మీనాబాయి.

లిఫ్ట్‌లో కిందకు వచ్చి తన బెంజ్‌కారులో బయలుదేరింది వెన్నెల. గేటు దాటి మెత్తగా వీధిలో దూసుకుపోనారంభించింది కారు. మీనా పెళ్ళిమాట ఎత్తగానే ఆమె కళ్ళముందు అనూప్ కదిలాడు.

"ఓహ్. చాలా కాలమైంది అతన్ని చూసి. ఎలా వున్నాడో ఏమిటో." మనసులో అనుకుంది.

సరిగ్గా అప్పుడే ఆమె సెల్ వైబ్రేటింగ్ మోడ్‌లో గిర్ర్ మంది. సెల్ అందుకుని చూసింది. చూడగానే ఆమె ముఖంలో ఆశ్చర్యం. స్క్రీన్ మీద అనూప్ ఫోటో... దానికింద కాలింగ్ అని లెటర్స్.

కోఇన్సిడెంట్ అంటే ఇదేనేమో.

చాలాకాలం తర్వాత ఫోన్ చేస్తున్నాడు. కారణం ఏమైవుంటుంది? ఆలోచిస్తూ బటన్ ప్రెస్‌చేసింది.

"యస్ అనూప్... చాలాకాలానికి గుర్తొచ్చాను" అంది కారు వేగం తగ్గించి పక్కకి తీసి ఆపుతూ.

అవతల చిన్నగా అనూప్ నవ్వు.

"మర్చిపోతేగా గుర్తుచేసుకోడానికి నీ రూట్‌లో నువ్వు బిజీ బిజీ అయిపోయావ్. నా రూట్‌లో నేను బిజీ లాయర్ని. మనసులో మాట్లాడాలని వున్నా టైమేదీ... ఒ.కె. మధ్యాహ్నం ఫ్రీగా వుంటావా?" ఐమీన్... నా కోసం ఫ్రీ చేసుకోగలవా?"

"విషయం చెప్పొచ్చుగా!"

"గోల్కొండకి వస్తావని."

"గోల్కొండ కోట చూడాలని కొత్తగా ఆశపుట్టిందా?" నవ్వింది.

"నేను పిలిచింది హోటల్ గోల్కొండకి. లంచ్ చేస్తూ మాట్లాడు కోవచ్చని షార్ప్‌గా టు ఒ క్లాక్."

"ఒ.కె... ఐవిల్ బి దేర్."

"థాంక్యూ" అవతల లైన్‌కట్ చేసాడు అనూప్. ఇంకాస్సేపు అతనితో మాట్లాడాలనివుంది. కాని టైం విలువ తనకన్నా అతడికే ఎక్కువ తెలుసు.

లాయర్ గదా. భారంగా నిట్టూర్చుతూ కారును ముందుకు పోనిచ్చింది వెన్నెల.

✳ ✳ ✳ ✳ ✳

షార్ప్‌గా రెండుగంటలకి హోటల్ గోల్కొండ పార్కింగ్‌లో తన కారు ఆపింది వెన్నెల. అప్పటికే తన కార్లో అక్కడికి చేరుకున్న అనూప్ ఆమె కోసం పార్కింగ్‌లోనే ఎదురుచూస్తున్నాడు. ఆమె రాకను గమనించి కారు వద్దకు వచ్చాడు.

బెంజ్‌కారు. చాలా లగ్జరీగావుంది. ఆమె హుందాకు తగ్గట్టుగా వుంది. ఇద్దరి పెదవులమీద చిరునవ్వులే పలకరింపులయ్యాయి. అతడ్ని చూసిన ఆనందంలో ఆమె తన గుండె వేగం పెరగటం గమనించింది. అతడి పరిస్థితీ అదే. చివరిసారిగా కలిసి రెండేళ్ళు కావచ్చునిపించింది.

మునుపటికన్నా కొద్దిగా ఒళ్ళుచేసినా ఆమె అందం మరింతగా పెరిగిందనిపించింది. ఖరీదయిన సిల్కుచీర జాకెట్‌లో సాంప్రదాయంగా ఏదో యాడ్‌లో చూసిన అందాలరాశి నడిచివస్తోందా అన్పిస్తోంది.

కారు లాక్‌చేసి అతనివంక చూసింది.

"సో... ఇప్పటికయినా నీకు నన్ను చూడాలనిపించింది. చాలా సంతోషంగా వుంది" అంది.

"చాలా మారిపోయావ్ వెన్నెలా. గుర్తుపట్టలేనంతగా" అన్నాడు.

"నా పోలికలు అంతగా మారిపోయాయా...?"

"నోనో... మరీ రిచ్‌గా మరీ గ్లామర్‌గా... నిన్ను చూస్తుంటే ఒకప్పుడు నాతో స్నేహం చేసింది ఈ అమ్మాయేనా అంటే నమ్మలేకపోతున్నాను."

"ఎందుకని?"

"అప్పట్లో చందమామ నాతో స్నేహం చేస్తోంది అనుకునేవాడ్ని ఇప్పుడు చందమామ ఆకాశంలో వుంది చేతికి అందదు అన్పిస్తోంది."

"అందీ అందకుండా ఉంటేనే ఆరాటాలు మొగ్గతొడుగుతూ తాజాగా వుంటాయి. లాయర్‌గా స్థిరపడ్డావ్. పెళ్ళిచేసుకుని వుంటావను కున్నాను. ఇంకా చేసుకోలేదటగా."

"అవును. నీలాంటి అమ్మాయి దొరకాలిగా చేసుకోడానికి... నీ సంగతేమిటి యిలాగే వుండిపోతావా?"

"నీలాంటి అబ్బాయి దొరకాలిగా అని మాత్రం నేను చెప్పను" అంటూ ఫక్కున నవ్వింది వెన్నెల.

ఆ నవ్వు చూస్తే పులకించిపోయాడు అనూప్.

దోసిళ్ళతో ముత్యాలు పోస్తున్నట్టు, వేయిగులాబులు ఒకేసారిగా విచ్చుకున్నట్టు అంత మధురంగా వుంటుందా నవ్వు. నవ్వి ఆమె తిరిగి తనే చెప్పింది.

"నాకు చాలా లక్ష్యాలు బాధ్యతలు వున్నాయి అనూప్. పెళ్ళి విషయం మర్చిపోయాను. ఒ.కే. పద లోపల కూర్చుని మాట్లాడుకుందాం" అంది.

ఇద్దరూ పక్కపక్కనే నడవసాగారు.

"అనూప్ కాస్త లావయ్యావు కదూ?" ఉన్నట్టుండి అడిగిందామె.

"తలమీద జుత్తుకూడా పల్చబడింది. అంటే బట్టతల ఆరంభమన్నమాట. బట్టతల మేధావులకు చిహ్నమటగదా. ఉంచేసుకుంటావా లేక అందరిలా విగ్గులనీ... హెయిర్ బేండింగ్ అనీ ఏదన్నా ఆలోచన వుందా?" అడిగింది.

"ఏయ్... "అంటూ నవ్వేసాడు అనూప్.

"కాలేజీరోజుల్లో నీలోవున్న సెన్సాఫ్‌హ్యూమర్ ఇప్పటికీ కొంచెం కూడ తగ్గలేదనిపిస్తోంది. పెద్ద బిజినెస్ ఉమన్‌వి. నీ లాజిక్ ప్రకారం చూస్తే నాకన్నా మేధావ్వినువ్వు."

"మైగాడ్. అంటే... నాకు బట్టతల రావచ్చంటావా?"

"ఎవరికయినా రావచ్చు."

"నోనో... ఈస్ట్రోజెన్ హార్మోన్స్ పుణ్యమాని ఆడవాళ్ళకి బట్టతల వచ్చే ఛాన్స్‌లేదు. వూరకే భయపెట్టకు. అయినా ఇప్పటికీ నా జుత్తు ఒత్తుగా పొడుగ్గా ఎలావుందో చూస్తున్నావుగా. అప్పట్లో నా జుత్తుని నీలిమేఘంతో పోల్చేవాడివి గుర్తులేదా?"

"మర్చిపోదామని ప్రయత్నిస్తున్నాను వెన్నెల. గుర్తుచేయకు. మన జీవితాల్లో గతం ఒక తీపికల. అది వాస్తవం అవుతుందన్న ఆశ ఎప్పుడో పోయింది."

చివరి మాటలు అంటున్నప్పుడు–

అతడి గొంతులో ఆర్ధ్రతని ఆమె గమనించింది.

అతని చేయి పట్టుకుని ఆపి కళ్ళలోకి చూసింది.

"నేను నీ జీవితంలోకి వచ్చుండకూడదు కదూ... సారీ అనూప్. నాకు తెలుసు. అప్పట్లో మనం పెళ్ళిచేసుకోవాలని అనుకున్న ప్రతిసారీ ఏదో అవాంతరం వచ్చిపడేది.

మా డాడీతో గొడవపడి నేను బయటకు వచ్చినప్పుడే మరో ఆడపిల్ల అయితే ప్రేమించినవాడ్ని పెళ్ళిచేసుకుని భార్య పోస్ట్‌లో తృప్తిపడి ఇల్లాలిగా సెటిలయిపోయేది.

కాని నా మనస్తత్వం అదికాదు. మా డాడీలా పట్టుదల ఎక్కువ. ఆడపిల్లగా నేను ఉద్యోగానికో, వ్యాపారబాధ్యతలు నిర్వహించటానికో పనికిరానని చాలా చులకనగా మాట్లాడారు ఆ రోజు. అదే నాలో పట్టుదలరేపింది. ఇక ఆ తర్వాత మన గమ్యాలు మారాయి. నాకు తెలుసు నిన్ను చాలా హర్ట్ చేసాను. అయాం సారీ" అంది.

"అవన్నీ ఇప్పుడు అవసరమా? ఏదో మాటవరసకన్నాను. ఇది జీవితం. అన్నీ మనం అనుకున్నట్టు జరగవు. నిన్ను లంచ్‌కి పిలిచింది ఇలా గతం తలుచుకోడానిక్కాదు. కమాన్" అంటూ ఆమె చేయి పట్టుకునే లోనకు నడిచాడు అనూప్.

హోటల్ ఎ.సి. రెస్టారెంట్‌లో–

కార్నర్ టేబిల్‌వద్ద పక్కపక్కన కూర్చున్నారు.

మీల్స్ ఆర్డర్ చేసేవరకూ ఇద్దరూ మాట్లాడుకోలేదు. వెయిటర్ వెళ్ళిపోయాక–

"ఈమధ్య నీ గురించి పత్రికల్లోను మ్యాగజైన్స్‌లోను ఆర్టికల్స్, ఇంటర్వ్యూలు వస్తున్నాయి. మీడియా నీ గురించి పబ్లిసిటీ బాగానే ఇస్తోంది. నీ కంపెనీల యాడ్స్ కూడా తరచూ పేపర్స్‌లో వస్తున్నాయి" అన్నాడు.

"అవును అనూప్! ఈరోజు ఏ బిజినెస్సూ పబ్లిసిటీ లేకపోతే సక్సస్ కావటంలేదు. నా గురించి, నా వ్యాపారాల గురించి తరచూ మీడియాలో పబ్లిసిటీ జరిగేలా చూసుకుంటాను. నా సంగతి అలా వుంచు. నీ లా ప్రాక్టీస్ ఎలా వుంది?" అడిగింది.

"లిఫ్ట్‌లా వుంది" చెప్పాడు.

"లిఫ్ట్‌లాగనా...." అంటూ ఫక్కున నవ్వింది.

"అవును. ఒకసారి పైకి ఒకసారి కిందకి, ఇంకోసారి గ్రౌండ్‌ఫ్లోర్‌కి ఒక నిలకడ లేదు. అఫ్‌కోర్స్. నేనూ పెద్దగా ఇంట్రస్ట్ చూపటంలేదనుకో చేస్తే కోప్పడతావ్. అయినా చెప్పక తప్పదు. ఇప్పుడు కూడా నా అంతట నేనుగా రాలేదు. ఒక క్లయింట్ విషయంగా నీతో మాట్లాడవలసిన అవసరం ఏర్పడింది. అందుకే పనిలో పనిగా లంచ్‌కి పిలిచాను" చెప్పాడు.

"సో... అంతేగాని నన్ను చూడాలని కాదన్నమాట...."

"ఏయ్... నేను ముందే చెప్పాగా కోప్పడతావని. సారీ. నాకూ నిన్ను చూడాలని, మాట్లాడాలని ఎప్పటికప్పుడు అనుకున్నా నీ పొజిషన్ నాకు తెలుసు. అనవసరంగా నిన్ను ఇబ్బంది పెట్టకూడదనే ఫోన్ కూడా చేయట్లేదు. నువ్వు కోప్పడి కాసేపటి ఈ ఆనందాన్ని కూడా నాకు దూరం చేయకు."

"ఓ.కె. కనీసం ఈ విధంగా అయినా కలుసుకున్నాం. ఇంతకీ నిన్ను నా వద్దకు పంపిన కష్టమర్ ఎవరు?"

"మాదాపూర్‌లో అయ్యప్ప సొసైటీ స్థలాల గురించి నీకు తెలుసు...."

"ఆగాగు... రమేష్ యాదవ్ నిన్ను రాయబారం పంపించాడా?" వెంటనే అడిగింది వెన్నెల.

"అవును. వాడు నా క్లయింట్. మన పరిచయం గురించి ఎలాగో వాడికి తెలిసింది. రిక్వెస్ట్ చేసాడు...."

"నన్ను కన్విన్స్ చేస్తానని మాటిచ్చావా? అలా జరిగితే నీకోసం ఒప్పుకుంటాను."

"లేదులేదు. గ్యారంటీ యివ్వలేనని ముందే వాడికి చెప్పాను. మన పరిచయాన్ని అడ్డం పెట్టుకుని వాడికేదో లాభం చేకూర్చాలని నాకులేదు."

"అయితే ఓ.కె. ఇంతకీ ఏమంటాడు?"

"నువ్వు థర్టీపర్సంట్ ఆఫర్ ఇచ్చావట. వాడు పార్టీ అడిగాట్ట. కనీసం థర్టీఫైవ్‌కి ఒప్పించమని అడిగాడు."

"వాడికి థర్టీ ఎక్కువ. పైగా ముందే ఏభై లక్షలు చెల్లింపు అయిపోతుంది. నీకు వాడు చెప్పని మరో విషయం వుంది. నేను ఆఫర్ చేసింది ప్లాట్స్ సేల్స్‌లో వైట్ మనీవరకే. బ్లాక్‌తో వాడికి సంబంధంలేదు." అంటూ నవ్వింది.

కళ్ళు గిర్రున తిరిగినంత పనయింది అనూప్‌కి.

"మైగాడ్. నీలో మీ డాడీని చూస్తున్నాను. వ్యాపారంలో ఇంత ఖచ్చితంగానూ ఆయనా వుంటారట...."

"నేను ముందే చెప్పాగా. ఆయన కూతుర్నేగా. ఆయనలాగే డీల్ చేస్తాను. నీ క్లయిట్‌ను నువ్వు ఈ విషయంలో వదిలేసుకోడం మంచిది. ఎందుకంటే, ఆ స్థలాలు వాడి కష్టార్జితం కాదు. కబ్జాచేసినవి. ఆ రోజుల్లో సొంతదారుడ్ని బెదిరించి అతితక్కువ ధరకి రాయించేసుకున్నాడుగాని ట్రస్ట్ భూమి గావటంతో రిజిస్ట్రేషన్ సాధ్యంకాలేదు. వాడు నా ఆఫర్‌ని చచ్చినట్టు ఒప్పుకోవాలి. లేదంటే మొత్తం పోగొట్టుకుంటాడు. అసలు ఓనర్‌ని రంగంలోకి దించుతున్నాను. పక్క వాళ్ళతో కూడా మాట్లాడాను. ఇచ్చింది పుచ్చుకోగలిగితే నా వద్దకి రమ్మను. లేదంటే ఎలా హేండిల్ చేయాలో నాకు తెలుసు" అసలు విషయం చెప్పింది.

ఆశ్చర్యంగా చూస్తున్నాడు అనూప్.

అతడి నీలికళ్ళంటే వెన్నెలకి చాలా యిష్టం. సహజసిద్ధమైన నీలికళ్ళు అతడివి. ఆ రోజుల్లో ఆ కళ్ళలోకి చూస్తూ తనెంతగా పులకించిపోయేదో ఇప్పటికీ గుర్తే.

"ఏమిటలా చూస్తున్నావ్?" అడిగింది.

"వ్యాపార రంగంలో ప్రవేశించాక నీకు ఆస్తులతోబాటు శత్రువులు కూడా పెరుగుతున్నారని డౌటుగా వుంది" చెప్పాడు.

చిన్నగా నవ్వి తలూపింది.

"రమేష్‌యాదవ్ గురించేగా? నా ముందు వాడు నథింగ్. నాతో పెట్టుకుంటే వాడికే నష్టం. వ్యాపారం కూడా ఒక అడవిలాంటిదే. అడవిలో అడుగుపెట్టాక అన్నీ వుంటాయి, ఫల వృక్షాలూ వుంటాయి, విషకీటకాలూ వుంటాయి. ముళ్ళకు భయపడితే గులాబీలు కోసుకోగలమా? వ్యాపారం అనే అడవిలోకొచ్చాక నేనూ ఎన్నో నేర్చుకున్నాను. నా శత్రువుల్ని ఎలా హేండిల్ చేయాలో నాకు తెలుసు."

ఆర్డర్ చేసిన లంచ్ టేబిల్‌మీదకు సర్వ్ చేయబడింది, కాస్సేపు మాటలు ఆపి భోజనం ఆరంభించారు. మధ్యమధ్య ఒకరినొకరు చూసుకొంటున్నారు. దారులు వేరయిపోయినా ఇద్దరి కళ్ళలోనూ ఆరాధన ఇప్పటికీ చెక్కుచెదరలేదు. అనూప్ మగాడు గాబట్టి మనసులో బాధని నిగ్రహించుకోగలుగుతున్నాడు. కాని వెన్నెలకి కళ్ళు చెమర్చాయి. అనూప్ కళ్ళ నుంచి ఆమె రెప్పలమాటున తడి తప్పించుకోలేకపోయింది.

"నమ్మలేకపోతున్నాను. ఇప్పటికీ నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు" అన్నాడు.

"వైనాట్... ఆడపిల్ల తనకు తప్పటడుగులు నేర్పిన తండ్రిని తన మదిలో వలపు చిగురింపచేసిన మగాడ్ని ఎప్పటికీ మర్చిపోలేదు. దారులు వేరయినంత మాత్రాన మనసులు వేరవుతాయని ఎలా అనుకున్నావ్? ఏం నీ మనసులో నేను లేనా?"

"అణువణువునా నువ్వే వున్నావ్. అందుకే ఇంకో అమ్మాయిని చూడలేకపోతున్నాను. ఓ.కె. లీవిట్. మన జీవితాలు కలవని రైలుపట్టాల్లా అయిపోకుండా ఎప్పుడో ఒకప్పుడు కలుస్తామన్న చిన్న ఆశ నాకుంది. ఆశయితే వుందిగాని నమ్మకం లేదు. ఎందుకంటే చెప్పాగా. నువ్విప్పుడు నాతో ఆడుకున్న చందమామవి కాదు. ఆకాశంలో జాబిల్లివి. నా చేతులకి అందనంత దూరంలో వున్నావ్" చటుక్కున అతడి చేతిమీద తన చేయి వేసి అదిమింది.

"ఒక విషయం మర్చిపోతున్నావ్ అనూప్! చందమామ అందనంత ఎత్తులో వున్నా తన పాలవెన్నెలని భూమిమీదికే ప్రసరిస్తుందని మర్చిపోతున్నావ్. నువ్వు మరీ అప్‌సెట్ కావద్దు. నాకు బాధగా వుంటుంది.

"ఓ.కె. ఒ మాటడగనా. ఇప్పుడే చెప్పావ్. తప్పటడుగులు వేయించిన తండ్రిని మర్చిపోదు ఆడపిల్ల. అలాంటి తండ్రిమీద నీకెందుకు ఇంకా పంతాలు, పట్టింపులు. చిన్నదానివి నువ్వే ఒక మెట్టు దిగాలి. నీ తండ్రి టైగర్ యుగంధర్. నువ్వో మెట్టుదిగి ఆయన్ని గెలిపిస్తే తప్పేమిటి? ఆయనకి నువ్వంటే ప్రాణం. ఆ విషయం నాకు తెలుసు."

"నిజమే. కాని ఆయన కూతుర్ని గదా. మెట్టు దిగడం యిష్టం వుండదు. తానుగా పలకరించేవరకు నేనా గడప తొక్కదలచలేదు. ఏం? కనీసం ఫోన్‌చేసి ఎలా వున్నావని అడిగితే ఆయన సొమ్మేమయినా పోతుందా?"

ఆమె మాటలకు పెద్దగా నవ్వేసాడు అనూప్.

"ఎందుకా నవ్వు?" చిరుకోపంతో అడిగింది.

"నవ్వక? మీ తండ్రికూతుళ్ళ తగవు తీర్చటం బహుశ ఎవరివల్లా కాదేమో. నాకు తెలిసి నీ అంత జగమొండి ఎవరూ లేరు" అన్నాడు.

ఇద్దరూ భోంచేసి తీరిగ్గా హోటల్‌నుంచి బయటపడేసరికి మూడు దాటింది సమయం.

"దెన్... ఇక నేను బయల్దేరనా?" తన కారు వద్దకు రాగానే అడిగాడు.

"అర్జంటు పనులున్నాయా?" కాజువల్‌గా అడిగింది.

"ఉంటే?"

పక్కన పడేసి కాసేపు నాతో వస్తావని. కనీసం ఇంటికి కూడా పిలవలేదని రేపు నువ్వు నామీద అలుగుతావని భయం. నా ఫ్లాట్ చూళ్లేదుగా. నీ కారు ఇక్కడే వుంచు. నేను నిన్నిక్కడ డ్రాప్ చేస్తాను. నా కారులో వెళదాం. ఓ.కే." పిలిచింది.

ఎందుకో అనూప్ మనసు అంగీకరించటంలేదు.

ఆమె అహ్వానం తనకి ఆనందమే.

కాని గత అనుభవాల మధ్య ఆలోచనలలో పడ్డాడు.

తామిద్దరూ పెళ్ళి చేసుకోవాలనుకున్నప్పుడు ఆమె తండ్రితో గొడవపడి వచ్చేసింది. తమమధ్య అంతరం ఏర్పడింది. ఒకసారి తామిద్దరూ బెడ్‌రూంవరకు వెళ్ళిన సందర్భంలో కూడా ఏదో అవాంతరంతో ప్రోగ్రాం

కౌన్సిల్. ఆ మరునాడు ఇదే విషయంలో తామిద్దరూ గొడవపడి దూరమయ్యారు. ఇంతకాలం తర్వాత ఇప్పుడు కలిసారు. ఇప్పుడు పిలిచింది కదాని ఇంటిదాకా వెళ్తే మళ్ళీ ఏ అవాంతరం మీద పడుతుందోనని ఆలోచిస్తున్నాడు.

ఆమె అడిగితే ఇదే విషయం చెప్పాడు ఆమె నవ్వేసింది.

"నువ్వు లాయర్వి. సెంటిమెంట్లని నమ్మకూడదు. కమాన్" అంటూ తన బెంజ్‌కారులో కూర్చుంది. అతను పక్కన కూర్చుని డోర్ మూయగానే కారు బయలుదేరింది. విమానంలో ప్రయాణిస్తున్నంత హాయిగా వుంది బెంజ్‌కారులో ప్రయాణం.

కారు వేగం పుంజుకుంది.

* * * * *

విధి చాలా బలీయమైంది.

ఇది సర్వసాధారణంగా అంతా అనుకునే మాటే.

ఇంతకీ విధి అంటే?

విధి అంటే బాధ్యత-

విధి అంటే - తలరాత-

విధి అంటే దైవం.

మనిషిని నిర్ధేశిస్తాడు గాబట్టి దేవుడ్ని విధాత అన్నారు. ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు మనిషి జీవితాన్ని అలా నిర్దేశించే శక్తి అది దైవం గావచ్చు, మరేదన్నా సూపర్ ఫవర్ కావచ్చు. దానికి మనిషి తలవంచక తప్పదు. ఇచ్చింది తీసుకోవటం తప్ప నాకిలాగే కావాలి అంటే కుదరదు.

నా జీవితం నా చేతుల్లోనే వుంది అని సగర్వంగా చెప్పుకొనే వాళు ౣ కూడ ఒకానొక సందర్భంలో తమ అభిప్రాయం తప్పని ఖచ్చితంగా తెలుసుకుంటారు. మనిషి ఎంత గొప్పగా ఎదిగినా, చివరకు మట్టిలో కలవాల్సిందే. చరిత్రలో గొప్పగొప్ప వాళ్ళ జీవితాన్ని పరిశీలించినప్పుడు ఈ విషయం స్పష్టంగా అర్ధమవుతుంది.

మంగోలు వీరుడు గోబీ ఎడారి బెబ్బులి చెంఘిజ్ ఖాన్ ఏమయ్యాడు? అంత గొప్పవీరుడు, గుర్రంమీద నుంచి జారిపడిన ప్రమాదంలో కాలువిరిగి ఇక లేవనేలేదు.

ప్రపంచాన్ని జయించాలని బయలుదేరిన అలెగ్జాండర్ చివరకు సింధునదీ ప్రాంతంలో ఓ కోతి కరిచిన గాయంతో మరణించాడంటే నమ్ముతారా? కాని అది నిజం.

అమర ప్రేమికుడు షాజహాన్ చక్రవర్తి తన వృద్ధాప్యాన్ని జైల్లోనే గడిపి అక్కడే అంతిమశ్వాస వదిలాడు. ఆయన్ని ఖైదుచేసింది శత్రురాజు కాదు. కొడుకు ఔరంగజేబు. ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు.

ఈ లోకాన్ని విధి ఆడించే నాటకరంగం అని కొందరు వ్యాఖ్యానించటానికి కారణం యిదే. నేను, నాది, నా వాళ్ళు, నా సామ్రాజ్యం అని గొప్పగా చెప్పి ఓ వెలుగు వెలిగిన మహాపురుషులు కూడా ఎవరూ ఇక్కడ మిగల్లేదు. వెవట ఏమీ తీసుకునీ పోలేదు.

ఉన్నట్టుండి యుగంధర్ ఆలోచనలకు బ్రేకులు పడ్డాయి.

చిన్న జర్క్‌తో కారు ఆగటమే అందుక్కారణం.

తల విదిలించి ఓసారి బయటకు చూసాడు. అది ప్రయివేట్ విమానయాన సంస్థకు చెందిన ఏర్‌ఫీల్డు. ఎదురుగా రన్‌వే కనబడుతోంది. సమీపంలోనే ఒక ప్రయివేట్ విమానం ఆగుంది. ఒకసారి తల విదిలించి సీట్‌కి జేరబడ్డాడు.

ఉన్నట్టుండి ఏమిటి ఇలాంటి ఆలోచనలు వచ్చాయి. గుండెలోతుల్లో ఎక్కడో అనీజీ. ఏదో జరగబోతోందనే ఫీలింగ్. ఏమిటది...? మూసిన కళ్ళు తెరవలేదు.

ఆయన పక్కసీట్లోనే వున్న పి.ఎ. స్టెల్లా ఆశ్చర్యంగా చూస్తోంది.

"సార్. మనం ఏర్‌పోర్ట్ ఫీల్డులో వున్నాం" గుర్తు చేసింది.

చిన్నగా తల వూపాడు.

ఆయన బయలుదేరాడంటే ఆయన పర్సనల్ కాన్వాయ్‌లో కనీసం అరడజను కార్లకు తగ్గకుండా వుంటాయి. పర్సనల్ అసిస్టెంట్ స్టెల్లా మాత్రం అతని కారులో వుంటుంది.

వెనక వాహనాల్లో ఆయన సెక్రటరీలు, అసిస్టెంట్లు, సెక్యూరిటీ సిబ్బంది యిలా కనీసం పాతిక ముప్ఫైమంది వుంటారు.

పనిమీద విజయవాడ వెళ్ళిన ఆయన నాలుగో భార్య షీబా ప్రస్తుతం అనారోగ్యంతో అక్కడ ఒక ప్రయివేట్ అస్పత్రిలో చికిత్స పొందుతోంది.

అందుకే ఇప్పుడు సడెన్‌గా ప్రయాణం.

అది ఫ్లై హై ఏవియేషన్ వారి విమానాశ్రయం. ఆయన కోసం అక్కడ సింగిల్ ఇంజన్ విమానం సిద్ధం చేయబడింది. ఆరుగురు ప్రయాణించటానికి అనువైన విమానం అది.

"ఏమైంది సర్?" చిన్నగా స్టెల్లా అడగడంతో ఆలోచనలనుంచి తిరిగి బయటపడ్డాడు. ప్రయాణం కేన్సిల్ చేసుకుంటే ఎలా వుంటుందని మనసు పీకుతోంది. కాని వెంటనే రాలేదని షీబా ఫీలవుతుంది. అయినా తను సెంటిమెంట్ ఫూల్‌ని కాదుగదా...? ప్రయాణం ఎందుకు మానాలి?

"ఏంలేదు స్టెల్లా. మనసు కొంచెం డిస్ట్రబ్‌గా వుంది" అంటూ కారు దిగాడు. అప్పుడే వాహనాలు దిగిన ఆయన సిబ్బంది ఆయన కారువద్దకు వచ్చేసారు. వాళ్ళందరికీ సలహాలు, సూచనలు ఆర్డర్స్ చకచకా యిచ్చేసి కారులోంచి తన బ్రీఫ్‌కేసు లాబ్ ట్యాప్ అందుకున్నాడు.

"ఇలా ఇవ్వండి సర్. నేను తీసుకొస్తాను" అడిగింది స్టెల్లా.

"నోనో... ఇది బిజినెస్ టూర్ కాదు. పర్సనల్ ట్రిప్. నువ్వు రానక్కర్లేదు. ఆఫీసు పనులు చూసుకో. నైట్‌కంతా వచ్చేస్తాను. ఫోన్‌లో ఎప్పటికప్పుడు టచ్‌లో వుండు."

"ఓ.కే. సర్"

"మీరు బయలుదేరండి" అందరికీ ఆర్డర్ వేసాడు. అవికదిలే వరకు అక్కడే నిలబడి విమానంవైపు అడుగు లేసాడు.

"గుడ్‌మార్నింగ్ సర్" అంటూ ఆయన చేతుల్లోని లగేజీని అందుకుని విమానంలో వుంచాడు పైలట్ జోసఫ్.

"మనం బయలుదేరవచ్చా" సీట్ బెల్టు వేసుకుంటూ అడిగాడు యుగంధర్.

"ష్యూర్. వాతావరణం క్లియర్‌గా వుంది. ఎంటి.సి. నుంచి (AIR TRAFFIC CONTROL) ఇంత క్రితమే టేకాఫ్‌కి క్లియరన్స్ అందింది" అంటూ కాక్‌పిట్‌లో తన సీట్లో కూచున్నాడు జోసఫ్.

మరికొద్ది సేపట్లోనే టేకాఫ్ తీసుకుని గాల్లోకి లేచిన విమానం విజయవాడ దిశగా ప్రయాణం ఆరంభించింది. యుగంధర్ సీట్ బెల్టు తీసేసి రిలాక్స్‌గా కూచుంటూ లాబ్ ట్యాప్ ముందేసుకున్నాడు. కంపెనీలు ఉన్నట్టుండి ఎందుకు నష్టాలవైపు జారిపోతున్నాయో తెలుసు కోవడంకోసం మూడురోజులుగా ప్రయత్నిస్తున్నాడాయన.

ఆరుగురు కూర్చునే సామర్థ్యమున్న ఆ చార్టెడ్ విమానం రిలయబుల్, కాని పాతది. ఈ మధ్యనే సొంతంగా ఒక విమానం కొనాలని నిర్ణయానికొచ్చాడు యుగంధర్.

సుమారు అరగంట తర్వాత–

ఉన్నట్టుండి విమానంలో చిన్న జర్క్.

ఉలిక్కిపడి లాబ్ ట్యాప్ మూసేసి పక్కనపెట్టాడు యుగంధర్. అంతలోనే మరోసారి షేకయింది ప్లేన్. విమానం వేగం మందగిస్తోంది. ఏటవాలుగా నేలవైపు ప్రయాణం చేస్తున్నట్టుంది.

"ఏమైంది జోసఫ్?" లేచి పైలెట్ సీట్‌మీదకు వంగుతూ అడిగాడు యుగంధర్.

జోసఫ్ నుదుట చెమటలు పోస్తున్నాయి.

విమానాన్ని కంట్రోల్ చేయటానికి శ్రమ పడుతున్నాడతను.

"ఇంజన్‌లో ప్రాబ్లం సర్! ముందుకు పోలేం. కూలిపోకుండా అత్యవసరంగా కిందకు దించాలని చూస్తున్నాను. సీటు బెల్ట్ వేసుకోండి. టేకిటీజీ. సేఫ్‌గా లాండ్ అవుతాం" తన కంగారును మాటల్లో తెలీకుండా జాగ్రత్తపడుతూ హెచ్చరించాడు జోసఫ్.

సీట్లో కూచుని బెల్టు వేసుకున్నాడు యుగంధర్.

"ఇంజన్ ఆగిపోతోందా?" కంగారును అణచుకుంటూ అడిగాడు.

"లేదు. సర్... మొత్తం ఆగిపోలేదు. ఆగిఆగి పని చేస్తోంది. గ్రౌండ్ స్టేషన్‌తో మాట్లాడాను. విమానాన్ని వెనక్కు తీసుకుపోతున్నాను...." చెప్పాడు జోసఫ్.

నేలకు ఆరువేల అడుగుల ఎత్తున–

విమానాన్ని కంట్రోల్ చేయటానికి కుస్తీ పడుతున్నాడు జోసఫ్. విజయవాడ రూట్ నుంచి వెనుతిరిగి హైదరాబాద్‌కి వెనక్కి వచ్చేస్తోంది. కాస్సేపు ఏటవాలుగా, కాసేపు సమాంతరంగా అప్పుడప్పుడూ గిరికీలు కొడుతూ... ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి సేఫ్‌గా లాండ్ కాగలమా? యుగంధర్‌లో టెంక్షన్.

విమానం ఎక్కేముందు తన మనసులో ఆందోళనకి కారణం ఏమిటో యుగంధర్‌కి ఇప్పుడు అర్థమవుతోంది. విమానం కూలిపోతే... తను మరణిస్తే... లేదులేదు...

తను ఇప్పుడే మరణించకూడదు.

"సేఫ్‌గా లాండ్ అవుతామా జోసఫ్...?" తడబడుతూ అడిగాడు.

"ష్యూర్" హామీ యిచ్చాడు జోసఫ్.

ఇలాంటి సమయంలో ట్రెయిన్‌ని మరింత అలెర్ట్‌గా వుంచాలని జోసఫ్‌కి తెలుసు. అంతేకాదు. నిజంగా ప్రమాదం వున్నా, ప్రయాణీకుల్ని ఆందోళనకి గురి చేయకూడదనీ తెలుసు. అందుకే అబద్ధం చెప్పాడు. కాని ఎంతవరకు సేఫ్‌గా లాండ్ కావచ్చో తనకే అంచనా లేదు. విమానం హైటు క్రమంగా తగ్గుతోంది. ఇప్పుడు రెండువేల అడుగుల ఎత్తులో తిరుగుతోంది. ఎమర్జెన్సీ లాండింగ్‌కు దిగువన అనువైన చోటుకోసం జోసఫ్ గాలిస్తూనే వున్నాడు.

క్రమంగా హైదరాబాద్ సమీపంలోకి వచ్చేస్తున్నారు.

టైగర్ యుగంధర్ మరణం గురించి ఎప్పుడూ భయపడలేదు. ఎందుకంటే అది సహజం. కాని ఇలాంటి దుర్మరణాన్ని అతను ఎప్పుడూ కోరుకోలేదు.

ఎందుకో తను ప్రాణాలతో ఈ గండంనుంచి బయట పడలేడేమో అనిపిస్తోంది. చాలా బాధ్యతలు మిగిలిపోయాయి. అందుకే బాధ... ఆందోళన.

భార్యలు నలుగురయినా తనకున్నది ఇద్దరే సంతానం. ఆ ఇద్దరిలో శరత్‌చంద్రకి పెళ్ళి చేసేసాడు. కాని వెన్నెల పెళ్ళి చూడలేకపోయాడు. తనకి కూతురంటే చాలా ఇష్టం. తన అందం, తెలివితేటలు పుణికి పుచ్చుకున్న యువరాణి. పంతాలకుపోయి ఇద్దరూ దూరంగానే వుండిపోయారు. తనకు తెలుసు.

ఒక్క ఫోన్‌చేస్తే చాలు. ఈ డాడీని చూడ్డానికి పరుగులెత్తుకు వస్తుంది. కాని అహం... పిల్లలముందు తండ్రికి అహం ఏమిటి? జీవితంలో సక్ససవుతున్న పిల్లలు పెద్దవాళ్ళ ప్రోత్సాహాన్ని, అభినందన్ని ఆశిస్తారు. కనీసం ఫోన్‌చేసి ఒక్కసారి కూడా అభినందించలేకపోయాడు. చాలా బాధపడి వుంటుంది... అందుకే కోపం.

ఒక్కసారి కూడా చూడ్డానికి రాలేదు.

వెన్నెలతో సంబంధాల్ని పునరుద్ధరించుకోకపోవటం కన్న తండ్రిగా తను చేసిన పెద్ద తప్పు. ఈ సమయంలోనయినా ఫోన్‌చేసి చివరిసారిగా మాట్లాడదామన్నా తన సెల్‌నెంబర్ తనవద్దలేదు. యుగంధర్ మనసు వెన్నెలని తలుచుకుని వేదనపడుతోంది.

"ఎక్కడ వున్నాం?" గొంతు పెకల్చి పైలెట్‌ను అడిగాడు.

"హైదరాబాద్ సమీపంలో సర్. హయత్ నగరంవైపు వెళుతున్నాం. కొండలు, రేడియో టవరు కనబడుతున్నాయి. పొలాల్లో గ్రీనరీ కనిపించటంలేదు. అవుటర్ రింగ్‌రోడ్ వచ్చాక రైతులకు పంటలమీద ఆశ తగ్గిందనుకుంటా. పంటలమీద ఆసక్తి చూపించటంలేదు. క్రాష్ లాండింగ్‌కి బురదనేల అనుకూలంగా వుంటుంది. అలాంటి ప్రదేశంకోసం చూస్తున్నాను– జోసఫ్ మాట్లాడుతూనే వున్నాడు.

యుగంధర్‌కి విసుగ్గా వుంది.

క్రమంగా విమానం ఎత్తు మరింత తగ్గింది.

ఇంతలో ఇంజన్ ఆగిపోయింది.

"ఓ షిట్" అనరించాడు జోసఫ్.

ఇంజను ఆగిపోడంతో-

విమానం గ్లైడర్‌లా ఎగురుతోంది. అంతవేగంతో గాలివాటు ఏ మాత్రం మారినా ఒక్కసారిగా కుప్పకూలిపోవటం ఖాయం. ఈలోపలే విమానాన్ని దించేయాలి. ఒక కొండ పరిసరాల మీద చక్కెర్లు కొడుతూ వస్తోంది విమానం. క్రమంగా వేగం తగ్గిపోతోంది. విమానాన్ని గాల్లోనే వుంచటం ప్రమాదం. నేలకు ఇంకా అయిదు వందల అడుగుల ఎత్తులో వుంది. క్రాష్ లాండింగ్ చేద్దామని విమానాన్ని నేలకు వందగజాల దిగువ వరకు తెచ్చేసాడు జోసఫ్. కాని విమానంలో వేగం ఇంకా పూర్తిస్థాయిలో మందగించలేదు. నేలకు దించితే తల్లకిందులు కావచ్చున్న భయంతో తిరిగి కాస్త పైకి లేపి ఎదురుగా వున్న కొండవైపు పోనిచ్చాడు.

చాలా ఏటవాలుగా, చదునుగా వున్న కొండప్రాంతాన్ని చూడగానే ఇక ఆలోచించకుండా విమానాన్ని అటు పోనిచ్చాడు. నేలకు వాలుతున్న గ్రద్దలా విమానం నెమ్మదిగా దిగి, ఇంకా నెమ్మదిగా అలా... అలా... అది ఎగిరి వచ్చి కొమ్మమీద వాలిన గాలివటంలా కొండవాలు మీది చదును నేలమీద లాండయింది... అయినా ప్రమాదం తమని వీడలేదని ఆ ప్రాంతాన్ని చూసాక గాని జోసఫ్‌కి అర్థంకాలేదు.

పైనుంచి చూసినప్పుడు అది సమాంతర నేలగా కన్పించింది. కాని అది నిజం కాదు. ఏటవాలు ప్రదేశం. విమానం ఏ క్షణంలోనయినా వెనక్కు వాలి నేలకూలిపోవచ్చు. నేలకు మూడు వందల అడుగులెత్తులో వుందా చోటు. అందుకే జోసఫ్ డోర్ తెరుచుకుని కాక్‌పిట్‌లోంచి బయటకు దూకేసి ఒక చెట్టు కొమ్మను పట్టుకుని నిలదొక్కుకుంటూ-

"సార్... దూకేయండి... బయటకు దూకేయండి" అనరిచాడు.

సేఫ్‌గా లాండ్ అయినందుకు యుగంధర్ కూడా తేలిగ్గా వూపిరి తీసుకుంటూ చేతిలోని లాబ్‌ట్యాబ్‌ని కేర్ పట్టుకోమని అరుస్తూ ముందు జోసఫ్ మీదికి విసిరేసాడు.

జోసఫ్ దాన్ని అందుకున్నాడు.

"అది నా కూతురు వెన్నెలకి అందేలా చూడు... నేను వచ్చేస్తున్నాను...." అంటూ సీటు బెల్టు విప్పుకొంటుంటే అది వూడి రాలేదు టైం బాగోకపోతే పరిస్థితి ఎలా మారిపోతుందో చెప్పటానికి ఇలాంటి సందర్భాలే ఉదాహరణ. పరిస్థితి ముందే వూహించినట్టు అతను లాబ్‌ట్యాబ్‌ను జోసఫ్ మీదికి విసురుతూ దాన్ని వెన్నెలకి అందించాలి అని అరిచిన అరుపులే ఆయన చివరి మాటలయ్యాయి.

బకిల్ పదిసెకండ్ల ముందు వూడివచ్చి, బెల్టు తీసుకోగలిగితే ఆయన బయటకు దూకి ప్రాణాలు రక్షించుకోగలిగి వుండేవాడు. కాని బేడ్‌లక్. ఆయన బెల్టు తీసుకుని, సీట్లోంచి లేస్తూండగానే విమానం బేలన్స్ తప్పి వెనక్కి ఒరిగింది. అంతే– ఒక్కసారిగా స్లోపు వెంట మూడు వందల అడుగుల దిగువన నేలకు వేగంగా జారిపోవటం మొదలుపెట్టింది.

వేగంగా మరింత వేగంగా... రెక్కలు విరిగి తోక తెగి చిన్నా భిన్నమవుతూ దారిలోనే ఒక బండను బలంగా గుద్దుకుంది. అంతే– ఒక్కసారిగా ఎగసాయి మంటలు. దారుణ విస్ఫోటకం. యుగంధర్ చావు కేకలు కూడా పైలట్ జోసఫ్‌కు విన్పించలేదు.

లాబ్‌ట్యాప్‌ను చంకన పెట్టుకుని–

నిశ్చేష్టుడై నిలబడిపోయి–

కాలిపోతున్న విమాన శకలాల్ని చూస్తూ–

అలా ఎంతసేపు నిలబడిపోయాడో జోసఫ్‌కే తెలీదు.

అతడి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. క్షణం ఆలస్యం అయివుంటే తనూ ఆయనతోబాటే వెళ్ళిపోయేవాడు. తనను మాత్రం బ్రతికించి ఆ పెద్దమనిషి తీసుకుపోవడంలో విధి లీల ఏమిటో ఆయనకే తెలియాలి. టైగర్ యుగంధర్‌కి ఈ కొండమీద చావు రాసిపెట్టి ఉందంటే–

నమ్మలేకపోతున్నాడు జోసఫ్. తను కుంట్లూరు ప్రాంతంలో వున్నట్టు గుర్తించాడు. వెంటనే కర్తవ్యం గుర్తుకురాగానే అక్కడే కూలబడుతూ జేబులోంచి తన సెల్‌ఫోన్ తీసి ఒక నంబర్‌కి ఫోన్ చేశాడు.

❈ ❈ ❈ ❈ ❈

గ్రాండ్ వ్యూ చూడగానే–

అక్కడి రిచ్‌నెస్ అర్థమైంది అనూప్‌కి.

"నువ్వు చాలా అదృష్టవంతురాలివి" అన్నాడు కారు దిగుతూ.

"దేనికి?" అడిగింది వెన్నెల.

"ఇక్కడ నీకు ఫ్లాట్ దొరకటం" చెప్పాడు.

"దొరకలేదు. కొంటే వచ్చింది. డబ్బుంటే అన్నీ సాధ్యమే. అసాధ్యం ఏదీ ఉండదు" అంటూ నవ్వింది వెన్నెల.

కారు దిగి లాక్ చేసింది.

ఆమె వెంట లిఫ్ట్ వైపు అడుగులేస్తూండగా ఒక వ్యక్తి దూరంగా నిలబడి తమనే చూస్తూ కన్పించాడు. అతడి కళ్ళలో మెరుపులు, ఆశ్చర్యము కనిపించాయి. బహుశ తమ జంటను చూసి అసూయపడుతూండాలి. అతను ఎవరో కాదు. అక్కడ సెక్యూరిటీ గార్డ్ బలరాం... కాని ఆ విషయం అనూప్‌కి తెలీదు.

"మొదటిసారిగా నా ఫ్లాట్ కొస్తున్నావ్. నేను పంపించేవరకు నువ్వు వెళ్ళకూడదు. నీకోసం ఈ పూట ప్రోగ్రాంలన్నీ కేన్సిల్ చేసుకున్నాను" లిఫ్ట్‌లో హెచ్చరించింది వెన్నెల.

చిన్నగా నవ్వి వూరుకున్నాడు అనూప్.

ఆమె మనసులో ఇప్పటికీ–

తన స్థానం చెక్కుచెదరలేదని గ్రహించి–

ఆశ్చర్యపోకుండా వుండలేకపోతున్నాడు.

ఇద్దరూ లిఫ్ట్ దిగి ఆమె ఫ్లాట్ డోర్ వద్దకి చేరుకున్నారు. కాలింగ్ బెల్ స్విచ్ నొక్కింది వెన్నెల. క్షణం తర్వాత డోర్ తెరుచుకుంది. ఎదురుగా ఆయా మీనాబాయి.

ఆమె ముఖం చూడగానే–

ఏదో జరిగిందని వూహించేసింది వెన్నెల. కలవరం, ఆందోళన దుఃఖం, కళ్ళలో నీరు చాలా ఆత్రంగా వుందామె.

"వచ్చావా వెన్నెల. నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నాను" అంది.

అనూప్‌తో బాటు లోనకొచ్చి-

తలుపు మూసింది వెన్నెల.

"ఎందుకలా వున్నావ్? ఏం జరిగింది?" అడిగింది.

"ఇంతకు ముందే హయత్ నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ వచ్చిందమ్మా. అక్కడ... అక్కడ...."

"ఏమైందో చెప్పు."

"మీ డాడీ విజయవాడకు బయలుదేరి వెళ్ళిన ప్రయివేటు విమానం కూలిపోయిందట... డాడీ...." ఇక ఆపైన చెప్పలేక ఏడ్చేసింది మీనాబాయి.

అంతే-

"ఓ మైగాడ్...!" అంటూ నీరసంగా సోఫాలో కూలబడిపోయింది వెన్నెల.

ఆ దుర్వార్త విని హతాశుడయ్యాడు అనూప్.

వెన్నెల, తను దగ్గరవ్వాలనుకున్న ప్రతిసారీ ఇలా ఏదో ఒక ఆటంకం ఎదురవుతూనే వుంది. వస్తున్నప్పుడే సందేహించాడు. షిట్... అలాగే జరిగింది. డామిట్... ఇంత ఘోరం జరగాలా... వెన్నెల పూర్తిగా ఒంటరియినట్టే...

పక్కన కూర్చున్నాడు అనూప్.

ఆమె భుజం మీద చెయ్యేసాడు.

"వెన్నెల ప్లీజ్! కంట్రోల్ యువర్ సెల్ఫ్" అన్నాడు.

దాంతో ఇక దుఃఖం ఆపుకోలేక-

అనూప్ గుండెల్లో ముఖం దాచుకుని-

చంటిపిల్లలా ఏడ్చేసింది వెన్నెల.

అనూప్ ఎవరో ఆయా మీనాబాయ్‌కి తెలుసు.

అందుకే ఆమె ఆ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోలేదు.

❈ ❈ ❈ ❈ ❈

ఇంట్లో పెద్దదిక్కు పోతే ఏర్పడే సంక్షోభం ఏమిటో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అదీ కోట్ల ఆస్థిని కూడబెట్టిన యుగంధర్ లాంటి వ్యక్తి మరణం వూహించని సంఘటన. ఇలా జరిగి వుండకూడదు. కాని జరిగిపోయింది. కాలం ఆయన్ని కర్కశంగా కబళించటంతో వెనకా ముందూ ఆలోచించలేదు.

మిడాన్‌గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో విషాదం నెలకొంది.

ఎవరికోసం కాలం ఆగదు.

కాని కాలం చేసిన గాయాలు మానాలంటే చాలారోజులు పడుతుంది. విమాన ప్రమాదంలో గుర్తుపట్టడానికి వీల్లేనంతగా కాలి మాంసం ముద్దయిపోయింది యుగంధర్ బాడీ. దానికే సకల లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు జరిపించారు. యుగంధర్ అంతిమయాత్రలో కిక్కిరిసిన జనం, బంధుమిత్రులు, కంపెనీ ఉద్యోగులు, సానుభూతిపరులు, ప్రభుత్వంలో గొప్ప వాళ్ళు అంతా వచ్చారు. ఆ ఏర్పాట్లన్నీ కొడుకుగాతండ్రి మరణంతో అప్పుడే తను తన తండ్రి స్థానంలో కూర్చున్నంతగా అతడి ముఖంలో గర్వం తొంగిచూసింది. ఆ గర్వం ఎంతగా తలకెక్కిందంటే తండ్రిని కడసారి చూడ్డానికి వచ్చిన వెన్నెల పట్ల కూడా అతను పరాయివాళ్ళతో మాట్లాడినట్లు పొడిగా రెండు మాటలు మాట్లాడి వూరుకున్నాడు గాని మనస్ఫూర్తిగా ఆమెతో దుఃఖం షేర్ చేసుకోలేదు. చెల్లెల్ని ఇక నీ లెక్కేమిటి అన్నట్లే చూసాడు.

అయినా వెన్నెల పట్టించుకోలేదు.

ఈ మొత్తంలో యుగంధర్ మరణానికి అమితంగా సంతోషించిన ఒకే ఒక జీవి. ఆమె శరత్‌చంద్ర భార్య, యుగంధర్ కోడలు అయిన విజృంభన. ఆమె ఏకంగా పండగే చేసుకుందంటే ఆశ్చర్యం లేదు. నలుగురి ముందూ దుఃఖం నటించినా ఆమె మనసునిండా ఆనందమే. ఇక నుంచి తన మామగారి కంపెనీలకు తన భర్త రాజయితే తను మహారాణి. ఇక చక్రం తిప్పేది తనే అనుకుంటూ కల్లల్లో తేలిపోతోంది.

జరగవలసిన లాంఛన క్రియలన్నీ జరిగిపోయాయి.

తండ్రినుంచి తనకేదో ఆస్థి సంక్రమిస్తుందని వెన్నెల ఎప్పుడూ ఆశపడలేదు. ఆశపడిన వాళ్ళకి బాధ వుంటుందిగాని పడనివాళ్ళకి బాధా

వుండదుగదా. తన కాళ్ళమీద తను నిలబడి మంచి పొజిషన్‌లోనే వుంది గాబట్టి ఆస్థిపాస్థుల కోసం ఆమె ఆశించలేదు. కనీసం ఒక్కసారయినా ప్రాణాలతో వుండగా చివరిసారయినా నాన్నా అని పలకరించలేకపోయాననే అనే బాధ ఆమె మనసును చాలా బాధించింది.

వారం రోజులు గడిచిపోయాయి.

ఒకరోజు ఉదయం వెన్నెల ఆఫీస్‌కి రెడీ అవుతుండగా కాలింగ్‌బెల్ మోగింది.

"మీనా! ఎవరో చూడు?" అంటూ ఆయా మీనాను పిలిచింది వెన్నెల.

ఆమె వెళ్ళి డోర్ తెరిచింది.

ఎదురుగా ఒక అపరిచితుడు నిలబడివున్నాడు.

చేతిలో పెద్దసైజు బ్రీఫ్‌కేస్ వుంది.

"నా పేరు జోసఫ్. పైలట్‌ని. మేడంగారిని కలవాలి" వచ్చినపని సూటిగా చెప్పాడతను.

మీనాబాయికి అర్థమైపోయింది.

తను ఇతన్ని చూడకపోయినా ఏం జరిగిందో వినివుండటంతచేత టైగర్ యుగంధర్ ప్రయాణించిన విమానం పైలట్ ఇతనే అని వూహించేసింది.

"వన్ మినిట్" అంటూ అతడ్ని అక్కడే నిలబెట్టి లోనకువెళ్ళి వెన్నెలతో చెప్పింది.

జోసఫ్ ఇక్కడికి రావలసిన అవసరం ఏమిటో వెన్నెలకి అర్థం కాలేదుగాని, చివరిక్షణాల్లో తన తండ్రి ఇతనికేమన్నా తన గురించి సందేశం యిచ్చాడేమోననే భావన ఆమెలో తళుక్కున మెరిసి మాయమైంది. చేస్తున్న పని ఆపి వెంటనే ఫ్రంట్ డోర్‌లోకి వచ్చింది.

"రండి మిస్టర్ జోసఫ్! కూర్చోండి" అంది.

బ్రీఫ్‌కేస్‌ని టీపాయ్‌మీద వుంచి సోఫాలో కూర్చున్నాడు జోసఫ్. ఎదురుగా సోఫాలో కూర్చుంది వెన్నెల. ఎలా ఆరంభించాలో అర్థంగానట్టు ఇబ్బందిగా చూసాడు జోసఫ్.

"అయాం సారీ మేడం! టైగర్ సాబ్ ఎంత ప్రముఖ వ్యక్తో నాకు తెలుసు. ఆ ప్రమాదంలో నేను పోయినా బాగుండేది. బేడ్‌లక్" అంటూ బాధగా చూసాడు.

"ఎలా జరిగింది?" ఎలాంటి భావోద్వేగానికి గురికాకుండా సాఫీగా అడిగింది వెన్నెల. చివరి క్షణాల్లో ఏం జరిగిందో తెలుసుకునే అవకాశం ఆమెకు రాలేదు.

"విమానం గాల్లోంచి కూలిపోయివుంటే ఇద్దరం పోయేవాళ్ళం. నా గురించి కాకున్నా టైగర్ సాబ్‌ని రక్షించి తీరాలన్న ఆశతో చాలా శ్రమపడి విమానం కూలకుండా తెచ్చి సేఫ్‌గా లాండ్ చేయగలిగాను. కాని బేడ్‌లక్. నేలకు మూడువందల అడుగుల ఎత్తయిన ఏటవాలు ప్రాంతం అది. నేను దూకేసాను. ఆయన్ని కూడా దూకేయమన్నాను. కానీ ఆయన ముందుగా చేసిన పనేమిటో తెలుసా? 'ఇది నా కుతురు వెన్నెలకి అందచేయి' అంటూ ఒక వస్తువును నామీదకు విసిరేసారు. ఆ తర్వాత తన సీటుబెట్టు విప్పారు. బెల్టు ఓపెన్ కావటం కొన్ని క్షణాలు లేటయింది. అదే కొంప ముంచింది. ఆయన లేచి విమానంలోంచి బయటపడేలోన విమానం వెనక్కి వాలి కిందకు దొర్లుకుంటూ పోయి తగలబడిపోయింది. నిస్సహాయంగా చూడ్డం తప్ప నేనేమీ చేయలేకపోయాను. ఇప్పుడు నేను వచ్చింది చివరిసారిగా ఆయన నాకు వప్పగించిన ఒక బాధ్యతను నెరవేర్చుకోడం కోసం" అంటూ వివరించాడు.

వెన్నెలకి ఆశ్చర్యంతో నోటమాట రాలేదు.

తన చివరి క్షణాల్లో-

డాడీ తనను తలుచుకున్నారంటే నమ్మలేకపోతోంది.

దుఃఖం గొంతుకి అడ్డంపడి మాటలు పెగలటంలేదు.

"ఏమిటి మీరంటున్నది?" అని మాత్రం అడగ్గలిగింది.

"యస్ మేడం! ఆయన్ని కాపాడలేకపోయినా ఆయన నామీద వుంచిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చగలిగానన్న తృప్తి నాకు మిగలాలి. అందుకే సంఘటనా స్థలానికొచ్చిన పోలీసులకి ఇది కనబడకుండా చాలా జాగ్రత్తపడాల్సి వచ్చింది" చెప్పాడు.

"డాడీ ఏం చెప్పారు?"

"ఇది మీకు వప్పగించమని చెప్పారు. ఆయన పర్సనల్ లాబ్‌ట్యాప్. 'ఇది ఎవరికంటా' పడకూడదని ఈ బ్రీఫ్‌కేస్‌లో వుంచి తెచ్చాను. ఆయన వప్పగించిన బాధ్యత ఇదే. దీన్ని మీకు చేర్చమని చెప్పారు" అంటూ బ్రీఫ్‌కేస్ ఓపెన్‌చేసి అందులో చిన్నసైజు బ్రీఫ్‌కేస్‌లా వున్న లాబ్‌ట్యాప్‌ని ఆమెకు అందించాడు జోసఫ్.

వెన్నెల నమ్మలేనట్టు చూసింది.

లాబ్‌ట్యాప్‌ని అందుకుంటుంటే–

ఆమె చేతులు ఒణికాయి.

అది ఏమిటో ఆమెకు తెలుసు. డాడీ కంపెనీలకు సంబంధించిన మొత్తం సమాచారం అందులో వుంటుంది. స్వయంగా దాన్ని అన్నయ్య శరత్‌చంద్రకి పంపించాలి. కానీ తనకే యిమ్మని చెప్పారంటే ఆయనకి తనమీద గల నమ్మకానికి నిదర్శనం. కాని... ఆస్థికి శరత్‌చంద్ర వారసుడయి వుండగా దీన్ని ఆయన తనకు పంపించటంలో ఉద్దేశం ఏమిటి? ఏదో కారణం లేందే ఆయన యిలా చేసి వుండరు.

"మీనా! దీన్ని నా బెడ్‌రూమ్‌లో వుంచు" అంటూ లాబ్‌ట్యాబ్‌ని మీనాబాయి చేతికిచ్చి లోనకు పంపింది.

ఆ తర్వాత ఎక్కువసేపు జోసఫ్‌తో మాట్లాడలేదు.

పాతిక లక్షల రూపాయలకు చెక్‌రాసి అతడి చేతికిచ్చింది.

"వద్దు మేడమ్! నేను నా డ్యూటీ చేసాను" వారించబోయాడు జోసఫ్.

"కావచ్చు. కానీ డాడీ తాలూకు వస్తువును భద్రంగా తెచ్చి నాకు యిచ్చారు. ఇది డాడీ నాకు పంపిన అమూల్యమైన కానుక. యిది నా సంతోషం కోసం యిస్తున్నాను. ప్లీజ్ టేకిట్!" అంటూ చెక్‌ని జోసఫ్ చేతికిచ్చి పంపించింది వెన్నెల.

* * * * *

మెహిదీపట్నం దగ్గర వుంది సరోజినీదేవి ఐ హాస్పిటల్. ఆ హాస్పిటల్ రోడ్‌లో ఎడంవైపు వుంది తీస్రీ మంజిల్ కాంప్లెక్స్ ఒకటి. ఆ కాంప్లెక్స్

మూడో అంతస్థులో పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేయబడిన ఆఫీస్ ఒకటి వుంది. అది రావ్ లీగల్ సర్వీసెస్‌కు చెందిన ఆఫీస్. దీన్ని సింపుల్‌గా ఆర్.ఎల్.యస్. ఆఫీస్ అంటారు.

ఈ ఆర్.ఎల్.యస్.తో ముగ్గురు పార్టనర్స్ వున్నారు.

వాళ్ళలో ముఖ్యుడు లాయర్ ధర్మారావు.

ఆయన పేరు మీదనే ఈ ఆఫీస్ నడుస్తోంది.

ధర్మారావు హయత్‌నగర్ ప్రాంతంవాడు. ఆయన తండ్రి హనుమంతరావుకి అక్కడ అనేక ఎకరాల పంటభూములు ఉండేవి.

మొదటినుండి వ్యవసాయాన్ని నమ్ముకున్న కుటుంబం వాళ్ళది. మిగిలిన కుటుంబ సభ్యులంతా వ్యవసాయంలో కష్టపడుతున్నా తన కొడుకు ధర్మారావుని మాత్రం ఆయన లా చదివించగలిగాడు.

లాయర్ ధర్మారావుకి టైగర్ యుగంధర్ పరిచయంతో దశ తిరిగింది. అప్పట్నుంచి యుగంధర్ ఫ్యామిలీ లాయర్ ఆయనే. ఆయన్ని లాయర్‌గా గాకుండా తన ఫ్రెండ్‌గా, ఫ్యామలీ మెంబర్‌గా ట్రీట్ చేసేవాడు యుగంధర్. ఆ విశ్వాసం ధర్మారావు గుండెల్లో నిండుగా వుంది.

మరో విషయం ఏమంటే, హైదరాబాద్‌ను చుట్టి నిర్మించ తలపెట్టిన అవుటరన రింగ్‌రోడ్ పుణ్యమా అని అక్కడి భూముల విలువ ఎకరాకు కోటికిపైగా పెరిగింది. దాంతో అక్కడి భూములు అమ్మేసాడు ధర్మారావు. ఆయన పిల్లలు సంతోషించారు. అవుటర్‌రింగ్‌రోడ్డు అక్కడి రైతుల జీవనవిధానాన్నే మార్చేసిన సంగతి తెలిసిందే. ఒకప్పుడు పాలకూర కట్టల స్థానంలో యిప్పుడు నోట్లకట్టలు, టైగర్ యుగంధర్ ఆకస్మిక మరణానికి లాయర్ ధర్మారావు కూడా ఎంతో బాధపడ్డాడు.

ఇక్కడో ముఖ్య విషయం ఏమంటే, అన్నాచెల్లెళ్ళయిన శరత్‌చంద్ర, వెన్నెలలు గాని శరత్‌చంద్ర భార్య విజృంభనగాని మిడాస్ గ్రూప్‌లో సెంకడ్ ప్లేస్‌లో వున్న రవీందర్‌గాని ఎవరూ కూడా వూహించని రహస్యం ఒకటి లాయర్ ధర్మారావు దగ్గర వుంది.

వాళ్ళంతా కూడా యుగంధర్ సడెన్‌గా పోవటంచేత ఆస్థిపాస్థుల విషయంలో ఏ విధమైన వీలునామా వ్రాసి వుండకపోవచ్చు అనుకున్నారు.

సంతాపదినాలు, పెదకర్మ అన్నీ అయిపోయేవరకు ఈ విషయాన్ని ధర్మారావు కూడా గోప్యంగానే వుంచాడు. అంతా అయిపోయిన తర్వాత అంటే సుమారు పక్షం రోజుల తర్వాత ధర్మారావు అటు వెన్నెలకి, ఇటు శరత్‌చంద్రకు యిద్దరికీ ఫోన్లుచేసి తమ ఆఫీసుకు పిలిపించుకున్నాడు.

అంతా ధర్మారావు పర్సనల్‌రూంలో సమావేశమయ్యారు. వెన్నెల ప్రశాంతంగా వుంది. ఆమెలో ఎలాంటి ఫీలింగ్సూ లేవు. లాయరు పిలవటాన్నిబట్టి బహుశ వీలునామా రాసి వుండొచ్చని వూహించింది. అందులో తనకేమీ ఉండకపోవచ్చని కూడా అనుకుంది.

కాని శరత్‌చంద్రలో టెన్షన్ కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

ఇంతవరకూ వీలునామా ఆలోచనే రాలేదు అతడికి. అంతా తనదే అనే భ్రమలో వున్నాడు. ఇప్పుడు డౌటు వచ్చింది. అదే నిజమైతే వెన్నెలకి, తనకు సగం సగం యిచ్చాడా... అసలు ఏం జరిగింది? ఆత్రంగా తెలుసుకోవాలని చూస్తున్నాడు.

“వెల్! పిలవగానే నామీద గౌరవంతో మీ యిద్దరూ వచ్చి ఇలా నా ముందు కూచున్నందుకు చాలా సంతోషంగా వుంది. ఆయన మహావ్యక్తి. ఆయనలేని లోటు తీర్చలేనిది. నేనే పెద్ద దిక్కు పోగొట్టుకున్నట్టు ఫీలవుతున్నాను. మీరు ఎంత బాధపడుతున్నారో వూహించుకోగలను. కాని ఏదయినా మన చేతుల్లో లేదు పైవాడి దయ.

యుగంధర్ దూరదృష్టిగల మనిషి. భవిష్యత్తును ఆయన ముందే వూహించారో ఏమిటో తెలీదుగాని, సంవత్సరం క్రితమే ఆయన వీలునామా వ్రాసిపెట్టారు. ఆ విషయం మీకెవరికీ తెలియదు. తను పోయాక ఆస్థుల గురించి ఎవరూ మనస్థాపం చెందకూడదని, గొడవలు పడకూడదని ముందు చూపుతో చాలా జాగ్రత్తలు తీసుకున్నారాయన.

మీకు తెలుసు. మీ డాడీ కంపెనీలకు చరాస్థిరాస్థులకు మా రావ్‌లీగల్ సర్వీసెస్ చాలాకాలంగా లీగర్ కన్సల్‌టెంట్‌గా వుంది. ఇక నేను మీ నాన్నగారి

పర్సనల్ అటార్నీని. ఆ విషయం మీకు తెలుసు. మీ నాన్నగారి విల్లు విషయంలో ఒక లాయర్‌గానేగాక, మీ ఫ్యామిలీకి సన్నిహితుడిగా, ఒక పెద్దమనిషిగా మీకు సవివరంగా చెప్పాలని పర్సనల్‌గా ఈ సమావేశం ఏర్పాటు చేసాను" అన్నాడు ప్రస్థావనకు నాందిగా ధర్మారావు.

"యస్ యస్... ఐనో... ఇది చాలా ప్రయివేట్ సమావేశం అని మీరు చెప్పటంవల్లనే నేను మా లాయర్‌ని తీసుకురాలేదు...." అన్నాడు వెంటనే శరత్‌చంద్ర.

ఆ మాటకు అతడ్ని ఓ చిన్నపిల్లాడ్ని చూసినట్టు చూసి, సింపుల్‌గా నవ్వి వూరుకున్నాడు ధర్మారావు.

వెన్నెల మాత్రం అన్యమనస్కంగా మౌనంగా కూర్చుంది. లాయరు ధర్మారావుపట్ల ఆమెకు ఎప్పుడూ గౌరవం వుంది. తండ్రి మరణాన్ని ఆమె ఇంకా జీర్ణించుకోలేకపోతోంది.

వృద్ధాప్యంలో సహజ మరణంవేరు. కాని యిలా ప్లేన్ క్రాష్‌లో బలవన్మరణం పాలవటం ఆమెను బాగా కలచివేసింది. డెత్ కాంకర్స్ ఆల్... ఎంత నిజం.

ఆయన తనని ఎంతో ప్రేమించాడు. ఆ విషయం తెలిసి కూడా ఈ నాలుగేళ్ళలోనూ ఒక్కసారి కూడ ఆయన ముందుకెళ్ళి ఎలా వున్నారు డాడీ? అని పలకరించలేకపోయింది.

ఆ విషయమే ఆమెను వేదనకు గురిచేస్తోంది. విల్లుమీద ఆమెకు ఆశలేమీ లేవుగాని ఆసక్తి వుంది.

ఆమెను బాధపెడుతున్న మరో విషయం కూడా వుంది.

అది అన్న శరత్‌చంద్ర ప్రవర్తన.

అతడిలో ముందులేని అహంకారం స్పష్టంగా కనపడుతోంది.

డాడీ అంత్యక్రియల విషయంలో అన్నిటా తనే ముందుండి జరిపించాడు. ఏ విషయంలోనూ తనను సంప్రదించలేదు. కొడుగ్గా అది అతడి బాధ్యత కాదనలేదు. కాని కష్టసమయంలో కూడా చెల్లెలిగా తనను

అతడు ఓదార్చే ప్రయత్నంగాని, మంచిచెడు సంప్రదించాలనిగాని ఏమీ చేయలేదు. పరామర్శించటానికి వచ్చిన పదిమందిలో తనను ఒక మనిషిగా చూశాడంతే. వదిన విజృంభన అయితే మరీనూ.

ఇక మీడియా కూడా వాళ్ళిద్దర్నే కవర్ చేసిందిగాని, తనను పట్టించుకోలేదు. తను మాత్రమే యుగంధర్‌కి వారసుడైనట్టుగా ప్రవర్తించాడు. వాళ్ళు తనను శత్రువుని చూసినట్టు చూడటం వెన్నెలని మానసిక వేదనకు గురిచేసింది.

ఎవరి ఆలోచనల్లో వారున్న అన్నా చెల్లెళ్ళిద్దరూ లాయర్ ధర్మారావు పొడిగా దగ్గటంతో ఆలోచనల నుంచి బయటపడి ఆయన వంక చూసారు.

"మీ డాడీ ఆస్థి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయన భార్యలు నలుగురి విషయంలో ఎవరికెంతో ముందే యిచ్చేశాడు గాబట్టి వారెవరికీ ఆస్థిమీద క్లెయిమ్‌చేసే హక్కులేదు. పోతే ట్రస్ట్‌లు, విదేశాల్లో ఆస్థులు కంపెనీలు అన్నీ కలిపి సుమారుగా లక్షకోట్ల రూపాయల పైగానే ఆస్థి వుంటుందని ఒక అంచనా...."

"అంతేనా– ఇంకా ఎక్కువగా వుంటుందనుకున్నాను" ఆయన మాటలకు అడ్డోస్తూ తన అసంతృప్తిని ప్రకటించాడు శరత్‌చంద్ర.

చెప్పటం ఆపి కొద్దిగా మంచినీళ్ళు తాగాడాయన.

'ఇంకా ఏంచెప్పి నాచేత మంచినీళ్ళు తాగిస్తాడో' అనుకున్నాడు మనసులో శరత్‌చంద్ర.

ధర్మారావు శాంతంగా తన మాటల్ని కంటిన్యూ చేసాడు.

"మీ డాడీ చాలా ఆలోచించి పకడ్బందీగా వ్రాయించిన వీలునామా యిది. నాలుగో భార్య షిబాకు ఉదారంగా కొంత డబ్బు కేటాయించారు. ఆఫ్‌కోర్స్. కోర్టుకెళ్ళి ఆమె తన పేరుకు మచ్చ తేకూడదనే అలాచేసి వుండొచ్చు. ఒక విషయం మీరు గుర్తు చేసుకోవాలి. ఈ విల్లు విషయంలో ఎవరయినా అసంతృప్తి చెంది, తమకు సరయిన వాటా దక్కలేదని కోర్టుకెళితే, విల్లు ప్రకారం రావలసిన ఆస్థి కూడా రాదు. ఈ క్లాజును చాలా క్లియర్‌గా రాయించారాయన" కాస్సేపు చెప్పటం ఆపారాయన.

శరత్‌చంద్ర ముఖంలో అప్రసన్నత కొట్టొచ్చినట్టు కనబడుతోంది. వెన్నెల మౌన ముద్రలోనే వుంది. తిరిగి తన మాటల్ని కంటిన్యూ చేసాడు ధర్మారావు.

"మీ డాడీ బ్రతికినన్నాళ్ళు టైగర్ లాగే బ్రతికారు. ఆయన సంపాదనా అలాగే సంపాదించారు. దాన ధర్మాలు కూడా అలాగే చేసారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో యూనివర్శిటీలలో చదువుకొనే బీద విద్యార్థులకోసం స్కాలర్‌షిప్పుల రూపంలో అందించటానికి ఒక ట్రస్టును ఏర్పరచి కొన్ని కోట్లు దానం చేసారు.

పలు ఎన్.జి.వో సంస్థలకు, మ్యూజియమ్స్‌కు, ఆర్ఫ్ స్టూడెంట్స్‌కు ఆర్థికసాయం చేయటమే కాదు, మీ దగ్గర పనిచేస్తున్న పనిమనుషులకు, కారు డ్రయివర్లకు కూడా డబ్బు ఎంత ముట్టచెప్పాలో స్పష్టంగా రాసారు.

ఆయన మాటలకు అడ్డొస్తూ-

చిన్నగా నవ్వాడు శరత్‌చంద్ర.

"ఎంతయినా ఆయన టైగర్ గదా సార్. తనను నమ్ముకున్నవారిని బాగానే చూసుకున్నారు. రేపు ఈ విల్లు అమల్లోకి వచ్చాక ఎంతమంది యిళ్ళలో ఆయన ఫోటోకి దండ వేలాడుతుందో... ఎంతగా పూజిస్తారో- తన ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లను తమ కంపెనీ ఉద్యోగస్థులకు యిచ్చినట్టే తన కారు డ్రయివర్‌కూ ఇచ్చారట నారాయణ మూర్తిగారు. అంటే ఆయన కారు డ్రయివర్ కోటేశ్వరుడే. ఆయనమీద అభిమానంతో ఆ డ్రయివరు ఇంకా ఆయనకు డ్రయివరుగానే పనిచేస్తున్నాట్ట. ఆయన దాన గుణానికి ఆయన పిల్లలు ఎలా ఫీలయ్యారో నాకు తెలీదుగాని, నాకు మాత్రం నచ్చలేదు" అన్నాడు.

"మీకు నచ్చినా, నచ్చకపోయినా ఇది మీ డాడీ వీలునామా సారాంశం. మీరు వినాలి. ఎందుకంటే, మిగిలిన ఆయన వికర ఆస్తులన్నిటిని ఆయన ఒక ట్రస్ట్‌గా ఏర్పాటు చేసారు" అన్నాడు ధర్మారావు.

శరత్‌చంద్ర అసహనంగా సీట్లో కదిలాడు.

"ఇదన్యాయం. కొడుకును నేను వున్నాగదా. ఆస్థిని ట్రస్ట్‌లో పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది?" అనడిగాడు. తనకున్న బంగారుకలలు ఏవో కొద్దికొద్దిగా కరిగిపోతున్న ఫీలింగ్ ఏర్పడుతోంది అతడికి.

"మీ డాడీ ఏ నిర్ణయం తీసుకున్నా దానివెనుక ఓ కారణం ఉంటుంది. బహుశ టాక్స్ ఇతర సమస్యలనుంచి సత్వర పరిష్కారాల నాశించి ఇలా ట్రస్ట్ ఏర్పరిచి వుండొచ్చు. మీకు తెలుసో లేదో ఆయన ఆస్థుల్లో సగభాగం ఇప్పటికే ట్రస్ట్‌లో వుంది ఆయన స్టాక్‌హోల్డింగ్స్‌తో సహా.

ధర్మారావు మాటలు వింటూనే "ఓ షిట్!" అంటూ నుదురు రుద్దుకున్నాడు శరత్‌చంద్ర.

అతని ఫీలింగ్స్‌ని పట్టించుకోకుండా తన మాటల్ని కంటిన్యూ చేసాడు ధర్మారావు.

"ట్రస్ట్ బోర్డ్‌లో ముగ్గురు సభ్యులున్నారు. వారిలో ముఖ్యుడ్ని నేను...."

"డామిట్... ఆస్థి నాకు చెందకుండా ఇదంతా ఏదో కుట్రలా వుంది. ఇకనుంచి యు ఆర్ మై బాస్! అంతేగా?" ఇక అపుకోలేక కోపాన్ని వెళ్ళగక్కాడు శరత్‌చంద్ర.

"యు ఆర్ అబ్సల్యూట్లీ రాంగ్ మిస్టర్ శరత్‌చంద్ర. ఇక్కడ ఎవరు ఎవరికీ బాస్‌కారు. నేనుగాని ట్రస్ట్‌బోర్డులోని మిగిలిన యిద్దరుగాని కేవలం మేం పర్యవేక్షకులం మాత్రమే. అంతా సవ్యంగా జరిగేలా చూడ్డం మా బాధ్యత...." సీరియస్‌గానే బదులిచ్చాడు ధర్మారావు.

"ఒకె... ఇంకా ఏముందో చెప్పండి" కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ అడిగాడు శరత్‌చంద్ర.

అంతా చూస్తున్న వెన్నెల కళ్ళలో ఆశ్చర్యం తొంగిచూస్తోంది. తన తండ్రికీ, తన అన్నకీ రూపంలోనే కాదు. గుణంలో కూడా ఎక్కడా పోలికలు కన్పించటంలేదు. ఎంతటి విషమ సమస్యనయినా చిరునవ్వుతో ఎదుర్కోవటం, కూల్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవటం ఆయన అలవాటు, కానీ శరత్‌చంద్ర అలాకాదు. స్వార్థం, దుడుకుతనం, ఆత్రం ఇవి ఎప్పుడూ ప్రతిఫలిస్తాయి. తొందరపాటు కూడా ఎక్కువే. తన తండ్రి

గుణాలు తనకు వచ్చాయి. తన తల్లి స్వభావం, యాంగ్జయిటీ, న్యూరోసిస్ శరత్‌చంద్రకి వచ్చింది.

"ట్రస్ట్‌లో వుంచిన ఆస్థులమీద ఆదాయం మీ యిద్దరికీ సమంగా వర్తిస్తుంది" చెప్పాడు ధర్మారావు.

ఆ మాట వింటూనే తేలుకుట్టినట్టు "వ్వాట్?" అనరిచాడు శరత్‌చంద్ర.

"అర్థంకాలేదా? మీ డాడీ ఆస్థులమీద వచ్చే ఆదాయం ఆయన బిడ్డలుగా మీ యిద్దరికీ చెరిసగం అందుతుంది. అయితే కొన్ని వ్యత్యాసాలు కూడా వున్నాయి. ముఖ్యంగా స్టాక్ మొత్తం ట్రస్ట్‌లో వుంచబడినా, స్టాక్స్ విషయంలో ఫుల్ కంట్రోల్‌తో బాటు ఓటింగ్ సౌకర్యం వెన్నెలకి మాత్రమే చెందేలా విల్లులో రాశారు" అంటూ అసలు సంగతి బయటపెట్టారాయన.

ఆ మాట వింటూనే శరత్‌చంద్ర ముఖం పాలిపోయింది.

వెన్నెలకి అయితే షాక్‌తో మాట పెగల్లేదు.

ఆమె వూహించని మలుపు యిది.

తండ్రినుంచి తనకి ఒక్కరూపాయి కూడా దక్కదని అనుకుంది ఆమె. అక్కడికి వచ్చేముందు కూడా తనకేదో ఇచ్చివుంటాడన్న ఆశతో రాలేదు. కాని ఆయన తన లాబ్‌ట్యాప్‌ని తనకే ఎందుకు పంపించాడో ఇప్పుడిప్పుడే అర్థమవుతోందామెకు.

ఇది కలో నిజమో కూడా అర్థంకావటంలేదు. కళ్ళముందు తండ్రి యుగంధర్ రూపం మెదులుతోంది. ఎదురుగా కూర్చుని పిచ్చితల్లీ! నువ్వు ఎప్పుడూ నన్ను చూడ్డానికి రాకపోయినా తండ్రిగా నా బాధ్యత నీకే వప్పగించిపోతున్నాను చూశావా?" అంటూ పరిహసిస్తున్నట్టు తోస్తోంది. పొంగుతున్న కన్నీటిని కర్చీఫ్‌తో తుడుచుకుంది.

తను ఆశించినట్టుగా విల్లు లేదనేసంగతి అర్థంగావటంతో ఇక తట్టుకోలేక ఓపెన్ అయిపోయాడు శరత్‌చంద్ర.

"నమ్మలేకపోతున్నాను. ఏదో గోల్‌మాల్ జరిగింది. ఆ ముసలాడికి, వెన్నెలకి పడదు. ఒక్కరూపాయి కూడా వెన్నెలకి యివ్వని మొండితనం

ఆయనది. అలాంటిది కంపెనీ అధికారాలు ఆమెకిచ్చారంటే నమ్మటం ఎలా?" అనడిగాడు కోపంగా.

"శరత్! ఖంగారెందుకు? ఆస్థి, ఆదాయం మీ యిద్దరికీ సమంగానే పంచారాయన. ఇకముందు లాభాలు కూడా అలాగే పంచుకుంటారు గదా?" కూల్‌గా అడిగాడు ధర్మారావు.

"నా బాధ డబ్బు గురించో, ఆస్థి గురించో కాదు. ఎంత తిన్నా తరగని ఆస్థి. వెన్నెలకి, నాకు సమంగా పంచినందుక్కూడా నాకు బాధలేదు. నా బాధంతా పవర్ గురించి. కంపెనీలమీద ఆధిపత్యం గురించి. మిడాన్ గ్రూప్‌కి రాజును కావలసినవాడ్ని. కానీ జరిగిందేమిటి? ఇంతకాలం వెంటవుండి డాడీతో చివాట్లు తిన్నందుకు ఇదా ఫలితం?" ఆవేశంగా అడిగాడు.

తండ్రి మరణం ఎంత షాక్ యిచ్చిందో అంతకన్నా ఎక్కువే షాకిచ్చింది వెన్నెలకి. యిక శరత్‌చంద్రకయితే డబుల్ షాక్. యిద్దరి వూహకీ అందని విధంగా వుందా వీలునామా. ఆవేశపడుతున్న ఆ కుర్రాడ్ని ఎలా సముదాయించాలో ధర్మారావుకి అర్థంకాలేదు. తిరిగి తనే గొంతు పెంచి చెప్పాడు శరత్.

"ఈ విషయం నేను సహించను. మా లాయర్లు చూసుకుంటారు. కోర్టులో కేసు వేస్తాను."

"వేసి?... నెగ్గగలవనుకుంటున్నావా?" సూటిగా అడిగాడు ధర్మారావు.

"మీ యిద్దరిలో ఎవరు ఈ వీలునామాను సవాల్‌చేస్తూ కోర్టుకెళ్ళినా మీ వాటా కోల్పోవలసి వుంటుంది. మీ డాడీ తన భార్యల విషయంలో కూడా యిదే క్లాజ్‌ను స్పష్టంగా మెన్షన్ చేశారు. కోర్టుకెళితే రూపాయి కూడా రాదు."

"కేసు నేను గెలిస్తే?"

"గెలిచే ఛాన్సేలేదు. బట్! నీవే గెలిచావనుకుందాం. ఏమవుతుంది? పాపం! అర్హులయిన బీద విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది... దాని వల్ల నీకొచ్చే ఆదాయంలో ఏమీ మార్పు వుండదు. అధికార పగ్గాలు నీ చేతికి రావు. కానీ ఓడిపోతే నీ ఆస్థి, ఆదాయం రెండూ వెన్నెలకి వెళ్ళి

పోతాయి. నువ్వు పూర్తిగా జీరో అయిపోతావు. అలాంటి పిచ్చిపని చేయవనే అనుకుంటాను."

"ఆ పెద్దమనిషి నాకింత అన్యాయం చేస్తాడనుకోలేదు. నిజంగానే కొంప ముంచాడు. ఇంకా నయం! నా వాటాకూడా పెళ్ళాలకీ, ఉంపుడు గత్తెలకి రాయలేదు."

"శరత్! అది ఆయన పర్సనల్ ఇష్యూ. స్టిల్ నీకూ, వెన్నెలకీ మీ యిద్దరికేగదా సింహభాగం పంచారు?"

"సింహం... యస్... వెన్నెల ఆడ సింహం... అడవికి రారాజుగా వుండాల్సింది మగ సింహం. ఆడ సింహం కాదు. ఈ విల్లు ప్రకారం యిప్పుడు మిడాస్ గ్రూప్‌కి రారాణి. నా దగ్గర డబ్బుతో ఏదైనా కొనగలను ఒక్క రెస్పెక్ట్ తప్ప...." అంటూ ఎర్రబడ్డ కళ్ళతో వెన్నెల వంక చూస్తూ– "నీవల్లే... ఇదంతా నీవల్లనే జరిగింది. నా ఆశలన్నీ అడియాశలయ్యాయి. డాడీకి దూరమయ్యావనుకున్నాను. దూరంగా వుండి ఏం మాయజేశావోగాని ఖచ్చితంగా నాకు మాత్రం అన్యాయమే జరిగింది" అన్నాడు ఆవేశంగా.

పరిస్థితి వేడెక్కుతోందని గ్రహించిన వెంటనే కల్పించుకున్నాడు ధర్మారావు.

"శరత్ ప్లీజ్! డోన్ట్ లూజ్ యువర్ టెంపర్... ఆమె నీ సొంత చెల్లెలు. ఆ విషయం మర్చిపోకు" అన్నాడు.

"చెల్లెలు కాదు. శత్రువు. యిల్లు అలగ్గానే పండుగ కాదు వెన్నెల. నీ పప్పులు అంత తేలిగ్గా ఉడకనివ్వను. నీకంత ప్రెషర్ కల్పిస్తాను. ఆ ముసలాడు విల్లుతో బాణం నా గుండెకేసి వదిలాడు. ఐమీన్ నాటే విల్... విల్లు" అనరిచాడు. కోపం మనిషిని కంట్రోల్ తప్పేలా చేస్తుంది. శరత్ చంద్ర నోరుజారటంతో యిక మౌనం వహించలేకపోయింది వెన్నెల.

"శరత్! డాడీకి మర్యాద యివ్వటం నేర్చుకో. పోయినవాళ్ళ గురించి సభ్యత లేకుండా మాట్లాడ్డం మంచిదికాదు. నా సమర్థతమీద నమ్మకంతో డాడీ కంపెనీ బాధ్యత నామీద వుంచారు. నువ్వు నాతో వార్ డిక్లేర్ చేయాలనుకుంటే అయాం రెడీ. బట్! తొందరపడుతున్నావేమో ప్రశాంతంగా ఆలోచించు" అంది.

"అవును. అయాచితంగా అధికారం హస్తగతం చేసుకోబోతున్నావ్. ఏమైనా అంటావ్! చూస్తుండు. హెచ్.ఎస్.క్లబ్‌కి డాడీకి వారసుడ్ని నేనే. గుర్తుంచుకో. అవసరమైతే ప్రభుత్వాల్నే మార్చేసే పవర్ హెచ్.ఎస్.క్లబ్‌కుంది. నీకు ప్రశాంతత లేకుండా చేస్తాను. చచ్చి ఏ లోకాన వున్నా డాడీకి నరకం చూపిస్తాను" హెచ్చరించాడు.

"నీ కోపాన్ని చూపించి ప్రయోజనం లేదు శరత్! జస్ట్ టుడే ఈజ్ నాట్ యువర్ డే. తన కోపమే తనకు బి.పి... అనవసరంగా బి.పి. పెంచుకోవద్దు" సలహా యిచ్చాడు ధర్మారావు.

"బి.పి. ఏమిటి సార్! మీరు చెప్పేది వింటుంటే ఏమైనా రావచ్చునిపిస్తోంది ఈ విషయంలో..."

"విజన్... జస్ట్ విజన్. ఈ విషయంలో నువ్వో నేనో ఎవరూ చేయగలిగింది ఏంలేదు. అంతా మీ డాడీ అభీష్ట ప్రకారం రూపొందించబడిన వీలునామా యిది. అండర్‌స్టాండ్? హెచ్.ఎస్. క్లబ్ విషయంలో నువ్వు ఆశపెట్టుకోనవసరంలేదు. తన వారసుడిగా నిన్ను ఎన్నుకోవద్దని సూచనప్రాయంగా సభ్యులకు ముందే చెప్పారు. పైగా ఆ విషయం క్లియర్‌గా నిర్దేశించారు. ఒక తండ్రిగా నీకు రావలసిన ఆస్థి పంచియిచ్చాడాయన. కానీ నువ్వు తనకు సరితూగే వ్యక్తివి కాదని ఆయన నమ్మకం. సమర్థత విషయంలో ఆయన తరతమ భేదాలు చూడరు."

శరత్‌చంద్రకి కాసేపు నిలువుగుడ్లు పడ్డాయి.

హార్ట్ అటాక్ వస్తుందేమోనని భయపడ్డాడు.

ఛాతీలో ఎడంపక్క చిన్నగా నొప్పి ఆరంభమైంది.

"ఇది మరీ దారుణం. డాడీ తర్వాత ఆ స్థానం నాకే రావాలి. నన్ను కాదని ఆయన ఎవర్ని సూచించారు?" అసహనంగా అడిగాడు.

వరసగా షాకింగ్ వార్తలకు అతడు తట్టుకోలేకపోతున్నాడని గ్రహించి కాసేపు మౌనం వహించారు ధర్మారావు. వెన్నెల నమ్మలేనట్టు చూస్తోంది. హెచ్.ఎస్.క్లబ్ విషయంలో ఈ లిటిగేషనేమిటో ఆమెకూ అర్థంకాలేదు.

తన అన్నకు హెచ్.ఎస్. క్లబ్‌లో తన తండ్రిస్థానం వారసత్వంగా వచ్చితీరాలి. కాని అలాగే వద్దంటున్నాడంటే వారసుడిగా ఎవర్ని సూచిస్తున్నట్లు?

తన తండ్రికి తామిద్దరమే సంతానం. ఈ కొత్త మెలిక ఏమిటి? ఎవర్ని సూచిస్తున్నట్లు?... వెన్నెల కూడా తీవ్రంగా ఆలోచిస్తోంది. శరత్‌చంద్ర కోపంతో మండిపోతున్నాడు.

"మా డాడీ నాలుగు పెళ్ళిళ్ళుచేసుకున్న పెద్దమనిషి. కాని వారసత్వానికి పనికొచ్చే పిల్లలం మేమిద్దరమే. అసలే డి యన్ ఎ కాలంగదా. మాకు తెలీకుండా ఆయన ఉంపుడుగత్తెకు ఎవరన్నా పిల్లలున్నారేమో దాపరికం అనవసరం. ఆయన నామినేట్ చేసిన వ్యక్తి ఎవరో కూడ చెప్పేయండి" అనడిగాడు సీట్లోంచిలేస్తూ.

"శరత్. టెన్షన్‌వల్ల మనిషిలో అటెన్షన్ తగ్గుతుంది కూర్చో. జీవితం అంటే అప్ అండ్ డౌన్స్ తప్పవు. వాస్తవాల్ని నువ్వు గ్రహించాలి. తప్పదు.

నువ్వు అనుకుంటున్నట్లు మీ డాడీకి అక్రమ సంతానం ఎవరూ లేరు. ఆయన నామినేట్ చేసింది ఎవరినో కాదు... వెన్నెలని" ప్రశాంతంగా అసలు విషయం బయటపెట్టాడాయన.

షాక్ మీద షాక్.

శరత్‌చంద్ర నుదుటిమీద ఒక నరం ఉబ్బటం గమనించాడు లాయర్ ధర్మారావు. అది ఏంగ్జయిటీకి పరాకాష్ట.

"మీరు జోక్ చేస్తున్నారా? సరదాగా అబద్దాలు చెపుతున్నారనిపిస్తోంది. వాటీజ్‌దిస్. నన్ను ఎందుకు యిలా ఫూల్‌ని చేస్తున్నారు? వెన్నెలకి హెచ్.ఎస్ క్లబ్‌లో స్థానమా? నెవ్వర్. మహిళలు అన్నిరంగాలలోనూ టాప్ పొజిషన్స్‌లో వున్నారు.

కాని హెచ్.ఎస్. క్లబ్‌లో ఇంతవరకూ సభ్యత్వం పొందిన ఒక్క మహిళను చూపండి చూద్దాం. నెహ్రూకి కొడుకులు లేరు గాబట్టి ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయింది. కాని ఇక్కడ అలా కాదు. హెచ్.ఎస్ క్లబ్‌లో లేడీస్‌కి నో ఎంట్రీ...." అరిచాడు.

"కావచ్చు. కాని మీ డాడీ నామినేట్ చేసిన పర్సన్ వెన్నెల. ఆమెకు సభ్యత్వం యివ్వటం, యివ్వకపోవటం క్లబ్ వాళ్ళిష్టం. సో... మీకు విల్లు జెరాక్స్ పత్రాలను చెరోసెట్టు యిస్తాను. చదివిచూస్తే మీకే అర్థమవుతుంది.

ఒరిజినల్ డాక్యుమెంట్లను కోర్టులో ఫైల్ చేశాను" అంటూ టేబుల్ సొరుగులోంచి రెండు కవర్లను తీసి వెన్నెలకి ఒకటి, శరత్‌చంద్రకి ఒకటి యిచ్చాడు ధర్మారావు.

విసురుగా లేచి ఏదో మాట్లాడాలనుకున్నాడు శరత్‌చంద్ర. కాని అదుపుతప్పిన కోపంతో మాటలు పెగల్లేదు. డాక్యుమెంట్ జెరాక్స్ పత్రాలున్న కవర్‌తో స్ప్రింగ్ డోర్‌ని బలంగా తోసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

కాని వెన్నెల కాస్సేపు అలాగే కూర్చుంది.

"అన్నయ్య ఎమోషనల్ పర్సన్. ఆ విషయం మీకు తెలుసు, అతని తరపున నేను సారీ చెపుతున్నాను. ప్లీజ్" అంది చిన్నగా.

"ఐనోదట్. ఇట్సాల్‌రైట్. డోట్‌వర్రీ" అన్నాడు నవ్వుతూ ధర్మారావు.

"అంకుల్! డాడీ నా మీద చాలా పెద్ద బాధ్యత ఉంచారనిపిస్తోంది. అందుకు నేను సమర్థురాలినని మీరు నమ్ముతున్నారా?"

"నా నమ్మకం ముఖ్యం కాదు. మీ డాడీ నమ్మారు. ఆయన అంచనా తిరుగులేనిది. నీకో సంగతి తెలుసా? స్వతంత్రంగా నువ్వు ఎదిగిన తీరు, నీ విజయాలను గురించి చెప్పి నువ్వు తన కూతురుగా ఎంత గర్వపడేవారో నీకు తెలీదు. నువ్వు తన ప్రతిబింబంగా భావించేవారు ఆయన. నీ టాపిక్ మా మధ్యలో వచ్చిందంటే ఆయన ఎంత పొగిడేవారో చెప్పలేను."

ఆయన మాటలు వింటున్న వెన్నెలకి–

మరోమారు కళ్ళు నీటికొలనులయ్యాయి.

"కాని ఇంత బాధ్యతలు ఎలా నెగ్గుకురాగలనో అర్థంగావటంలేదు అంకుల్. పైగా నా సొంత వ్యాపారాలు నాకున్నాయి" అంది చిన్నగా.

ఆ మాటలకి తమాషాగా నవ్వాడు ధర్మారావు.

ఎదుటి మనిషిని మాటలతో హిప్నటైజ్ చేయటం ఆయన ప్రత్యేకత. అసలు ఆయన హిప్నోటిస్ట్ కావలసినవాడు. లాయర్ ఎలా అయ్యాడో

అర్థంకాదు అంటూ బార్ అసోసియేషన్‌లో ఆయన గురించి జోక్ చేస్తుంటారు.

"వెన్నెలా... ఏదో వంకపెట్టి ఈ బాధ్యతనుంచి తప్పించుకుంటే ఎలా వుంటుందని కదూ ఆలోచిస్తున్నావ్. నీకు ఛాన్స్‌లేదు. తప్పించుకోలేవు. నువ్వు గనుక మిడాన్ గ్రూప్‌కి సారధ్యం వహిస్తూ పగ్గాలు అందుకోపోతే ఏం జరుగుతుందో తెలుసా!

నీ వాటా ఆస్థి నీకు దక్కకుండా పోతుంది. నీ స్టార్‌హోల్డింగ్స్‌తోపాటు ఇతరులనీ చేజారిపోతాయి. సో... నీకు వేరే ప్రత్యామ్నాయం కూడా లేదు. మీ డాడీ స్థానం ఆయన కంపెనీల్లోనే కాదు. హెచ్.ఎస్. క్లబ్‌లో కూడా నీకోసం రిజర్వ్ చేయబడింది.

నీకు ఇష్టం వున్నా, లేకున్నా తప్పదు. తప్పించుకోలేవు. చిన్న వయసులో నీకీ బర్డెన్ పెద్దదే. కాని తప్పదిక" అన్నాడు.

"కంపెనీ సంగతి అలా వుంచండి అంకుల్. హెచ్.ఎస్. క్లబ్‌లోకి నాకు ప్రవేశం సాధ్యం కాదనుకుంటా... ఎందుకంటే..."

"సాధకబాధకాలు ఆలోచించకుండానే మీ డాడీ ఈ నిర్ణయం తీసుకున్నారను కుంటున్నావా? ఆయన జీనియస్. భవిష్యత్తును చూడగల వ్యక్తి. ఇవి పూర్వం రోజులుకావు. విజయం నిన్నే వరిస్తుంది.

"కనీసం హెచ్.ఎస్.క్లబ్‌కయినా అన్నకు ఛాన్స్ వదిలేస్తే బాగుంటుందను కుంటాను. వారసుడుగా వాడికీ ఆశలుంటాయిగదా...."

"సారీ... కొన్నిటికి వారసత్వంకన్నా నాయకత్వ లక్షణాలుముఖ్యం. అవి శరత్‌లోకన్నా నీలోనే ఎక్కువవున్నాయి. మీ డాడీ ఈ ఆస్థిమాత్రమే నీకు ఇవ్వలేదు. ఎంతోమంది జీవితాల్ని కంపెనీల భవిష్యత్తును, నీ చేతుల్లో వుంచారు. టాలెంట్ ఎక్కడ వున్నా పసిగట్టి వెదికిపట్టుకుని తన దగ్గర జాబ్ ఇచ్చేవారు యుగంధర్.

నీ టాలెంట్‌ని గుర్తించాకే ఆయన తీసుకున్న నిర్ణయం ఇది. ఆ నిర్ణయాన్ని నువ్వు శిరసావహించాలి. మంచి పేరు తేవాలి. బెస్టాఫ్‌లక్" అంటూ సీట్లోంచి లేచాడు ధర్మారావు.

ఫార్మాలిటీగా ఆమె వెంట కారు వరకు వచ్చి సాగనంపాడు ధర్మారావు. కారు మూవ్ అవుతుండగా అనుకుంది వెన్నెల.

"ఇది సంతోషించాల్సిన సమయమో, బాధపడాల్సిన సమయమో తెలీటంలేదు. డాడీ తన మీద వుంచిన భారం తక్కువేమీకాదు. ఇక నా వ్యక్తిగత జీవితానికి తెరదించినట్లే. ఆరంభం కానున్న కొత్త అధ్యాయంలో తనకు ఏం రానుందో అర్ధంకావటంలేదు.

అన్న శరత్‌చంద్ర అనుకుంటున్నట్లు మిడాన్ గ్రూప్‌కి తను రారాణి అయినా తన తలమీద వుంచబడింది రత్నకిరీటం కాదు, ముళ్ళకిరీటం అని తనకు తెలుసు. డాడీ తీసుకున్న నిర్ణయం మూలంగా తనకు శత్రువులు పెరిగే అవకాశం లేకపోలేదు."

కారు వేగం పుంజుకున్నా ఆమె ఆలోచనలు మాత్రం వీలునామా చుట్టూనే పరిభ్రమి స్తున్నాయి.

❈ ❈ ❈ ❈ ❈

వెన్నెల కూడా వెళ్ళిపోయాక లాయర్ ధర్మారావు తిరిగి తన ఆఫీస్‌లోకి వచ్చి కూర్చున్నాడు. యుగంధర్ విల్లు ఆయన కంపెనీల్లో ప్రకంపనలు సృష్టిస్తుందని తెలుసు. వీలునామా విషయం అసలు హక్కుదారులయిన శరత్‌చంద్ర, వెన్నెల ఇద్దరికే ఇప్పుడు తెలుసు.

అందరికీ తెలియటానికి ఇంకా కొంచెం టైంపడుతుంది. కాని వెంటనే తెలియాల్సిన మరో వ్యక్తి వున్నాడు. మిడాన్ గ్రూప్‌లో యుగంధర్ తర్వాత నంబర్ టు తనే అని భావించే కీలకమైన వ్యక్తి.

అతనే రవీందర్. అతనికి వెంటనే తెలియటం అవసరం. వెన్నెల చేతికి పగ్గాలు వచ్చి కంపెనీ గుర్రాల్ని సరయిన రూట్‌లో పరిగెత్తించాలంటే రవీందర్ సహకారం అవసరం. కాని అతని క్యారక్టర్ ఏమిటో తనకు తెలుసు.

అతడ్ని అదుపులో వుంచాలంటే ఇప్పుడే చెప్పటం మంచిది.

టెలిఫోన్ దగ్గరకు లాక్కుని–

ఒక నంబర్‌కి డయల్ చేసాడు ధర్మారావు.

* * * * *

రవీందర్ ఆశావాది. అందుకే టైగర్ యుగంధర్‌కి నమ్మకంగా చాలాకాలంగా కంపెనీని నమ్ముకొని ఎం.డి. స్థానానికి ఎగబాకాడు. యుగంధర్ పోడంతో ఇప్పుడతని ఆశలు శరత్‌చంద్రమీద వున్నాయి. శరత్‌చంద్ర డమ్మీ. ఏమీ తెలీకపోయినా తెలిసినట్టు నటించే డాంబికం అతడిది.

అతన్ని తన గుప్పిట్లో పెట్టుకుంటే చాలు. అతన్ని అడ్డం పెట్టుకుని అంతా తనే అయి చక్రం తిప్పొచ్చు. ఈ ఆలోచనలతో ఇప్పటికే హెడ్డాఫీస్‌లో చకచకా మార్పులు చేసాడు.

టైగర్ యుగంధర్ సీటును తను అక్రమించాడు. యుగంధర్‌కి ఎంతో నమ్మకమయిన శక్రటరీ స్టెల్లా. ఆ రోజు యుగంధర్‌తోపాటు తనూ విమానం ఎక్కివుంటే, ఆయనతోబాటు తనూ మరణించి వుండేది. కీలకమయిన ఎన్నో విషయాలు ఆమెకు తెలుసు. ఆమె పక్కనుంటే తనకు ఇబ్బందని, ఆమెకు ప్రాధాన్యతలేని పోస్ట్ కేటాయించి, శ్రీజ అనే యువతిని ఆమె స్థానంలోకి తీసుకున్నాడు.

ఇంకా కొన్ని మార్పులు, చేర్పుల హడావుడిలో వుండగానే సుమారు మధ్యాహ్నంవేళ అనుకోకుండా లాయరు ధర్మారావునుంచి ఫోన్‌వచ్చింది.

“చెప్పండి సర్. నేను రవీందర్‌ని మాట్లాడుతున్నాను....” అన్నాడు.

“బిజీగా వున్నారా...?” అదే శాంతస్వరంతో అడిగాడు ధర్మారావు.

“సహజంగదా... ఇప్పుడు యుగంధర్‌గారి వారసుడు శరత్‌చంద్రగదా. ఆయనకోసం ఆఫీసులో కొన్ని మార్పులు చేర్పులు చేస్తున్నాను.”

“శరత్‌చంద్ర వారసుడని ఎవరు చెప్పారు...?” వెంటనే అడిగాడాయన.

“ఇందులో ఒకరు చెప్పాల్సిన అవసరం ఏముంది? తండ్రి తర్వాత వారసుడు కొడుకే గదా!”

"అంటే ముందు జాగ్రత్తలేకుండా ఆయన సడెన్ డెత్‌తో వెళ్ళిపోయాడు గాబట్టి, ఎవరికి వారు తోచిన విధంగా వూహించుంటే సరిపోయిందా? ఇలాంటి పరిస్థితి రాకూడదనే గత సంవత్సరమే ఆయన వీలునామా రాసి వుంచారు...."

"మైగాడ్... నిజమా... ఈ విషయం ఇప్పటివరకు ఎందుకు దాచారు?" కంగారును అణచుకొంటూ అడిగాడు రవీందర్.

"దాచలేదు. సమయం సందర్భం లేకుండా ఇలాంటివి బయట పెట్టరని మీకు తెలీదా? ఇంతక్రితమే వీలునామాలో విషయాలన్నీ అన్నా చెల్లెళ్ళు యిద్దరికీ వివరించాను. మీక్కూడా చెప్పటం మంచిదని ఫోన్ చేస్తున్నాను. యుగంధర్ ఆస్థిని అన్నాచెల్లెళ్ళిద్దరికీ సమానంగానే పంచారు. కాని తన వారసురాలిగా వెన్నెలని ప్రకటించారు. ఆఫీస్‌కొచ్చి ఆయనసీట్లో కూర్చోబోయేది శరత్‌చంద్ర కాదు. కుమారి వెన్నెల" ఆయన క్లుప్తంగా చెప్పినా, క్లియర్‌గా అర్థం చేసుకోగలిగాడు రవీందర్.

చేతిలో రిసీవర్ జారిపోకుండా గట్టిగా పట్టుకున్నాడు.

తను వూహించింది ఒకటి, జరుగుతోంది మరొకటి.

వెన్నెలతో తనకు వ్యక్తిగతంగా పరిచయం లేదుగాని, చాలా సందర్భాల్లో ఆమెను చూసాడు. సెల్ఫ్ మేడ్ బిజినెస్ ఉమన్ ఆమె. అందానికి యువరాణి ఆమె. తెలివితేటల్లో తండ్రి గుణాల్ని పుడికిపుచ్చుకుంది అంటారు. శరత్‌చంద్ర దగ్గర సాగినట్టు, వెన్నెల ముందు తన ఆటలు సాగవు.

"నమ్మలేకపోతున్నాను సార్. తనకు దూరంగా వెళ్ళిపోయిన కూతురికి ఆయన పట్టంగట్టడం అస్సలే నమ్మలేకపోతున్నాను...."

"నమ్మినా, నమ్మకపోయినా వాస్తవాన్ని గ్రహించాలి మిష్టర్ రవీందర్. వెన్నెల లాయర్ కూడ. కంపెనీలో అత్యధికంగా స్టాక్‌హోల్డింగ్ కలిగిన లేడీ. గ్రూపులోని కంపెనీలు ఎలా నడుస్తున్నాయో తనకు తెలియాలిగదా. గెట్ రెడీ. ఆమెకు కంపెనీ వ్యవహారాలు మీరే తెలపాలి. బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్ మీటింగ్‌లో వెన్నెల ఎన్నుకోబడేలా చూడాలి."

ఆయన మాటలు వింటుంటే-

రవీందర్‌కి తలనొప్పి మొదలయింది.

టెన్షన్‌లో అతడికి మైగ్రేన్ అటాక్స్ వస్తూంటాయి. ధర్మారావు మాటలు వింటుంటే రవీందర్‌కి కాలికింద భూమి పగుళ్ళు తీస్తున్నట్టుంది. తన స్థానం ఏమిటో తెలీలేదు. యుగంధర్ తనను నమ్మి, సెకండ్ స్థానంలోకి తెచ్చాడు. కాని తన నిజరూపం ఆయన గ్రహించి వుంటాడా? అందుకే తన గురించి ఏమీ పట్టించుకోలేదా? యధాతధ స్థితిలో కొనసాగటం తప్ప తను ఏమీ కాడా? చచ్చీ సాధించటం అంటే ఇదే కావచ్చు. 'ఫియర్ ఈజ్‌ది ఫస్ట్ స్టెప్ ఫర్ ది ఫెయిల్యూర్' అని ఎక్కడో చదివిన గుర్తు. అపజయానికి భయం మొదటి మెట్టు. ఎంత చక్కని కొటేషను. తను భయపడకూడదు. వెన్నంటి వుండి, వెన్నుపోటు ఎలా పొడవాలో తనకు బాగా తెలుసు. యుగంధర్ ప్లేస్‌లో వారసులుగా ఎవరు సీట్లోకి వచ్చినా, తన గుప్పిట్లో బిగించి చక్రం తిప్పకపోతే, తన పేరు రవీందర్ కాదు.

"థాంక్యూ ధర్మారావుగారు. విషయం చెప్పి చాలా హెల్ప్ చేసారు. రాబోయే బాస్ వెన్నెలకి నా కంగ్రాట్స్ చెప్పండి. నేనోసారి ఆమెతో మాట్లాడాలి" అన్నాడు.

షూర్... మీకేదన్నా డౌట్స్ వుంటే నన్ను కలవండి బై."

అవతల ఫోన్ పెట్టేసాడు ధర్మారావు.

"డామిట్. ఇది ఫోన్ కాదు. బాంబ్" అనుకుంటూ కసిగా రిసీవర్ క్రెడిల్ చేసాడు రవీందర్.

కాస్సేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

తన భార్య శ్వేత కోరికమేరకు, ఆమెకు సంతోషం కలిగించటం కోసం యుగంధర్ కంపెనీలు నష్టాలబాట పట్టేలా చేసాడు. అకస్మాత్తుగా ఆయన పోవటంతో, పూర్తిగా ప్రతీకారం తీర్చుకునే ఛాన్స్ పోయిందని శ్వేత అలిగింది. ఇప్పుడు తనను పట్టించుకోని యుగంధర్ మీద రవీందర్‌కీ కోపం తన్నుకొస్తోంది. అలాగని ప్రస్తుతానికి ఏమీచేయలేడు. వెన్నెలతో పోటీపడకుండా, కాకాపట్టి కవర్‌చేయటం మంచిది. అతడి మదిలో ఒక

సరికొత్త పథకం రూపుదిద్దుకో నారంభించింది. కౄరంగా నవ్వుకుంటూ తన సెల్‌నుంచి ఒక నంబర్‌కు రింగ్‌చేసాడు.

❈ ❈ ❈ ❈ ❈

దాయాదుల పోరుతో రాజ్యాలే కూలిపోయాయన్నది చరిత్ర చెప్పే నగ్నసత్యం. సమాజంలో గాని, రాజకీయాల్లోగాని, కార్పొరేట్ సంస్థల్లోగాని, గొప్ప గొప్ప కంపెనీల్లోగాని యిలా ఎక్కడయినా ముఖ్యమైన ఒక వ్యక్తి మరణిస్తే, ఆ లోటు తీర్చలేనిది.

సాధారణ కుటుంబాల్లో ఇంటిపెద్ద పోతే, ఆస్థులకోసం గొడవలు పడ్డం, కోర్టుకెళ్ళటం చూస్తుంటాం. ఇక కోట్ల ఆస్థులు కలిగిన సంస్థల విషయంలో వారసత్వ హక్కుల కోసం, ఆస్థుల కోసం పేచీలు పడ్డం సహజమే.

ప్లేన్ క్రాష్‌లో టైగర్ యుగంధర్ పోవటం చాలా దురదృష్టకర సంఘటన. ఆయన చావటంతో అంతా విచారంతో వుండగా, బాగా జరిగిందని మురిసిపోతూ మహదానందపడిన మనిషి కూడా వుందీ అంటే ఆశ్చర్యమే. అయినా అది నిజం.

ఆమె ఎవరో కాదు.

సాక్షాత్తూ యుగంధర్ కోడలు...

శరత్‌చంద్ర భార్య అయిన విజృంభన.

ఆయన పోయారని తెలీగానే ఆమెకు పండుగ చేసుకున్నంత సంబరం. ఇక ఆస్థికి తన భర్త రాజయితే, తనే మహారాణి అని కలలు కంటూ ఆరోజు ఫుల్‌గా మందుకొట్టి, హేపీగా పడుకుందామె.

టైగర్ యుగంధర్ భవిష్యత్తులో తన వారసులు ఆస్థుల కోసం గొడవ పడకూడదని చాలా ముందుచూపుతో వీలునామా వ్రాయించి వుంచాడు. అది హర్షించతగ్గ విషయమే. కాని కొడుకు శరత్‌చంద్రకు ఆస్థి మాత్రమే పంచి, ఆస్థి, అధికారాలు రెండూ కూతురు వెన్నెలకి దఖలు పరుస్తూ, తన అధికారాలను ఆమెకు కట్టబెట్టడం మూలాన ఆమెకు ఎదురయ్యే సమస్యల గురించి ఆయన ఎంతవరకు ఆలోచించాడో ఆయనకే తెలియాలి. బహుశ తన కూతురి సమర్ధతమీద ఏర్పరుచుకున్న ప్రగాఢ విశ్వాసంతోనే ఆయన

ఈ నిర్ణయం తీసుకుని వుంటాడు. ఇక వెన్నెల ఎలా నెగ్గుకు రాగలదో చూడాలి.

ఒకపక్క తనను డమ్మీని చేసారన్న కోపంతో, మేకవన్నెపులి వేషంలో రవీందర్ వుంటే, మరోపక్క తనకు పవర్‌లేకుండా చేసాడని శరత్‌చంద్ర కోపంలో వున్నాడు. ఇటుచూస్తే తన ఆశలు అడియాసలు కాగా, అడపడుచు వెన్నెలకి పట్టిన అదృష్టానికి ఈర్ష్య, అసూయలతో, పగ, ద్వేషాలను పెంచుకుంది విజృంభన.

ఆ రోజు లాయరు ధర్మారావుని కలిసి తిరిగివచ్చిన శరత్‌చంద్ర జరిగింది చెప్పగానే విని కొయ్యబారిపోయిందామె. తన పంచరంగుల కలలన్నీ కరిగిపోతున్నట్టు బాధపడిపోయింది.

ఇప్పుడా కుటుంబానికి డబ్బు గురించో, ఆస్థుల గురించో బెంగలేదు. అధికారం కావాలి... పవర్... తన భర్తకు పవర్ లేదంటే, తనకూ లేనట్టే. తన మొగుడికి కోపం వస్తే, మందుకొట్టి పడుకుంటాడు. అంతకు మించి ఏమీచేయలేడు. ఏం చేయాలన్నా తనే చేయాలి.

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి అన్నట్టు, ఆదిపత్యం పోరులో ఒక స్త్రీని దెబ్బతీయాలంటే మరో స్త్రీకే అది సాధ్యపడుతుంది. ఆ స్త్రీ తనే అని విజృంభన భావన.

అందుకే–

వెన్నెలని దెబ్బతీసే మార్గాలను అన్వేషించటంలో ఇప్పటినుంచే బిజీ అయిపోయింది విజృంభన. ఇలా ఒకపక్క యుగంధర్ గారి కుటుంబ పరిస్థితులు వుండగా, మరోపక్కన హెచ్.ఎస్. క్లబ్‌లో చిచ్చు రగులుతోంది. అదీ వెన్నెల విషయంగా.

హెచ్.ఎస్. క్లబ్‌లో స్త్రీలకు సభ్యత్వం నిషిద్ధం.

ఈ విషయం తెలిసి కూడా యుగంధర్ తన స్థానానికి తన కూతురు వెన్నెల పేరును నామినేట్ చేసాడు.

యుగంధర్ క్లబ్ శాశ్వత సభ్యుల్లో ఒకడు.

ఆయన చివరి కోరికను మన్నించి, వెన్నెలకి సభ్యత్వం ఇవ్వాలా, తిరస్కరించాలా అనే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ప్రస్థుత పరిస్థితిలో హెచ్.ఎస్. క్లబ్ శాశ్వత సభ్యుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేయబడింది.

✻ ✻ ✻ ✻ ✻

ఆర్ట్సుగేలరీ మేనేజర్ మెహబూబ్‌కి ఇవాళ చాలా ఆతృతగానూ, ఆరాటంగానూ, అదే సమయంలో ఆనందంగా కూడా వుంది. ఎందుకంటే హెచ్.ఎస్. క్లబ్ శాశ్వత సభ్యుల సమావేశం జరగబోతోంది. హెచ్.ఎస్. క్లబ్స్ గురించి తనకు తెలిసినా, తెలీనట్టే వుంటున్నాడతను.

అత్యవసర సమావేశానికి క్కారణం టైగర్ యుగంధర్ అకాల మరణమని అతడికి తెలుసు. కార్లో దిగిన ఒక్కొక్కరిని సాదరంగా ఛాంబర్ డోర్‌వరకు తీసుకెళ్ళి వస్తున్నాడు మెహబూబ్.

నిజాం వారసుడయిన మన్సూర్ ఆలీఖాన్ ఆఖరున వచ్చాడు. టైగర్ మరణవార్త తెలీగానే ఆయన న్యూజిలాండ్‌నుంచి బయలుదేరి వచ్చాడు.

వయసు పైబడటంతో ఖరీదైన తన కారునుంచి దిగడానికి కష్టపడ్డాడాయన. దీర్ఘంగా శ్వాసిస్తూ అడుగులేస్తున్నాడు. ఆయన్ని కూడా కాన్ఫరెన్స్ రూంలోకి పంపించాడు మెహబూబ్.

"అంతా వచ్చినట్టున్నారు. ఇక నువ్వీ ప్రాంతాల్లో వుండకు. నీ ఆఫీస్‌రూంకి వెళ్ళిపో" అంటూ మెహబూబ్‌కి ఆర్డర్ వేసి తలుపు మూసుకున్నాడు మన్సూర్.

మహబూబ్ క్షణం కూడా అక్కడ ఆగకుండా తన ఆఫీసర్‌ను చేరుకున్నాడు. కీలక సమావేశంలో ఇప్పుడు వాళ్ళంతా ఏం మాట్లాడుకున్నా మెహబూబ్‌కి తెలిసిపోతుంది.

నగరాన్ని, రాష్ట్రాన్ని నడిపించేది హెచ్.ఎస్. క్లబ్.

రకరకాల వ్యాపారవేత్తలు వారి కంపెనీల షేర్లు పెరగటం, తరగటం రాజకీయ మంతనాలు ఇలా ఎన్నో రహస్యాలు తనకి తను సెట్‌చేసిన వైర్‌లెస్ డివైజ్ మూలంగా తెలిసిపోతున్నాయి. హెచ్.ఎస్. క్లబ్‌లో ఇప్పుడూ తనూ ఒక సభ్యుడు. ఇన్‌డైరక్ట్ సభ్యుడు. తనకు తెలీని సీక్రెట్ వుండదు.

అక్కడ కాన్ఫరెన్స్ స్టార్ట్ గావటంతో-

మెహబూబ్‌లో టెన్షన్ పెరిగింది.

✳ ✳ ✳ ✳ ✳

లాంగస టేబిల్‌కి అటు యిటు వున్న కుషన్ ఛైర్స్‌లో అటు నలుగురు, ఇటు నలుగురుగా ఎనిమిదిమంది దిగ్గజాలు ఆ కాన్ఫరెన్స్ ఛాంబర్లో సమావేశమై వున్నారు. టేబిల్ చివర వున్న సింగిల్ ఛైర్ హెచ్.ఎస్. క్లబ్ ఛైర్మన్‌ది. ఆ పదవిలో వున్న యుగంధర్ పోవటంతో ఇప్పుడది ఖాళీగా వుంది.

"ఈ సమావేశానికి చాలా ప్రాధాన్యత వుంది. అందుకే ఏర్పాటు చేసాను. ఎన్ని పనులున్నా మీరంతా విచ్చేసినందుకు ముందు అందరికీ నేను కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను." తన సీట్లోంచి లేచి నిలబడిన రాజేంద్రరెడ్డి అందరినీ చూస్తూ ఉపోద్ఘాతంలా మాట్లాడాడు.

చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దంగా వుందక్కడ. డాక్టర్ భువనచంద్ర, దామోదరరెడ్డి, మధుసూదనరెడ్డి, మన్సూర్ అలీఖాన్ యిలా అక్కడ అంతా ఆసక్తిగా చూస్తున్నారు. అందరిలోకీ మన్సూర్‌కి వయసు ఎక్కువ. తన సీట్లో ఇబ్బందిగా కదులుతూ బరువుగా శ్వాస పీల్చుకుంటూ వింటున్నాడు.

రాజేంద్రరెడ్డికి ఎన్నో వ్యాపారాలున్నాయి. కాని అవి ఆయనకున్న దినపత్రిక, టీవీ ఛానళ్ళకు సరిరావు. ప్రచారమాద్యమంలో ఆయన దిగ్గజం. పవర్‌ఫుల్ మేన్. ఇండియా టుడేవారు రాష్ట్రంలో జరిపిన సర్వేలో టాప్ ట్వెంటీ జాబితాలోని ధనవంతులంతా హెచ్.ఎస్. క్లబ్ సభ్యులే కావటమే విశేషం.

రాజేంద్రరెడ్డి తిరిగి మాట్లాడాడు.

"మనం చర్చించవలసిన ముఖ్య విషయాలు రెండున్నాయి. అందులో మొదటిది యుగంధర్ మరణంతో ఇంతవరకూ ఆయన నిర్వహిస్తూ వచ్చిన ఛైర్మన్ పదవి ఖాళీ అయింది. ఛైర్మన్‌ను మనం ఎన్నుకోవాలి. ఇక రెండో విషయం, యుగంధర్ స్థానంలో ఆయన వారసులు ఎవరికి సభ్యత్వం

ఇవ్వాలనేది. ఈ రెండూ ముఖ్యమైనవే. ఏది ముందు చేపడదామని మీరు భావిస్తే అదే విషయాన్ని చర్చకు తీసుకుందాం" అన్నాడు.

మన్సూర్ అలీఖాన్ వెంటనే మాట్లాడాడు.

"ఛైర్మన్‌ని ఎన్నుకోవాలంటే సభ్యులు తొమ్మిదిమందీ వుండాలి గదా. ముందుగా యుగంధర్ వారసుడు ఎవరనేది చర్చిస్తే మంచిది. ఆ తర్వాత ఛైర్మన్ గురించి ఆలోచిద్దాం" అంటూ సూచించాడు.

"నాకయితే ముందుగా ఛైర్మన్‌గా ఎవర్ని వుంచాలో తేల్చేయటం మంచిదనిపిస్తోంది" అన్నాడు మధుసూదనరెడ్డి.

"మీరు పోటీలో వున్నారా చెప్పండి" అడిగాడు రాజేంద్రరెడ్డి.

"లేదు లేదు. నాకు పోటీ పడాలని లేదు."

"పోనీ ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఓ.కెనా?"

"నోనో... చెప్పాగా. నేను పదవుల్లో కూర్చోలేను.

"అవునవును. మీరు పోటీ పడరని మాకు తెలుసు. మీరు కింగ్ మేకర్ మాత్రమే. కింగ్ అయి ఆ కష్టాలు పడే ఓపిక మీకు లేదు. ఆఫ్‌కోర్స్! వయసు రీత్యా మనలో ఎవరికీ లేదనుకోండి" అంటూ చిన్నగా దగ్గుతూ నవ్వేసాడు మన్సూర్ అలీఖాన్.

కాస్సేపు నవ్వులు విరిసాయి.

"ప్రజాస్వామ్యం వచ్చి మీరు బ్రతికిపోయారు గాని, లేకపోతే నైజాం ప్రభువు మీరేగా అలీ సాబ్! మీ హయాం బెటర్. ఆ రోజుల్లో ఎదిరించి మాట్లాడ్డం ప్రజలకు తెలీదు. ఇప్పుడలా కాదు సి.యం.ని కూడా నిలదీస్తున్న రోజులు" అన్నాడు భువనచంద్ర.

"నా అభిప్రాయం అయితే ఫస్ట్ మనం చేయాల్సింది ఛైర్మన్‌ని ఎన్నుకోవటం. మనలో ఒకరిని ఎన్నుకుంటే ఓ పనయిపోతుంది" అంటూ తన అభిప్రాయం చెప్పాడు కమల్‌నాథ్. ఆయన మాజీ సి.బి.ఐ. డైరక్టర్. ప్రస్తుతం పెద్ద రియల్టర్.

"నేనూ ఆయనతో ఏకీభవిస్తున్నాను" అంటూ కమల్‌నాథ్‌ని బలపర్చాడు మనీష్ అగర్వాల్.

"సో– ప్రాబ్లం సాల్వ్‌డ్. కమల్‌నాథ్‌గారినే ఛైర్మన్‌గా ఎన్నుకుందాం" అన్నాడు భువనచంద్ర.

"సారీ జంటిల్మన్" అంటూ వారి మాటలకు అడ్డు వచ్చాడు కమల్‌నాథ్.

"నేను చూడ్డానికి ఆరోగ్యంగా, దృఢంగా బాగానే కన్పిస్తాను. కాని నా సమస్యలు నాకున్నాయి. ఆరోగ్య సమస్యలు. ఛైర్మన్ పోస్ట్‌లో వ్యక్తి హుషారుగా, ఆరోగ్యంగా వేగంగా నిర్ణయాలు తీసుకోగల వ్యక్తి అయివుండాలి టైగర్ యుగంధర్‌లా. దురదృష్టవశాత్తు ఇప్పుడు ఆయన మనమధ్యలేరు. ఇక నా ఆరోగ్య సమస్యలంటారా...? నాకు మధుమేహం వుంది. పార్కిన్‌సన్స్ స్టార్టయింది. మీకు తెలీసే వుంటుంది పార్కిన్ సన్స్ మూలంగా మెదడులో డోపమైన్ ఉత్పత్తి చేసే కణాలు చచ్చిపోతాయి. కృత్రిమగా డోపమైన్ యివ్వాలి. మజిల్స్ కంట్రోల్ అయ్యేది ఈ డోపమైన్‌తోనే. ఇప్పుడు జరుగుతున్న స్టెమ్‌సెల్ రిసెర్చి సక్ససయి వాటిని న్యూరో సర్జరీ ద్వారా మెదడులో డోపమైన్ తయారీ కణాలుగా మార్చితే తప్ప, ప్రస్తుతం మాత్రం తాత్కాలిక చికిత్సే గతి.

మన మాజీ ప్రధాని వాజ్‌పాయ్‌గారు కూడా పార్కిన్‌సన్స్ బాధితుడే. సో... నా ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తోంది. ఇప్పటికే నా బాధ్యతలన్నీ నా పిల్లలకు వప్పగించేసాను. అంచేత ఛైర్మన్ కుర్చీలో నేను కూర్చోలేను" అంటూ వివరించాడు.

నిజానికి ఆయన చెప్పేవరకూ ఆయన ఆరోగ్య పరిస్థితి అక్కడ ఎవరికీ తెలీదు. అందుకే ఆశ్చర్యంగా ముఖ ముఖాలు చూసుకున్నారు. సి.బి.ఐ. డైరక్టర్‌గా ఎందర్నో వణికించిన వ్యక్తి కమల్‌నాథ్. ఇప్పుడు పాల్కిన్‌సన్స్ ఆయన్ని వణికిస్తోంది.

"ఓ.కె... వారసత్వ పరంగా చూస్తే టైగర్ స్థానంలోకి ఆయన కొడుకు శరత్‌చంద్రను మనం తీసుకోవాలి. అతను యువకుడు. ఛైర్మన్ బాధ్యతలు అతనికి వప్పగిస్తే ఎలా వుంటుంది?" అనడిగాడు రాజేంద్రరెడ్డి.

"లేదు లేదు" అన్నాడు వెంటనే మన్సూర్ అలీఖాన్.

"శరత్‌చంద్ర అసమర్ధుడని స్వయంగా యుగంధరే ఎన్నోసార్లు నాతో చెప్పి బాధపడ్డాడు. శరత్‌చంద్రకి యుగంధర్ వారసుడిగా సభ్యత్వం యివ్వగలం గాని, ఛైర్మన్ స్థానంలోకి తీసుకోలేం" అన్నాడు.

ఇంతలో ఏదో గుర్తుకొచ్చినట్టు–

నుదురు రుద్దుకుంటూ చూసాడు కమల్‌నాథ్.

"సారీ... వన్ మినిట్ ప్లీజ్! ఒక విషయం మర్చిపోయాను. ప్కారిన్‌సన్స్ ఎఫెక్ట్. క్షమించాలి. లాయరు ధర్మారావుగారు అందరికీ తెలుసు. ఆయన యుగంధర్‌గారి ఫ్యామిలీ లాయరు. ఆయన రావ్ లీగల్ సర్వీసస్ సంస్థ మిడాన్ గ్రూప్‌కి తన సర్వీసస్‌ను అందిస్తోంది. ఆయన ఒక కవరు నాకు పంపించాడు. యుగంధర్ హెచ్.ఎస్. క్లబ్‌కి రాసిన లెటర్ అందులో వుందని ఫోన్‌లో ధర్మారావుగారు చెప్పారు. లక్కీగా విషయం మర్చిపోయాను గాని, కవరు జేబులోనే వుంది. మనం కాసేపు చర్చను ఆపి, ఆ కవర్‌లో ఏముందో తెలుసుకోవటం మంచిది కదూ!" అంటూ కోటు జేబులోంచి ఒక లాంగ్ ఎన్వలప్ కవర్ తీసి టెబిల్ మీద వుంచాడు.

పక్కన వున్న రాజేంద్రరెడ్డి ఆ కవర్‌ని అందుకుని తెరిచాడు. లోన యుగంధర్ పర్సనల్ లెటర్‌పాడ్‌లోని అరడజను కాగితాలతో కూడిన ఉత్తరం పిన్ చేయబడి వుంది. క్లబ్ నుద్దేశించి రాసిన ఉత్తరం అది.

"ఓ.కె. రెడ్డిగారూ! లెటర్ కూడా మీరే చదవండి" అంటూ సూచించాడు మన్సూర్ ఆలీఖాన్.

గొంతు సవరించుకుని ఉత్తరం చదవనారంభించాడు రాజేంద్రరెడ్డి.

"ప్రియమైన హెచ్.ఎస్. క్లబ్ మిత్రులకు–

మీ యుగంధర్ వ్రాయు చివరి ఉత్తరం యిది. నా మరణానంతరం మాత్రమే ఈ లెటర్ క్లబ్‌కి చేరే ఏర్పాటు చేయమని మా లాయరు ధర్మారావుకి చెప్పాను. ఆయన నా వీలునామా విషయంలో కూడా చాలా హెల్ప్ చేసాడు. ఈ లెటరు మీ చేతుల్లో వుందంటే నేనీ లోకంలో లేనని అర్థం. నా స్థానంలో వారసత్వంగా ఎవర్ని తీసుకోవాలనేది ఒక సమస్య కాకూడదని ఈ లెటరు రాసి వుంచాను.

నేను హెచ్.ఎస్. క్లబ్ ఛైర్మన్‌గా, క్లబ్ శాశ్వత సభ్యుడిగా నేను చేయగలిగిన సేవలు అందిస్తూ నా బాధ్యతలు సక్రమంగానే నిర్వహించానని అనుకుంటున్నాను. పొరబాట్లు ఏవైనా దొర్లివుంటే క్షమించగలరు.

ఇకపోతే మనం ఇంతవరకు క్లబ్ మెంబర్‌షిప్ విషయంలో వారసత్వ సంప్రదాయాన్ని పాటిస్తూ వస్తున్నాం. అదే ప్రకారం నా స్థానాన్ని నా కొడుకు శరత్‌చంద్రకి యివ్వాలి. కాని అలా జరగటం నాకు ఇష్టంలేదు. శరత్‌చంద్రకి ఆ అర్హత లేదు.

అర్హత లేదా మెరిట్‌కి పట్టం కట్టాలి అనుకున్నప్పుడు ఆడ, మగ వ్యత్యాసం చూడకూడదు. ఈనాడు స్త్రీలు కూడా అన్ని రంగాల్లోనూ దూసుకు వెళుతున్నారు. వాళ్ళకీ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం వుంది.

నాకు ఇద్దరే సంతానం. శరత్‌చంద్ర, వెన్నెల.

నాకు వారసుడు శరత్‌చంద్ర. కాని అతడిలో నాయకత్వ లక్షణాలు గాని, తగిన తెలివితేటలు గానిలేవు. నా కంపెనీల్లో ఒకటయిన సినీ గ్రూప్‌కి అతడ్ని ఎం.డి.ని చేసాను. దాన్ని నష్టాల బాట పట్టించాడు. తిరిగి నేను పూనుకుంటే గాని అది లాభాల బాటకు రాలేదు. ముందుచూపు, తగిన వ్యాపార దక్షత వాడికి లేవు.

ఇక నా కూతురు వెన్నెల.

ఆమె నా కూతురని చెప్పుకోడానికి గర్వపడుతున్నాను.

నా లక్షణాలన్నీ నా కూతురులో వున్నాయి. నానుంచి పైసా తీసుకోకుండా బయటికెళ్ళి స్వశక్తితో ఈరోజు ఏ స్థాయిలో వుందో మీకు తెలుసు. నిరంతర కృషి, పట్టుదల ఆమె సొంతం.

కాని శరత్‌చంద్ర అలాకాదు. సంపాదనకన్నా ఖర్చుపెట్టడంలోనే అతడికి ఆనందం. అతడి భార్య విజృంభనది అదే మనస్తత్వం. అందుకే నా కొడుక్కి ఆస్థి మాత్రం పంచాను. మిడాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కి కూతురు వెన్నెలకే సర్వాధికారాలు కట్టబెట్టాను. అదే బాటలో యిప్పుడు హెచ్.ఎస్. క్లబ్‌కీ తెలియచేస్తున్నాను. వారసత్వంగా చూసినా, మెరిట్ ప్రకారం చూసినా నా స్థానంలోకి రావటానికి అన్ని విధాలా అర్హురాలు నా కుమార్తె వెన్నెల.

నా మాటకు విలువిచ్చి-

నా వారసులకు నా స్థానం యివ్వాలనుకుంటే ఆ స్థానాన్ని నా కూతురు వెన్నెలకి యివ్వాల్సిందిగా కోరుతున్నాను" అంటూ కాసేపు ఉత్తరం చదవటం ఆపాడు రాజేంద్రరెడ్డి.

ఎవరూ వూహించని విషయం ఆ లెటర్‌లో వుంది.

అందుకే అక్కడున్న అందరి ముఖాల్లోనూ క్వశ్చన్‌మార్క్ కనిపిస్తోంది. హెచ్.ఎస్. క్లబ్‌లోకి ప్రప్రథమంగా యుగంధర్ తన కూతురు వెన్నెలని రికమెండ్ చేస్తున్నాడు. యిది ఎంతవరకూ సాధ్యం? అందరిలో యిదే ఆలోచన.

"ఇది జోక్ కాదుగదా? వెన్నెలని సూచించటం ఏమిటి?" ముఖం చిట్లిస్తూ అడిగాడు అగర్వాల్.

"మీరు చదవండి. వాదోపవాదాలు తర్వాత" అన్నాడు మన్సూర్ అలీఖాన్.

రాజేంద్రరెడ్డి తిరిగి చదవటం ఆరంభించాడు.

"మీరు ఇది ఒక సమస్యగా భావిస్తారని నాకు తెలుసు. ఆలోచిస్తే యిది సమస్య కాదని మీకే అర్థమవుతుంది. ప్రతిభ, అర్హత ఇవి రెండూ ఎక్కడున్నా వెదికి తెచ్చుకుని నా కంపెనీల్లో ఉద్యోగాలిచ్చి వారి సేవల్ని వినియోగించుకున్న అనుభవం నాది. అర్హతకు ఆడ, మగ వ్యత్యాసం లేదు. యింకా మహిళలకు సభ్యత్వం లేదనటం మంచిదికాదు. స్త్రీలు కూడా ఏ స్థానానికైనా అర్హులమని నిరూపిస్తున్నారు. నామీద మీకున్న గౌరవాన్ని విశ్వసిస్తూ నా రికమెండ్‌ని అమలుచేస్తారని ఆశిస్తూ ఐ స్ట్రాంగ్లీ రికమెండెడ్ మై డాటర్ వెన్నెల ఇన్ మై ప్లేస్!"

ఉత్తరం దిగువన యుగంధర్ సంతకం వుంది.

రాజేంద్రరెడ్డి ఉత్తరం చదవటం ముగించగానే ఆ లెటర్‌మీద చర్చ ఆరంభమైంది. వెన్నెలకి సభ్యత్వం యివ్వాలని కొందరు, యివ్వరాదని కొందరు అరగంట పైగా వాడిగా, వేడిగా చర్చ. సభ్యులు రెండు వర్గాలయ్యారు. చివరికి వచ్చేవారం సమావేశంలో ఈ విషయాన్ని ఓటింగ్‌కు పెడదామని నిర్ణయం తీసుకుని కాన్ఫరెన్స్ ముగించి లేచారు.

* * * * *

అక్కడ ఆర్ట్ గ్యాలరీ ఆఫీసులో మేనేజర్ మెహబూబ్ వైర్‌లెస్ బగ్ ద్వారా తమ మాటల్ని వింటున్న సంగతి యిక్కడి పెద్దలకు తెలీదు. తెలిస్తే-

* * * * *

సోమాజిగూడ రోడ్‌లో వుంది మిడాన్ గ్రూప్ కార్పొరేట్ ఆఫీసు. ఎగ్జిక్యూటివ్ లిఫ్ట్‌లో పైకి వెళుతున్న వెన్నెలలో ఏదో తెలియని ఉత్సుకత, భావోద్వేగం.

నాలుగేళ్ళ తర్వాత తిరిగి ఆఫీసు మెట్లెక్కుతోంది.

ఇదే ఆఫీస్‌కి ఓరోజు తండ్రి తనను పిలిచి అభినందిస్తాడని ఎంతో ఆశగా ఎదురుచూసింది. చివరకు ఆయనే వెళ్ళిపోయాడు. చివరి చూపుకూడా దక్కలేదు. తను చూపిన పట్టుదలకి, అహంకారానికి ఆయన చాలా పెద్ద శిక్షే విధించాడు. తండ్రి గుర్తుకురాగానే ఆమె కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

బ్లాక్ ప్యాంటుపైన వైట్‌షర్టు, ఆ షర్టుపైన బ్లాక్ కోటు, కాళ్ళకి హైహీల్స్‌తో కార్పొరేట్ లుక్‌తో లేడీ అమితాబ్‌లా ఎంతో ఆకర్షణీయంగా వుంది వెన్నెల.

అప్పట్లో ఒకే అంతస్థు కలిగిన తమ ఆఫీసు కట్టడం ఈ రోజు ఆరు అంతస్థులతో అధునాతనంగా, ఆకర్షణీయంగా వెలుగొంతోంది అంటే దీని వెనక తన డాడీ కృషి, పట్టుదల ఎంతో తనకు తెలుసు. అటువంటి తండ్రికి తను కూతురు అని తలుచుకుంటేనే ఆమెకు చాలా గర్వంగా అన్పిస్తుంది.

లిఫ్ట్ ఆరో అంతస్థుకు చేరుకునేసరికి-

అక్కడ కంపెనీ ఎమ్.డీ. రవీందర్ రెడీగా నిలబడి వెయిట్ చేస్తున్నాడు ఆమెను రిసీవ్ చేసుకోడానికి.

ఇప్పుడు కూడా వెన్నెల తానుగా రావటంలేదు. తన సొంత పనుల్లో ఆమె చాలా బిజీగా వుంది. తండ్రి విల్లు ప్రకారం అధికార పగ్గాలు తన చేతికి వచ్చినా ఆమె కొంచెం కూడా తొందరపడలేదు. ఎందుకంటే బోర్డు ఛైర్మన్‌గా తను ఎంపికై ఆ సీట్లో కూర్చోడానికి జరగాల్సిన ఫార్మాలిటీస్ యింకా చాలా వున్నాయి. ముఖ్య విషయాలు చర్చించడానికి ఒకసారి ఆఫీస్‌కు రావాల్సిందిగా రవీందర్ ఫోన్‌చేసి కోరటంచేత ఆమె వస్తోంది. కాబట్టి

స్వాగత ఏర్పాట్లు ఏమీచేయటానికి వీల్లేదని తను వస్తున్నట్టుకూడా స్టాఫ్‌కి చెప్పాల్సిన అవసరంలేదని ఆమె ముందే సూచించటం మూలంగా రవీందర్ మాత్రమే అక్కడ వున్నాడు.

లిఫ్ట్ డోర్ తెరుచుకోగానే–

బయటకు అడుగుపెట్టింది వెన్నెల.

ఆమెను చూడగానే సాదరంగా నవ్వుతూ "వెల్‌కమ్ మేడమ్... వెల్‌కమ్" అంటూ ముందుకొచ్చాడు రవీందర్.

"థాంక్యూ మిస్టర్ రవీందర్" అంటూ చాలా హుందాగా అతడితో కరచాలనం చేసింది వెన్నెల.

"ప్లీజ్ కం దిస్ వే" అంటూ అతను ముందు నడుస్తుంటే అనుసరించిందామె.

"ఆఫీస్‌కి పూర్తిగా కార్పొరేట్ లుక్ తెచ్చింది మీ నాన్నగారే. ప్రతి సంవత్సరం కొత్త ఫర్నిచర్, లేటెస్ట్ పరికరాలు వస్తుంటాయి. టెక్నాలజీతో మనమూ పరుగెత్తకపోతే మనం వెనకబడిపోతాం అనేవారు. అఫ్‌కోర్స్! కొందరికి అది నచ్చేదికాదు. నాకు మాత్రం ఆయన అభిప్రాయాలు, అభిరుచులు అంటే చాలా యిష్టం" నడుస్తూనే చెప్తున్నాడు అతను.

మౌనంగా వింటోందామె.

ఎగ్జిక్యూటివ్ సూట్స్ వున్నవైపు తనే గ్లాస్‌డోర్ తీసి ఆమెను యుగంధర్ క్యాబిన్‌లోకి తీసుకెళ్ళాడు రవీందర్. విశాలమైన ఎ.సి. క్యాబిన్. అక్కడంతా మోస్ట్ కాస్ట్లీ ఫర్నిచరే. చూడ్డానికి ఫైవ్‌స్టార్ హోటల్లో ఎగ్జిక్యూటివ్ సూట్‌లా వుందా క్యాబిన్.

అక్కడి నుంచి చూస్తుంటే గ్లాస్ విండోనుంచి హుస్సేనన్‌సాగర్ అందాలు అద్భుతంగా కనిపిస్తున్నాయి. టేబిల్‌మీద తమ ఫ్యామిలీ ఫోటోఫ్రేమ్ వుంది. దానిపక్కనే తన ఫోటోతో మరో ఫ్రేం వుంది. ఆయన ఎప్పుడూ తనను మర్చిపోలేదనటానికి అది నిదర్శనం.

తనలో చెలరేగుతున్న భావోద్వేగం కనపడకుండా కవర్ చేసుకుంటూ గ్లాస్‌విండో పక్కన నిలబడి కాస్సేపు హుస్సేన్‌సాగర్‌ని చూస్తుండిపోయింది.

"మేడం... పగటికన్నా రాత్రివేళ ఇక్కడినుంచి సిటీ అందాలు చాలా బాగుంటాయి. ఇక్కడ ప్రతివస్తువూ మీకు మీ డాడీని గుర్తుచేస్తుంది. నాకు తెలుసు. ఆయన కూడా మిమ్మల్ని ఎప్పుడూ తలుచుకునేవారు... ఏమైనా తీసుకుంటారా? కూల్‌గాని, హాట్ డ్రింక్స్‌గాని మినీబార్ కూడా వుంది."

"ఈ టైంలోనా... నో... ఎప్పుడన్నా సరదాగా వైన్ మాత్రమే తీసుకుంటాను, మీరు కావాలంటే తీసుకోండి. నాకభ్యంతరంలేదు."

"సారీ... నేను పగలు తాగను. మీకోసమే అడిగాను. ఒకె. ఫోన్ చేయగానే వచ్చినందుకు ముందుగా నేను మీకు థాంక్స్ చెప్పాలి. మీరు మీ డాడీ సీట్లో కూర్చుంటే చూడాలనుంది" విన్నవించుకున్నట్టు చెప్పాడు.

ఆమె చిన్నగా నవ్వి-

సున్నితంగా తిరస్కరించింది.

"లేదు మిష్టర్ రవీందర్. కుర్చీకోసం పాకులాడే మనిషినికాదు. ఫార్మాలిటీస్ పూర్తికాకుండా నేనా సీట్లో కూర్చోలేను. రండి. అలా విజిటర్స్ ఛేర్స్‌లో కూచుందాం" అంటూ తనే ముందుగా వచ్చి ఒక చైర్లో కూచుంది.

ఆమెకు ఎడంగా మరో సీట్లో కూర్చున్నాడు రవీందర్. తన ప్రవర్తనతో, మాటలతో ఇప్పట్నుంచే ఆమెను తనకు అనుకూలంగా మలుచుకోవాలన్నది రవీందర్ ఉద్దేశ్యం. ప్రస్తుతం రవీందర్ చేస్తోంది అదే. ఆమెకు తను ఈక్వల్ అనే ఫీలింగ్ కలగనీకుండా తను నాలుగు మెట్లుదిగువనే వున్నట్టు ఆమెకు అభిప్రాయం ఏర్పడేలా ఆచి తూచి మాట్లాడుతున్నాడు.

"వెల్... మీరు ఏం చెప్పదలచుకున్నారో చెప్పండి" నిశితంగా చూస్తూ అడిగింది.

"మన బోర్డ్ ఆఫ్ డైరక్టర్లలో కొంతమందితో మీ గురించి మాట్లాడాను మేడమ్...."

"వెయిటె మినిట్. ప్లీజ్. నన్ను మీరు, మేడం అనకుండా వెన్నెల అని పిలిస్తేనే సంతోషిస్తాను."

"ఓ... థాంక్యూ వెన్నెలా... కంపెనీ ప్రెసిడెంట్‌గా మీరే వుండాలని చాలామంది అభిప్రాయపడుతున్నారు."

"అంటే... మిడాన్ లిమిటెడ్ గురించా?"

"యస్... అంతేకాదు. బోర్డు ఛైర్ పర్సన్‌గా కూడా మిమ్మల్నే ఎన్నుకునే అవకాశాలున్నాయి. అంతా మీకు ఫేవర్‌గా వున్నారు. మీ డాడీ కోరిక ప్రకారం ఆయన స్థానంలో మీరు కూర్చునేరోజు ఎంతో దూరంలేదు."

తన మాటలకు ఆనందంతో–

ఆమె పొంగిపోతుందని వూహించాడతను.

కాని అదో పెద్ద ఇష్యూ కానట్టు చూసిందామె.

ఎందుకంటే–

తనింకా బోర్డ్‌మెంబర్స్ ఎవరినీ కలవలేదు. రవీందర్ చెప్పాడని ఇప్పుడే ఆశలు పెంచుకోకూడదు. ఒకవేళ బోర్డ్‌మెంబర్స్ తనను ఎన్నుకోకపోతే అప్పుడు దిగాలుపడాల్సి వుంటుంది. ప్రస్తుతం ఏమీ ఆశించకుండా వేచి చూడటం మంచిది. పదవివస్తే లాభం, రాకుంటే అనుభవం. అంతే– ముందే వూహల్లో విహరించటం మంచిదికాదని వెన్నెలకి తెలుసు. తండ్రి లానే ఆమె కూడా ప్రాక్టికల్ మనిషి.

"ఏమిటి మౌనం? మీ తండ్రి స్థానంలో కూర్చోవటం సంతోషమే కదా?" అడిగాడు.

"సారీ... ఇది నాకు అదనపు భారం. ఎలా సంతోషించగలను?"

"అంటే?"

"డాడీ కంపెనీలకు నేను హెడ్‌గా వుండటం అంటే నాకేకాదు, అందరికీ హెడేకే... ఈ వ్యాపారం గురించి నాకేమీ తెలీదు. నాది రియల్ ఎస్టేట్ వ్యాపారం. సో... మిడాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీకి నేను అందించగల సేవలేమిటో అర్థం గావటంలేదు.

"ఇది అర్థంలేని మాట. నీమీద నమ్మకంతో యుగంధర్‌గారు బాధ్యతలు నీకు వప్పగించారు నీ సమర్థత గురించి ఆయనకే గాదు. మాకూ నమ్మకం వుంది. బాధ్యతలు తీసుకోక తప్పదు" అంటూ ఆమెకు సపోర్టుగా మాట్లాడాడు రవీందర్.

అలా మాట్లాడితేనే ముందుముందు తనకు లాభం అని అతడికి తెలుసు. వెన్నెల మనసులలో తనకి ప్లస్ మార్కులు పడడం తనకి అవసరం.

ఆమె కూల్‌గా నవ్వుతూ అతడ్ని చూసింది.

“డాడీ తర్వాత కంపెనీలో మీది నంబర్ టూ స్థానం. మీకు మాత్రం ఛైర్మన్ అవ్వాలని ఆశ లేదా? మరీ ఇంతగా నన్నే ఎందుకు సపోర్ట్ చేయటం?” సూటిగా అడిగింది.

ఇది అతను వూహించని ప్రశ్న అయినప్పటికీ బదులు చెప్పటానికి తడబడలేదు.

“గుడ్ క్వశ్చన్... నాకే కాదు– నా స్థానంలో ఎవరున్నా ఆశ పడతారు. కాని ఇక్కడ పర్సనల్ ఆలోచనకి తావులేదు. యుగంధర్ మా బాస్. ఆయన చెప్పింది శిరసావహించటం మా ధర్మం. నంబర్ వన్ స్థానం కోసం నేను కాదు. ఇక్కడ ఎవరూ పోటీపడరు. ఆ స్థానం మీది. మీ డాడీ నిరంతర పరిశ్రమ ఈ కంపెనీలన్నీ. ఆయన వారసులకే ఇవన్నీ చెందుతాయని మన స్టాఫ్‌కీ, మన షేర్ హోల్డర్స్‌కీ అందరికీ తెలుసు. కంపెనీ పగ్గాలు మీరు అందుకుంటేనే అందరికీ వూరటగా వుంటుంది” చెప్పాడు.

“కంపెనీల పరిస్థితి ఏమిటి? అన్నీ లాభాల బాటలో లేవని విన్నాను.”

“అఫ్‌కోర్స్! ఒకటి రెండు కాస్త వెనకబడ్డ మాట నిజమే. నువ్వు సారధ్యం వహిస్తే తిరిగి దారికి తేవటం పెద్ద కష్టంకాదు.”

“మా అన్నయ్య శరత్‌చంద్ర పరిస్థితి ఏమిటి? అతడ్ని సపోర్ట్‌చేస్తున్న వాళ్ళు కొందరున్నారని విన్నాను.”

“లేదు లేదు” అంటూ తల అడ్డంగా వూపాడు రవీందర్.

ఆమె తను వూహించినంత అమాయకురాలు కాదని, బయట వుండే చాలా విషయాలు గేదర్ చేస్తోందని అతడికి అర్థమైంది.

“రేస్‌లో నిన్ను అదిగమించే అవకాశాలు ఆయనకు లేవు. శరత్‌చంద్ర మంచి మనిషి మాత్రమే. మంచి బిజినెస్ మేన్ కాదు. అతన్ని పూర్తిగా డమ్మీ చేసేసారు మీ డాడీ” అన్నాడు.

రెండు నిముషాలు మౌనంగా దొర్లాయి.

ఆమె సమాధానం కోసం ఎదురు చూస్తున్నాడు రవీందర్.

"ఒక మనిషి రెండు పడవలమీద కాలు పెట్టడం చాలా కష్టమైన పని" అంటూ చెప్పడం ఆరంభించింది వెన్నెల.

"నేను ముందే చెప్పాను... నా వ్యాపారాలు నాకున్నాయని. ముఖ్యంగా డ్రీమ్ ప్రాజక్ట్ కోసం హార్డ్‌గా కృషి చేస్తున్నాను. చాలా గ్రాండ్‌గా ఏర్పాట్లు జరుగుతున్నాయ్. అది నాకు చాలా ప్రిస్టేజ్ ప్రాజక్ట్. కోట్లు ఖర్చుపెడుతున్నాను. అది పూర్తిగాకుండా నేను ఇక్కడికిసమయం కేటాయించలేను" అంటూ తన నిస్సహాయతను బయటపెట్టింది.

"వెల్. మరీ ఇబ్బంది పెడుతున్నాని అనుకోకపోతే నేనో మార్గం చెబుతాను. నచ్చితే అలా చేద్దాం" వచ్చిన అవకాశాన్ని తనకు అనుకూలంగా మలుచుకోడానికి పావులు కదపటం ఆరంభించాడు.

"ఏమిటా మార్గం?" వెంటనే అడిగాడు.

"అందరి సంతృప్తికోసం మీ డాడీ కోరిక ప్రకారం ప్రెసిడెంటు, ఛైర్మన్ పదవుల్లో నువ్వే వుండాలి. నా వంతు కృషి చేసి ఆ పదవులకు ఎంపిక చేయిస్తాను. నీ పేరు మీదుగా ఇక్కడి వ్యవహారాలు నేను చక్కబెడు తూంటాను. నీ ప్రతినిధిగా. ఈ విషయం మనమధ్య వుండాలి. ఎవరికీ చెప్పాల్సిన అవసరంలేదు. మీ డాడీలాగే నా మీద నీకూ నమ్మకం వుండి ఓ.కె. అనుకుంటే, నీకు ఈ సాయం చేయగలను. నీ తరపున కంపెనీ అభివృద్ధికి మరింత కృషి చేయటం నాకు ఎంతో ఆనందాన్నిచ్చే విషయం."

అతడి ప్రపోజల్ వెన్నెలకి మంచిదే అన్పించింది.

తను ఒకందుకు అభ్యంతరం చెప్తే, అతను మరొకందుకు పరిష్కారం చెపుతున్నాడు. స్వార్ధం లేకుండా ఎవరూ ఏ పనీ చేయరు. కంపెనీ మీద తన పట్టు జారిపోకుండా అతను జాగ్రత్త పడుతున్నాడనిపిస్తోంది. ఈ డీల్‌కి తను ఒప్పుకుంటే, కంపెనీలో అతను చేసే తప్పొప్పులకి తను బాధ్యత వహించాల్సి వుంటుంది. బట్... ప్రస్తుతం అతని రూట్‌లోనే వెళ్ళి, ఎక్కడ కావాలో అక్కడే స్పీడ్ బ్రేకర్‌ని వుపయోగించవచ్చు. ఇప్పుడే అతని మాట కాదంటే తనకి వ్యతిరేకంగా పనిచేసే ప్రమాదం వుంది. అసలు అతని

మనసులో ఏముందో బయటపెట్టించటం కోసమే అలా మాట్లాడింది... అతను బయటపడిపోయాడు.

"మీ మనసులో మరేదో ఉందని అర్థమవుతోంది. పూర్తిగా చెప్తే బాగుంటుంది" అడిగింది.

"యస్... ఇంత చేస్తున్న వాడ్ని ప్రతిఫలం ఆశించటంలో తప్పులేదు కదా?"

"తప్పు అని నేనను. ఏం కావాలి చెప్పండి?"

"నాకేమీ అక్కర్లేదు. సంవత్సరం తర్వాత మిడాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మీద మీ అధికార పగ్గాన్ని వదులుకుంటే చాలు."

"అంటే. సంవత్సరం తర్వాత నా ప్రెసిడెంట్ పదవికి, ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి, కేవలం బోర్డ్ ఆఫ్ మెంబర్స్‌లో ఒకరిగా నేను వుండిపోతే చాలా?"

"ఎగ్జాట్లీ... ప్రస్తుతం మీ డాడీ మరణంతో మన కంపెనీల భవిష్యత్ మీద నీలిమేఘాలు కమ్ముకున్నాయి. ముందుగా వాటిని తొలగించాలి. యుగంధర్ మరణం తర్వాత కూడా మన కంపెనీలు సజావుగానే సాగిపోతున్నాయి అనే నమ్మకాన్ని మన స్టాక్ హోల్డర్స్‌కి, బ్యాంకర్లకి, క్రెడిటర్లకి అందరికీ తెలియాలి. అంటే నామమాత్రంగానయినా నువ్వు బాధ్యతలు చేపట్టాలి. సంవత్సరం తర్వాత రాజీనామా చేసి బాధ్యతల నుంచి తప్పుకో. అప్పటికి టైగర్ మరణం మన గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మీద అంతగా ప్రభావం చూపదు" అంటూ వివరించాడు.

ఆమె నొసలు ముడిపడటం గమనించాడు.

"ఇందులో నువ్వాశించిన ప్రతిఫలం ఏముంది? సంవత్సరం తర్వాత నా రాజీనామా వల్ల నీకేమిటి లాభం?" కావాలనే అమాయకంగా అడిగింది.

"సారీ మేడమ్! మరీ ఏమీ తెలీనట్టు అడిగితే ఏం చెప్పను? అప్పుడు మీ స్థానంలోకి నేను వస్తాను. కంపెనీ పగ్గాలు నాచేతికొస్తాయి. అది చాలు నాకు" అన్నాడు.

"నా బాధ్యతల్ని మీరు టేకోవర్ చేయటం సమంజసమా?"

"ష్యూర్! అది లాజికల్ స్టెప్ అవుతుంది. మీ డాడీ ఉద్దేశం కూడా అదే కావచ్చు."

"ఒకవేళ అప్పుడు నేను పదవిలో కొనసాగాలనుకుంటే?"

"లాభం ఏమిటి? పదవిలో వున్నా ఇక్కడ వ్యవహారాలు చక్కబెట్టేది నువ్వు కాదు, నేను. కంపెనీ అంతర్గత వ్యవహారాలు నీకు తెలీదు. కంపెనీ మీద పట్టు ఉండదు గాబట్టి రబ్బరు స్టాంపులా ఎంతకాలం వున్నా నీకు ప్రయోజనం వుండదు. ఇక నీ సొంత వ్యవహారాలతోనే టైం చాలక బిజీగా వుంటే, నీకు ఇక్కడ బాధ్యతలు నెరవేర్చటం కూడా కష్టమే గదా?"

ఆమె తల వూపింది.

ముఖంలో భావాలు కన్పించకుండా జాగ్రత్తపడింది.

రవీందర్ చేసిన పథక రచన ఏమిటో, దానికి తనను ఎలా ఉపయోగించుకోవాలని చూస్తున్నాడో ఆమెకు అర్ధమైపోయింది. తను ఏది వూహించి వచ్చిందో అదే జరుగుతోంది. రవీందర్‌ని తన తండ్రి ఖచ్చితంగానే అంచనా వేసాడు. ల్యాబ్‌ట్యాబ్‌లో విషయాల్ని బట్టి రవీందర్‌ని ఆమె ఖచ్చితంగా వూహించగలిగింది.

ఆమెను మానసికంగా మరింత ప్రిపేర్ చేయటం కోసం తన మాటల్ని తిరిగి ఆరంభించాడు రవీందర్.

"ఇది ఏక వ్యక్తి సామ్రాజ్యం. ఇందులో ప్రధమ వ్యక్తి మీ డాడీ. ప్రధమ వ్యక్తి మరణించాడన గానే షేర్ మార్కెట్‌కి ఒడిదుడుకులు తప్పవు. కుటుంబంలో ఆధిపత్య పోరు కూడా సహజం. నువ్వు బాధ్యతలు స్వీకరించి సమస్యలు లేకుండా చూడు. సంవత్సరం తర్వాత పదవి విడిచిపెట్టు. కంపెనీలు ప్రస్తుతానికి బాగానే నడుస్తున్నాయి. అప్ అండ్ డౌన్స్ సహజం. మీ డాడీ రాక్ సాలిడ్ ఆర్గనైజేషన్‌గా మలిచిన సంస్థ యిది. చిన్న భూకంపాలకు కూలదు. డీల్ ఓ.కె. అనుకుంటే అన్నీ నేను చూసుకుంటాను" నమ్మపలికాడు.

"ఓ.కె.... నేనున్న పరిస్థితిలో ముందే చెప్పినట్టు రెండు పడవలమీద కాళ్ళు పెట్టలేను. డాడీ పేరు చెడకుండా మీరు కంపెనీలను చక్కగా నడిపిస్తే నాకు సంతోషమే. డీల్ ఓ.కె." అంది వెన్నెల.

రవీందర్ తన చెవుల్ని నమ్మలేకపోయాడు.

అంత ఈజీగా ఆమె తన ట్రాప్‌లో పడిపోతోందని వూహించలేదతను. అందుకే ఆమె ఓ.కె. అనగానే అతని ముఖంలో ఉత్సాహం గప్పున వెలిగింది.

"థాంక్స్ వెన్నెల! బోర్డు మెంబర్స్ నిన్ను ఎన్నుకునేలా నేను చూస్తాను. నీ తరపున గ్రూప్‌ని నేను నడిపిస్తాను. నీకు సహకరిస్తున్నందుకు గాను సంవత్సరం తర్వాత గ్రూప్ హెడ్‌గా నన్ను సపోర్ట్ చేసే నైతిక బాధ్యత నీది. మర్చిపోకూడదు.

"వెల్... ఇట్సె డీల్" అంటూ చిరునవ్వుతో కరచాలనం చేసింది వెన్నెల. అతడి అరచేయి తడిగా వుండటం గమనించింది. ఎ.సి.లో వున్నా అతడి అరచేతులకు చెమటలా? పాపం. తను ఓ.కె. అంటుందా లేదా అని చాలా ఏంగ్జయిటీలో వున్నట్టున్నాడు.

"మిష్టర్ రవీందర్ మన డీల్ ప్రకారం నేను ఎంపిక కాగానే నేను మా డాడీ ఆఫీస్‌లోకి మారతాను. నా సొంత వ్యాపారాలు కూడా ఇక్కడినుంచే చూసుకోగలను ఓ.కె?"

"వెల్. నో ప్రాబల్లం."

"దెన్? ఈ ప్రాసెస్ అంతా పూర్తికావటానికి ఎంత టైం పడుతుంది?"

"గురువారం బోర్డ్‌మీటింగ్‌కి కాల్ చేస్తాను. ఈ వారంలోనే నిన్ను మీ డాడీ స్థానంలో కూర్చోబెట్టే బాధ్యత నాది."

"థాంక్యూ."

ఆమె వెళ్ళిపోడానికి లేచింది.

లిఫ్ట్‌వరకు ఆమెను సాగనంపాడు రవీందర్.

ఆమె లిఫ్ట్‌లోకి వెళ్ళగానే "బై అండ్ గుడ్‌లక్" అన్నాడు. ఆమె "సీయూ" అంటూ చేయి వూపింది.

లిఫ్ట్ డోర్ మూసుకుంది.

వెన్నెల మనసులో వున్న వ్యూహం ఏమిటో తెలీదు గాని తన వ్యూహం ఫలించినందుకు రవీందర్‌కి చాలా ఆనందంగా వుంది.

ఒకరు గెలవాలంటే ఒకరు ఓడిపోవాలి. అది ప్రకృతి నియమం. వెన్నెలని గెలిపిస్తున్నట్టు నటిస్తూ ఓడించబోతున్నాడు అదీ యిక్కడ విశేషం.

తన పాచిక పారనుంది.

సో... ఇక అసలు వారసులయిన శరత్‌చంద్ర వెన్నెలల పని ఖాళీ. పిల్లి పిల్లి తగవు కోతి తీర్చినట్టు వాళ్ళిద్దర్ని సైడ్‌చేసి ఇకమీద తను చక్రం తిప్పబోతున్నాడు. తిరిగి చూడాల్సిన అవసరమే లేదు.

రవీందర్ పెదవులమీద–

క్రూరమైన చిరునవ్వు విరిసింది.

* * * * *

తన కారును సరాసరి గ్రీన్‌పార్క్ హోటల్‌కి పోనిచ్చి పార్కింగ్‌లో వుంచాడు మెహబూబ్.

తను డావిన్సీ ఆర్ట్స్ గ్యాలరీ డైరక్టరు. తెలిసినవాళ్ళు ఎవరన్నా చూస్తే ఇబ్బందిగాబట్టి ఒకసారి పరిసరాల్ని క్షుణ్ణంగా గమనించాక లోనకు నడిచాడు.

హోటల్ రెండో అంతస్తులో వుంది రూం నంబర్ 202. డోర్ ముందు నిలబడి కాలింగ్‌బెల్ స్విచ్ నొక్కాడు.

కాస్సేపటికి తలుపు తెరుచుకుని–

ఒక వ్యక్తి బయటకు తొంగిచూసాడు.

మెహబూబ్‌ని చూడగానే అతడి ముఖంలో చిరునవ్వు పొంగింది. "బాగున్నావా మెహబూబ్. రా లోనకు రా" అంటూ దారి ఇచ్చాడు. అతను లోనకురాగానే తిరిగి తలుపు మూసి బోల్ట్ వేసాడు. ఆ వ్యక్తి పేరు మహేష్‌కేల్కర్. మహారాష్ట్రకు చెందినవాడు.

కేల్కర్‌తో మెహబూబ్ పరిచయం ఈనాటిదికాదు. పురాతత్వశాఖలో పనిచేస్తున్నప్పట్నుంచీ పరిచయం. మహేష్ కేల్కర్ పురాతన వస్తువుల్ని స్మగుల్డ్ చేస్తుంటాడు. మెహబూబ్ తన పదవిని దుర్వినియోగం చేసి చాలా కళాఖండాల్ని కేల్కర్‌కు గతంలో అమ్మాడు.

ఇద్దరూ రిలాక్స్‌గా కూర్చున్నారు.

"నువ్వు ఫోన్ చేయగానే వస్తావనుకోలేదు. ఈసారి ఏం తీసుకొచ్చావ్. జస్ట్ వెయిట్" అంటూ ఫ్రిజ్‌లోంచి రెండు బీర్ బాటిల్సు తీసి చెరొకటి ఓపెన్ చేసాడు. కూల్ బీర్ తాగుతుంటే అదో తృప్తి. కాస్సేపు మాట్లాడుకున్నాక మెహబూబ్ తనవెంట తెచ్చిన పొడవాటి ట్యూబ్‌లోంచి రెండు పెయింటింగ్స్ తీసి ఓపెన్ చేశాడు.

ఒకదాంట్లో పరుగెడుతున్న గుర్రాలు చిత్రించారు.

రెండోదాంట్లో జలపాతంకింద అర్ధనగ్న స్త్రీ.

రెండు పెయింటింగ్‌మీదా కుడిపక్క చివరన ఎఫ్.ఎమ్. హుస్సేన్ అని సంతకం.

ఆ సంతకం చూసి ఫక్కున నవ్వాడు కేల్కర్.

"ఏమిటిది? ఎఫ్.ఎమ్. రేడియో పాపులరయిందని ఎఫ్.ఎమ్. హుస్సేన్‌గా సంతకం చేసేసాడు. ఎవరీ ఆర్టిస్ట్?" అనడిగాడు.

"అది వాడి ఒరిజినల్ పేరే అనుకో" అన్నాడు మెహబూబ్.

"ఇది డూప్లికేట్ అని అనుకుంటున్నాలే. నాకు తెలీదా? ఎఫ్.ఎమ్. హుస్సేన్ కాన్వాస్‌మీద మూడు రంగులేసి కింద సంతకం చేస్తే చాలు. ఆ పెయింటింగ్ కనీసం ముప్పై లక్షలనుంచి ఏభై లక్షలు పలుకుతుంది. ఇది ఎఫ్.ఎమ్. హుస్సేన్ పెయింటింగ్ అనే అమ్మనా?"

"అలా అని నేను చెప్పను భాయ్. ఒరిజినల్ రేటు డూప్లికేట్స్‌కి రాదు గదా. చూసివ్వు. దగ్గరుండి వేయించాను."

"సర్లే. నీ ఆర్ట్ క్లాస్‌లో ఎవడో కుర్రాడితో వేయించి వుంటావు. అసలుకన్నా ఇవే బాగున్నాయిలే."

మొత్తానికి కాస్సేపు చర్చల అనంతరం రెండు పెయింటింగ్స్‌కీ ఎనభై వేలకు ఫిక్సయ్యారు.

"మహేష్! నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి. వచ్చిందే అందుకు" బీర్ ఫినిష్ చేసాక చెప్పాడు మెహబూబ్.

"అరె భాయ్. ఇంతకన్నా ముఖ్యవిషయం ఏముంటుంది. నువ్వు తెచ్చిన రెండు పెయింటింగ్స్ తీసుకున్నాను. రేపు పేమెంట్ కూడా అయిపోతుంది. మన దగ్గర తేడాపాడాలుండవని తెలుసుగదా" అడిగాడు మహేష్ కేల్కర్.

"ఛ ఈ సంగతి పక్కన పెట్టవయ్యా బాబు. నాకో విషయం తెలియాలి. నువ్వు స్మగ్లర్‌వని నాకు తెలుసు... సమాచారాన్ని కూడా స్మగుల్డ్ చేస్తావా?"

"సమాచారమా... యూమీన్ ఇన్‌ఫర్మేషన్? డబ్బు సంపాదించి పెట్టే ఇన్‌ఫర్మేషనుండాలిగాని ఎందుకు చేయను భాయ్... నీ దగ్గర అలాంటి రహస్య సమాచారం ఏమన్నా వుందా?" కుతూహలంగా అడిగాడు కేల్కర్.

"ప్రస్తుతం లేదు... త్వరలో చెప్తాను. మనం ముందుగానే ఒక డీల్ చేసుకుంటే మంచిదిగదా!"

"వెల్... ఇంతకీ నువ్వు తెచ్చే సమాచారం ఎలాంటిది?"

"సపోజ్ షేర్ మార్కెట్ గురించి ఖచ్చితమైన సమాచారం నేను ముందుగా యివ్వగలిగితే?"

"ఏమిటి? జోస్యం చెప్తావా?"

"లేదు. ఖచ్చితమైన సమాచారం యివ్వగలను. షేర్ మార్కెట్లో ఏ కంపెనీ ఏ నిర్ణయం తీసుకోనుంది, ఏ కంపెనీ దివాలా తీయబోతోంది, ఏయే కంపెనీలు విలీనం కాబోతున్నాయి, ఏ కంపెనీ షేర్లు పడిపోబోతున్నాయి, ఏ కంపెనీల షేర్లు పెరగబోతున్నాయి ఇలాంటి సమాచారం."

"వాఁవ్. వెరీ ఇంట్రస్టింగ్. నువ్వు ఖచ్చితమైన సమాచారం ఇవ్వగలిగితే చాలు. మనకి కాసులవర్షం కురిపిస్తుంది."

"ఇదేగాదు. అనేక రహస్య సమాచారాలు అందించగలను."

"వెల్. నీకు తెలిసిన సమాచారంతో నువ్వే లాభాలు పొందవచ్చు గదా, నాతో టైఅప్ అవ్వాలనే ఆలోచన దేనికి?"

"ఎందుకంటే... నేను షేర్ల వ్యాపారిని కాను. అలాగని దలాల్ స్ట్రీట్‌లో మైక్ పుచ్చుకుని నా దగ్గర రహస్య సమాచారాన్ని అమ్ముకోలేను. ఖచ్చితమైన సమాచారాన్ని తెచ్చే పూచీ నాది. దాన్ని క్యాష్ చేసే డ్యూటీ

నీది. ఇందులో మేజర్ రిస్కు నాది కాబట్టి వచ్చిన ఆదాయంలో సెవంటీ పర్సెంట్ నాది. థర్టీ పర్సెంట్ నీది."

"వూహుం ఫిఫ్టీ పర్సంట్ షేర్ లేందే నేను ఎవరితోనూ చేయికలపను."

"ఇదన్యాయం. పట్టుబడితే నా ప్రాణాలు పోవచ్చు తెలుసా?"

"సమాచారం తేవటానికి నీకున్న రిస్కుకన్నా దాన్ని కేష్ చేసుకోడానికి నేను తీసుకునే రిస్క్ ఏమీ తక్కువకాదు. నీకు యిష్టమైతేనే చెప్పు."

"ఓ.కె. నీకన్నా నమ్మకస్తుడు నాకు దొరకడు గాబట్టి నీ కండిషన్‌కి ఓ.కె. చెప్తున్నాను. అయితే ఒక విషయం గుర్తుంచుకో. నేనందించే సమాచారం హైదరాబాద్‌లోనే కాదు, ఇటు తెలంగాణా, అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కడా నువ్వు వినియోగించకూడదు. ఈ విషయంలో నీ కార్యకలాపాలన్నీ రాష్ట్రాల బయటనే జరగాలి. ముంబై ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై... అలా" హెచ్చరించాడు మెహబూబ్.

"సమాచారాన్ని రెండు తెలుగు రాష్ట్రాలో అమ్మకూడదనటానికి కారణం నాకు తెలియాలి గదా?"

"ఓ.కె. అడిగావు గాబట్టి చెపుతున్నాను. ప్రాణం పోయినా ఈ రహస్యం నీలోనే వుండాలి. హెచ్.ఎస్. క్లబ్ గురించి నీకు తెలుసుకదా?"

"విన్నాను. "రాష్ట్ర భవిష్యత్తుని దేశభవిష్యత్తుని శాసిస్తున్న అదృశ్యశక్తి. అటువంటి క్లబ్ నిర్ణయాలు వాళ్ళకివచ్చే ఇన్ఫర్మేషనూ నాకు ముందుగా తెలిసిపోయే లింకువుంది.

నేనిచ్చే సమాచారం ఇక్కడ లీకయితే హెచ్.ఎస్. క్లబ్ వాళ్ళు నన్ను అనుమానించే అవకాశం వుంది. పట్టుబడితే ప్రాణం తీస్తారు" అంటూ అసలు విషయం బయటపెట్టాడు మెహబూబ్.

తలపంకించాడు కేల్కర్.

"ఓ.కె.అర్థమైంది... ఇది వర్కవుటయితే కొద్దిరోజుల్లోనే మనమూ కోటీశ్వరులం అయిపోతాం. అయాంహేపీ. ఈ శుభసందర్భంలో మరో స్ట్రాంగ్ బీర్ వేద్దాం" అంటూ హోవర్డ్స్ 5000 బీర్ సీసాలు రెండు ఓపెనన్ చేశాడు కేల్కర్.

మెహబూబ్ దృష్టిని స్విచ్‌బోర్డులోని జీరోవాల్ట్స్ బల్బు ఆకర్షించింది. అది రకరకాల రంగుల్లోకి మారుతూ అట్రాక్ట్ చేస్తోంది.

"ఏమిటి చూస్తున్నావ్?" బీర్ బాటిల్ అందిస్తూ అడిగాడు మహేష్ కేల్కర్.

"ఏంలేదు. మనిషిలోని ఊసరవెల్లి మనస్తత్వానికి ప్రతీకలా రంగులు మారుస్తూ ఈ బల్బు ఏదో కొత్తగా వుందే..." అన్నాడు మెహబూబ్.

"నీమాట కరక్ట్ భాయ్. ఈ బల్బులు ముంబయిలో ఎప్పుడో వచ్చాయి. ఇప్పుడిప్పుడే ఇక్కడ కనపడుతున్నాయి" అంటూ తన బాటిల్ అందుకున్నాడు కేల్కర్.

* * * * *

శ్రమపడే మనిషికి ప్రతిక్షణం విలువయినదే.

కష్టపడి జీవితంలో ఉన్నతస్థితికి ఎదగాలని తపనపడి–

ఆ దిశగా శ్రమిస్తున్నవారికి రోజుకి వున్న విలువ ఏమిటో తెలుసు. రోజులు వచ్చి పోతూనేవుంటాయి. ప్రతిరోజు సుఖసంతోషాలను ఇవ్వదు. పడ్డ శ్రమకు ఫలితం అందివచ్చిన రోజునే అసలయిన ఆనందం ఏమిటో తెలుస్తుంది. ఈరోజు వెన్నెలకి చాలా ఆనందంగా వుంది.

తను చాలా అందంగా, ఆకర్షణీయంగా వుంటుందని తెలుసు. ముఖ్యంగా మగవాళ్ళ చూపులు తనను వెన్నంటుతుంటే ఒకప్పుడు గర్వపడేది. కాని ఆ తర్వాత అర్థమైంది తన అందాన్నే గాని తన ప్రతిభను, తెలివితేటల్ని ఎవరూ గుర్తించటంలేదని, ఆఖరికి తన తండ్రి కూడా తననో ఆడపిల్లగానే లెక్కించి మాట్లాడ్డం చూసి ఆరోజు తండ్రితో విభేదించి బయటకు వచ్చేసింది. వచ్చాక నిరంతర కృషితో స్వయంగా ఎదిగింది.

రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఒకపక్క సాగుతుండగానే తన డ్రీమ్ ప్రాజక్ట్‌కోసం చేస్తున్న ప్రయత్నాలు ఒకకొలిక్కి వచ్చిన రోజు ఇది. అందుకే రోజంతా ఆమె బిజీనే.

బ్యాంకర్లు, లాయర్లు తన మేనేజర్లతో మీటింగులు, చర్చల అనంతరం కాంట్రాక్ట్‌ల మీద సంతకాలు ఇలా బిజీగా గడపటంలో ఆమెకు ఆనందమే కాదు, విశ్రాంతి కూడా ఏర్పడింది.

ఏ నిర్ణయమైనా తొందరపడి తీసుకునే అలవాటు ఆమెకులేదు. ప్రతి విషయాన్ని స్పష్టంగా అన్ని కోణాలనుంచి అధ్యయనం చేసాకే తుది నిర్ణయానికి వస్తుంది. అందుకే ఆమె తన ప్రతిభతో ఇప్పుడు అందరినీ కట్టిపడేస్తోంది.

డబ్బుతో ఒకలాంటి పవర్.

జ్ఞానంతో మరోరకమైన పవర్.

ఆమె ఈ రెంటినీ మేళవించి విజయాల్ని సొంతం చేసుకుంటోంది. అంతా వెళ్ళిపోయినా తన ఛాంబర్‌లోంచి బయటకు రాలేదు వెన్నెల. తన సీట్లోంచి లేచి ఇవతలకు వచ్చి సోఫాలో రిలాక్స్‌గా కూర్చుంది. ఇంతలో సెక్రటరీ మరియా ఇంటర్‌కం ఫోన్‌లో అడిగింది.

"ఈ రోజు చాలా అలసిపోయావ్. స్ట్రాంగ్ టీ పంపించనా?" అంటూ.

"టీ కాదు. స్ట్రాంగ్ బీర్ కావాలి. గోవాపిల్లవిగదా. బీర్ బాగా కిక్ ఇస్తుందట నిజమేనా?" సరదాగా అడిగింది.

"ఏమిటి. జోకా? నేను గోవానుంచి తెచ్చే వైన్‌కూడా ఎప్పుడోగాని ముట్టుకోవు... బీర్ కావాలా?"

"ఎయ్. తమాషాకన్నాను. టీ పంపించు చాలు. టీ తాగి ఓ గంట నిద్రపోతేకాని అలసట తగ్గదు" అంటూ ఇంటర్‌కం ఆపి వచ్చి సోఫలో వాలిపోయింది.

ఒకే వయసు గాబట్టి సెక్రటరీ మరియకు వెన్నెల దగ్గర చనువు ఎక్కువ. అప్పుడప్పుడూ కబుర్లు చెప్పుకుంటారు. కాస్సేపటికి మరియ పంపిన టీ తాగి తిరిగి పడుకుంది వెన్నెల. కాని నిద్ర రావటంలేదు.

ఆరోజు జరిగిన సంఘటనలను నెమరువేకుంటూ ఎక్కడన్నా తప్పులు దొర్లాయా అని ఆలోచిస్తోంది. అంతలో ఇంటర్‌కంలో మరయ మాట్లాడింది.

డిస్ట్రబ్ చేయొద్దన్నాగా" విసుగ్గా అంది వెన్నెల.

"నీ సెల్ స్విచ్ ఆఫ్‌చేసావా?"

"అవును."

"అందుకే లాండ్‌లైన్‌కి చేసినట్టున్నారు. అవతల రవీందర్‌గారు లైన్లో వున్నారు. మీతో అర్జంట్‌గా మాట్లాడాలంటున్నారు."

"ఒ.కె. లేచే ఓపికలేదు. నా సెల్ స్విచ్ ఆన్‌చేస్తున్నాను. నా సెల్‌కి ఫోన్ చేయమని చెప్పు." అంటూ ఇంటర్‌కం కట్ చేసింది.

కొన్ని క్షణాల తరువాత–

ఆమె సెల్ రింగయింది.

"హలో రవీందర్..." పిలిచింది.

"వెన్నెల కంగ్రాట్స్. నీకో గుడ్‌న్యూస్ చెప్పాలి. అందుకే ఫోన్‌చేశాను" అవతల ఉత్సాహంగా అరిచాడు రవీందర్.

"చెప్పండి"

"నా ప్రామిస్ నిలబెట్టుకున్నాను. బోర్డు ఛైర్మన్ పదవికి ప్రసిడెంట్ పదవికి రెంటికి కూడా ఏకగ్రీవంగా నువ్వే ఎన్నికయ్యావ్. బోర్డు మెంబర్స్‌ని జాగ్రత్త మేనేజ్ చేయటంవల్ల ఇది సాధ్యపడింది... ఎనీవే... కంగ్రాట్స్...."

"ఓహ్... థ్యాంక్యూ రవీందర్" అని మాత్రం. అనగలిగింది వెన్నెల.

ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది.

సోఫాలో లేచి కూర్చుంది.

అధికారికంగా తండ్రి స్థానంలోకి తను వెళ్ళగలుగుతున్న ఆనందం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మిడాస్ గ్రూప్‌కి తను రారాణి అయిన శుభసందర్భం ఇది.

"నాకు మాటలు రావటంలేదు. ఇంకా టైంపడుతుందనుకున్నాను. ఇక్కడ నా డ్రీమ్ ప్రాజక్ట్ మీద ఫుల్ బిజీగా వున్నాను."

"నో ప్రాబ్లం... నీ సొంత పనులకు ఇబ్బంది కలక్కుండా మిడాస్ గ్రూప్‌ని నేను చూసుకుంటాగదా. మన డీల్ ప్రకారం అప్పుడప్పుడూ బోర్డు మీటింగ్‌లకు రావటం, ఫైల్‌మీద సంతకాలు చేయటం దట్సాల్. డోంట్‌వర్రీ."

"థాంక్యూ రవీందర్."

"వెల్... ఈ శుభసందర్భంలో రాత్రికి ఏదో స్టార్‌హోటల్లో డిన్నర్ తీసుకుని సంతోషాన్ని సెలబ్రేట్ చేసుకుంటే బాగుంటుంది కదూ?"

వెన్నెల మాట్లాడలేదు.

పదిక్షణాల తర్వాత-

"నేను, నా భార్య, నువ్వు... మన ముగ్గురమే...." అడిగాడు.

తను వెంటనే ఒ.కె. అంటే-

ఇతగాడు భార్యని కలిపేవాడా? ఖచ్చితంగా కలపడు...

అతడి మనసులో ఏముంది?

ఆలోచిస్తూనే "సారీ" అంది వెన్నెల.

"ఇవాళంతా బిజీ... అలసిపోయాను. పార్టీ మరోసారి" అంది.

"ఒ.కె. వెన్నెలా... నో ప్రాబ్లమ్. రేపు మాత్రం ఓసారి నువ్వు ఆఫీస్‌కు రావాలి. మిడాన్ గ్రూప్ ఆఫీస్ స్టాఫ్ ఎదురుచూస్తున్నారు. నిన్ను వాళ్ళకి పరిచయం చేయాలి. అలాగే మీడియావాళ్ళకీ తెలియపర్చాను. రేపు ఉదయం పదకొండుగంటలకి రాగలవా?"

"ఓ.కె. వస్తాను."

"థాంక్యూ."

అవతల లైన్‌కట్ చేసాడు రవీందర్.

సెల్ పక్కన పడేసి తిరిగి సోఫాలోకి వాలిపోయింది వెన్నెల. ఆమె ఆలోచనలు రవీందర్ చుట్టూ తిరుగుతున్నాయి. తన తండ్రి లాబ్ టాప్‌ని పూర్తిగా స్టడీ చేయటం ఇంకా వీలుకాలేదని, పూర్తిగా నమ్మి తన తర్వాతి స్థానాన్ని అతనికిచ్చాడు యుగంధర్. కాని రవీందర్‌ని శంకించటంలో ఉద్దేశం ఏదో వుంది. అదేమిటో అర్థం గావటంలేదు. రవీందర్‌తో కంఫర్ట్‌ఫీలింగ్ రావటంలేదు.

ఎందుచేత-?

ఆలోచనల మధ్య ఎప్పుడో-

గాఢనిద్రలోకి జారుకుంది వెన్నెల.

* * * * *

రవీందర్ ట్రిమ్‌గా రెడీఅయి బయటికొచ్చేసరికి సెక్రటరీ శ్రీజ ఇంకా అక్కడే వుంది. అతడు వెళ్ళమని చెప్పేవరకు ఆమె యిక్కడే వుంటోంది. రవీందర్ కోసం సెల్లార్‌నుంచి ఎంట్రన్స్ వద్దకు కారు వచ్చిందని అంతక్రితమే ఆమెకు ఫోన్ వచ్చింది.

"కారు రెడీగా వుంది" అతను రావటం చూసి చెప్పింది.

ఆమెవంక చూసాడతను.

ఆమె స్కిన్‌టైట్ డ్రస్‌లో మరింత అందంగా వుంది. ఆమెలో చాలా అందాలున్నాయి. మోడల్‌గా రాణించగలదు. శ్రీజను మోడలింగ్ వైపు ప్రోత్సహించాలి అనుకున్నాడు.

"నువ్వింకా వెళ్ళలేదా?"

"మీ పర్మిషన్ లేకుండా ఎలా వెళతాను సార్?" అంది. అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళలో ఆరాధన అతడ్ని మూర్ఖుడ్ని చేసింది డబ్బు... అధికారం వున్న మగాళ్ళంటే కొంతమంది అమ్మాయిలు అతుక్కుపోవాలని చూస్తారు.

"ఏభైవేల రూపాయల టికెట్‌తో పార్టీనా... ఆశ్చర్యంగా వుంది" అంది శ్రీజ నవ్వుతూ. అతడు పార్టీకి వెళుతున్న విషయం ఆమెకు తెలుసు.

"ఏమిటి...? పార్టీకి రావాలనుందా? మరోసారి తీసుకువెళతానులే. హై సొసైటీవాళ్ళు పరిచయం అవుతారు. కం విత్‌మి. పార్టీ మాదాపూర్లో. నిన్ను పంజాగుట్ట దగ్గర డ్రాప్ చేస్తాను" అంటూ బయలుదేరాడు.

ఇద్దరూ కిందకు వచ్చారు.

ఎ.సి.కారు వెనకసీట్లో అతని పక్కన కూచుంది.

కారు బయలుదేరింది.

ఆమె వంటినుంచి వీస్తున్న పెర్ఫ్యూమ్ మత్తునిస్తోంది. ఆమె షేపులు మనసును దోస్తున్నాయి.

"పార్టీ టికెట్ ఏభైవేలని ఆశ్చర్యపడకు. ఎయిడ్స్ బాధితుల పునరావాసం కోసం ఎన్.జి.ఓ. సంస్థ ఫండ్స్ సేకరిస్తోంది. ఆ సంస్థను

నడుపుతోంది ఒక మంత్రిగారి భార్య. సో... టికెట్ తీసుకోక తప్పదుగా. అంతా హై సొసైటీవాళ్ళే వస్తారు.

పైగా టాక్స్ ఫ్రీ. ఇలాంటప్పుడు డబ్బుకోసం చూడకూడదు. ఎందుకంటే, పరిచయాలు పెరుగుతాయి. రాజకీయాలు, వ్యాపారాలు జోడు గుర్రాలు. ఒకరి అవసరం మరొకరికి ఉంటుంది" అంటూ భరోసాగా నవ్వాడు.

అతడినుంచి తను నేర్చుకోవాల్సింది–

చాలా ఉందనిపించింది శ్రీజకు.

ఆమెను పంజాగుట్ట వద్ద డ్రాప్ చేసాక–

కారు మాదాపూర్‌లోని ఒక ఫాంహౌస్‌కి చేరుకుంది.

అక్కడ చాలా గ్రాండ్‌గా జరుగుతోంది పార్టీ.

పార్టీలో అంతా కోలాహలంగా వుంది.

ఒకరికొకరు పరిచయాలు చేసుకుంటున్నారు.

ఇక హైసొసైటీ లేడీస్ అయితే మరీను. ఫ్యాషన్ డిజైనర్లు రూపొందించిన కళ్ళు జిగేల్‌మనే దుస్తుల్లో తిరుగుతూ, మీడియా వాళ్ళ దృష్టిలో పడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు, ఎయిడ్స్ బాధితులకోసం నిర్వహిస్తున్న పార్టీలు కూడా చాలామంది అలా ఫ్యాషన్ పెరేడ్‌లో పాల్గొంతున్నట్టు డ్రస్‌లు వేసుకొచ్చిన సోషల్ లైట్స్‌ని చూసి నవ్వుకున్నాడు రవీందర్.

సిటీలో పబ్లిసిటీ లేనిదే కొందరు ధనికులకు బ్రతుకులేదు. కొందరు ఆడాళ్ళకయితే అదో అబ్సెషన్. ఏ పత్రిక అయినాసరే తమ ఫోటోలతో ఆర్టికల్స్ పడాలి. డబ్బు ఎక్కువ కావటంతో వాళ్ళకిదో టైంపాస్.

అందరితో కలివిడిగా తిరుగుతూ ముఖ్యంగా అధికార పార్టీ వాళ్ళతో ఎక్కువగా మాట్లాడుతూ ఒక ముఖ్యమైన పర్సన్‌కోసం చూస్తున్నాడు రవీందర్.

అతను వస్తాడా?... వచ్చి తీరాలి... పదినిముషాల తర్వాత కన్పించాడు అతను ఎదురుచూస్తున్న వ్యక్తి.

ఎడంగా ఒక్కడే నిలబడుతున్నాడతను. నీట్‌గా డ్రస్సు, చేతిలో షాంపేన్ గ్లాస్... కళ్ళలో మెరుపు మాత్రంలేదు. అతను ఎవరోకాదు. యుగంధర్ కొడుకు శరత్‌చంద్ర.

స్ట్రెయిట్‌గా అతడ్ని పలకరించటం రవీందర్‌కు ఇష్టంలేదు. అతడి కంటపడేలా ముందుకెళుతూ ఎవరినో విష్ చేసాడు. అతని ట్రిక్ ఫలించింది.

చూడగానే "హలో రవీందర్...." అంటూ పిలిచాడు శరత్‌చంద్ర.

అప్పుడే అతడ్ని చూస్తున్నట్టు ఆశ్చర్యం నటిస్తూ "హలో శరత్. మీరా... ఒక్కరే వచ్చారా? మేడం రాలేదా?" అంటూ దగ్గరకెళ్ళి కరచాలనం చేసాడు.

"ఒక్కడ్నే వచ్చాను. పబ్లిసిటీ వస్తుందనుకున్న పార్టీలకే నా భార్య వెళుతుంది. ఇది ఎన్.జి.ఓ.ల పార్టీగా. అందుకే రాలేదు" అంటూ నవ్వాడు శరత్‌చంద్ర.

"మీ డాడీ అంత్యక్రియల తర్వాత మిమ్మల్ని చూడలేదు. ఎలా వున్నారు అన్నట్టు మిడాన్ ఫిలిం కంపెనీ ఎం.డి. పదవికి రాజీనామా చేసారని విన్నాను. నిజమేనా?"

"మీరు విన్నది నిజమే. మరేం చేయను? రెండు భారీచిత్రాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. నష్టాలు, డాడీ బ్రతికుంటే ఆయనే నన్ను దించేసేవారు."

"ఆయన లేరుగా?"

"తెలీనట్టు అడుగుతారే? మీకు తెలీకుండానే వెన్నెల డాడీ స్థానంలోకి వచ్చిందా? ఆమె తీసేయటంకన్నా నేను తప్పుకోవటమే మంచిదనిపించింది. దానివన్నీ డాడీ లక్షణాలే."

"నాకు అర్థంకాలేదు. ఆమె సమర్థురాలనా, అసమర్థురాలనా మీ ఉద్దేశ్యం?"

"నేను సమర్థత మాట్లాడటంలేదు. మన కంపెనీల గురించి నాకు తెలుసు, మీకు తెలుసు. బయటినుంచి వచ్చింది ఆమెకేం తెలుసు? నేనేం అసూయతో అనటంలేదు. ఆమె గ్రూప్‌ని నట్టేట ముంచుతుంది నో డౌట్."

"యస్... చాలామంది అభిప్రాయం కూడా అదే!"

ఆశ్చర్యంగా చూశాడు శరత్‌చంద్ర.

ఎదుటివారి మనసులో ఏముందో తెలుసుకోవాలంటే ముందు వారి ట్రాక్‌లోకి వెళ్ళి మాట్లాడాలి. అప్పుడు నిజాలు తెలుస్తాయి. ఇలాంటి విషయాల్లో అందెవేసిన చేయి రవీందర్‌ది. అందుకే సులువుగా అతడి మాటల గారడీలో పడిపోయాడు శరత్‌చంద్ర.

"ఎవరు వాళ్ళు?" కుతూహలంగా అడిగాడు.

"బోర్డు సభ్యుల్లో చాలామందికి వెన్నెలని ఎన్నుకోవటం అస్సలు ఇష్టంలేదు." చెప్పాడు రవీందర్.

"మరి తెలిసీ ఎందుకు ఎన్నుకున్నారు?"

"గౌరవం... కేవలం మీ డాడీమీది గౌవరం. బలమైన కారణంలేనిదే టైగర్ తన వారసురాలిగా వెన్నెలని ప్రకటించరు. ఇది వారసత్వ విషయము గాబట్టి వెన్నెలకి ఒక అవకాశం యిచ్చి చూద్దామనే ఉద్దేశ్యంతో బెనిఫిట్ ఆఫ్ డౌట్‌కింద ఛైర్‌పర్సన్ అండ్ ప్రసిడెంటుగా వెన్నెలనే ఎన్నుకున్నారు."

"తప్పు చేసారు. నా చెల్లెలి గురించి నాకు బాగా తెలుసు. గ్యారంటీగా అది మిడాన్ గ్రూప్‌ని చిన్న డ్రామాగ్రూప్‌గానో, రికార్డింగ్ డాన్స్ గ్రూప్‌గానో మార్చేస్తుంది. కంపెనీలు దాని చేతిలోకిపోయాక ఎవరూ ఆపలేరు. అది జగమొండి" చాలా ఆవేశంగా తన మనసులో భాధని మాటల్లో చూపించాడు శరత్‌చంద్ర.

చెల్లెలిమీద అతను కడుపుమంటతో వున్నాడని రవీందర్‌కి అర్థమైపోయింది.

షాంపేన్ ఖాళీ అవటంతో–

అటుగా వచ్చిన బేరర్‌ని ఆపి రెండు షాంపేర్ గ్లాసులు అందుకుని ఒకటి శరత్‌కిచ్చి, తనొకటి తీసుకున్నాడు రవీందర్.

"శరత్! మీరన్నది నిజమే. నాకూ అదే భయం పట్టుకుంది. ఎంత కూతురయితే మాత్రం కంపెనీ పగ్గాలు మీడాడీ ఆమె చేతికి ఎందుకిచ్చారో అర్థంగావటంలేదు. ఆమె ఎం.బి.ఎ చేయలేదు. చదివింది లా. పైకొచ్చింది

రియల్ ఎస్టేట్‌లో. మన గ్రూప్‌లో చూస్తే సినిమాల నుంచి మందుల వరకు ఎన్నో వ్యాపారాలున్నాయి. ఆమెకు వీటి గురించి ఏమీ తెలీని మాట నిజమే. కాని మన చేతిలో ఏముంది? మీ డాడీ స్టాక్ హోల్డింగ్స్ వెన్నెలకి ఇవ్వబడ్డాయి. ఓటింగ్ హక్కు ఆమెకే వచ్చింది. అందుకే ఎందుకొచ్చిన గొడవలే ఒక అవకాశం యిచ్చి చూద్దామని బోర్డ్ మెంబర్స్ ఆమెను ఎన్నుకున్నారుగాని, నిజానికి బోర్డ్ మెంబర్స్ మిమ్మల్ని పెసిడెంట్‌ని చేస్తేనే బాగుంటుందనుకున్నారు."

"నిజమా?" ఆశ్చర్యంగా చూసాడు శరత్‌చంద్ర.

అతడి కళ్ళలో తొంగిచూస్తున్న ఆశాకిరణాల్ని స్పష్టంగా చూసాడు రవీందర్. గోడ కట్టినట్టు అబద్దాలు చెప్పటంలో రవీందర్ దిట్ట. తన తప్పేమీ లేదన్నట్టు నాటకమాడి, శరత్‌చంద్రని కూడా గ్రిప్‌లో పెట్టుకో కోవాలనే అతడి ప్రయత్నం సక్సెస్ అయినట్టే. పైకిమాత్రం భారంగా నిట్టూర్చి–

"అవును శరత్. వాస్తవాన్ని మీకు చెప్పాను. ఎంతయినా మగాడ్ని. ఒక అమ్మాయి దగ్గర పనిచేయాలంటే నాకూ బాధే కదా. బట్... అయాం హెల్ప్‌లెస్" అన్నాడు.

అతడి మాటలతో తిరిగి శరత్‌చంద్రలో–

ఆశలు చిగురించాయి.

"వెన్నెల కంపెనీని ముంచుతుంది. డౌటే లేదు. ఒకవేళ టైగర్ వారసత్వమే కావాలనుకుంటే నేను లేనా? ఏవో రెండు సినిమాలు ప్లాపయితే. కంపెనీ మునిగిపోతుందా? అవకాశం యిస్తానంటే నేను రెడీ...." అన్నాడు ఉత్సాహంగా.

"మీరు బరిలోకి దిగితే బాగానే వుంటుంది. కాని...."

"కాని...చెప్పండి?"

"మీ అన్నా చెల్లెళ్ళమధ్య ఇది యుద్ధానికి దారితీయవచ్చు."

"నో ప్రాబ్లం. వెన్నెలని తప్పిస్తే, ఆ స్థానానికి నేను వస్తాను. ఒక్క విషయం గుర్తుంచుకో రవీందర్. వెన్నెలని దించేస్తే, నేను ప్రెసిడెంట్‌గా ఎక్కువకాలం వుండను. ఆ పోస్ట్ నీకు దక్కేలా చూస్తాను. నేను బోర్డు

ఛైర్మన్ పదవికి పరిమితమవుతాను. కంపెనీలను నడిపించే సమర్థత నీకుంది. నువ్వు సహకరిస్తే నా పరువు తిరిగి నిలబడుతుంది. ఏమంటావ్?"

"అంటే... ప్రెసిడెంట్ పదవిమీద నేను ఆశ పెట్టుకోవచ్చా?"

"ష్యూర్. నేను మాటతప్పే మనిషిని కాదు."

"కరక్ట్‌గా మీ యిద్దరూ ఒకే తల్లి బిడ్డలు. మీరిద్దరూ గొడవపడ్డం మంచిదికాదేమో" ఆలోచించండి."

"ఇందులో ఆలోచించాల్సింది ఏమీలేదు. డాడీ చేసిన పనికి ఇప్పటికే సగం చచ్చాను. పరువుపోయింది. అది నా చెల్లెలుకాదు, శత్రువు. ఎంత ఆస్థి వుండి ఏంలాభం, అధికారం పోయాక. నా భార్య విజృంభన ఇప్పటికే అమెరికా వెళ్ళిపోదాం అని గొడవ చేస్తోంది. లేదంటే ఆత్మ హత్య చేసుకుంటానంటూ బెదిరిస్తోంది. నేనూ ఏదో ఒకటి చేయాలనే నిర్ణయంతోనే వున్నాను."

"కరక్టే... కాని ఆలోచిస్తే ఇందులో చాలా ప్రమాదాలున్నాయన్పిస్తోంది శరత్."

"నోనో... ప్రమాదం ఏముంది? వెరీ సింపుల్. వెన్నెల మొదటి తప్పు చేయగానే కథ ఆరంభమవుతుంది. మా డాడీ విల్లును వ్యతిరేకిస్తున్న బోర్డ్ మెంబర్స్ ఆమె కాలికింద కార్పెట్ లాగేస్తారు. అప్పుడు నేనేగా దిక్కు కాదంటే నీ హెల్ప్ అవసరం."

తలవూపాడు రవీందర్.

"మీరు చెప్పింది అర్థమైంది. కొంచెం జాగ్రత్తగా ఆలోచించి ప్లాన్ చేయాలి. వర్కవుట్ కావచ్చు. కొంచెం టైం పడుతుంది. జాగ్రత్తగా పావులు కదపాలి" అన్నాడు.

"ఎంత వేగంగా కదిపితే అంతమంచిది. మీకూ, నాకు మన కంపెనీలకి కూడా" ఉత్సాహంగా ప్రోత్సహించాడు శరత్‌చంద్ర.

"ఓ.కె. శరత్. మీరు చెప్పింది గుర్తుంటుంది. టచ్‌లో వుంటాను. సీ.యు" అంటూ అక్కడ్నుంచి వేగంగా కదిలాడు రవీందర్.

తన మాటలకు శరత్‌చంద్ర ముఖంలో ఎంతకళ వచ్చిందో వూహించుకోగలడు. అక్కడే ఆగి అతడి ముఖంలోకి చూడాలనిపించలేదు. అతడిలో చెల్లెలిపట్ల ద్వేషం నిప్పులా రగులుకుంటోంది. ఆ నిప్పులని తను ప్రజ్వరిల్ల చేసాడు. ఇక ఏమాత్రం దహిస్తుందో చూడాలి.

తన ప్లాన్ సక్సస్ అయితే–

టైగర్ వారసులు ఇద్దర్నీ నాశనం చేయగలడు.

అప్పుడు తనే రాజు.

తన పక్కన శ్వేత, శ్రీజ, ఇంకా ఎందరో అందగత్తెలు. ఆలోచిస్తున్న రవీందర్‌కి తాగుతున్న షాంపేన్ మరింత రుచిగా అన్పించింది. వచ్చినపని అయిపోయింది గాబట్టి పార్టీ సగంలోనే వచ్చి కారెక్కేసాడు.

* * * * *

సికింద్రాబాద్ దగ్గరలో ఈస్ట్ మారేడ్‌పల్లి రోడ్‌లో వుంది ఎం.డి.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ కంపెనీ. అది ఎం.ఎల్.ఏ. నిరంజన్ తండ్రి మధుసూదన్‌రెడ్డిది.

కంపెనీ ప్రెసిడెంట్ మరియు సి.ఇ.ఒ. అయిన మధుసూదన్‌రెడ్డి ఎదురుగా కూర్చుంది వెన్నెల.

అతికష్టంమీద మధుసూదన్‌రెడ్డితో అరగంట ఆమెకు అపాయింట్‌మెంట్ దొరికింది. ఎమ్.ఇ.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ దేశంలోని టాప్ ఫైవ్ కంపెనీల్లో ఒకటి. నిజానికి తీరిక లేకపోయినా, వచ్చింది వెన్నెల కాబట్టి రెడ్డి అపాయంట్‌మెంట్ ఇచ్చాడు. ఇవ్వకపోతే జరిగే అపాయం అతడికి తెలుసు కాబట్టి.

రెడ్డిగారి టేబిల్‌మీద అన్నీ చిందరవందరగా పడున్నాయి ఫైల్స్, బుక్స్, కంప్యూటర్ వగైరా... వాటిని ఒక పక్కకు జరిపి, తను కూర్చుంటూ చెప్పాడు రెడ్డి.

"ఎంత కంప్యూటర్ యుగమైనా ఇంకా ఈ ఫైళ్ళు పాతవాసనలు మాలాంటి ముసలాళ్ళకుపోవు. అమెరికాలో గొప్ప ప్రెసిడెంట్‌గా పేరున్న బెంజిమన్ ఫ్రాంక్లెన్ అనేవాడట. 'ఎ.డి. జార్డర్లీ డెస్క్ ఈజ్ ది సైన్ ఆఫ్

ఏన్ ఆర్డర్లీ మైండ్' అని. అది నిజం కాకపోవచ్చు. బట్ నేనిలా వుంటేనే పనిచేయగలను" అంటూ నవ్వాడు.

వెన్నెల కూడా నవ్వింది.

తెల్లటి షిపాన్‌చీర. చీర మొత్తం పొదిగిన చిన్న చిన్న అద్దాలు. ఆమె కట్టు బొట్టు భువికి దిగిన అప్సరలా వుంది. ఆమెలాగే ఆమె నవ్వు కూడా చాలా సమ్మోహనంగా వుందని గ్రహించాడు మధుసూదన్‌రెడ్డి. తన కొడుకు నిరంజన్‌కి వెన్నెల తగిన జోడీ అన్పించింది.

"రెడ్డిగారూ! నేను మీ టేబిల్ పై ఏమీ కామెంట్ చేయలేదు. కాని మీరే డిఫెన్సివ్‌గా మాట్లాడారు. మీరెప్పుడూ ఇంతేనా?" అనడిగింది.

"అలా అనికాదు. ప్రస్తుతం మా కంపెనీ దేశవ్యాప్తంగా ఎన్నో భారీ ప్రాజెక్ట్‌లు చేపడుతోంది. నేనెంత బిజినో నువ్వు అర్థంచేసుకుంటావని అలా అన్నాను. ఓ.కె... ఇంతకీ వచ్చినపని చెప్పలేదు."

"నా డ్రీమ్ ప్రాజెక్ట్‌పై ఇంజనీరింగ్ రిపోర్ట్ కావాలి. మీ కంపెనీదయితే రిలయబుల్‌గా వుంటుందని వచ్చాను. మీ కంపనీకున్న గుడ్‌విల్ నాకు ఉపయోగపడుతుందని...."

"రిపోర్ట్సు త్వరగా అవసరమా?"

"అవును."

"ఇప్పటికే ఎన్నో ప్రాజక్టులమీద మా ఇంజనీరింగ్ ఆర్కిటెక్‌లు చాలా బిజీగా వున్నారు. అన్నట్టు నీ డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి సేవీ మ్యేగజైన్‌లో చదివాను. వెరీ ఇంట్రస్టింగ్. మా కంపెనీ స్థాయికి నీ ప్రాజెక్టు చాలా చిన్నది. బట్ ఇప్పుడున్న బిజీలో నీకు హెల్ప్ చేయలేను. మాది ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పాలసీ!"

"రెడ్డిగారూ! నా ఇబ్బంది అర్థంచేసుకోండి. డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం నా ఆస్థులన్నీ తనఖా పెట్టా."

"నిజంగా నువ్వు అలా చేసుంటే అది జూదం అవుతుంది."

"జూదం కరక్ట్ పదం కాదు సర్... నమ్మకం అనండి. లేదా రిస్క్."

ఆమెకు కోపం వచ్చిందని గ్రహించాడు రెడ్డి.

యుగంధర్ కూడా ఇంతే. ఎంత కోపం వచ్చినా భావాల్ని భాషనూ కంట్రోల్లో వుంచుకుంటూ కూల్ అవుతాడు. తండ్రి పోలికలు ఈమెలో చాలా వున్నాయి అనుకున్నాడు.

వెన్నెలకి కూడా అర్థమైంది ముసలాయన రిటార్ట్‌లు బాగా ఇస్తాడని. ఏమైనా తనకు పనికావటం ముఖ్యం. పెద్ద సంస్థ కాబట్టి అతడికే అడ్వాంటేజ్ ఎక్కువగా వుంది.

"ఓ.కె. వెన్నెలా! ఇంతకీ సమస్య ఏమిటి చెప్పు?" అడిగాడు మధుసూదనరెడ్డి.

"సకాలంలో అన్నీ సమకూర్చుకుంటే సమస్యలు రావు. ఆ దిశగానే నేను ప్రయత్నిస్తున్నాను. లెండింగ్ అగ్రిమెంట్ అమలు కోసం నిర్మాణం షెడ్యూల్ కరక్ట్‌గా వుండాలి. ఆ తర్వాత నిర్మాణ పనులు వేగంగా జరగాలి. ఎక్కడ తేడాలొచ్చినా ప్రాజెక్ట్ ఖర్చు పెరుగుతుంది. నిర్మాణం ఆలస్యం కావటం, వడ్డీలు పెరగటం మీకు తెలీందికాదు. మీ కంపెనీ ఫాస్ట్‌నెస్ ఇప్పుడు నాకు అవసరం" వివరంగా చెప్పింది వెన్నెల.

అయినా కూడా-

మధుసూదన్‌రెడ్డిలో చిన్న అనుమానం మొదలయింది. వెన్నెల చెప్పేది నిజమేనా లేక హెచ్.ఎస్. క్లబ్ ఛైర్మన్‌గా ఎన్నిక కావటానికి తన సహకారం కోసం, ఓటు అడగటం కోసం వచ్చిందా? తమ కంపెనీ ఫాస్ట్ అండ్ క్వాలిటీ విషయంలో టాప్. నిజమే. కాని పనిలో పనిగా సహాయం కోసం కూడా వచ్చుండాలి అనిపిస్తోంది. ఎదుటి మనిషిలో కోపం వస్తే గాని, నిజాలు బయటపడవు. కోపం రప్పించటం పెద్ద సమస్యకాదు.

"వెన్నెలా! మా ఇతర క్లయింట్‌లు కూడా మా పై ఇలాగే వత్తిడి తెస్తున్నారు. అయితే వారిలో నీ అంత బ్యూటిఫుల్ ఎవరూ లేరు" అన్నాడు.

బ్యూటిఫుల్ పదాన్ని ఆయన వాడటంలో ఆమెకు వేరే అర్థం స్ఫురించింది. ఆయన కోరుకున్న ఎఫెక్ట్ వచ్చేసింది.

"ఏం మాట్లాడుతున్నారు?" కాస్త ఘాటుగానే అడిగింది.

"ఒక స్త్రీగా మీ సాయం అడుగుతున్నాననుకుంటున్నారా?"

"సారీ! ఆడ మగ వివక్షత నాకు లేదు. నువ్వు అందంగా వున్నా వన్నది నా కాంప్లిమెంట్ మాత్రమే. అఫ్‌కోర్స్! ఆడపిల్లవయిపోయావుగాని, నా మిత్రుడు టైగర్‌ని నీలో చూస్తున్నాను. టైగర్ అంటే లేడీస్ పడి చచ్చేవాళు ్ళ. ఆడవాళ్ళలా మేం జెలసీ ఫీలయ్యేవాళ్ళం."

"ఆడవాళ్ళకేనా?" మగవాళ్ళకి జెలసీ వుండదా?"

"వెన్నెలా! టాపిక్ మారుతోంది. నేను మగ పక్షపాతిని కాదు. నీకు తెలుసో లేదో మా కంపెనీలో కీలక స్థానాల్లో లేడీస్ పనిచేస్తున్నారంటే అది వారి సామర్థ్యంతో సంపాదించుకున్న ఉద్యోగాలే."

ఆలోచనలో పడింది వెన్నెల.

ఆయన అన్నట్టే టాపిక్ ఎటో పోయింది.

రెడ్డి నిర్ణయం మీద తన భవిష్యత్తు ఆధారపడి వుందని తెలుసు. అతన్ని పొగడలేకపోతోంది. తన తండ్రి ఫ్రండ్ గనుక హెల్ప్ చేయమనీ అడగలేకపోతోంది. అసలు మనసులో ఏదో వుంచుకుని ఆయన తనను ఛాలెంజ్ చేస్తున్నట్టుంది. చూస్తుంటే ఆ రోజు తన తండ్రితో జరిగిన వాగ్వాదం గుర్తుకొస్తోంది.

"రెడ్డిగారూ! ఓ.కె. స్త్రీని గనక నాకు ఎక్కువ విలువ యివ్వనక్కర్లేదు... నా ప్రాజెక్ట్ పనికి ఎక్కువ డబ్బు కావాలంటే యిస్తాను" అంది చివరిగా.

రెడ్డిని డబ్బుతో ఎరవేయాలనుకోవటం వాన పామును ఎరగాకట్టి భారీ షార్క్ చేపను పట్టాలనుకోవడమేనని ఆమెకు తెలుసు. కాని కోపం రప్పించటం ఆయనకే కాదు, తనకూ తెలుసని తెలియ చెప్పాలనే అలా అంది.

ఆమె ఆశించినట్టే ఆయనకు కోపం వచ్చింది.

"ఇది ప్రభుత్వ ఆఫీసు కాదు లంచం యివ్వటానికి" అన్నాడు ఘాటుగా.

"లంచం అని ఎందుకనుకుంటున్నారు? మీ స్టాఫ్ నా కోసం అదనంగా కొన్ని గంటలు పని చేయాలి. దానికి ఖరీదు ఇస్తానంటున్నాను. అవసరం నాది కదా!"

"ఓ.కె. వెన్నెలా! నో మోర్ ఆర్గ్యుమెంట్స్. నువ్వు కోరినట్టే నీ వర్క్ చేయిస్తాను. మా వర్క్ షెడ్యూల్ మార్చి మరీ నీ వర్కు త్వరగా పూర్తయ్యేలా చూస్తాను. మా మేనేజర్లు నీ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లకి ఎంత చెల్లించాలో నిర్ణయిస్తారు. బిల్లు విషయంలో గాని, పేమెంట్ విషయంలో గాని నా ప్రమేయం ఉండదు. చాలా?"

ఆయన ఆ మాటనగానే వెన్నెల రిలాక్స్‌గా ఫీలయింది.

"థాంక్యూ రెడ్డిగారూ... థాంక్యూ!" అంది ఉత్సాహంగా.

ఆమె ముఖంలో నిజంగానే ఆనందం కన్పించింది రెడ్డిగారికి. అయినా అనుమానం వీడలేదు. అందుకే–

"ఇంకా... ఏమైనా?" అడిగాడు.

"మనం అనవసరంగా ఆడా మగా అంటూ వాదించుకున్నాం. మిమ్మల్ని తప్పుగా అర్థంచేసుకున్నాను. సారీ...." అంది.

"ఇట్సాల్‌రైట్! ఒక్క మాట గుర్తుంచుకో. మన వాదన హెచ్.ఎస్. క్లబ్ విషయంలో ప్రమేయం వుండదు."

అప్పటిగ్గాని ఆయన ఉద్దేశం ఆమెకు బోధపడలేదు. తన ప్రాజెక్టు వంకతో హెచ్.ఎస్. క్లబ్‌లో తనకు సపోర్ట్‌గా ఓటు అడగటానికి సాయం అర్థించటానికి వచ్చినట్టు వూహించి నట్టున్నాడు. అందుకే కోపంగా అడిగింది.

"మీరు పొరబడ్డారు రెడ్డిగారు! హెచ్.ఎస్. క్లబ్ విషయంగా నేను మీ సాయం కోరి రాలేదు. నన్ను తన స్థానానికి మా డాడీ నామినేట్ చేసారు. నాకు సభ్యత్వం యివ్వటమో, ఛైర్మన్ పదవి యివ్వటమో అది క్లబ్ వారి ఇష్టం. పదవుల కోసం పాకులాడే అలవాటు నాకులేదు. వస్తే వదిలేదీ లేదు. మా డాడీ పేరు చెప్పి కూడా ఎవరినీ సాయం అడగను" అంది.

"వెల్– నీలో నచ్చింది ఆ పాయింటే వెన్నెలా. టైగర్ పేరు చెప్పి వుంటే ఖచ్చితంగా నీ ప్రాజక్ట్ రిపోర్ట్ వర్క్ చేపట్టేవాడిని కాదు. ఎందుకంటే స్నేహం వేరు. వ్యాపారం వేరు. నీ పట్టుదల, దీక్ష నాకూ నచ్చాయి గాబట్టి ఓ.కె. చెప్పాను. ఇక హెచ్.ఎస్. క్లబ్ విషయం అంటావా– నిన్ను

ఎన్నుకోవడంలో చూపే ప్రధాన అంశం నీ సమర్థత. అంతేకానీ, బ్లండర్ కాదు. అలాంటి బ్లండర్ నేను చేయను.”

“థాంక్యూ రెడ్డిగారూ! నా ప్రాజెక్టుకు సంబంధించిన ఫైల్స్‌ని మా మేనేజరు మీ వాళ్ళకి అందిస్తాడు. మళ్ళీ కలుస్తాను. సీయు” అంటూ లేచి వెళ్ళిపోయింది వెన్నెల.

ఆమె వెళ్ళిపోయాక కూడా–

ఆమె గురించే చాలాసేపు ఆలోచించాడు మధుసూదన్‌రెడ్డి. హెచ్.ఎస్. క్లబ్ మీటింగ్ డేట్ ఫిక్సయింది. వెన్నెల తన ఓటు కోసం రాలేదని తేలిపోయింది. మిగిలిన సభ్యుల్లో ఎవరినీ కూడా ఆమె కలిసినట్టు తెలీలేదు. ఇదే మరొకరయితే ఈపాటికి సభ్యులందర్నీ ఒకటికి పదిసార్లు కలిసి రిక్వెస్ట్ చేసేవాళ్ళు. వెన్నెల హెచ్.ఎస్. క్లబ్ గురించి అసలు పట్టించుకున్నటే లేదు. అంతా టైగర్ యుగంధర్ లక్షణాలే. తండ్రి పోలికలు, గుణాలు పుణికి పుచ్చుకుంది.

* * * * *

సికింద్రాబాద్‌లోని ప్రముఖ చైనీస్ రెస్టారెంట్ ‘చైనా టౌన్’లో వెన్నెల, లాయర్ అనూప్‌లు లంచ్ తీసుకుంటున్నారు.

వెన్నెల ఫోన్ చేసి అతడ్ని పిలిచింది.

చైనీస్ చికెన్ ఫ్రైడ్‌రైస్‌ని చిల్లీసాస్‌తో కలుపుతూ స్లోగా తింటున్నాడు అనూప్. ఎదురుగా కూర్చున్న వెన్నెల చిల్లీసాస్‌కు బదులు టమాటాసాస్‌తో తింటోంది.

తామిద్దరూ దగ్గరవ్వాలనుకున్న ప్రతిసారీ ఏదో విఘాతం కలగటం తెలిసిందే. లాస్ట్ టైం తన క్లయింట్ మూలంగా ఆమెను కలిసినప్పుడు ఆమె తన ఫ్లాట్‌కి ఆహ్వానించింది. అయితే అనూహ్యంగా అప్పుడే ప్లేన్ క్రాష్‌లో టైగర్ యుగంధర్ గతించటం గురించి తెలిసి హతాశుడయ్యాడు. ఆ దుఃఖ సమయంలో వెన్నెల వెంట వున్నప్పటికీ ఆ తర్వాత అనూప్ ఆమెను చుడ్డానికి రాలేదు. ఫోన్ చేయలేదు. ఇప్పుడు కూడా ఆమె ఫోన్ చేయకపోతే వచ్చేవాడు కాదు.

ఒకప్పుడు తామిద్దరూ ప్రేమికులయినా–

ఇప్పుడిలా అపరిచితుల్లా కూర్చుని ఫోంచేయటం అనూప్‌కి బాధగా వుంది. అప్పుడూ ఇప్పుడూ కూడా ఆమె తనకి అందని ద్రాక్షపండుగానే మిగిలిపోయింది.

“అనూప్! ఏమిటాలోచిస్తున్నావ్?” అతన్నే గమనిస్తూ అడిగింది వెన్నెల.

“ఏం లేదు” అన్నాడు.

“నన్ను చూడాలనిపించలేదా? ఫోన్ చేయలేదు. రాలేదు. ఎందుకని?”

“భయం... మనం కలిసిన ప్రతిసారీ ఏదో విఘాతం కలుగుతూనే వుంది. ఏం వినాల్సి వస్తుందోనని భయం. నేను డిసైడయిపోయాను. మనకు రాసిపెట్టి లేదని.”

“ఈ మాట కరక్టే... ఏం చేయను. ఇప్పుడు నేనున్న పరిస్థితిలో నా గురించి ఆలోచించు కోడానికే టైంలేదు.”

“ఐనో దట్... అవునూ. మీ డాడీ తర్వాత ఇప్పుడక్కడ లేడీబాస్ నువ్వేనా... ఓ సారి... లేడీ అంటే ఒప్పుకోవుగా. యు ఆర్ ది బాస్. చెప్పు వెన్నెలా. మీ కంపెనీలు ఎలా వున్నాయి? ఎలా వుంది నీకక్కడ?” కొంచెం నవ్వుని పెదవులమీదికి తెచ్చుకుంటూ అడిగాడు.

“అక్కడ అంతా బాగానే వుంది. ప్రస్తుతం నా దృష్టి అంతా నా డ్రీమ్ ప్రాజక్ట్‌మీదే వుంది. ఆ పనులమీదే మరీ బిజీబిజీ అయ్యాను. ఒక్కోసారి అన్పిస్తుంది. ఎప్పుడో నాకు మెంటల్ వచ్చేస్తుందని” అంది తనూ నవ్వుతూ.

“ఆ మాట ఒప్పుకోనులే. పని ఎక్కువయితే పిచ్చిరాదు. పైగా వత్తిడిలోనే పనులు వేగంగా చేయొచ్చంటారు. నువ్వు పని రాక్షసివి. ఆ విషయం నాకు బాగా తెలుసు.”

“ఫరవాలేదు. ఈ మధ్య మాటలు బాగానే నేర్చావ్.” ఇంతకీ నీ ప్రాక్టీస్ ఎలా వుంది?”

"బోరింగ్‌గా వుంది. ఏం చేయను? అసలు ఈ లా కోర్సు బాగాడబ్బున్న నీలాంటివాళ్ళే చేయాలి. అసిస్టెంట్‌గా పడ్డ కష్టాలు తలుచుకుంటే ఎలా భరించానో నాకే ఆశ్చర్యంగా వుంటుంది. జీతం వుండదు. రాబీ వుండదు. క్లయింట్లను మోసంచేసి ఫీజులు లాక్కోవాలి...."

"అనూప్! చాలా ప్రొఫెషన్స్‌లో ఇవన్నీ కామన్. డాక్టర్లు కూడా మొదట్లో క్లినిక్ పెట్టుకొని ఏ పేషంట్ వస్తాడా అని పేషెన్స్‌తో వెయిట్ చేయాలి. కాస్త పేరు వచ్చాక పేషంట్లే వెదుక్కుంటూ వచ్చి క్యూలో వుంటారు. లాయరుగా స్థిరపడి కూడా నీలో ఈ నిరాశ ఏమిటి? సరయిన కేసులు రెంటిలో విజయం సాధిస్తే ఇక నీకు తిరుగుండదు."

"నిజమే... కాని ఒక విషయం నువ్వు మర్చిపోతున్నావు. మన దగ్గర అర్హత, సమర్ధతలు వుంటే సరిపోవు. అదృష్టం కూడా కలిసిరావాలి. చాలామందికి సెంటిమెంట్స్ మీద నమ్మకాలుండవు. కాని నేను నమ్ముతాను."

"అంటే నాకేగాని అదృష్టం నీకు లేదంటావా?"

"ప్రస్తుతం లేనట్టే. ఉంటే ఈపాటికే లాయర్‌గా టాప్ పొజిషన్‌లో వుండేవాడిని."

"నన్ను నీ అదృష్టంగా ఎందుకనుకోవు?"

"అనుకున్న రోజుల్లో ఏం జరిగిందో నీకూ తెలుసు. చెప్పాగా. మనకు రాసిపెట్టిలేదని. మనిద్దరం ఒకేసారి లా చదివాం. కాని మనదారులు వేరు. నాది కాలనీలో దారి అయితే, నీ దారి అవుటర్ రింగ్‌రోడ్ రహదారి. ఎనిమిది లైన్స్."

"ఓ షిట్... ఎందుకింత అప్‌సెట్ అవుతావ్ అనూప్! ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుంది. నిరాశ వెనక్కి లాగుతుంది. డోంట్‌వర్రీ. నే చెప్తున్నాగా. ఎప్పటికయినా నువ్వు పైకొస్తావు."

"వచ్చాగా... ఇప్పటికే పైకొచ్చాను మేడమ్. ఆఫీస్‌రోడ్ పైన వుండేది. అద్దె భరించలేక ఇప్పుడు నాలుగో అంతస్థుకు మారాను. పైకొచ్చినట్టేగా?" అంటూ కాస్త పెద్దగానే నవ్వేసాడు అనూప్. అతడి మాటలకి తనూ నవ్వేసింది వెన్నెల.

"సో... నెక్స్ట్?" నవ్వాపుకుంటూ అడిగింది.

"వాట్ నెక్స్ట్?"

"పెళ్ళి, సంసారం, పిల్లలు... ఇలాంటి ఆలోచనలేమీ లేవా?"

"ఒకప్పుడుండేవి. ప్రస్తుతానికయితే బ్రహ్మచారి లైఫే బాగుంది. ఏ బాదరబందీ లేదు."

"సో... నా జీవితం నుంచి డ్రాపవుతున్నావన్నమాట. ఓ.కె. వెయిట్ చేయమని అనను. బట్... సుమతో కూడా ఇలాగే చెప్పావా?"

అనూప్ ఉలిక్కిపడ్డాడు.

అతడి ముఖంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనపడింది.

"మైగాడ్! నీ నెట్‌వర్క్ ఏమిటో ఇప్పుడు అర్థమవుతోంది. కొంపదీసి నామీద నిఘా వుంచావా?" నమ్మలేనట్టు అడిగాడు.

"అదేంలేదుగాని చెప్పు... మనం ఎలాగూ బెస్ట్ లవర్స్ కాలేకపోయాం. బట్ బెస్ట్‌ఫ్రెండ్స్. అందులో డౌటు లేదు. సుమ నిన్నెంతో ఇష్టపడుతుందని విన్నాను" ప్లజంట్‌గా నవ్వుతూ అడిగింది.

"నిజమే వెన్నెల... ఇప్పటికీ అమ్మాయిల మనస్తత్వాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాను. మన గురించి సుమకు తెలుసు. అయినా నన్నే ఇష్టపడుతోంది. నన్ను పెళ్ళిచేసుకోడానికి తను రెడీ. నేనే ఎటూ తేల్చుకోలేకపోతున్నాను."

"వెంటనే తేల్చుకో. లేకపోతే సుమ కూడా నాలానే బిజీ అయిపోతే మళ్ళీ ఒంటరి వాడివైపోతావ్. కనీసం నువ్వయినా సుఖంగా వున్నావని సంతోషిస్తాను..."

"అదికాదు వెన్నెలా...."

"ఇంకేం చెప్పకు. మనం ఇష్టపడే మనిషికన్నా మనల్ని ఇష్టపడే మనిషి దొరకటం అదృష్టం. సుమని పెళ్ళిచేసుకో. నీకే సాయం కావాలన్నా నేనున్నాను. ఏమంటావ్?"

"ఇది సజషనా... రిక్వెస్టా... ఆర్డరా?"

"నువ్వు ఏదనుకుంటే అది. సుమ నీ లైఫ్‌లోకొస్తే హేపీగా వుంటావ్. అందువల్ల మన స్నేహానికేమీ ఢోకాలేదు. నీ అంత జంటిల్‌మెన్ దొరకడు గదా... ఏయ్ నవ్వకు... నిజమే చెబుతున్నాను."

"థాంక్స్ వెన్నెలా!"

ఇద్దరూ కాస్త పెద్దగానే నవ్వుకున్నారు.

కాస్సేపట్లోనే లంచ్ ముగించి బయల్దేరారు.

* * * * *

మరునాడు–

కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ స్టయిల్లో లిఫ్ట్‌లో పైకెళుతుంటే ఒకలాంటి ఉత్సుకత వెన్నెలలో. ఒకప్పుడు తన తండ్రి యుగంధర్ కూడా ఇలాగే వెళుతుండేవారు. ఇప్పుడు ఆయన కూతురుగా తను.

స్పెషన్ క్యాబిన్‌లో అడుగుపెట్టాక–

ఈసారి తండ్రి ఛైర్‌లో కూర్చోడానికి–

ఆమె సందేహించలేదు.

"నా పేరు అనూరాధ మేడం. అంతా అను అని పిలుస్తారు. నేను మీ పర్సనల్ సెక్రటరీని" ఎదురుగా నిలుచున్న యువతి తనను తాను పరిచయం చేసుకుంది.

తను అందంగా వుంది.

కాని వయసులోను, అనుభవంలోను చాలా చిన్నది.

"మా డాడీ పర్సనల్ సెక్రటరీ మిస్ స్టెల్లా ఇప్పుడిక్కడ పని చేయటంలేదా?" వెంటనే అడిగింది వెన్నెల.

చెప్పటానికి సందేహిస్తున్నట్టు కొంచెం యిబ్బందిగా చూసింది అను.

"ఆమె ఇక్కడే పనిచేస్తున్నారు మేడం. ఇంతకుముందు నేను అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో డి.టి.పి. ఆపరేటర్‌గా పనిచేసేదాన్ని. సెక్రటరీ కోర్సు కూడా చేసాను. ఏం జరిగిందో నాకు తెలీదు. నన్నిక్కడకు మార్చారు. స్టెల్లాను మా డిపార్ట్‌మెంట్‌కు మార్చారు. ఆమెను ఎందుకు డిమోట్ చేసారో నాకు తెలీదు" అంది.

"ఓ.కె... వెళ్ళి పర్సనల్ డిపార్ట్‌మెంట్ హెడ్‌కి ఫోన్‌చేసి నాతో మాట్లాడమన్నానని చెప్పు. యుకెన్ గో" సీరియస్‌గా చెప్పింది వెన్నెల.

అను బయటికెళ్ళిపోయింది.

రవీందర్ ఇంకా రాలేదు.

తన సంతకాలకోసం టేబిల్‌మీద ఫైళ్ళు ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతానికి రవీందర్ చెప్పినట్టు చేయాలి, తప్పదు. తనొక రబ్బర్‌స్టాంప్. అంతే... కాని... ఎక్కడో పొరబాటు జరుగుతోందనే ఫీలింగ్ ఆమెను కలవరపెడుతోంది స్టెల్లాను గతంలో ఒకటి రెండుసార్లు తను చూసింది. డాడీకి ఎంతో నమ్మకమైన పి.ఎ. ఆమె. డాడీ విమానం ఎక్కే క్షణం ముందువరకు ఆయనతోనే వుంది. చివరి నిముషంలో తనొక్కడే విమానం ఎక్కాడాయన. లేకపోతే ఆయనతో బాటు స్టెల్లా కూడా మరణించి వుండేది. కంపెనీలో ఎంతో అనుభవం వున్న స్టెల్లాను డిమోట్ చేయాల్సిన అవసరం ఏమిటి?

టెలిఫోన్ మోగటంతో–

ఆమె ఆలోచనలు చెదరిపోయాయి.

రిసీవర్ ఎత్తింది.

అవతల జేమ్స్ లైన్‌లో వున్నాడు.

"మా డాడీ సెక్రటరీ ఇప్పుడు ఎక్కడ వుంది?" సూటిగా అడిగింది.

"ఎక్కడ అంటే ఖచ్చితంగా తెలీదు మేడమ్! కంపెనీలోనే వుందో. రిజైన్‌చేసి వెళ్ళిపోయిందో తెలీదు. ఇలాంటివి నా అసిస్టెంట్స్ చూస్తారు."

"మరి మీరేం చూస్తారు మిష్టర్ జేమ్స్? ఆమె పేరయినా మీకు గుర్తుందా? ప్రస్తుతం అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో వుంది మిస్ స్టెల్లా. కారణాలు నాకు వివరించనక్కర్లేదు. కారణం లేందే ఎవరూ అబద్ధాలు చెప్పరు. పది నిమిషాల్లో స్టెల్లా ఇక్కడుండాలి. ఇట్స్ ఏనార్డర్..." కొరడా ఝుళిపిస్తున్నట్టు ఆర్డర్‌వేసి రిసీవర్ పెట్టేసింది వెన్నెల.

ఎదురుగా వున్న ఫైల్స్‌ని చకచకా చదివి సంతకాలు చేసింది. తను సంతకం చేసేచోట ప్రెసిడెంట్ అండ్ బోర్డ్ ఛైర్‌పర్సన్ అని బోర్డ్ అక్షరాల్ని గమనించింది.

రివాల్వింగ్ ఛైర్లో వెనక్కి తిరిగింది. గ్లాస్ విండోగుండా హుస్సేన్‌సాగర్ అందాలు అద్భుతంగా కనిపిస్తున్నాయి. డాడీ కూడా ఇలాగే సిటీ అందాల్ని చూస్తూ ఆలోచించేవారేమో, ఎన్ని మార్పులు వచ్చినా తనకి హైదరాబాద్ అంటే చాలా యిష్టం. ఒక్క హైదరాబాదే కాదు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలూ అభివృద్ధి పేరుతో రూపురేఖలు మార్చుకుంటున్నాయి.

రాజమండ్రి కూడా అంతే.

తను పుట్టింది రాజమండ్రి దగ్గర్లోని కడియం అట. పూలు నర్సరీ వ్యాపారాల్లో కడియంది నెంబర్ వన్ స్థానం. అక్కడికి ఒకసారి వెళ్ళి రావాల్సిన పనివుంది. ఇక్కడ పనుల వత్తిడి లేకపోతే ఈపాటికే వెళ్ళిరావాలి.

రామకృష్ణంరాజుగారు డాడీకి చాలా క్లోజ్ ఫ్రెండ్.

ఆయనకు వికారాబాద్ వద్ద స్థలాలున్నాయి.

ఆ స్థలాలు తనకు అవసరం.

వయసు పెరగటంతో సిటీలోని బిజీ జీవితం నచ్చక కడియం వెళ్ళిపోయి అక్కడ ప్రశాంతంగా గడుపుతున్నాడాయన.

ఇంటర్‌కం మోగటంతో వెన్నెల ఆలోచనలు ఆగిపోయాయి.

"మేడం. మిస్ స్టెల్లా హియర్... లోనికి పంపించమంటారా?" అను గొంతు విన్పించింది.

"ప్లీజ్ సెండ్" అంది వెన్నెల.

స్టెల్లా లోనకు వచ్చింది.

తనకన్నా కొంచెం వయసులో పెద్దది స్టెల్లా. చాలా హుందాగా అందంగా నవ్వుతూ దగ్గరకొచ్చింది స్టెల్లా.

"థాంక్యూ మేడం" అంది వస్తూనే.

"దేనికి?"

"నన్ను మీరు గుర్తుంచుకుని పిలిపించినందుకు."

"గుర్తుండిపోయే కొందరుంటారు. వాళ్ళని మర్చిపోలేం. మా డాడీకి నీమీద వున్న నమ్మకం ఎంతో నాకు తెలుసు. ప్లీజ్ సిడౌన్."

"థాంక్యూ."

ఎదురుగా చెయిర్‌లో కూర్చుంది స్టెల్లా.

"నిన్నువేరే శాఖకు ఎందుకు మార్చారు?" సూటిగా విషయాని కొస్తూ అడిగింది వెన్నెల.

"సారీ మేడం. అది మార్చిన వాళ్ళకే తెలియాలి. నేను అడిగి మార్పించుకోలేదు. ఆరోజు మీ డాడీవెంట నేనూ విమానంలో వెళ్ళుంటే ఆయనతోబాటే మరణించి వుండేదాన్ని అది నాకు హేపీ. బ్రతికినంతకాలం టైగర్‌లానే బ్రతికారాయన. ఇప్పుడిక్కడ నక్కలు రాజ్యమేలుతున్నాయి. నన్ను వేరే శాఖకు మార్చి అవమానించారు. అయినా డాడీమీద అభిమానంతోనే రిజైన్‌చేసి వెళ్ళలేకపోయాను" అంటూ చెప్పింది.

స్టెల్లా కళ్ళలో తొంగిచూస్తున్న కన్నీటిని స్పష్టంగా చూసింది వెన్నెల. స్టెల్లాలో చాలా బాధ ఆక్రోశం వున్నాయి.

"నిన్ను డీ మోట్ చేసిందెవరు?" అడిగింది.

"సారీ... మీకు అర్థమైన విషయాన్ని నాచేత చెప్పించాలని చూడకండి. మీరు నన్ను పిలిపించారంటేనే నాకు అర్థమయింది. టైగర్ తన వారసత్వాన్ని మీకే ఎందుకిచ్చారో. ఎనీవే... టైగర్ తర్వాత ఇక్కడ అన్ని విషయాలు తెలిసిందాన్ని నేనే. టైగర్ ఏదీ నా నుంచి దాచలేదు. నేను మీకు అందుబాటులో వుండకుండా చేయాలనే నన్ను ప్రాధాన్యతలేని పోస్ట్‌లోకి మార్చారు. నేను మీకు ఉపయోగపడతానని మీరనుకుంటే, అయాం రెడీ."

"థాంక్యూ స్టెల్లా. వచ్చీ రాగానే నిన్ను పిలిపించానంటే కారణం అదే. ఈ క్షణం నుంచీ నా పి.ఎ.గా నిన్ను తీసుకుంటున్నాను. నీ సేవలు డాడీకే కాదు. నాకూ అవసరమే."

"థాంక్యూ మేడం."

"ఒక్క విషయం. నీకన్నా వయసులో చిన్నదాన్ని. కాబట్టి మనం ఒంటరిగా వున్నప్పుడు మామూలుగా మాట్లాడుకోవచ్చు. మేడం అంటూ పదేపదే అనక్కరలేదు."

"ఒకె... మేడం."

ఇద్దరూ నవ్వుకున్నారు.

"డాడీ మీ గురించి చాలా గర్వపడేవారు. ఆ విషయం నా దగ్గరే ఎన్నోసార్లు చెప్పారు. మీ ఇద్దర్నీ దగ్గర చేయాలని నేనూ ప్రయత్నించాను. అది నా కూతురేగా. ఓ మెట్టు దిగివచ్చి డాడీ అని పిలిస్తే పలకనా? దానికంత పట్టుదలవుంటే, పెద్దవాడ్ని నాకెంత వుండాలి? వస్తుంది. ఓరోజు తనే నా వద్దకొచ్చి డాడీ అంటుంది అనేవారాయన. మొండి మనిషి...." అంది.

ఆ మాటలు వింటుంచే వెన్నెల కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నిజమే. తను ఇప్పటికీ బాధపడేది ఆ విషయం గురించే...

పట్టుదలకుపోయి, ఆయన కడసారి చూపుకి నోచుకోలేకపోయింది.

"మొండితనం మా ఫ్యామిలీ ట్రేడ్‌మార్క్ మిస్ స్టెల్లా. ఏం చేస్తాం? చూస్తున్నావ్‌గా. ఆయన పోతూ పోతూ నా భుజాలమీద చాలా భారం మోపారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టి, నేను సక్రమంగా ఈ గ్రూప్ ఆఫ్ కంపెనీలను నడిపించాలంటే నీ సహకారం అవసరం. ఇక్కడ మిత్రులున్నారు. శత్రువులు వున్నారు. ఎవరెవరో తెలుసుకోవటం కష్టం. నువ్వు నా పక్కనుండాలి. తప్పదు."

"ష్యూర్... చెప్పాగా. టైగర్ తర్వాత ఆ స్థానంలో మిమ్మల్ని చూస్తుంటే చాలా ఆనందంగా వుంది. టైగర్‌ని దెబ్బ తీయటానికి కుట్రజరుగుతోంది. ఆ విషయం నేను హెచ్చరించాను. ఆయన చర్య తీసుకునేలోపలే ప్లేన్ క్రాష్ జరిగింది.

ఇప్పుడు మిమ్మల్ని పడగొట్టే ప్రయత్నాలు ఆరంభమవుతాయి. కుట్ర కంటిన్యూ అవుతోంది. మీరు నాకి అవకాశం ఇచ్చారు కాబట్టి, వాళ్ళని దెబ్బతీసే అవకాశం నాకు లభించింది. థాంక్యూ. పరిస్థితిని చర్చించటానికి ఇది ప్లేస్ కాదు గాబట్టి, ప్రస్తుతానికి ఈ విషయం వదిలేద్దాం...." అంది స్టెల్లా.

కంపెనీ అంతర్గత విషయాలన్నీ స్టెల్లాకు తెలుసని, ఆమెను తన వద్దకు రప్పించుకోవడంలోనే మొదటి విజయం లభించిందని వెన్నెల వూహించింది. తన తండ్రి పూర్తిగా నమ్మిన స్టెల్లా. ఆమె తన పి.ఎ.గా పనిచేయటానికి అంతకుమించిన అర్హతగాని సర్టిఫికెట్లుగాని అక్కరలేదు.

"ఒకె. స్టెల్లా. పి.ఎ.గా నీ హోదాని పునరుద్ధరిస్తున్నాను. ఇకనుంచి నా తరపు ఇక్కడి విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత నీది. అన్నట్టు రేపు నేను రాజమండ్రి వెళుతున్నాను. ఒకటి రెండురోజుల్లో వచ్చేస్తాను. సాయంత్రం ఓసారి వివరంగా మాట్లాడుకుందాం."

"ఒకె. థాంక్యూ మేడం. నా పోస్ట్ నాకిచ్చినందుకు థాంక్యూ వెరీమచ్. బహుశ ఈ విషయంలో రవీందర్‌గారు అప్‌సెట్ అవుతారేమో మీరు...."

"నో ప్రాబ్లం. డిసిషన్ నాది. డోన్ట్‌వర్రీ. ఇప్పుడే రవీందర్‌తో మాట్లాడుతాను" అంటూ లాండ్‌లైన్ ఫోన్ దగ్గరకు లాక్కుని రిసీవర్ అందుకుంది వెన్నెల.

* * * * *

రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఆగిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోని ఫస్ట్‌క్లాస్ ఎ.సి.కోచ్ నుండి దిగింది వెన్నెల.

రైలు లేటవటంవల్ల అప్పుడప్పుడే తెల్లవారుతోంది.

జీన్స్ టీ షర్ట్ వేసుకున్న వెన్నెల, స్టేషన్ బయటకొచ్చాక ఆమె మొబైల్ మ్రోగింది.

రామకృష్ణంరాజుగారి ఫోన్.

"వెన్నెలా... అక్కడ తెల్లటిహోండా సిటీ కారు, డ్రైవర్‌తోసహా వుంటుంది.

నీ పత్రికల్లో పడ్డ ఫోటోలు చూపించాను. కారు తీసుకుని నీ దగ్గరకు వస్తాడు. డ్రైవర్ పేరు మూర్తి. చాలా నమ్మకమైన మనిషి."

"థాంక్యూ అంకుల్."

అంతలోనే తెల్లటి హోండా సిటీ కారు వెన్నెల ముందు ఆగింది. వెన్నెల కూర్చోగానే కారు కడియం దిశగా పరుగుతీసింది.

కడియంలోని ఒక పెద్ద బంగళాముందు కారు ఆగింది.

వెన్నెలని ఆహ్వానించి, ఆమెకు కేటాయించిన రూమ్‌ని స్వయంగా చూపించాడు రామకృష్ణంరాజు.

"ఫ్రెష్ అప్ అయ్యిరా... టిఫిన్ టైంకి రెడీ అవ్వాలి" అన్నాడు రాజు.

"సరే... అంకుల్" అని తన రూమ్‌లోకి వెళ్ళింది.

తన తండ్రిలాగే, రామకృష్ణంరాజు కూడా చాలా ఏళ్ళక్రితం హైదరాబాద్ వచ్చాడు. అతడు మాత్రం కేవలం రియల్ ఎస్టేట్ రంగంలోనే వ్యాపారం చేసాడు. స్థలాలు కొనడం, వెంచర్స్ వేయటం, అమ్మేయడం... అంతే. అయితే ఆయనకు తన మిడాన్ గ్రూప్‌లో షేర్స్ ఉన్నట్లు తెలుసు వెన్నెలకి.

కడియం చిన్న వూరయినా బంగళాలో అన్ని అత్యాధునిక వసతులు వుండడం గమనించింది. బయట నిలిపి వుంచిన కార్లు రామకృష్ణంరాజు స్థాయిని తెలుపుతున్నాయి.

షవర్ క్రింద స్నానం చేసాక ఫ్రెష్‌గా ఫీలయ్యింది వెన్నెల.

వెన్నెల మెట్టుదిగి టేబుల్ దగ్గరకు వచ్చింది.

రామకృష్ణంరాజు ఒక్కడే కూర్చుని వున్నాడు. పనిమనిషి రెండు ప్లేట్లలో ఇడ్లీలు, కారంపొడి, నెయ్యి సిద్ధం చేసింది.

"వెన్నెలా! హైదరాబాద్‌లో స్టార్ హోటల్‌లో కూడా ఇలాంటి ఇడ్లీలు దొరకవు. ఎలక్ట్రానిక్ గ్రైండర్లు, మిక్సీలు వచ్చాక ఏ హోటల్‌లోను మంచి రుచి రావడంలేదు. ఇక్కడ రుబ్బురోలు వాడడంవల్ల ఎంత రుచిగా వుంటాయో చూడు... అలాగే అల్లం పెసరట్లు కూడా వస్తాయి. పిజ్జాలు తిని బోర్ కొట్టలేదా? అసలు పిజ్జాలు మన దిబ్బరొట్టెలు ఉతప్పం లాంటివే" చెప్పాడు రామకృష్ణంరాజు.

వెన్నెల నవ్వి ఇడ్లీతింటూ అంది "నిజమే అంకుల్! మెషినరీతో టైమ్ ఆదా అయినా, రుచులు పోయాయి."

టిఫిన్స్ తిన్నాక, వేడివేడి కాఫీలు వచ్చాయి.

"ఇంత కమ్మటి కాఫీ త్రాగి చాలాకాలమయింది అంకుల్" అంది వెన్నెల.

"అందుకే నగర జీవితానికి దూరంగా, ఇలా ప్రశాంతంగా ఉంటున్నాను. సరే... ఏదో బిజినెస్ డీల్ మాట్లాడాలని అన్నావు. ఏ విషయం? అడిగాడు రామకృష్ణంరాజు.

"అంకుల్! నా డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి చెప్పానుగా. ఇక మీకు వికారాబాద్ వద్ద భూములున్నాయి కదా?" అంది వెన్నెల.

"వికారాబాదే కాదు... అమెరికా, ఆస్ట్రేలియాల్లో కూడా నాకు భూములున్నాయి. భూమిని సృష్టించలేం, పంచుకోగలం. అందుకే హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్‌లు, వగైరాలు... నేను సంపాదించిందంతా భూమిపైనే. అయితే ప్రస్తుతం భూముల అమ్మకంపై ఆసక్తి తగ్గింది. అలా పడి వుంటే ముందు తరాలకి పడి వుంటుందికదా అన్నది నా అభిప్రాయం." అన్నాడు రామకృష్ణం రాజు.

"నిజమే అంకుల్! కాని మీ వికారాబాద్ భూములు ఫెన్సింగ్‌వేసి, చెట్లు మాత్రం నాటారు. వెంచర్స్ చేయడంలేదు. నా ప్రాజెక్ట్‌కి మీ భూమి కావాలి. లీజు అయినా ఓ.కే. అమ్మితే ఇంకా బెస్ట్."

"వెన్నెలా! టైగర్ కూతురుగా అడిగితే ఉచితంగా కూడా ఇస్తాను."

"అంకుల్! నేను వెన్నెలగా అడుగుతున్నాను. ఇది జస్ట్ బిజినెస్ డీల్. పర్సనల్ విషయం కాదు."

"నువ్వు టైగర్‌తో దెబ్బలాడి, స్వయంగా ఎంత పైకి వచ్చావో నాకు తెలుసు. టైగర్ నీ విజయాలు చెప్పి, చిన్నపిల్లాడిలా నావద్ద సంబరపడేవాడు. సరే ఒక బిల్డర్‌గానే మాట్లాడు. కానీ నాకా భూములు అమ్మే ఉద్దేశ్యంలేదు. పైగా హైదరబాద్ శరవేగంగా విస్తరిస్తోంది. ఇంకో పదేళ్ళకు రెండో ముంబాయిలాగా అయినా ఆశ్చర్యంలేదు. అయితే ఇప్పుడు అక్కడ అన్నీ దొరుకుతాయి ప్రశాంతత తప్ప."

"అంకుల్! మీరు రేటు ఎక్కువ ఆశిస్తున్నారా?"

ఆ మాటకు కృష్ణంరాజు గట్టిగా నవ్వి అన్నాడు–

"వెన్నెలా! ఇప్పటికే నా ఆస్థి నాలుగు తరాలకు సరిపోయేంత వుంది. డబ్బుమీద నేను ఇంకా హైదరాబాద్‌లోనే వుండేవాడ్ని. నా ఇద్దరు కొడుకులు కూడా రియల్ ఎస్టేట్ ఇష్టపడక, అమెరికాలో సెటిలయ్యారు. సరే ఆ భూములకు నీవెంత ఇవ్వగలవో చెప్పు" అడిగాడు.

తన అభిప్రాయం చెప్పింది వెన్నెల.

"సరే... వెన్నెలా! రేట్ కాదుగానీ, పర్యావరణంవల్ల నాలాగే నీకు అవగాహన వుంది. ఆ ఒక్క పాయింట్‌కే నీకు ఆ భూములు అమ్ముతాను. ముందే చెప్పాను. టైగర్ కూతురుగా అయితే ఉచితంగానే ఇస్తానని... కాదు రేటు ఇస్తానంటున్నావ్ కాబట్టి ఒక షరతు–

నాకు డబ్బు నగదు రూపంలో ఒకే చెల్లింపులో జరగాలి."

"అలాగయితే నాకు కష్టంకదా. మీకు వాయిదాల పద్ధతిలో ఇస్తాను. వడ్డీతోసహా. క్యాష్‌ని లిక్విడ్‌గా వుంచడం నాకు అలవాటు...."

ఆమె మాటల్ని అడ్డుకుని అన్నాడు. "డబ్బు విషయం సమస్య కాదు. అయితే దాన్ని నువ్వు చెల్లించే విధానం నాలో ఆలోచనల్ని కలిగిస్తోంది. వెన్నెలా... నేను బిజినెస్‌లో నో అంటే 'నో' నే. పైగా ఎవరికీ కారణం కూడా చెప్పను. కాని టైగర్ మీదున్న అభిమానంతో నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"ఏ విషయాలు?" ఆశ్చర్యపోతూ అడిగింది వెన్నెల.

కాసేపు ఆలోచించి అన్నాడు. "వెన్నెలా! నువ్వు నీ తండ్రి కంపెనీలకు ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యావు కదా?"

"అవునంకుల్! మిడాన్ గ్రూప్ చాలా పెద్ద గ్రూప్. అది తనంతట తానే స్మూత్‌గా నడుస్తుంది." అంది వెన్నెల.

రామకృష్ణంరాజు మళ్ళీ రెండో కాఫీ తాగసాగాడు.

వెన్నెల రెండో కాఫీ వద్దంది. ఎసిడిటీ వల్ల ఈ మధ్య టీలు–కాపీలు తగ్గించానని చెప్పింది.

కాఫీ త్రాగాక చెప్పాడు రామకృష్ణంరాజు వెన్నెలా! నువ్వు ఒకేసారి మొత్తం చెల్లిస్తే ప్రాబ్లం ఉండేది కాదు. అసలు అమ్మడమే ఇష్టంలేదు. నీకని సరేనన్నాను. కాని...." అని ఆగాడు.

"ఒకేసారి చెల్లింపుపై అంత పట్టుదలగా ఉన్నారంటే అంకుల్! నాపై నమ్మకంలేదా?" అడిగింది వెన్నెల.

"వెన్నెలా! బిజినెస్ పరంగా మాట్లాడుతున్నాను. నీ ప్రాజెక్ట్ ఒకవేళ ఫెయిల్ అయితే, నీ బ్యాంకర్స్ నా ఆస్తిని సీజ్ చేస్తారు. కోర్టులో కేసులు తొందరగా తేలవు.

వెన్నెలలో చిన్నగా వణుకు.

"అంకుల్! మీరు కూడా నా ప్రాజెక్ట్‌ని నమ్మడంలేదా? ఒకవేళ ఫెయిల్ అయితే అన్నారు. నిజానికి నేను ఇప్పటివరకు ఏ ప్రాజెక్ట్‌లోనూ ఫెయిల్యూర్ చూడలేదు. అది మీకు తెలిసే వుంటుంది" అంది వెన్నెల నచ్చచెప్పే ధోరణిలో.

కాసేపు దీర్ఘంగా ఆలోచించి మెల్లిగా చెప్పాడు రామకృష్ణంరాజు.

"మిడాన్ గ్రూప్ కుప్పకూలిపోతే, దీనితోపాటు నువ్వూ మునిగిపోతావు. ఆ గ్రూప్‌కి నువ్వే ప్రెసిడెంట్ కదా! అలాగే నీ సొంత డ్రీమ్ ప్రాజెక్ట్ కూడా ట్విన్‌టవర్స్‌లా, పేకమేడలా ఒక్కసారిగా అదీ కూలిపోతుంది. బిజినెస్ సర్కిల్స్‌లో నీ పేరు పోతుంది.

టైగర్ అంటే నాకు చాలా అభిమానం. మా మధ్య స్నేహం కూడా నీకు తెలుసు. టైగర్ బ్రతికివుంటే గ్రూప్‌ని రక్షించేవారేమో? ఎందుకంటే అందుకుతగ్గ సమర్ధత, పరిచయాలు టైగర్‌కున్నాయి."

రామకృష్ణంరాజు మాటలకి చాలా ఆశ్చర్యపోయింది వెన్నెల.

"అంకుల్! ఈ విషయం మీకెలా చేరిందో... ఆశ్చర్యంగా వుంది. మిడాన్ గ్రూప్ లాభాల్లో వుంది."

"వెన్నెలా! నువ్వు లా చదివావు. ఈ విషయాలన్నీ నీకు తెలీదా?" అడిగాడు రామకృష్ణం రాజు నమ్మలేనట్టు.

"లేదంకుల్! మిడాన్ గ్రూప్ చాలా పటిష్టంగా వుంది" అంది వెన్నెల రోషంగా.

"వెన్నెలా! ఓ విషయం మర్చిపోయాను. ముసలితనం వచ్చిందికదా. నువ్వు టైగర్ గొడవలోపడి నాలుగేళ్ళు వేరుగా వున్నావుగా-గ్రూప్‌లో ఏం జరిగిందో... జరుగుతుందో నీకు అంతగా తెలియవు. తెలుసుకునే ప్రయత్నాలు కూడా నువ్వు చేసినట్టులేదు."

"వెన్నెల మొహం ఒక్కసారిగా కందగడ్డలా మారింది.

"అంకుల్! మీకీ తప్పుడు సమాచారం ఎవరిచ్చారు?" అని ప్రశ్నించింది.

"నీ తండ్రి" కూల్‌గా బదులిచ్చాడు రామకృష్ణంరాజు.

"డాడీ చెప్పారా?" ఆశ్చర్యపోతూ అంది వెన్నెల.

"అవును. ఆయన చనిపోవడానికి మూడు నెలలకు ముందు కడియం వచ్చారు. టైగర్ కంపెనీల్లో నాకు షేర్లు వున్నాయి. నిజానికి నాకు సన్నిహితుడయిన ఓ వ్యక్తి బోర్డు మెంబర్ కూడా. తన కంపెనీలను గట్టెక్కించడానికి నా సహాయానికై టైగర్ ఇక్కడకు వచ్చారు."

ఆయన చెప్పేది అబద్ధమైతే బాగుండును అని మనసులో అనుకుంది వెన్నెల.

"అంకుల్! నేను ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ చదివాను" సమర్థించుకోబోయింది వెన్నెల.

"కాగితాలమీద అంతా సవ్యంగానే కన్పిస్తాయి. నీవు గత సంవత్సరం రిజల్ట్స్ చదివివుంటావు. అవి ఫిక్షన్‌నవల్స్‌గా బాగా పనికొస్తాయి. కల్పిత కథలు" అని ఆగాడు రామకృష్ణంరాజు. తరువాత తనే మళ్ళీ చెప్పసాగాడు.

"నా దగ్గరకు వచ్చినప్పుడు ఏం జరిగిందో చెప్పారు. ఎలా సరిదిద్దాలో కాస్త టైమ్‌తీసుకుని చూద్దామని అన్నాను. ఒకవేళ సరిదిద్దగల పరిస్థితులుంటే నేను సహాయపడేవాడ్నే. లేకుంటే నా షేర్స్ ముందే అమ్మేసేవాడిని. నేనూ వ్యాపారస్తుడ్నే కదా."

"నా తండ్రి స్థానంలో ఇప్పుడు నేనున్నాను. డాడీ ఏం చేయగలరో నేనూ ఇప్పుడు చేయగలను" అంది వెన్నెల. అయితే ఆమె గొంతులో పూర్తి ధీమాలేదు.

"వెన్నెలా! ఫ్రాంక్‌గా చెప్పాలంటే నువ్వు ఏమీ చేయలేవు. అందుకే నా భూములకి పూర్తిగా ఒకేసారి నగదు చెల్లింపు అడుగుతున్నాను."

"అంకుల్! నా మీద మీకు నమ్మకంలేనట్లుంది. డాడీతో గొడవపడి ఒక్కరూపాయి కూడా తీసుకోకుండా బిల్డర్‌గా ఎదిగినదాన్ని."

"వెన్నెలా! అదే ప్రాబ్లమ్. నీవు ఒక్క మిడాన్ గ్రూప్ గురించే ఆలోచించాల్సివస్తే, నీకు అక్కడ అంత అనుభవంలేకపోయినా, టైగర్‌లా నీ సమర్థతతో గ్రూప్‌ని మునిగిపోకుండా కాపాడగలిగే ఛాన్స్ వుంది. అయితే నాకు తెలిసిన విషయం ఏమిటంటే, నువ్వు పూర్తిగా నీ సొంత డ్రీమ్ ప్రాజెక్ట్‌పై

నీ సంపాదన, ఆస్థి, టైమ్ అన్నీ పెట్టావు. రెండు పడవలపై కాళ్ళు పెట్టావు. కాబట్టి నువ్వు మునిగిపోవటం ఖాయమని నా భయం.”

“నేను రెండూ నిర్వహించగలను.”

“అలా అయితే బాగుండేది. కాని కుదరదు. ఎవరో నిన్ను పావుగా వాడుకుంటున్నారని నాకు అనిపిస్తోంది.”

వెన్నెలకి సంగతి అర్థమైంది. రామకృష్ణంరాజు సరదాగా ఆ మాటలు అనడంలేదు. అందుకే “అసలేం జరిగింది అంకుల్!” అని అడిగింది.

“వెన్నెలా! చెప్పటానికి చాలా సమయం పడుతుంది. ముందు సమస్య మిడాస్ ఫిల్మ్‌లో ప్రారంభమైంది చెప్పసాగాడు రామకృష్ణంరాజు.

* * * * *

రైలు రాజమండ్రి బ్రిడ్జిపైకి రాగానే ఒక్కసారిగా శబ్దం మారిపోయింది.

బ్రిడ్జిలపై రాగానే రైలు శబ్దం మారడం– అదీ లయబద్ధంగా వుండడం చిన్నప్పట్నించీ వెన్నెలకి చాలా ఇష్టం.

ఎ.సి. కోచ్‌లో సన్‌ఫ్రెమ్‌గ్లాసెస్‌లోంచి ప్రకృతి అందాలు సరిగ్గా కనపడవని డోర్ తీసి నిలబడి చూడసాగింది వెన్నెల.

క్రింద విశాలంగా గోదావరి ప్రశాంతంగా పరిగెడుతోంది. అయితే వెన్నెల మనసు రిలాక్స్‌డ్‌గాలేదు. ఆమె మదిలో రామకృష్ణంరాజు మాటలే మ్రోగుతున్నాయి.

రామకృష్ణంరాజుకి అన్ని విషయాలూ కూలంకుషంగా తెలుసు. ముందు అనుమానపడ్డా, ఆయన చెప్పిన విషయాలు విన్నాక నమ్మక తప్పలేదు వెన్నెల.

మిడాస్ గ్రూప్ ఒక్కసారిగా కుప్పకూలిపోయే దిశలో వుంది. గ్రూప్‌లోని ప్రముఖ కంపెనీలన్నీ ఆర్థికంగా సమస్యలతో ఊగిసలాడుతున్నాయి. తన తండ్రి తాను మరణించే కాలానికి కొద్ది ముందుగా ఈ విషయం తెలుసుకున్నాడని రామకృష్ణంరాజు ద్వారా తెలుసుకుంది.

తన తండ్రిపై జాగ్రత్తగా ఉచ్చులు బిగించారు. మరి ఇది ధనదాహమా? కీర్తి దాహమా? లేక పగ తీర్చుకోవడమా... ఎందువల్ల జరిగిందో అర్థంకాలేదు వెన్నెలకి.

ఇక ఇప్పుడు తనను ఉచ్చులోకి లాగుతారు. టైగర్‌కు కంపెనీ వ్యవహారాలు బాగా తెలుసు. కాబట్టి ఎలాగో బయటపడేవారు. పైగా ఆయనకి గ్రూప్ ఒక్కటే వుంది. కాని తను?

దీనికి మూలకారణం రవీందర్ అని తెలిసి చాలా ఆశ్చర్యపోయింది. ఎందువల్ల అతనికి పగ? తనను పైకి తెచ్చిన టైగర్‌కి వెన్నెపోటు పొడవాలని ఎందుకు నిర్ణయించుకున్నట్లు? తన తండ్రి మరణం తరువాత, తననో రబ్బర్‌స్టాంప్‌లా వుండేలా నమ్మించాడు. కారణం? తన సందేహం నిజమని రామకృష్ణంరాజుగార్ని కలవటంలో రుజువయింది.

ఒక్కసారిగా ఒంటరితనం ఫీలయ్యింది వెన్నెల. తన అన్న శరత్, వదిన విజృంభన సహాయపడరు. ఎప్పుడూ తన స్వంత నిర్ణయాల గురించి గర్వంగా అనుకునేది. కాని ప్రస్తుతం ఎవరితోనన్నా తన మనసులోని బాధని పంచుకోవాలని అనిపిస్తోంది.

అనూప్‌తో ఒకనాటి తన ప్రేమ మళ్ళీ చిగురిస్తే బాగుండు. కాని ఆ ఛాన్స్‌లేదు. తమ దారులు వేరయిపోయాయి. తనకు ఎవరూ తోడులేరు. తను ఒంటరి. జీవితం పోరాటం కోసమే అయితే తను పోరాడుతుంది. ఇందులో విజయమో, వీరస్వర్గమో కాలమే చెప్పాలి.

* * * * *

కడియంలో రెండు రోజులు వుంది వెన్నెల.

అనుభవజ్ఞుడయిన రామకృష్ణంరాజు నుంచి చాలా విషయాలు తెలుసుకుంది. ఆయన చెప్పిందాన్ని బట్టి తను వూహించినట్టు అంతా సవ్యంగా జరిగే అవకాశం లేదని గ్రహించింది.

ఎందుకంటే మొదట తన ప్లాన్ వేరు.

తనకి తన ప్రాజక్టు, తన పనులు ముఖ్యం. అని సక్రమంగా జరిగేలా చూసుకోవాలంటే తన తండ్రి మిడాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కి ఎక్కువ టైం

కేటాయించలేదు. అనుభవంగల రవీందర్ అంతా తను చూసుకుంటానని హామీ ఇవ్వటంచేత అక్కడ రబ్బరుస్టాంప్‌గా మాత్రమే వ్యవహరిస్తూ కార్యాభారాన్ని రవీందర్‌కే విడిచిపెట్టొచ్చని వూహించి అతడి డీల్‌కి అంగీకరించింది.

కాని అసలు సమస్యే రవీందర్ అని ఇప్పుడు స్పష్టం గావటంతో తను తప్పుచేసాననే ఫీలింగ్ ఆమెకు ఏర్పడింది. ఆ సమస్య గురించి ఆలోచిస్తూనే ఆమె హైదరాబాద్‌కు చేరుకుంది. ఇక అసలు కడియం వెళ్ళిన అసలు పని వికారాబాద్ భూముల విషయం. త్వరలోనే హైదరాబాద్ వస్తానని అప్పుడు ఆ భూముల క్రయవిక్రయాలు చూసుకుందామని ఆయన హామీ యిచ్చాడు. అదలా వుంచితే–

వెన్నెల హైదరాబాద్ రాగానే మరునాడు ఉదయం పదిగంటలకి హెచ్.ఎస్. క్లబ్‌కి హాజరు కావాలని మేసేజ్ అందింది. దాంతో మరింతగా అప్‌సెట్ అయింది వెన్నెల. ఇప్పుడున్న సమస్యలు చాలవని ఇప్పుడు క్లబ్ వ్యవహారం ఒకటి. ఈ ఆలోచనలతోనే ఆమె ఆ రోజు మిడాన్ గ్రూప్‌కి వెళ్ళలేదు. తను ఇక్కడలేని ఈ రెండ్రోజుల్లోనూ ఇక్కడ ఏం జరిగిందో తెలుసుకునే ఉద్దేశంతో పి.ఎ. స్టెల్లాను తన ఫ్లాట్‌కే రప్పించుకుంది.

"నాకు తెలుసు. రామకృష్ణంరాజుగారు చాలా నిజాయితీ మనిషి. మీ డాడీ తరచూ అంటూండేవాడు. ఈ ప్రపంచంలో నేను నమ్మతగ్గ మంచి స్నేహితుడు రాజుగారే అని. రవీందర్‌ని అంచనా వేయటంలో ఆయన పొరబాటు పడలేదు" అంది స్టెల్లా.

"అవును. ఆయన్ని కలిసాక నాకు చాలా విషయాలు అర్ధమయ్యాయి" అంది వెన్నెల.

"ఇక్కడ పరిస్థితులు చాలా వేగంగా మారుతున్నాయి. ఆ విషయం నీకు అర్ధంగావటంలేదు నాకు మాత్రం కలవరం పుట్టిస్తున్నాయి."

"చెప్పు. ఏమిటి విశేషాలు?"

"నీ అన్న శరత్‌చంద్ర కోర్టుకు వెళ్ళే వుద్దేశంతో వున్నట్టు వదంతులు వినిపిస్తున్నాయి. దానికి బలం చేకూర్చే విధంగానే శరత్‌చంద్ర మూవ్‌మెంట్స్ కన్పిస్తున్నాయి. మొన్న ఒక బార్‌లో శరత్‌చంద్ర ఆనంద్ యస్ అని పిలవబడే

బిజినెస్ రిపోర్టర్‌ని కలిసాడు. అతను ఒక ప్రముఖ ఆంగ్లపత్రికకి బిజినెస్ రిపోర్టర్.

"తర్వాత?"

"నిన్న ఒక పార్టీ జరిగింది. ఆ పార్టీలో రవీందర్ శరత్‌చంద్రని కలిసి చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. శరత్‌చంద్రలో ఏదో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నట్టు రిపోర్ట్. ఏం మాట్లాడుకున్నారో తెలీదుకాని రవీందర్ శరత్‌లో ఏవో ఆశలు రేకెత్తిస్తున్నాడని నా డౌట్."

"లేదు స్టెల్లా. వదినకి మగాళ్ళ పిచ్చి. చీరలు మార్చినట్టు మగాళ్ళను మార్చేస్తుంది. నన్ను ఢీకొనే గట్స్ వదినకు లేవు. మరేమన్నా కబుర్లుంటే చెప్పు."

"హాట్ న్యూస్ ఒకటుంది."

"ఏమిటి చెప్పు."

"మధుసూదన్‌రెడ్డిగారు హెచ్.ఎస్.క్లబ్‌కి రాజీనామా చేసారు."

"డామిట్. నేన్నమ్మను"

"నువ్వు నమ్మినా, నమ్మకపోయినా జరిగింది అదే. అనారోగ్య కారణంగా తను హెచ్.ఎస్. క్లబ్‌కి సరయిన సేవలందించలేకపోతున్నానంటూ రాజీనామా చేస్తూ తన వారసుడిగా తన స్థానాన్ని తన కొడుకు నిరంజన్‌కు కేటాయింపజేసాట్ట. నీ విషయంలో అయితే ఎన్నిక వాయిదా వేసారు. కాని నిరంజన్‌కు వెంటనే శాశ్వత సభ్యత్వం ఇచ్చారు. ఖచ్చితంగా ఇది పురుషాహంకారమే కదూ?" అంటూ నవ్వింది స్టెల్లా.

"అఫ్‌కోర్స్... కావచ్చు. కాని మధుసూదన్‌రెడ్డిగారు సడెన్‌గా ఈ నిర్ణయం తీసుకోడానికి కారణం ఏమైవుంటుంది? నాకు సభ్యత్వం రాకుండా అడ్డుకునే వుద్దేశంతోనే ఆయన నిరంజన్‌కి అవకాశం యిచ్చి వుంటాడా?" ఆలోచిస్తూ అడిగింది వెన్నెల.

"ఆ పని ఆయనే చేయొచ్చుగా. రాజీనామా చేసి సభ్యత్వం కొడుక్కి ఇప్పించాల్సిన అవసరంలేదు."

"నిజమే కాని ఒక విషయం మర్చిపోతున్నావ్. మా డాడీకి క్లోజ్ ఫ్రెండ్‌లో మధుసూదన్ రెడ్డి గారొకరు. ఇంతవరకు లేడీస్‌కు క్లబ్‌లో సభ్యత్వంలేదు. నేను ఎన్నికకావటం ఆయనకు ఇష్టంలేదు. నాకు వ్యతిరేకంగా ఓటువేస్తే డాడీ నిర్ణయాన్ని వ్యతిరేకించినట్టవుతుంది. అదే నిరంజన్ అయితే ఈ సమస్య రాదు. అందుకే ఇలాచేసి వుండొచ్చు.

"అదే నిజమయితే క్లబ్ మెంబర్స్‌లో నీకు వ్యతిరేకులు వున్నారని అర్ధమవుతోంది. ఓసారి విడివిడిగా వాళ్ళని కలుసుకుని మాట్లాడితే మంచిది కదూ?"

"లేదు. అలాంటి వుద్దేశం నాకు లేదు స్టెల్లా. పదవులకోసం రాజకీయాలు నడపటం, లాబీలు నిర్వహించటం, రిక్వెస్ట్‌లు చేయటం నాకు నచ్చని విషయాలు. అందుకే ఇంతవరకు మెంబర్‌షిప్ విషయంగా నేను ఎవరినీ కలవలేదు. అలాగని సభ్యత్వం వదులుకుంటాని అర్ధంకాదు. నిన్నటిదాకా సభ్యత్వం రాకపోతేనే మంచిది అనే ఆలోచనలో వున్నాను.

ఎందుకంటే, ఇప్పటికే నేను రెండు పడవల మీద కాళ్ళు పెట్టాను. ఇప్పుడు నాది హెచ్.ఎస్. క్లబ్ విషయంలో సభ్యత్వం ప్లస్ ఛైర్మన్ సమస్య.

డాడీ ఆకాలమరణంతో ఆయన సభ్యత్వమే కాదు. ఆయన స్థానంలో కూడా నేను కూచుని క్లబ్ కార్యకలాపాలు నిర్వహించాలి. అందుకే వదులుకుందామనుకున్నాను.

కాని ఇక్కడ మిడాన్ గ్రూప్ పరిస్థితులు చూసాక ముందు ముందు ప్రత్యర్ధుల్ని ఎదుర్కోవాలంటే హెచ్.ఎస్.క్లబ్ పగ్గాలు కూడా నా చేతిలో వుంటే మంచిదనిపిస్తోంది.

అందుకే రేపు క్లబ్ సమావేశానికి వెళ్ళే ఉద్దేశంతోనే వున్నాను. ఓ.కె! వస్తే పదవి, లేకపోతే... నో ప్రాబ్లం. అంతేగాని దానికోసం ఎవరినీ దేవిరించే ఉద్దేశం మాత్రం నాకు లేదు." అంటూ తన మనోభావాన్ని బయటపెట్టింది వెన్నెల.

"నిరంజన్‌తో పరిచయం వుందా?" అడిగింది స్టెల్లా.

"పరిచయంలేదు. బట్ చూసాను. అతను రాజకీయాల్లో ఉండాల్సిన మనిషి కాదు" అంది వెన్నెల.

"మరి. సినిమాల్లో హీరోగా ఉండాల్సిన వాడనా? చిన్న వయసులోనే ఎమ్మెల్యే అయ్యాడు. వెరీ నైస్ గై!" అంటూ నవ్వింది స్టెల్లా.

ఆమె నవ్వుతో శృతి కలిపింది వెన్నెల.

* * * * *

మిడాన్ గ్రూప్‌కి సారథ్యం వహిస్తుండటంతో అక్కడికి వెళ్ళేప్పుడు ప్యాంటు, షర్టు ఆపైన బ్లేజర్ ధరించి కార్పొరేట్ డ్రస్‌లో వెళుతోంది వెన్నెల. కాని మొదటిసారిగా హెచ్.ఎస్. క్లబ్‌కి వెళుతోందిప్పుడు. ఒక అమ్మాయిగానే వెళ్ళాలనుకుంది. చక్కటి ఆరు రంగులున్న ఇంద్రధనుస్సు చీర, బ్లౌజ్ వేసుకుని తన అందాలు ఉట్టిపడేలా సాంప్రదాయంగా తయారై తన బెంజ్ కారులో ఆర్ట్ గ్యాలరీకి చేరుకుంది వెన్నెల.

ఆర్ట్‌గ్యాలరీ డైరక్టర్ మెహబూబ్ ఎంతో మర్యాదగా ఆమెను తీసుకెళ్ళి కాన్ఫరెన్స్ హాల్లోకి పంపించి తలుపులు మూసాడు. తర్వాత షరా మామూలే. లోపల సంభాషణ వినటం కోసం వేగంగా తన ఛాంబర్‌కు వెళ్ళిపోయాడు.

అప్పటికే లోన సభ్యులు ఎనిమిదిమంది సమావేశమై వున్నారు. వాళ్ళలో వెన్నెలకి తెలిసిన వాళ్ళున్నారు. తెలీని వాళ్ళున్నారు. అందరిలోకి వయసులో చిన్నవాడు నిరంజన్. అతడి చూపుల్లో తన అందం అతడ్ని ఇంప్రెస్ చేసిందని అర్థమవుతోంది. చాలా అందంగా వున్నాడు అనుకుంది మనసులోనే.

రాజేందర్‌రెడ్డి ఆమెకు తెలిసినవాడే. ఆయనే అందర్నీ ఆమెకు పరిచయం చేసి, కూర్చోడానికి చోటు చూపించాడు. ఆమె కూర్చుంది.

టేబిల్ చివర ఛైర్మన్ ఛేర్ ఖాళీగా వుంది. అది తన తండ్రి స్థానం. ఆ కుర్చీ తనకు దక్కుతుందా లేదా అన్నది సభ్యుల నిర్ణయం మీద ఆధారపడిన విషయం. అక్కడ కొందరి ముఖాల్లో తన పట్ల అప్రసన్నతను స్పష్టంగా గమనించింది వెన్నెల. నిరంజన్ మాత్రం తనను చూసి చిరునవ్వులు నవ్వటం కొంత వూరటనిచ్చింది.

వెన్నెలతో కలిసి ఇప్పుడక్కడ తొమ్మిదిమంది వున్నారు. ఆలస్యం చేయకుండా రాజేందర్‌రెడ్డి మాట్లాడు.

"సమస్య మనందరికీ తెలిసిందే. ప్రత్యేకించి చెప్పక్కర్లేదనుకుంటాను. మిస్ వెన్నెలా! మీ డాడీ పట్ల, ఆయన రాసిన ఉత్తరం పట్ల మాకు చాలా గౌరవం వుంది. అయినప్పటికీ నీ విషయంలో ఇక్కడ ఏకాభిప్రాయం సాధించటం సాధ్యంకాలేదు. నీతో మాట్లాడవలసిన అవసరం వుంది. కాబట్టి పిలిపించక తప్పలేదు. సభ్యులు నిన్ను ప్రశ్నించాలనుకుంటున్నారు. ఓ.కె.నా?" అడిగాడాయన.

వెన్నెల వూహించని పరిణామం ఇది.

అక్కడ నిరంజన్ తప్ప అందరూ చాలా చాలా పెద్దవాళ్ళు. వాళ్ళు తనను ప్రశ్నించటం, తను బదులు చెప్పటం... ఇదేమన్నా ఎగ్జామ్‌హాలా...?

అయినా తప్పదు. పోటీ పడాలనుకున్నప్పుడు అన్నిటికీ సిద్ధంగానే వుండాలి. అందుకే కంగారును అణచుకుంటూ 'ఓ.కె!' అంది.

రాజేందర్‌రెడ్డి మీడియా మొగల్ కాబట్టి అసెంబ్లీలో స్పీకర్ తరహాలో సమావేశం నిర్వహించటం ఆయన అలవాటు. ఆయనది తటస్థవైఖరి.

"వెల్... మీరిక ప్రశ్నలు అడగవచ్చు" అంటూ మిగిలిన మెంబర్స్ వంక చూసాడు.

ముందుగా కమల్‌నాథ్ గొంతు సవరించుకున్నాడు.

"వెన్నెల ఇవాళ నాకు కొత్తకాదు. ఈ అమ్మాయి నాకు చిన్నప్పట్నుంచి తెలుసు. టైగర్ అందం, తెలివితేటలు పుణికిపుచ్చుకుంది. వ్యాపార రంగంలో సొంతంగా పైకి వచ్చి, తనేమిటో నిరూపించుకుని, తండ్రికి తగ్గ వారసురాలనిపించుకుంది" అంటూ ఆగాడు కమల్‌నాథ్.

"ఇది సన్మాన సభకాదు పొగడటానికి. ప్రశ్నలేమన్నా వుంటే అడగండి" అంటూ చికాగ్గా అడ్డుకున్నాడు భువనచంద్ర.

ఆయన ఫార్మాస్యూటికల్ జెయింట్.

డయాబిటీస్ వచ్చినప్పట్నుంచీ చిరాకు ఎక్కువయింది ఆయనకి.

ఆయన విసుగు చూసి వస్తున్న నవ్వుని బలవంతంగా ఆపుకున్నాడు ఎమ్మెల్యే నిరంజన్.

కమల్‌నాథ్ భువనచంద్ర మాటలకి అలిగినట్టున్నాడు. "నో క్వశ్చన్స్" అన్నాడు వెంటనే.

"ఓ.కె... భువనచంద్రగారూ! మీరు అడుగుతారా?" అడిగాడు రాజేందర్‌రెడ్డి.

"యస్... చూడమ్మాయ్! ఈ హైసొసైటీ క్లబ్ ఉనికి గురించి నీకేమన్నా తెలుసా?" వెంటనే అడిగాడు భువనచంద్ర.

"అంతా తెలుసని చెప్పను. నాకు తెలిసింది కొంచెమే. హైద్రాబాద్ ముఖ్యంగా మన స్టేట్‌లోని రాజకీయాలు, వ్యాపారాలు అన్నిటి పైనా హెచ్.ఎస్. క్లబ్ ప్రభావం వుంటుందని, ఇక్కడున్న వారంతా కింగ్ మేకర్స్ అని విన్నాను."

"దట్స్ కరెక్ట్. నీ వరకు ఈ క్లబ్‌లో సభ్యత్వాన్ని ఎందుకు ఆశిస్తున్నావ్?"

"సారీ! సభ్యత్వం కావాలని నేను అప్లికేషన్ పెట్టలేదు. ఇట్స్ మై ఫాదర్స్ ఆర్డర్. తన బాధ్యతల్ని నన్ను నిర్వహించమని ఆయన కోరిక. ఒక కూతురిగా ఆయన కీర్తికి మచ్చ రాకుండా నడుచుకోవటం, ఆయన విధుల్ని సమర్ధవంతంగా నిర్వహించటం నా బాధ్యత.

అందుకే మా తండ్రిగారి స్థానం నాకు ఇస్తారా లేక స్త్రీని అని చులకన చేసి నిరాకరిస్తారా తెలుసుకోవాలనే ఈ క్షణం నేను మీ ముందున్నాను" కుండ పగలగొట్టినట్టు ముగమాటం లేకుండా బదులిచ్చింది వెన్నెల.

ఆమె సమాధానం ఇంత షార్ప్‌గా ఉంటుందని వూహించని భువనచంద్ర షాక్ తిన్నాడు. తండ్రినే ఎదిరించిన యువతి. భువనచంద్రని ఎదిరించటంలో ఆశ్చర్యం ఏముంది?

'ఆమె ఫైర్ బ్రాండన్న సంగతి పాపం తెలీదు ఈయనకి' అనుకున్నాడు కమల్‌నాథ్ వెన్నెల సమాధానానికి మురిసిపోతూ.

"సారీ యంగ్ లేడీ... టైగర్ కోరికను ఆర్డర్‌గా భావించి నువ్వు ఇక్కడ సభ్యత్వం కోరటంలో ఎలాంటి అభ్యంతరం లేదు. అలాగే టైగర్

కోరికను ఎంతవరకు మన్నించ వచ్చు అనేది సభ్యుల ఇష్టాఇష్టాల మీద ఆధారపడిన విషయం.

నా ప్రశ్నలోని అంతరార్థం ఒక్కటే. ఇప్పటికే నువ్వు నీ సొంత వ్యాపారాలు, అటు మిడాన్ గ్రూప్ బాధ్యతల మధ్య బిజీగా వున్నావ్. ఇక్కడ నీకు సభ్యత్వం అంటూ వస్తే వెంటనే నీ తండ్రి స్థానంగా ఛైర్మన్ పదవి కూడా నువ్వే నిర్వహించాలి.

నీ వయసుకి ఇన్ని బాధ్యతలంటే... అది సాధ్యమా... నిర్వహించ గలవా? ఇదే విషయాన్ని ఇంతకుముందు మన్సూర్‌సాబ్, నేను కూడా చర్చించాం. దీనికి నీ నుంచి సంతృప్తికరమైన సమాధానం కావాలి...." అంటూ వివరణ ఇచ్చాడు భువనచంద్ర.

ఆయనకు బదులు చెప్పటానికి వెన్నెల తడబడలేదు.

"నిర్వహించగలను... ఆ నమ్మకం నాకుంది గాబట్టే ఇలా మీ ముందున్నాను. కష్టే ఫలి అనే సూత్రం. నా అదర్శం. ఎంత శ్రమిస్తే అంతగా మంచి ఫలితాలు వస్తాయి. పనిలో ఎప్పుడూ బిజీని కోరుకునే స్వభావం నాది. ఇది కూడా నా తండ్రి నుంచి నాకు వారసత్వంగా సంక్రమించిందే.

అంతదేనికి సర్! మీకూ సొంత వ్యాపారాలు, అనేక కార్యభారాలు వున్నాయి. అయినా మీరు క్లబ్ అభివృద్ధికి పాటుపడుతున్నవారే కదా... నాది కష్టపడే వయసు. మీకన్నా అధికంగానే శ్రమించి, క్లబ్‌కి నా సేవలను అందించగలను" అంది ధీమాగా.

ఆమె మాటలకి భువనచంద్రలాంటి వ్యక్తి దిమ్మెరపోయాడంటే ఆశ్చర్యంలేదు.

ఆమె అంత సూటిగాను, ఫాస్ట్‌గానూ మాట్లాడుతుందని ఎవరూ వూహించలేదు. ఇంతలో కురువృద్ధుడులాంటి మన్సూర్ అలీఖాన్ చిన్నగా దగ్గి అన్నాడు.

"స్త్రీ హక్కుల గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"హక్కుల గురించి ఒక్క స్త్రీలేకాదు, చాలామంది పోరాడుతూనే వున్నారు. హక్కుల కోసం పోరాడేవారు బాధ్యతల్ని కూడా గుర్తుంచు

కోవాలన్నది నా అభిప్రాయం. హక్కులు కాగితాలకే పరిమితంగా కుండా, చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే వాటి ప్రయోజనం చేకూరుతుంది.”

“వెల్... నేను పాత తరం వాడినయినా, కొత్తతరం గురించి బాగా తెలిసిన వాడినే. అయినా ఇప్పటివరకు హెచ్.ఎస్. క్లబ్‌లో మహిళలకు స్థానం కల్పించకపోవటానిక్కారణం స్త్రీలు రహస్యాల్ని దాచలేరని, కొన్ని స్థానాలకు స్త్రీలు సమర్థులు కారని, క్లబ్ ఆరంభించిన తొలిరోజుల్లో పెద్దలు తీసుకున్న నిర్ణయాన్నే ఇంతదాకా మేమూ పాటిస్తూ వచ్చాం. ఇప్పుడు నీ మూలంగా సమస్య వచ్చింది.”

“ఇది సమస్య అనుకుంటున్నారా?”

“సమస్య గాబట్టే చర్చిస్తున్నాం.”

“ఇప్పటికే హెచ్.ఎస్. క్లబ్‌కి స్త్రీలను దూరంగా వుంచాలనే మీ నిర్ణయమా?”

“నువ్వు ప్రశ్నిస్తున్నావ్, మేం నీ సమర్థతని అంచనా వేయాలని చూస్తున్నాం?”

“ఓ.కె. ఒక మహిళగా నా సమర్థత ఏమిటో వ్యాపార రంగంలో నిరూపించుకున్నాను. కోటీశ్వరుడైన తండ్రిని కాదని, సొంతంగా ఎదిగిన దాన్ని, మహిళకు సభ్యత్వం కల్పించటం ఇష్టంలేకపోతే ఆ విషయం చెప్పేయొచ్చు. దానికి నా సమర్థతను సాకుగా చూపించనక్కర్లేదు.”

“ఇట్స్ క్రేజ్”... చూడమ్మాయ్. నీ స్పీడు కాస్త ఇబ్బందే....” అంటూ నవ్వేసాడు మన్సూర్ అలీఖాన్.

సందర్భం దొరకటంతో తిరిగి నోరు విప్పాడు భువనచంద్ర.

“మన్సూర్‌గారు కరక్ట్‌గా చెప్పారు. ఇలా దూకుడుగా వుండే స్త్రీలు ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోలేరు” అన్నాడు.

దాంతో వాతావరణం తిరిగి వేడెక్కింది.

ఒక దశలో రాజేంద్రరెడ్డి కల్పించుకున్నా వాగ్వాదం సద్దుమణగలేదు. ఇందులో మౌనంగావున్న వ్యక్తి నిరంజన్ మాత్రమే. అతను మాట్లాడతాడని

ఎదురుచూసింది వెన్నెల. కాని తనకు ప్రేక్షకుడి పాత్రే నచ్చినట్టు ప్రత్యక్షసాక్షిగా వుండిపోయాడు.

అక్కడ సమావేశం నిర్వహిస్తున్న మీడియా మోనార్క్ రాజేంద్రరెడ్డి తటస్థ స్థానంలో వుండగా, ఇంకా మిగిలిన సభ్యులు ఏడుగురు. వారు మన్సూర్ అలీఖాన్, కమల్‌నాథ్, డాక్టర్ భువనచంద్ర, నిరంజన్, జాన్ అబ్రహాం, దామోదరరెడ్డి, మనీష్ అగర్వాల్.

వెన్నెల పరిస్థితి ఏమంటే సింహాలమధ్య కూర్చున్న లేడికూనలా వుంది. కాని ఆమె తను లేడికూన కాదని, సివంగి అని అప్పటికే నిరూపించుకుంది.

ముఖ్యంగా ఆమెను పూర్తిగా వ్యతిరేకిస్తున్న వ్యక్తులు యిద్దరు. వాళ్ళు డాక్టర్ భువనచంద్ర, మనీష్ అగర్వాల్‌లు.

జాన్ అబ్రహాం అడిగిన పర్యవరణానికి సంబంధించిన ప్రశ్నకు వెన్నెల చాలా బాగా సమాధానం చెప్పింది. కాని ఎలాగయినా మాటలతో వెన్నెలని రెచ్చగొట్టి ఆమె అన్‌ఫిట్ అని నిరూపించాలని డాక్టర్ భువనచంద్ర ప్రయత్నిస్తూనే వున్నాడు. ఒక దశలో ఆయన కాస్త అదుపు తప్పి-

"చూడమ్మాయ్! నువ్వు వచ్చింది ఇక్కడ సభ్యత్వం కోసం. నీ లెక్చర్లు ఆపి, పెద్దల ముందు ఎలా ప్రవర్తించాలో తెలుసుకుంటే బాగుంటుంది" అని నోరు పారేసుకున్నాడు.

దాంతో వెన్నెలలో ఆత్మాభిమానం కస్సుమని లేచింది.

"అంటే...? నేనెలా ప్రవర్తించాలనుకుంటున్నారు? ఏదో మీ ఆఫీస్‌లో స్టెనో పోస్ట్‌కి మొదటిసారిగా ఇంటర్వ్యూకి వచ్చిన అమ్మాయి లాగానా? ఒణికిపోతూ, భయపడిపోతూ, అలా వుంటేనేగా మీకు నచ్చుతుంది. నేను టైగర్ కూతుర్ని మర్చిపోతున్నారు. నేను మీరనుకునే అమ్మాయిని మాత్రం కాను" అంది.

ఆమె ధాటికి దెబ్బకు మంచినీళ్ళు తాగాడు భువనచంద్ర.

అందర్నీ ఓసారి చూసి అడిగాడు-

"చూసారుగా– ఆ అమ్మాయి తీరు, సమాధానాలు విన్నారు. నా సైడ్ నుంచి ఆమెకు మైనస్ పాయింట్లు చాలానే వున్నాయి. నాకు తెలుసు. రాజేంద్రరెడ్డిగారు ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తున్నారని. అది సాధ్యంకాదు. ఓటింగ్ నిర్వహించమని కోరుతున్నాను" అన్నాడు.

"నేను భువనచంద్రగారి అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను." అన్నాడు ప్రతాపరావు.

వెన్నెల వంక నిస్సహాయంగా చూసాడు రాజేంద్రరెడ్డి.

"వెల్!" అంటూ లేచి నిలబడి అందరి వంకా చూసింది వెన్నెల.

"నా తండ్రిగారు తన స్థానానికి నన్ను నామినేట్ చేసారు. మీ ఆహ్వానం మీదే నేనిక్కడికి వచ్చాను. నాకీ అవకాశం కల్పించినందుకు అందరికీ థాంక్స్!

ఓటింగ్‌లో నేను గెలిస్తే ఐ విల్ డూ మై బెస్ట్. ఒకవేళ ఓడిపోయినా... వెల్– నో ప్రాబ్లమ్. థాంక్యూ జంటిల్మన్... గుడ్‌బై" అని చెప్పి కాన్ఫరెన్స్ నుంచి బయటకు వెళ్ళిపోయింది వెన్నెల.

తను ఎన్నిక కాదని, అక్కడ తనకు బలమైన ప్రతిపక్షం ఉందని అర్థమైపోయింది ఆమెకు. తగు రీతిలో సమాధానం చెప్పగలిగాను అది చాలు అనుకుందామె. అంతే!

ఆమె అలా ఓటింగ్‌కు ముందే వెళ్ళిపోయినందుకు బాగా ఫీలయినవాడు. నిరంజన్ అయితే, అధికంగా సంతోషించిన వాడు డాక్టర్ భువనచంద్ర.

వెన్నెలని అన్‌ఫిట్ అని చెప్పటానికి మరో సాకు దొరికింది ఆయనకు.

"చూసారుగా... ఆమెను వెళ్ళిపొమ్మని మనం చెప్పామా? పెద్దల ముందు. ఆమె ప్రవర్తించాల్సిన తీరు ఇదేనా? ఇంత షార్ట్ టెంపర్‌మెంట్ లేడీకి మన క్లబ్‌లో సభ్యత్వం ఇచ్చి, ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటే ఇంతకాలం మనం కాపాడుకుంటూ వస్తున్న రహస్యాలు, క్లబ్ పరువు ప్రతిష్ఠలు మంటకలిసిపోతాయి. ఆలోచించండి" అన్నాడు.

"ఓ.కె! ఇంకా చర్చలతో టైం వేస్ట్ చేయక్కర్లేదు. ఓటింగ్ కాల్ చేస్తున్నాను. నేను తటస్థ స్థానంలో ఉండి, కండక్ట్ చేస్తున్నాను గాబట్టి నేను ఓటింగ్‌లో లేను. మీ ఏడుగురి ఓట్లకి ప్రాధాన్యత వుంది. ఎవరు ఎటు చెప్పండి" అనడిగాడు రాజేంద్రరెడ్డి.

"నా వరకు టైగర్ మీది గౌరవంతో వెన్నెలకి ఒక అవకాశం యిచ్చి చూడటం మన కర్తవ్యంగా భావిస్తున్నాను. ఆ అమ్మాయి పర్యావరణ గురించి చెప్పిన విషయాలు నన్ను ఇంప్రెస్ చేసాయి. వెన్నెలకి అనుకూలంగా ఓట్ చేస్తున్నాను" అన్నాడు జాన్ అబ్రహం.

"ఎస్! నేను అబ్రహంగారిని సెకండ్ చేస్తున్నాను" అన్నాడు వెంటనే కమల్‌నాథ్.

రాజేంద్రరెడ్డి నోట్ చేసుకుంటున్నాడు.

"నో... నో... ఆ అమ్మాయి పద్ధతి నాకు నచ్చలేదు. నేను వ్యతిరేకిస్తున్నాను." తన అభిప్రాయం చెపుతూ నెగిటివ్‌గా ఓట్ చేసాడు డాక్టర్ భువనచంద్ర.

అది వూహించిందే గాబట్టి ఆశ్చర్యపోలేదు రాజేంద్రరెడ్డి.

భువనచంద్రను బలపరుస్తూ తన ఓటును కూడా నెగిటివ్ చెప్పాడు మనీష్ అగర్వాల్.

"మీరు దామోదరరెడ్డిగారూ?" అడిగాడు రాజేంద్రరెడ్డి.

"నేను కూడా వెన్నెలకి వ్యతిరేకంగా ఓట్ చేస్తున్నాను." చెప్పాడాయన.

అప్పటికి వెన్నెలకి మూడు ఓట్లు నెగిటివ్‌గా పడగా, రెండు ఓట్లు పాజిటివ్‌గా పడ్డాయి. ఇంకా ఇద్దరున్నారు.

"మన్సూర్ సాబ్! మీ ఓటు చెప్పాలి" అడిగాడు రాజేంద్రరెడ్డి.

ఆయన కూడా తన ఓటు–

వెన్నెలకి వ్యతిరేకంగా వేస్తాడనుకున్నారంతా–

ఓసారి అందర్నీ చూసి చిన్నగా నవ్వాడాయన.

"ఇందాకటి నుంచి ఇదే విషయం ఆలోచిస్తున్నాను. మీకు తెలుసుగా. మాలో స్త్రీలు మగాళ్ళకి కనబడకూడదు. అఫ్‌కోర్స్! ఆ రోజుల్లో అనుకోండి. ఇప్పుడూ ఆచరిస్తున్నారు. సాంప్రదాయాల్ని గౌరవించటం మన ధర్మం.

"నేను ఆస్ట్రేలియా అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. కాని ఆమెను బురఖా వేసుకోమని ఎన్నడూ వత్తిడి చేయలేదు. ఆమె నాకన్నా షార్ప్ అని ఒప్పుకోడానికి సిగ్గుపడను. ప్రతిభ ఎక్కడ వున్నా అభినందించాలి. ఇరాక్‌లో స్త్రీలు అతి భారీ ట్రక్కులయిన వోల్వో ట్రక్కుల్ని నడపటం నేను చూసాను.

అలాగని తను సాంప్రదాయమైన బురఖాలు వదిలి బయటకు రాలేదు వాళ్ళు. మతాలు, ఆచారాలు, కట్టుబాట్లు ఆయా కాలాల్ని బట్టి మార్పులు, చేర్పులకు గురికావటం చూస్తూనే వున్నాం.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే– నేనింకా సనాతన ధర్మాలనే పట్టుకు వేలాడే పాతకాలం మనిషిననే అనుకుంటున్నారు. వెన్నెల కూడా అలాగే వూహించింది.

అది నిజం కాదు. నాకు పాత వింటేజ్ కార్లంటే ఇష్టం. అలాగని వాటినే వాడను. లేటెస్ట్ రోల్స్‌రాయిస్‌ను కూడా వాడతాను. టైగర్‌లోని షార్ప్‌నెస్, టెంపర్‌మెంట్, ఆ హుందాతనం అన్నీ నేను వెన్నెలలో చూస్తున్నాను. ఆమె సమర్ధురాలనే ఫీలవుతున్నాను. సో... ఆమెకు అనుకూలంగా ఓట్ చేస్తున్నాను" అన్నాడు.

ఇది వూహించని మలుపు.

మన్సూర్ అలీఖాన్ ఓటు సంపాదించటంతో వెన్నెల తనను వ్యతిరేకిస్తున్నవారికి సమ ఉజ్జీగా నిలబడింది. దాంతో ఒక్కసారిగా టెంక్షన్ చోటు చేసుకుందక్కడ.

వెన్నెలకి ఛాన్స్ లేదని వూహించిన రాజేంద్రరెడ్డిలో కూడా ఇప్పుడు టెన్షన్ చోటు చేసుకుంది.

ఒక్క ఓటు మెజారిటీ ఉంటే చాలు– వెన్నెల విన్ చేస్తుంది. ఆ ఓటు నిరంజన్‌ది. అందుకే అందరి దృష్టి ఇప్పుడు ఆ యువ ఎమ్మెల్యే మీద నిలిచాయి.

"సో... మిష్టర్ నిరంజన్! నీ ఓటు ఇప్పుడు కీలకమై కూర్చుంది. నీ ఓటు పాజిటివా? నెగిటివా?" అడిగాడు ఉత్సాహంగా రాజేంద్రరెడ్డి.

"నాకు అంకుల్ యుగంధర్ అంటే గౌరవం వుంది. ఆయన అనాలోచితంగా ఏ నిర్ణయం తీసుకోరు. వెన్నెల సమర్ధత మీద నాకు నమ్మకం వుంది. సో... పాజిటివ్‌గా ఓట్ చేస్తున్నాను" అన్నాడు నిరంజన్.

డాక్టర్ భువనచంద్రకి ఇది ఎదురుదెబ్బ. తన మాటని అంతా ఫాలో అవుతారనుకున్నాడు. వెన్నెలని ఈజీగా బయటకు పంపించేయొచ్చు అనుకున్నాడు.

అనూహ్యంగా ఆమెకు నాలుగు ఓట్లు అనుకూలంగా పడటంతో ఆమె విన్ చేస్తోంది. అందుకే అదుపు తప్పి అరిచేసాడు.

"ఇట్స్ క్రేజీ! నీకేమైనా పిచ్చి పట్టిందా నిరంజన్! నిన్ను చూస్తుంటే ఆమె సమర్ధతకి కాదు- ఆమె అందానికి ఓటు చేసినట్టుంది" అంటూ.

"సారీ! నో కామెంట్స్!" సీరియస్‌గా హెచ్చరించాడు రాజేంద్రరెడ్డి.

"ఓటింగ్ పూర్తయింది. ఏడింటికి నాలుగులు ఓట్లు వెన్నెలకి అనుకూలంగా వచ్చాయి. అధికారికంగా వెన్నెలకి మన హెచ్.ఎస్. క్లబ్‌కి శాశ్వత సభ్యురాలిగాను, ప్రెసిడెంట్‌గానూ ప్రకటిస్తున్నాను" అంటూ అనౌన్స్ చేసాడు.

ఆ అనౌన్స్‌మెంట్‌ని అక్కడి సభ్యులే కాదు-

"ఆర్ట్స్ గ్యాలరీ ఆఫీస్ ఛాంబర్‌లో కూర్చున్న డైరక్టర్ మెహబూబ్ కూడా వింటున్నాడన్న సంగతి అక్కడ ఎవరికీ తెలీదు.

* * * * *

నగర శివారు ప్రాంతంలోని హయత్‌నగర్‌కు దగ్గర్లోని మౌంట్ ఓపెరా రిసార్ట్స్‌లో గ్రాండ్‌గా ఒక పార్టీ జరుగుతోంది. పార్టీ యిస్తోంది మిస్ మంజులత.

తను మిస్ ఆంధ్రాగా ఎంపికయిన సందర్భాన్ని పురస్కరించుకుని నియర్ అండ్ డియర్ అందరికీ పార్టీ యిస్తోంది.

మంజులత వెన్నెలకి బెస్ట్ ఫ్రండ్.

నిన్ననే మంజులత ఫోన్‌చేసి చెప్పినా హెచ్.ఎస్. క్లబ్ కాన్ఫరెన్స్ మూలంగా పార్టీకి అటెండ్ కావటం సాధ్యంకాదనుకుంది వెన్నెల. కాని సమావేశంలో ఓటింగ్‌వరకూ తను వుండకుండా బయటికి వచ్చేయటంతో టైం కలిసొచ్చింది. దాంతో ఫోన్‌చేసి తన సెక్రటరీ అనూకి, మిడాన్ గ్రూప్‌లో పి.ఎ. స్టెల్లాకి ఫోన్‌చేసి చెప్పి సరాసరి పార్టీకి వచ్చేసిందామె.

మరొకప్పుడయితే వచ్చేది కాదేమో.

కాని ప్రస్తుతం ఆమె మానసికస్థితి గజిబిజిగా వుంది. ఒకపక్క తన వ్యాపార సమస్యలు తనకుండగా అటు మిడాన్ గ్రూప్ సమస్యలు వేరే. ముఖ్యంగా రవీందర్‌తో తను కోల్డ్‌వార్‌కి సిద్ధమైనట్టే లెక్క.

ఈ పరిస్థితుల్లో తను హెచ్.ఎస్. క్లబ్‌కి ఛైర్‌పర్సన్ అయితే అతడ్ని సమర్థంగా ఎదుర్కోవచ్చనే ఉద్దేశంతో ఆశలు పెట్టుకుంది. కాని స్త్రీ ద్వేషి అయిన డాక్టర్ భువనచంద్ర మూలంగా అక్కడా తనకు చుక్కెదురయింది.

తను అక్కడ ఛైర్‌పర్సన్ కాదుగదా కనీసం సభ్యత్వం కూడా వస్తుందన్న ఆశపోయింది. అందుకే ఈ చికాకులనుంచి కాస్సేపయినా రిలాక్స్ కావచ్చని ఓపెరా రిసార్ట్స్‌కు వచ్చేసింది.

గ్రాండ్ పార్టీ.

పలకరింపులు, షేక్ హ్యాండ్లూ మామూలే. పైగా మీడియావాళ్ళు పార్టీని బాగా కవర్ చేస్తున్నారు. వాళ్ళని తప్పించుకుని ఒక కార్నర్‌కు వెళ్ళి టేబుల్ ముందు ఒంటరిగా కూర్చుని ఫ్రూట్‌జ్యూస్ తీసుకోసాగింది. అంతలో అటుగా వస్తున్న ఒక యువకుడిమీద ఆమె దృష్టి పడింది.

అతను ఎవరో కాదు.

ఎమ్మెల్యే నిరంజన్.

అతను యిక్కడ ప్రత్యక్షం గావటం ఏమటి? ఓటింగ్ తొందరగానే ముగిసిందా? తనకు ఒకటి రెండు ఓట్లకు మించి వచ్చుండవు. అయినా అక్కడున్న వాళ్ళలో తామిద్దరే దగ్గరదగ్గరగా ఒక వయసువాళ్ళు. కనీసం నోరు విప్పలేదు. తనకి సపోర్ట్ కూడా రాలేదు. ఎంతయినా తనూ మగాడే గదా... మధుసూదన్‌రెడ్డిగారే బెటర్.

ఆమె ఆలోచించేలోపు అతను సూటిగా తనవైపే రావటం గమనించింది. బ్లూ జీన్స్ వైట్ టీ షర్ట్‌లో హీమేన్‌లా వున్న నిరంజన్‌మీదే చాలామంది అమ్మాయిల కళ్ళు పడటం వెన్నెల గమనిస్తూనే వుంది. వాళ్ళకే కాదు. అతడి అందం తననూ ఆకర్షిస్తోంది.

తెలిసినవాళ్ళు పలకరిస్తున్నా చిరునవ్వే సమాధానంగా సరాసరి అతను తనవైపే రావటం ఆమెను ఆశ్చర్యానికి గురిచేసింది. అతను వచ్చి ఆమెకు ఎదురుగా కూర్చుంటూ "హలో... మన మధ్య పరిచయాలు అక్కర్లేదనుకుంటా" అంటూ నవ్వాడు.

"అరె... మీకు మాటలు వచ్చా?" టీజింగ్‌గా అడిగింది.

"అదేమిటి? నన్ను మూగవాడు అనుకున్నారా ఏమిటి?" తనూ సరదాగానే అడిగాడు.

"క్లబ్‌లో ఒక్కమాటా మాట్లాడలేదుగా. రాముడు మంచి బాలుడు అన్నట్టు కూర్చుంటే ఏమనుకోవాలి?"

"నేను మంచి బాలుడ్ని కాదులెండి. అందుకే అలా కూర్చున్నాను."

ఎందుకోగాని అతనితో మాట్లాడుతుంటే–

చాలా కంఫర్టబుల్‌గాను, రిలాక్స్‌గాను ఫీలవుతోంది వెన్నెల. ఇద్దరూ నవ్వుకున్నారు.

"మీరు ఈ పార్టీకి వస్తున్నట్టు తెలీదు" అంది.

"నేను పార్టీకి రాలేదు. నాకు ఇన్విటేషన్ కూడా లేదు. నేను వెదుక్కుంటూ వచ్చింది మీ కోసం."

"ఓటింగ్ రిజల్ట్ చెప్పాలనా. నేనప్పుడే ఆశ వదులుకున్నాను. అందుకే వచ్చేసాను. ఏమైంది?"

"ఆశ వదులుకున్నారుగా. ఏమైతే మీకెందుకు? ఇఫ్ యు డోంట్ మైండ్ షాంపేన్...."

"ష్యూర్... బట్ నాకు ఫ్రూట్‌జ్యూస్ చాలు. మీరు తీసుకోండి."

అటుగా వస్తున్న బేరర్‌ని ఆపి–

షాంపేన్ లార్జ్‌పెగ్ గ్లాస్ అందుకున్నాడు నిరంజన్.

"నేనిక్కడ వున్నట్టు ఎలా తెలిసింది?" కుతూహలంగా అడిగింది.

"డాడీకి ఫోన్‌చేస్తే మీ సెక్రటరీ నంబరిచ్చారు. ఆమె పేరేమిటి? అను... ఆమె వాయిస్‌లో మెలోడి వుంది. వెరీనైస్ వాయిస్. ఆమె చెప్పింది మీరిక్కడ వున్నట్టు" షాంపేన్ సిప్‌చేసి చెప్పాడు.

"నాకన్నా నా సెక్రటరీ, వాయిస్ బాగుంటుందిలెండి" అంది కావాలనే.

"ఆ మాట నేననలేదు. మీరు టైగర్ కూతురుగదా. మీరేమిటో క్లబ్‌లో చూసాను. మీ గట్స్... ఐలైకిట్. మీలా షార్ప్‌గా, అర్ధవంతంగా మాట్లాడేవాళు ళ్ళ చాలా అరుదు."

"బాగుంది. కనీసం మాటవరసకయినా ఒక్కమాట కూడా నా తరపున మీరు ఆ పెద్దమనుషులముందు మాట్లాడలేదు. ఇక్కడికొచ్చి పొగడటంలో అర్థం ఏమిటి? ఓటింగ్‌లో నేను విన్ చేయలేదని బాధపడతాననా?"

"అంటే ఓడిపోతారని ముందే డిసైడయిపోయారా?"

"అక్కడి పరిస్థితి అదేగా. ముఖ్యంగా డాక్టర్ భువనచంద్ర... అతనేమిటి లేడీస్ అంటే అలర్జీనా లేక తృణీకారమా? నన్నో పురుగును చూసినట్టు చూస్తాడు. నా ఉద్దేశం కరక్టయితే అతని పెళ్ళాం ఎప్పుడో విడాకులిచ్చేసి వుండాలి" అంది.

ఆ మాటలకీ పెద్దగానే నవ్వేసాడు నిరంజన్.

"ఎందుకంత నవ్వు?" కాస్త ఉడుక్కుంటూ అడిగింది.

"నువ్వు తమషాకి అన్నా కూడా ఆ మాట కరక్టయినందుకు. ఆయన వయసు అరవై ఎనిమిది. ఇప్పటికి ఎనిమిదిమంది పెళ్ళాలు విడాకులు తీసుకున్నారు. లేటెస్ట్‌గా తొమ్మిదో పెళ్ళాం కూడా డైవర్స్‌కోసం అప్లయ్ చేసిందని వినికిడి" అంటూ నవ్వాడు.

ఈసారి తనూ నవ్వింది వెన్నెల. నవ్వితే అతను మరీ అందంగా అన్పించాడు. అసలు అతను ఇంత సరదా మనిషని వూహించలేదామె.

"వెన్నెలగారూ! మీకో మాట చెప్పనా... ఏమీ అనుకోనంటేనే" అడిగాడు.

"మనం ఏకవచనంలో పిలుచుకుంటేనే బాగుంటుంది, మీ డాడీ, మా డాడీ బెస్ట్‌ఫ్రెండ్స్. ఫ్రెండ్స్ మధ్యన మర్యాదలుండకూడదు."

"సో, మనం ఫ్రెండ్స్. థాంక్యూ వెన్నెల! నువ్వు నవ్వితే చాలా అందంగా వుంటావ్."

"నువ్వు ఆడవాళ్ళని పొగుడుతావా? ప్రజాప్రతినిధిని. అసెంబ్లీలో కూడా అడవాళ్ళుంటారు."

"హలో... మనసులో ఏదీ దాచుకోకుండా మాట్లాడతాను. అంతేగాని అమ్మాయిల్ని పడగొట్టాలని కాదు."

వెన్నెల ఏదో చెప్పబోతూ కళ్ళు తిరిగినట్టయి ముందుకు తూలింది. టేబిల్‌ని పట్టుకుని సరిగా కూర్చుంటూ జ్యూస్‌గ్లాసు ఖాళీచేసింది.

"నథింగ్. టెన్షన్స్‌తో టైమ్‌కి ఏమీ తినలేకపోతున్నాను. సరాసరి ఇక్కడికొచ్చేసాను. ఇక్కడ లంచ్ లేటయ్యేలా వుంది" అంది.

"అర్థమైంది. టైంకి ఏదో ఒకటి తినకపోతే ఇలాంటి ప్రాబ్లమ్స్ వస్తాయి. బయట భోంచేద్దాం కమాన్. నేనూ ఏమీ తినలేదు."

మరో మాట చెప్పకుండా అతడితో వచ్చేసిందామె.

పార్టీ నుంచి బయటపడి దగ్గర్లోని హోటల్‌కి చేరుకున్నారు. భోంచేసాక బయటకొస్తూ అడిగాడు నిరంజన్.

"నువ్వు వచ్చేసాక క్లబ్‌లో ఏం జరిగిందో తెలుసుకోవాలని లేదా?"

"ప్రీవ్యూలోనే సినిమా ఫ్లాప్ అని అర్థమైంది. ఇక ప్రత్యేకించి తెలుసుకోవాల్సిన పనేం వుంది?"

"నీకు అక్కడ అన్నీ నెగిటివ్ ఓట్లే పడతాయని వూహించావా?"

"అఫ్‌కోర్స్. నాకు అర్థమైంది అదే. ఈ మాత్రం తెలివి కూడా లేకపోతే సిటీలో బ్రతుకు పిటీ అయిపోతుంది."

"నువ్వేదీ సీరియస్‌గా తీసుకోవా?"

"తీసుకుంటాను. బహుశా నాకన్నా సీరియస్‌గా ఎవరూ తీసుకోరనుకుంటాను. ఏ విషయమైనా సరే. అంత పట్టుదల నాది. బట్ ఫలితం మీద వెర్రిమొర్రి భ్రమలు పెట్టుకోను. ఎందుకంటే ప్రయాణం మొదలుపెట్టాక గుర్రం ఆగకూడదు. అప్‌సెట్ అయి ఆగిపోతే ప్రయాణం కూడా అక్కడితో ఆగిపోతుంది. ప్రయత్నలోపం చేయను. ఫలితం ఏదయినా స్వీకరిస్తాను. అది నా పాలసీ."

"వెరీగుడ్. నీకో గుడ్‌న్యూస్ చెప్పాలి. నీ పరిస్థితి చూసాక భోంచేసాక చెప్పొచ్చని ఆగాను."

మాట్లాడుతూనే యిద్దరూ తమ కార్లవద్దకు వచ్చేసారు.

"ఏమిటా గుడ్‌న్యూస్?" తన బెంజ్ కారుకు జేరబడి విలాసంగా అడిగింది వెన్నెల.

"నీ వూహ కావచ్చు. అంచనా కావచ్చు. హెచ్.ఎస్. క్లబ్ విషయంలో అది తప్పింది" అన్నాడు.

ఆ మాట వినగానే వెన్నెల కళ్ళలో ఒక్కసారిగా కాంతి గప్పున వెలిగింది నో... నేను నమ్మను" అంది ఎగ్జయిట్‌గా.

"నమ్మాలి. మొత్తం ఏడు ఓట్లలో నీకు అనుకూలంగా మూడు, వ్యతిరేకంగా మూడు ఓట్లు వచ్చాయి. నా ఓటు కీలకమైనది. టైగర్. అంకుల్ అంటే నాకు చాలా అభిమానం.

ఆయన కూతురిగా నీమీద కూడా ఆ అభిమానం నన్ను నీకే ఓటువేసేలా చేసింది. సో... ఓ ఓటు ఆధిక్యంతో నువ్వు క్లబ్ సభ్యత్వాన్నే కాదు ఛైర్‌పర్సన్‌గా కూడా ఎన్నికయ్యావ్.

పర్సనల్‌గా ఈ విషయం నీతో చెప్పాలనే పనిగట్టుకుని వచ్చాను" అంటూ నిరంజన్ అసలు విషయం చెపుతుంటే సంతోషంతో మాట రాలేదు ఆమెకు...

* * * * *

రెండు మాసాలు గడిచిపోయాయి.

వెన్నెల ప్రయాణం ఇప్పుడు మూడు పడవలమీద సాగుతోంది. అయినా ఆమె చాకచక్యంగా తన బాధ్యతలు నిర్వహిస్తూ వస్తోంది. అంతా సవ్యంగానే జరుగుతున్నట్టు పైకి కన్పించినా...

ఎక్కడో ఏదో జరుగుతోందనే డౌట్ వెన్నెలని హెచ్చరిస్తూనే వుంది. ఆ విషయాన్ని బలపరిచే ఆధారాలు కొన్ని లభించగానే తను జాగ్రత్త పడకతప్పదని గ్రహించింది. పి.ఎ. స్టెల్లా కూడా ఇదే విషయాన్ని బలపర్చింది.

ఇంతవరకు తన సొంత ప్రాజక్ట్ డ్రీమ్‌లాండ్ ఫైలయినా మిడాన్ గ్రూప్ ఆదుకుంటుందన్న ధీమా వుండేది. ఇప్పుడు మిడాన్ కూలిపోయ్యే పరిస్థితులున్నాయి.

అందుచేత పట్టాలుతప్పుతున్న మిడాన్ గ్రూప్‌ని తిరిగి పట్టాలమీద నిలబెట్టేవరకూ తన సొంత ప్రాజెక్ట్ కోసం టైం కేటాయించలేదు. మరో పక్క హెచ్.ఎస్. క్లబ్ ఛైర్మన్‌గా ఆ బాధ్యతలు వేరే వున్నాయి.

ఇవన్నీ ఆలోచించే వెన్నెల కొన్ని మార్పులు చేర్పులు ప్రత్యేక నిర్ణయాలు తీసుకోక తప్పలేదు. వాటిలో అతి ముఖ్యమైన నిర్ణయాలు రెండున్నాయి.

మొదటిది తన ప్రాజక్ట్ లేఅవుట్స్ రిపోర్ట్స్ తయారుచేసిన ఎమ్.ఇ.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ మధుసూదనరావుగారికే ఈ ప్రాజక్ట్ తనకు నిర్మించి యిచ్చేలా ఒప్పించి ఒప్పందం కుదుర్చు కోవటం.

తమ కంపెనీ లెవల్‌కి మూడువందలకోట్ల ప్రాజక్ట్ చాలా చిన్నదే అయినా తన మిత్రుడు టైగర్ మీద అభిమానం, ఆడపిల్ల అయివుండి నిరంతర కృషి పట్టుదలతో ఎదుగుతున్న వెన్నెలకి తనవంతు కూడా ఏదో సాయం చేయాలన్న ఉద్దేశంతో ఆయన ఈ ప్రాజక్ట్ పనుల్ని తమ కంపెనీకి వప్పగించాడు.

ఇక వెన్నెల తీసుకున్న రెండో నిర్ణయం కూడ కీలకమైనదే. తన బెస్ట్‌ఫ్రెండ్ లాయర్ అనూప్‌ని తన డ్రీమ్ ప్రాజక్ట్‌లోకి తీసుకుని ప్రాజక్ట్ పనుల్ని సూపర్‌వైజ్ చేసే డ్యూటీని అతనికి వప్పగించింది.

అలా చేయటం మూలంగా అనూప్‌ని ఆర్థికంగా నిలబెట్టినట్టూ వుంటుంది. తనకు అతనికన్నా నమ్మకమైన మనిషి దొరకడు. తన లా

ప్రాక్టీస్, కోర్టుపనులు ఓపక్క చూసుకుంటూనే డ్రీమ్‌లాండ్ పనుల్ని పర్యవేక్షించేలా ఒప్పందం.

అతను కూడా వెన్నెల ఒంటరిది కాకూడదన్న అభిమానంతోనే డ్రీమ్‌లాండ్ ప్రాజక్ట్‌లో పనిచేయటానికి ఒప్పుకున్నాడు.

ఇప్పుడామె తన దృష్టిని పూర్తిగా మిడాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీల మీదే కేంద్రీకరించి పని చేస్తోంది. ఇదే సమయంలో ఎమ్మెల్యే నిరంజన్‌తో స్నేహం కూడాపెరిగింది.

నిరంజన్ ఫోన్‌చేస్తే తను వెళ్ళటం, లేదా తనకు టైందొరికినప్పుడు అతడికి ఫోన్ చేయటం, చిన్న చిన్న పార్టీలు... అతడి పక్కనవుంటే తనకి చాలా రిలాక్స్‌గా వుంటుంది. తరచూ అతడ్ని చూడాలనే ఫీలింగ్ కూడా కలుగుతూ వుంటుంది.

ఇది ప్రేమా స్నేహమా ఇంకేదన్నానా... ఆమెకే అర్థంకాని స్థితి అసలు నిరంజన్ మనసులో ఏముందో తెలిస్తేగదా తన మనసులో ఏముందో తెలుసుకోవటానికి.

ఇలా వుండగా ఓరోజు ఉదయం-

పి.ఎ. స్టెల్లా సరాసరి వెన్నెల ఫ్లాట్‌కి వచ్చేసింది. అప్పటికి ఇంకా వెన్నెల ఆఫీస్‌కి రెడీకాలేదు. సడెన్‌గా స్టెల్లా రావటం వెన్నెలకి ఆశ్చర్యం కలిగించింది.

"స్టెల్లా... ఏమైంది?" అంటూ అడిగింది.

"నువ్వింకా న్యూస్‌పేపర్ చూసుండవని నాకు తెలుసు. అందుకే నేనే వచ్చాను. సీదెమ్" అంటూ ఒక ఆంగ్లపత్రిక, ఒక తెలుగు దినపత్రిక రెంటినీ ఆమె ముందు వుంచింది స్టెల్లా.

తన అన్న శరత్‌చంద్ర పత్రికకిచ్చిన స్టేట్‌మెంట్ అది. తన తండ్రి టైగర్ యుగంధర్ తనకు తీరని ద్రోహం చేసాడనీ కొడుకును కాదని కంపెనీ అధికారవర్గాలు తన చెల్లెలు వెన్నెలకి యిచ్చి తనకు అన్యాయం చేసాడనీ అలాగే అసమర్థురాలయిన ఆడపిల్లను కంపెనీకి ఛైర్మన్‌గా ఎన్నుకుని బోర్డు మెంబర్లు కూడా తప్పుచేసారనీ శరత్‌చంద్ర ఆరోపణలు.

అంతేకాదు. తను కోర్టును ఆశ్రయించే ఉద్దేశంతో తన లాయర్లతో సంప్రదిస్తున్నట్టు కూడా చెప్పాడు. త్వరలోనే వెన్నెలని పదవినుంచి తప్పించి ఆమె స్థానంలోకి తను రానున్నట్టు జోస్యం కూడా చెప్పాడు.

"ఇట్స్‌క్రేజీ... వీడికి పిచ్చిపట్టిందా? డాడీ రాసిన విల్లు ప్రకారం ఏం జరుగుతుందో తెలిసి కూడా కోర్టుకి ఎలా వెళ్తాడు? పైగా నా స్థానంలోకి తను రావటమా... ఇది జరిగేపనేనా?" అంటూ నవ్వేసింది వెన్నెల.

కాని స్టెల్లా నవ్వలేదు.

"కొందరు తలుచుకుంటే జరుగుతుంది" అంది సీరియస్‌గా.

"వాట్ యు మీన్...."

"ఐ మీన్... సీ వెన్నెలా... ఈ విషయాన్ని నువ్వు సీరియస్‌గా తీసుకోవటంలేదా? ఇది ఆషా మాషీగా పత్రికకు ఇచ్చిన వార్తకాదు. దీని వెనక కొందరు వున్నారు.

ఆరోజు నేను చెప్పాను గుర్తుందా? ఆనంద్ యంగ్ బిజినెస్ రిపోర్టర్. వాడు డబ్బుకోసం గడ్డితినే మనిషి. నీ గురించి పత్రికల్లో తక్కువచేస్తూ ప్రచారంచేసే కార్యక్రమాన్ని తన భుజానికి ఎత్తుకుని వుండాలి.

దానికి సూచనే ఇలా నీ అన్నచేత ఈ విధంగా మాట్లాడించి వుండాలి. రవీందర్ వీళ్ళకి తోడయ్యాడు. నీ దగ్గర నమ్మకంగా వుంటూ అతను తరచూ శరత్‌చంద్రను కలుస్తున్నాడంటే అర్థం ఏమిటి?

నిన్ను దెబ్బకొట్టి శరత్‌చంద్రను తెరమీదికి తెచ్చే ఉద్దేశం కావచ్చు. లేదా శరత్‌చంద్రను అడ్డంపెట్టుకుని తనే నీ స్థానానికి ఎగబాకే కుట్రకావచ్చు.

మనం జాగ్రత్త పడకపోతే పరిస్థితులు ప్రతికూలం కావటానికి ఎంతో కాలం పట్టదు. రవీందర్ విడివిడిగా బోర్డ్ మెంబర్స్‌ని కూడా కలుస్తున్నట్టు వార్తలొస్తున్నాయి" అంటూ తన ఆందోళనని వివరించింది స్టెల్లా.

"అంటే... నన్ను శరత్‌ను కూడా తప్పించి తన గుప్పిట్లోకి కంపెనీని తెచ్చుకోవాలని రవీందర్ పథకం చేస్తున్నాడా?... అంత ద్రోహానికి తెగిస్తాడా?" నమ్మలేనట్లు అడిగింది వెన్నెల.

"మీ డాడీకే నమ్మకద్రోహం చేసాడు. మీకు చేయడని గ్యారంటీ ఏమిటి?" నిన్ను రబ్బరుస్టాంపులా వుంచి తనే ఓ సంవత్సరంపాటు చక్రం తిప్పి తర్వాత తన గుప్పిట్లోకి కంపెనీని తీసుకోవాలనుకుని నీతో ఒప్పందం చేసుకున్నాడు.

కాని నువ్వు రబ్బర్ స్టాంప్ కాదని ఇప్పుడు అర్థమైపోయింది. దాంతో నిన్ను దించటానికి జాగ్రత్తగా పావుల్ని కదుపుకున్నాడు. అందులో మొదటి పావు నీ అన్న శరత్‌చంద్ర."

"తను బలిపశువు కాబోతున్నాడు. అందులో డౌట్‌లేదు."

"ఓసారి శరత్‌తో ఫోన్‌లో మాట్లాడిచూడు. పరిస్థితి వివరిస్తే మంచిది."

"వినడు. వాడికి వినాలనివున్నా మా వదిన విజృంభన పడనివ్వదు. ఆమెకు మగాళ్ళ పిచ్చేకాదు, పదవి పబ్లిసిటీపిచ్చి కూడా వుంది."

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావు?"

"స్టెల్లా, నీకోవిషయం అర్థంకాలేదు. నేను యుద్ధానికి సిద్ధంగా రణభూమిలోనే వున్నాను. కాని నాతో పోరాటానికి ప్రత్యర్థి ఎవరో ఇంకా నా ముందుకురాలేదు.

వేటకీ, యుద్ధానికి తేడా వుంది. వేటగాడు జంతువు కనబడగానే తరుముకెళ్ళి చంపుతాడు. వీరుడు రణక్షేత్రంలో తనకు ఎదురు పడిన శత్రువుతోనే పోరాడి విజయమో, వీరస్వర్గమో తేల్చుకుంటాడు. నేను వేటగాడ్నికాదు. ఆ విషయం నీకూ తెలుసు."

"సో... తలమీదకు ప్రమాదం వచ్చాకగాని ఏం చేయలేనంటావ్" అంటూ నవ్వింది స్టెల్లా.

"డోన్ట్‌వర్రీ. కాళ్ళు తడవగానే జాగ్రత్తపడ్డం నా అలవాటు" అంది వెన్నెల.

"చాపకింద నీరు చాలా ప్రమాదం. రవీందర్ చాపకింద నీరులాంటి వాడు. ఈలోపలే మనం ఏదో ఒకటి చేయటం మంచిదని నా అభిప్రాయం."

"నిజమే! కాని ఆధారంలేకుండా చర్యతీసుకోవటం గాలితో యుద్ధం చేయటం వంటిది. ప్రయోజనం వుండకపోగా, అవతలివాళ్ళు జాగ్రత్తపడే అవకాశం వుంది.

హెచ్.ఎస్. క్లబ్ పవర్ ఇప్పుడు నా చేతిలో వుంది. అవసర సమయంలో అది నన్ను గట్టెక్కిస్తుంది. డోంట్‌వర్రీ. మరిన్ని వివరాలు సేకరించే ప్రయత్నం చెయ్యి అప్పుడు చూద్దాం. ఆఫీస్ టైమైంది. పద వెళదాం" అంటూ స్టెల్లాతో ఆఫీస్‌కు బయలుదేరింది వెన్నెల.

✳ ✳ ✳ ✳ ✳

బంజారాహిల్స్, రోడ్ నెంబర్ 12 మలుపులో వుందా రెస్టారెంట్. బయటినుంచి కూడా లోపలి జనం కనపడేలా పూర్తిగా అద్దాలతో, ఖరీదైన ఆ రెస్టారెంట్ చూపరుల్ని ఇట్టే ఆకట్టుకుంటుంది.

సరిగ్గా ఆ రెస్టారెంట్ ముందు తన బెంజ్‌కారు దిగాడు రవీందర్.

అద్దాలలోంచి ఎక్కువగా యువతీ యువకులు కనిపిస్తున్నారు. ఐ.టి. బూమ్‌తో హైదరాబాద్‌లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట ప్రాంతాలు మరో అమెరికాలాగా తయారవుతున్నాయి.

ఒకప్పుడు ఉడిపి హోటళ్ళలో ఫ్యామిలీ సెక్షన్ అని వేరుగా వుండేది. అవి ఫ్యామిలీలకే కాక, ప్రేమికులకూ వరప్రసాదంగా వుండేవి. నేడు అంతా ఓపెన్... లోపలున్న యువత కూడా తన స్థాయికి చేరాలన్న గోల్ వున్నవారే...

కానీ... తనీస్థాయికి అంత ఈజీగా ఏమీరాలేదు. గోల్‌ని చేరుకోడానికి ఇంకా శ్రమపడాలి తను.

ఏతాడు లేకుండా పెద్ద కొండ ఎక్కడంలాంటిది తన పయనం. చేతివేళ్ళే పనిముట్లు...

ఎక్కితే శిఖరం... జారితే అఘాతం... అంతే సంగతులు. కానీ... తను శిఖరం చివరివరకు చేరాడు. ఇంకొక్క అడుగు... అంతే' ఆలోచిస్తూ లోపలికి నడిచిన రవీందర్‌కి దూరంగా ఓ టేబుల్ దగ్గర కూర్చున్న నరసింహన్ కనిపించాడు.

నరసింహన్ ఓ షేర్ కన్సల్టెన్సీ కంపెనీకి సి.ఇ.ఓ. తనలాగే సేల్స్‌మెన్‌గా చేరి టాప్ పొజిషన్‌కి వచ్చాడు. అతడు మిడాన్ గ్రూప్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఒకడు. చాలా తెలివిగలవాడు.

రవీందర్ అతడ్ని విష్‌చేసి–

ఎదురుగా కూర్చున్నాడు.

"రవీందర్! ఎందుకో ఈ హోటల్ నాకు సెంటిమెంట్‌గా నచ్చింది. నా రెండో భార్య రంజిత ఇక్కడే పరిచయం అయింది... ఆఫ్ కోర్స్! రంజిత నాకు పెద్ద హెడేక్. మెంటల్ తెచ్చేలా ప్రవర్తిస్తుందనుకో అసలు పెళ్ళి చేసుకోవడమే నన్నడిగితే పెద్ద తప్పు. ఇక రెండో పెళ్ళి... నరకానికి అడ్వాన్స్ బుకింగ్‌లాంటిది...." అంటూ పెద్దగా నవ్వాడు నరసింహన్. ఆయన చెప్పింది అనుభవసారం.

అందుకే–

"నిజమే" అన్నాడు రవీందర్ తనూ నవ్వుతూ.

అతడికి తన రెండో భార్య శ్వేత గుర్తుకొచ్చింది.

"రవీందర్! మిడాన్ గ్రూప్ పరిస్థితి ఎలా వుంది? మనం ఎక్కువగా బోర్డ్ మీటింగ్స్‌లోనే కలుసుకుంటాము' అన్నాడు నరసింహన్.

అతడ్ని కలవాలని రవీందర్ కోరబట్టే నరసింహన్ ప్రస్తుతం ఇక్కడ వున్నాడు.

"మీ సలహా కావాలి" అడిగాడు రవీందర్.

"ఏవైనా పెట్టుబడుల విషయమా? ప్రస్తుతం షేర్లకంటే నగర శివార్లలో స్థలాలు కొనడం బెటర్" అన్నాడు నరసింహన్.

"ఆ విషయంలో మీరు కరక్టే... కాని నేను ప్రస్తుతం మిడాన్ గ్రూప్ గురించి మాట్లాడుతున్నాను. వెన్నెలని ఛైర్‌పర్సన్ అండ్ ప్రెసిడెంట్‌గా టైగర్ స్థానంలో ఎన్నుకోమని మీ బోర్డువారికి చెప్పి, పెద్ద తప్పుచేసానని ఇప్పుడు అనిపిస్తోంది."

రవీందర్ మాటలకి ఏమి జవాబు ఇవ్వలేదు నరసింహన్.

"మాటలు బులెట్ల వంటివి... చాలా జాగ్రత్తగా వాడాలి" అన్నది నరసింహన్ అభిప్రాయం.

రవీందర్ తిరిగి తనే అన్నాడు "వెన్నెల సంపాదించుకున్న పేరు చూసి, మన గ్రూప్‌ని ఈజీగా నిర్వహిస్తుందని అనుకున్నా. కానీ...."

"అది జరగలేదు. అంతేగా?"

"నిజం చెప్పాలంటే వెన్నెల ఆఫీసుకి వచ్చేదే తక్కువ. ఆమె తన పదవి ఏదో గౌరవార్థం ఇచ్చినట్లు భావిస్తోంది. అన్నీ నేనే చూసుకోవాలి. కాని ఫైనల్‌గా వెన్నెల అనుమతించాలి. మనం ఫిలిమ్స్ డివిజన్ వరుసగా నాలుగు ఫ్లాపులిచ్చింది. ఇక ఆ స్టూడియోని అమ్మేయడమే మార్గం."

నరసింహన్‌కి సినిమాలంటే అంత ఆసక్తి లేదని రవీందర్‌కి తెలుసు. కాని డబ్బు అంటే ఆసక్తివుంది. సినిమాల ఫ్లాపులవల్ల అమెరికా హాలీవుడ్‌కి చెందిన ప్రఖ్యాత ఎమ్.జి.ఎమ్. స్టూడియోస్ సోనీ కంపెనీకి అమ్ముడుపోయింది.

"ఆ నాలుగు సినిమాల కథలను ఎవరు ఒప్పుకున్నారు?" అడిగాడు నరసింహన్.

"ఇంకెవరు? టైగర్ యుగంధర్. రిస్క్ తీసుకోవడం ఆయనకి అలవాటేగా! అయితే ఈసారి స్టూడియోస్ ముంచింది. టైగర్ జీన్స్ వెన్నెలలోనూ వున్నాయి. అందుకే భయపడుతున్నాను...." అన్నాడు రవీందర్.

"అలా అయితే వెన్నెలని కంపెనీకి దూరం చేయటం బెటర్."

"నిజమే. కాని వెన్నెలకి తన తండ్రి స్టాక్ హోల్డింగ్స్‌పై అదికారం వుంది. ఆ విషయం ఇతర బోర్డుమెంబర్లు పరిగణించి, ఆమెపై చర్యకు భయపడతారు."

"అది ముఖ్యంకాదు. మనకి వేరేస్టాక్ హోల్డింగ్స్‌పై అధికారం వుంది. ఆ విషయం ఇతర బోర్డుమెంబర్లు పరిగణించి, ఆమెపై చర్యకు భయపడతారు."

"అది ముఖ్యంకాదు. మనకి వేరేస్టాక్ హోల్డర్స్‌కూడా వున్నారుగా. వెన్నెలకి వ్యతిరేకంగా ఓటు వేయడమే."

రవీందర్ మెల్లిగా అన్నాడు. "అలా చేయాలనుకుంటే, చాలా జాగ్రత్తపడాలి. వెన్నెల స్థానంలో సరయిన వ్యక్తిని ఎన్నుకోవాలి. నా విషయం

కూడా ఆలోచించాను. నా సమర్థత మీకందరికీ తెలుసు. కాని ప్రజలకి తెలియదుగా. మన స్టాక్ హోల్డర్లకు భరోసా కల్పించే వ్యక్తిని చూడాలి."

"అలా అయితే టైగర్ కొడుకు శరత్‌చంద్ర వున్నాడుగా? ఇప్పటికే గ్రూప్‌లో పలుపదవుల్లో పనిచేసాడు. అఫ్‌కోర్స్... నీకన్నా సమర్థుడు కాదనుకో...."

"నరసింహన్‌గారూ! నాపై మీ నమ్మకానికి థ్యాంక్స్. మీకు మంచి ఐడియా వచ్చింది. శరత్‌చంద్ర కూడా గ్రూప్ పగ్గాలు చేపట్టడానికి వెన్నెలపై యుద్ధానికి సిద్ధంగా వున్నాడని వార్తలు వచ్చాయి. చాలా వ్యాపారకుటుంబాల్లో, ముఖ్యంగా ఈ రోజుల్లో ఇలాంటి కలహాలు మామూలు అయిపోయాయి."

"సహజమేకదా! డబ్బు లేనంతవరకూ సంపాదించాలన్న ఆశ. సంపాదించాక డబ్బుతోబాటు అధికారం, పవర్... ఇవి ఎవరికి చేదు? ఆడపిల్ల చేతిలో ఇంత బాధ్యత వుంచటం తప్పని నాకు అప్పుడే అన్పించినా, అయాం హెల్ప్‌లెస్. నలుగురితోపాటు సపోర్ట్ చేయక తప్పలేదు. ఆ అమ్మాయికి తనకంటూ వ్యాపారాలున్నాయి. ఏదో ప్రాజెక్ట్ కూడా చేస్తోందట. ఇక మన కంపెనీలమీద ఆసక్తి ఏంవుంటుంది."

"యస్. దటీజ్ కరక్ట్."

"డోన్ట్‌వర్రీ! ఇతర బోర్డ్‌మెంబర్స్‌తో నేనూ మాట్లాడి చూస్తాను. వెన్నెలని దించేయటమే మంచిది."

నరసింహన్‌ను ఒప్పించటంలో విజయం సాధించటంతో రవీందర్‌కి చాలా ఆనందంగా వుంది. తోలుబొమ్మలాటలో బొమ్మల్ని ఆడించే వాడికి చాలా సంతోషంగా వుంటుంది.

ఎందుకంటే బొమ్మలన్నీ అతడి చేతుల్లోనే ఆడుతూంటాయి. రవీందర్‌దీ అలాంటి సంతోషమే. కాని ఇక్కడ అతడి చేతిలోవున్నవి బొమ్మలు కాదు, మనుషులు. ఎలా ఆడతారో ఇక చూడాలి.

తను ఎక్కబోయే శిఖరం ఇక ఒక్క అడుగు దూరంలోనే వుంది. అందుకే రవీందర్ మనసు పరవశిస్తోంది.

"థాంక్యూ నరసింహన్‌గారూ! మళ్ళీ కలుద్దాం" అంటూ లేచి బైటికొచ్చేసాడు.

* * * * *

నగరమేయర్ రాంరెడ్డి కారు తను పార్టీకార్యాలయంవైపు పరుగుతీస్తోంది. అతడు అన్యమనస్కంగానే వున్నాడు. అందరిలా తరచూ పార్టీ కార్యాలయానికి వెళ్ళటం, పార్టీ ప్రముఖుల్ని దర్శించుకోవటం ఇలాంటి అలవాట్లు రాంరెడ్డికి లేవు. ఎంతోకొంత లాభం వుంటే గాని ఏపనీ చేయడు, ఎక్కడికీ వెళ్ళడు.

ఈమధ్య తనను ఫెయిల్యూర్స్ వెంబడిస్తున్నాయి.

అదే అతడి భయం.

ఎందులో వేలు పెట్టినా కాలుతోంది.

టైగర్ కూతురు వెన్నెలని చూసినప్పట్నుంచి గుండె లయతప్పింది. ఆమెకు సాయంచేసినట్టు నటించి ఆమెకు దగ్గర కావాలని ఆశపడ్డాడు.

ఆమె ప్రాజెక్ట్‌కు సంబంధించిన కాగితాన్ని తొక్కిపట్టించాడు. కాని తను అనుకున్నట్టు జరగలేదు. వెన్నెలకి బదులు ప్రముఖ కాంటాక్టర్ మధుసూదన్‌రెడ్డి రంగంలోకి దిగాడు.

ఇక తనవల్లేమవుతుంది... తీరా ఆరాతీస్తే ఆమె డ్రీమ్ ప్రాజక్ట్‌ని రెడ్డిగారు కాంట్రాక్ట్ తీసుకున్నారని తెలిసింది. అంతేకాదు, ఈ మధ్య రెడ్డిగారి కొడుకు నిరంజన్, వెన్నెల చాలా స్నేహంగా వుంటున్నారని పబ్‌లు, పార్టీలోల తరచూ కలిసే కన్పిస్తున్నారనీ వినికిడి.

ఆ పిల్లమీద ఆశలు పెంచుకుని, తన బుగ్గమీద కత్తిగాటు మచ్చను కూడా ప్లాస్టిక్ సర్జరీతో అనవసరంగా తొలగించుకున్నాడు.

ప్రస్తుతం వెన్నెల పరిస్థితి కూడా ఏమంత బాగాలేదంటున్నారు. క్రమంగా ఆమెను సమస్యలు చుట్టుకుంటున్నాయని వదంతులున్నాయి. అటు ఆమె అన్న శరత్‌చంద్ర తనకు ద్రోహం జరిగిందంటూ కోర్టు కెళతానని, త్వరలో వెన్నెల స్థానంలోకి తనే వస్తానని పేపర్ స్టేట్‌మెంట్లు ఇవ్వటం చూస్తుంటే వదంతులు కాదు, వాస్తవాలే అనటానికి బలం చేకూరుతోంది.

మరో పక్క మిడాన్ గ్రూప్ ఎమ్.డి. రవీందర్ కూడా ఆమెను వ్యతిరేకిస్తున్నాడు.

రవీందర్ తనకి కావలసినవాడు. అతడి మాటల్ని బట్టి వెన్నెలని దించేసే ప్రయత్నాల్లో వున్నట్టు స్పష్టమవుతోంది. ఆ పోరి ఏదో రోజు సాయం కోరి తన వద్దకు రాకపోదు. తను పంజరంలో చిలుకను చేసి ఆమెను చెరపట్టకపోడు.

అతడి ఆలోచనలు ఓ కొలిక్కిరాకముందే–

కారు పార్టీ కార్యాలయాన్ని చేరుకుంది.

లోనకు అడుగు పెడుతుంటే–

రాంరెడ్డికి గుండెల్లో గుబులుగా అన్పించింది.

ఎలక్షన్లు దగ్గర పడుతున్నాయి. ఈసారి ఎం.పి. సీటు కోసం తను గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. దాదాపు సీటు ఖాయమనే పార్టీ వర్గాలు హామీయిచ్చాయి.

ఇప్పుడు సడన్‌గా పార్టీ రాష్ట్రకార్యదర్శి రఘునాధ్ అర్జంటుగా వచ్చి తనను కలవమని ఫోన్ చేయటంతో రాంరెడ్డికి ఎక్కడో డౌటు క్రియేటవుతోంది. ఎందుకు ఇంత జరూరుగా తనను పిలిచినట్టు...

"రావయ్యా రాంరెడ్డి. రా కూచో" అంటూ రాంరెడ్డిని చూడగానే తనకి ఎదురుగా సీటు చూపించాడు రఘునాధ్.

"చెప్పండి. మీరు పిలిచారని పనులన్నీ వదులుకుని వచ్చాను. ఏమిటి విషయం?" కూర్చుంటూ సీరియస్‌గానే అడిగాడు రాంరెడ్డి.

"సర్లేవయ్యా. పనులు ఎవరికి లేవు. చాలా ముఖ్యమైన విషయం చెప్పాలి. ఎందుకంటే ఎం.పి. సీటు నీకు కేటాయించే విషయంలో ఇబ్బంది ఏర్పడింది.

"ఇబ్బందా... ఏమిటండీ? నాకు సీటు ఇవ్వద్దని ఎవడన్నా నిరాహార దీక్ష చేపట్టాడా? రాష్ట్రపతిని కలసి వినతిపత్రం సమర్పించాడా? వాడెవడో చెప్పండి? తెల్లారేసరికి వాడుండడు...." కాస్త ఆవేశంగానే అడిగాడు రాంరెడ్డి.

"నిరాహారదీక్షలు, వినతిపత్రాల మీద నమ్మకాలు లేని మనిషి ఆయన. ఆయన్ని వేసేసే సత్తా నీకుంటే ట్రయ్ చెయ్. పేరు చెప్తాను. నీకు ఎమ్.ఇ.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ గురించి తెలుసా?"

"సర్లే... ముంజేతి కంకణానికి అద్దం ఏందుకన్నట్టు ఇండియాలోని భారీ కాంట్రాక్ట్ సంస్థ గురించి తెలీదా ఏమిటి నాకు? ఆ సంస్థా తెలుసు. దాని ఓనరు మధుసూదన్‌రెడ్డిగారూ తెలుసు. ఇంతకీ అసలు సంగతి చెప్పండి."

''ఈ సీటు తన కొడుకు నిరంజన్‌కి కేటాయించమని అడుగుతున్నాడాయన.

"బాగుంది. అడుక్కునే బిచ్చగాడికి ఏ వీధి అయితే ఏమిటని నాకు వేరే చోట సీటు ఇవ్వండి."

"ఇది బై ఎలక్షన్. సికింద్రాబాద్ సీటు తప్ప, ఎక్కడా బై ఎలక్షన్‌లేదు. ఇంకా మూడేళ్ళుంది. తన కొడుకు నిరంజన్‌ని లోక్ సభకు పంపించాలని ఆయన ఆశపడుతున్నాడు. ఆయనతో నువ్వు పోటీ పడలేవనుకుంటాను" అంటూ చిన్నగా నవ్వాడు రఘునాథ్.

ఆ నవ్వు చూస్తుంటే కత్తితో కోసి కారం అద్దినంతగా మంట పుడుతోంది రాంరెడ్డికి.

"ఇదన్యాయం. నాకు కేటాయించాక ఆ సీట్‌ని వేరే వాళ్ళకి ఎలా యిస్తారు? పైగా ఆ నిరంజన్ ఎమ్మెల్యేగా పదవిలోనే వున్నాడు చాలదా... ఇదేదో నా మీద పార్టీలో జరిగిన కుట్రగానే నేను భావిస్తున్నాను" కాస్త ఆవేశంగానే అన్నాడు.

శాంతంగా అదే చిరునవ్వుతో బదులిచ్చాడు రఘునాథ్.

"ఇదే నయ్యా నీతో వచ్చిన చిక్కు. ఆవేశపడిపోతావ్. ఇందులో కుట్రలు, కుతంత్రాలు ఏమీలేవు. నువ్వయినా, నేనయినా అధిష్టాన నిర్ణయానికి కట్టుబడక తప్పదు గదా!"

"సికింద్రాబాద్ నియోజక వర్గంలో నాకు పట్టు, బలం వున్నాయి. నేనయితే గెలుపు ఖాయం. నిరంజన్ కుర్రాడు... అతడికేం తెలుసని?

ఓ.కె! ఏ కారణం చేతనయినా నిరంజన్ తప్పుకుంటే, సెకండ్ ఛాన్స్ నాకే యిస్తారా? కనీసం ఇదన్నా హామీ యివ్వగలరా?"

"ష్యూర్! ఖచ్చితంగా నీకే వచ్చేలా చూస్తాను. బట్ నో ఛాన్స్. ఎందుకంటే– అతని వెనక తండ్రి మధుసూదన్‌రెడ్డి వున్నాడు. అతని పవర్ మనకు తెలీంది కాదు గదా."

"నిజమే... కాని అప్పుడప్పుడూ ప్రపంచదేశాల చిత్రపటాలే మారిపోతున్నాయి రఘునాథ్‌గారూ! ఇక్కడ రాజకీయాలు మారిపోవటం ఓ లెక్కా! చూద్దాం. వస్తాను" అంటూ లేచాడు రాంరెడ్డి.

"ఒక్కమాట. నీ మనసులో ఏమన్నా పథకం ఉండే ఇప్పుడే డ్రాప్ చేసుకో... తెలిసీ మధుసూదన్‌రెడ్డిని ఢీకొనటం మంచిదికాదు."

"ఛ ఛ! నాకు ఎలాంటి పథకాలు తెలీదు రఘునాథ్‌గారూ. ఎన్నికల నోటిఫికేషన్‌కి ఇంకా చాలా టైముంది. రోజుకో మలుపు తిరుగుతున్న రాజకీయాలు మీకు తెలీంది ఏముంది? అదృష్టం బాగుండి సీటు నాకే రావాలని ఆశ అంతే. వస్తాను" అంటూ–

రఘునాథ్‌కి ఒక నమస్కారం పారేసి విసవిసా బయటకు వచ్చేసాడు రాంరెడ్డి.

అతను కూర్చోగానే డ్రయివరు కారును పోనిచ్చాడు.

క్యూబా సిగార్‌ను వెలిగించి హాట్ హాట్‌గా దమ్ముకొడుతూ తన ఆఫీస్‌కు చేరుకునే వరకు ఈ విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నాడు రాంరెడ్డి. ఇప్పుడు తన ప్రత్యర్థులు ముగ్గురయ్యారు.

నిరంజన్– జనాకర్షణ, జనంలో మంచి పేరున్న యువకుడు.

వెన్నెల– అనేక ప్లస్ పాయింట్లతో బాటు అందం, ఆకర్షణ గల యువతి.

మధుసూదన్‌రెడ్డి – అసలు సమస్య ఇతనే.

రాజకీయంగా తన సత్తా ఏమిటో చూపించి, వీళ్ళని డౌన్ చేయాలి. ఏం చేస్తే తన ప్లాన్ వర్కవుటవుద్ది? ఆలోచిస్తున్న రాంరెడ్డి మదిలో సర్కిల్

ఇన్స్‌పెక్టర్ గౌస్ మెదిలాడు. ఎం.డి.గౌస్ గుర్తుకురాగానే రాంరెడ్డి పెదవుల మీద సుడి తిరిగింది ఒక వంకర నవ్వు.

* * * * *

"తెలుగు టైమ్స్" టీవీ ఛానల్ ప్రొడ్యూసర్‌తో, శరత్‌చంద్ర కోర్టు బయట ప్రెస్‌తో ఎంత ఆవేశంగా మాట్లాడుతున్నాడో, తన చెల్లెలిపై ఎంత కసి వుందో, ఆ వీడియో రికార్డింగ్ చూసాక అర్థమయింది.

అక్కడ రెండు వీడియో క్లిప్పింగ్స్ వున్నాయి. ఒకటి ఒక పార్టీకి వెన్నెల, నిరంజన్‌లు జంటగా వచ్చినప్పటి కవరేజ్.

రెండోది చెల్లెలు వెన్నెలపై కేసు ఫైల్ చేసాక, మొదటి వాయిదాకు వచ్చిన శరత్‌చంద్ర మీడియా వాళ్ళతో తన కేసు గురించి వివరిస్తున్న దృశ్యాలు.

ఆ ప్రొడ్యూసర్ బి.వి. రావ్‌కు అత్యంత ఆప్తుడు. ఇద్దరూ రమ్ము ప్రియులు.

బి.వి. రావ్ రహస్య సమాచారాన్ని సేకరించటంలో డైనమిక్ రిపోర్టర్. కాని డబ్బు కోసం తప్పులు చేయటానికి వెనుకాడని మనిషి. గాసిప్స్ రాయటంలో దిట్ట. అందుకే అతడంటే భయపడతారు.

వెన్నెలని మిడాన్ గ్రూప్ నుంచి తొలగించడానికి తన లాయర్లు కేసు ఎందుకు వేసారో శరత్‌చంద్ర ప్రెస్‌కి చెబుతున్నాడు వీడియో ఫిల్మ్‌లో.

తన అసిస్టెంట్ వైపు తిరిగి. "మంచి మసాలా దొరికింది. అత్యంత ధనికులైన కుటుంబంలో చిచ్చు... ప్రజలకి ఉచితంగా పాప్‌కార్న్ దొరికినట్లే" అని నవ్వాడు ప్రొడ్యూసర్.

శరత్‌చంద్ర మాట్లాడాక, కేమేరావైపు తిరిగి లేడీ రిపోర్టర్ చెప్ప సాగింది. "వెన్నెలని తొలగించడానికి ప్రస్తుతం జడ్జిగారు ఒప్పుకోకపోయినా, ముందుముందు ట్రయల్స్‌లో ఏం జరుగుతుందో చూడాలి. గొప్ప వ్యాపార కుటుంబంలో కలతలు, చెల్లిపై అన్న కేసు... కార్పొరేట్ రంగం రెడ్ కార్పెట్ రంగం కాదని ఈ కేసు నిరూపిస్తుంది" అంటూ వివరిస్తోంది.

ప్రొడ్యూసర్ తన అసిస్టెంట్‌వైపు తిరిగి "నిరంజన్, వెన్నెలాల డిన్నర్‌కి వెళ్ళినప్పటి కవరేజీ చూపించు" అని అడిగాడు.

అసిస్టెంటు అతను చెప్పినట్టే వీడియో కవరేజ్‌ని బిగినింగ్‌కు తెచ్చి రన్ చేసాడు.

ఎదురుగా టీవీ మానిటర్‌పై నిరంజన్ కారు డోర్ తీయడం, వెన్నెల దిగుతుంటే గౌన్ ప్లిట్‌లోంచి ఆమె తొడ నుంచి కాలి హైహీల్స్ వరకూ, సెక్సీగా ఏదో మోడల్‌గా వుంది. అంతేగానీ ప్రతిష్టాత్మక గ్రూప్‌కి హెడ్‌లా లేదు.

ఆ తరువాత నిరంజన్, వెన్నెలా గురించిన వ్యాఖ్యలు... వెన్నెల ఆ సెక్సీ డ్రెస్ ఎందుకు వేసుకుందో తెలియదు. కాని శరత్‌చంద్ర విమర్శలకు అది కాస్త ఊతం ఇస్తోంది.

సిటీన్యూస్‌లో ఇది హాట్ టాపిక్ అవుతుందంటే సందేహం అక్కర్లేదు. ప్రొడ్యూసర్ కాస్సేపు ఆలోచించి–

"దీన్ని లీడ్‌గా కాకుండా, ముందు హైలెట్స్‌గా చెప్పి, చివర్లో ప్రసారం చేయాలి" అంటూ సూచించాడు అసిస్టెంట్స్‌కి.

నిజానికి తమ యజమాని కొడుకు నిరంజన్. అతని ఇమేజ్‌ని దెబ్బతీసేలా వున్న ఈ వీడియో క్లిప్పింగ్స్‌ని న్యూస్ ఛానల్‌లో ప్రసారం చేయకూడదు. కాని తమ ఎడిటర్ ఇన్ ఛీఫ్ మధుసూదన్‌రెడ్డిగారు కాదు గాబట్టి ప్రొడ్యూసర్ డేర్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని కనీసం తమ ఓనర్‌కి చెప్పాల్సిన అవసరం వుందని కూడా అతను ఆలోచించటం లేదు.

ఈ ప్రసారం ఎంత దుమారం లేపుతుందో ఆ ప్రొడ్యూసర్‌కి తెలుసు. కాని అతడికీ, బి.వి, రావ్‌కి అజ్ఞాత వ్యక్తులనుంచి లక్షల్లో డబ్బు అందింది.

తమ ఉద్యోగాలు పోయినా ఫరవాలేదు.

కాని వెన్నెల, నిరంజన్‌లపై ప్రజల్లో చెడు అభిప్రాయం కలిగించాలి.

వెన్నెలా పేరుకి, నిరంజన్ రాజకీయ జీవితానికి ఎదురులేని దెబ్బ కొట్టే ఛాన్స్ వచ్చింది. దీన్ని కేష్ చేసుకునే ప్రయత్నమే ప్రొడ్యూసర్‌ది.

వెంటనే బి.వి. రావ్‌కు ఫోన్ చేసాడా ప్రొడ్యూసర్.

✳ ✳ ✳ ✳ ✳

రాత్రిపూట తన సొంత న్యూస్ ఛానల్ 'తెలుగు టైమ్స్' వార్తలు చూస్తూ రెమీమార్టిన్ బ్రాందీ తాగడం మధుసూదన్‌రెడ్డికి అలవాటు.

న్యూస్ హైలెట్స్‌లో నిరంజన్, వెన్నెలాల గురించి వుండడం చూసి నొసలు విరిచాడాయన.

నిరంజన్ కారు తీయడం, వెన్నెల బిగుతైన నల్లటి డ్రెస్‌లో దిగడం, ఆమె కాళ్ళ సోయగం, సెక్సీదనం కురిపించడం...

మధుసూదన్‌రెడ్డికి ఆశ్చర్యం కలుగుతోంది.

అంతకుముందు తన చెల్లెలు వెన్నెలపై విరుచుకుపడ్డ శరత్‌చంద్ర మాటలు, నిజం అనిపించేలా ఓ మోడల్‌లా లేదా సినీస్టార్‌లా వుంది వెన్నెల.

ఇది కార్పొరేట్ రంగంలో చెడు ఇమేజ్ నిస్తుంది. వెన్నెలలో టాలెంట్ వుంది. కాని ప్రజలు ఇలాంటి దృశ్యాలు చూస్తే ఆమె గురించి చెడుగా వూహిస్తారు. నిరంజన్ కెరీర్‌కు కూడా ఇది మంచిదికాదు. ఎందుకిలా వీళ్ళిద్దరూ మీడియాకు అవకాశం ఇచ్చారు? ఈ విషయాన్ని రేపు–న్యూస్‌పేపర్లు ఇంకా వివరంగా కవర్ చేస్తాయి.

నిరంజన్‌కి మంచి జోడీ వెన్నెల. కాని తెలిసో తెలీకో ఆమె సమస్యల్లో చిక్కుకుంటోందనిపిస్తోంది.

చూస్తుంటే ఇదంతా ఎవరో కావాలని చేస్తున్నట్లుగా వుంది.

లేకపోతే వెన్నెలని సెక్సీగా చూపించటానికి అలా క్లోజ్‌కి జూమ్ చెయ్యాల్సిన అవసరంలేదు.

ఇందులో ఎవరిదో హస్తం వుంది. ఈ విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూ వెంటనే తన సెల్‌ఫోన్ అందుకుని ఒక నంబర్‌కి ఫోన్‌చేసాడు మధుసూదన్‌రెడ్డి.

* * * * *

వెన్నెల హెచ్.ఎస్. క్లబ్‌కి ఎన్నిక కావటాన్ని మొదటినుంచి వ్యతిరేకించిన వ్యక్తి డాక్టర్ భువనచంద్ర. పాతకాలం భావాలు బుర్రనిండా పేరుకుపోయిన మనిషి ఆయన.

మనుషుల జబ్బులు నయం చేయటంలో ఎన్నో రకాలు మందులు కనిపెట్టి మందులు తయారీ కంపెనీలకు అధిపతి అయివున్న ఆయనకు–

ఆయన చాందసభావాల్ని రూపుమాపే మందుల్ని మాత్రం ఇంత వరకూ ఎవరూ కనిపెట్టలేకపోయారు. మారుతున్న సమాజంతోబాటు మారలేకపోవడం కూడా ఓ మానసిక రుగ్మతే.

ప్రపంచం ఎంత ముందుకు వెళ్ళినా అది మగవాళ్ళకోసమే అని ఆయన వుద్దేశం. ఆడవాళ్ళు గడపదాటకుండా వుంటేనే గృహస్తుకు మర్యాద అంటాడు.

ఆయన కట్టుబాట్లు తట్టుకోలేక ఇద్దరు భార్యలు ఆయనకు విడాకులిచ్చేసారు. ఇప్పుడు మూడో భార్య కూడా విడాకులివ్వటానికి రెడీ అవుతోందని వినికిడి.

రోజులు మారుతున్నాయి గాబట్టి తప్పని పరిస్థితిలో ఏవో కొన్ని ఉద్యోగాలకు, వ్యాపారరంగాలకు పరిమితం కావాలిగాని, కీలక పదవులకు ఆడవాళ్ళు రాకూడదంటాడు.

అందుకే అతను టైగర్ యుగంధర్‌మీద ఎంత అభిమానం వున్నా ఆయన తన స్థానానికి కూతుర్ని నామినేట్ చేసాడని తెలిసి కూడా వెన్నెలని హెచ్.ఎస్. క్లబ్‌లో కాలు పెట్టనీయకూడదని మొదటినుంచి ప్రయత్నించాడు. కాని అది సాధ్యంకాలేదు. అందుకే వెన్నెలమీద ఆమెను సపోర్ట్ చేసిన నిరంజన్ మీద కూడా భువనచంద్రకు కోపం తీరలేదు. ఆమెను తన పదవినుంచి తప్పించే అవకాశాలకోసం అతను ఎదురుచూస్తున్నాడు.

ఆ అవకాశం అనుకోకుండా వచ్చింది అన్పించింది. ఎందుకంటే ఉదయం న్యూస్‌పేపర్స్‌లోను, తెలుగు టైమ్స్ న్యూస్ ఛానల్‌లోను నిరంజన్, వెన్నెలల గురించిన పార్టీ విశేషాలు ఆయన చూసాడు. చదివాడు. సంఘటన వాళ్ళిద్దరి పరువు, ప్రతిష్ఠలమీద కొంత ప్రభావం చూపించవచ్చు గాని హెచ్.ఎస్. క్లబ్ విషయంలో ఇది సాకు చూపించటానికి చాలదనిపించింది.

మరేదన్నా చేయాలి. ఇది మంచి అవకాశం. పరువు ప్రతిష్టలమీద దెబ్బపడితే చాలదు. ఆర్థికంగా కూడా ఆ అమ్మాయి ఎదురుదెబ్బలు తినాలి. అప్పుడే తప్పులు చేస్తుంది.

అప్పుడు తన ప్రమేయం లేకుండానే క్లబ్‌వాళ్ళు ఆమె గురించి ఆలోచనలో పడతారు. నోడౌట్. వెన్నెల డౌన్‌ఫాల్‌కి కౌంట్‌డౌన్ స్టార్టయింది." అనుకుంటూ తన సెల్ అందుకుని సెక్రటరీ మీనాకి ఫోన్‌చేసాడు.

"మినా... మిడాన్ గ్రూప్ వెన్నెల తెలుసుకదా?" అడిగాడు.

"తెలుసు సర్! ఇవాళ న్యూస్ సెంటర్ పాయింట్ ఆవిడేగదా. తెలీని వాళ్ళకి కూడా ఇప్పుడు ఆమె ఎవరో తెలిసిపోతుంది" అంది అవతలినుంచి మీనా.

"యస్. యు ఆర్ కరక్ట్. వెన్నెల సొంత కంపెనీలో ఆమె సెక్రటరీ పేరేమిటి? మారియా కదూ? యస్! ఆ అమ్మాయి నీ ఫ్రెండేగా?"

"అవును సార్!"

"సెల్. డ్రీమ్ ప్రాజక్ట్ గురించి మనకి సమాచారం కావాలి. మారియా ద్వారా సంపాదించ గలవా?"

"అది సాధ్యం కాదనుకుంటాను సార్, ఆమె వెన్నెలకి చాలా నమ్మకమైన మనిషి."

"నో ప్రాబ్లం. నమ్మకాల్ని నాశనం చేసేందుకే డబ్బు పుట్టింది. అర్థమైందా? ఖర్చుకోసం వెనుకాడనక్కర్లేదు. పని జరగాలి. పైగా నీ ఫ్రెండే గాబట్టి పని సాధించుకోడం పెద్ద కష్టంకాదు. మరో విషయం. ఆమె డ్రీమ్ ప్రాజక్టుకి మెయిన్ ఫైనాన్సింగ్ బ్యాంక్ ఇండీ బ్యాంక్ అని విన్నాను.

ఆ బ్యాంకు సి.ఇ.ఓ. కిరణ్‌కుమార్‌తో నాకు రేపు అపాయింట్‌మెంట్ కావాలి. మాట్లాడి ఏర్పాటుచెయ్యి. అలాగే ఆ బ్యాంకు ఎం.డి. ప్రకాశరావుతో కూడా అప్పాయింట్‌మెంట్ తీసుకో. నేను ఆఫీస్‌కు లేట్‌గా వస్తున్నాను" అంటూ చెప్పాల్సింది చెప్పి లైన్ కట్‌చేసి సెల్‌ఫోన్ జేబులో వేసుకున్నాడు.

* * * * *

వెన్నెలకి ఆ రోజంతా మనసు చికాకుగానే వుంది. ఉదయం పేపర్స్‌లోను తెలుగు టైమ్స్ న్యూస్ ఛానల్‌లోను విశేషాలు ఆమె కూడా చూసింది. ఏమిటీ లోకం? ఇప్పుడేం జరిగిందని తమ గురించి ఇంతగా ప్రచారం. పార్టీలో తనేమీ సెక్సీగా డ్రస్ వేసుకోలేదు. అయినా ఆ వీడియో

గ్రాఫర్స్ తనను సెక్సీగా చూపించటం కోసమే జూమ్‌చేసి మరీ తన అందాల్ని చూపించారు.

నిరంజన్‌కి, తనకు సంబంధం అంటకట్టి గాసిప్స్ రాసారు. దేనికీ? మీడియా వాళ్ళకి తనమీద ఎందుకీ వివక్ష. పనిగట్టుకుని ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఒకవేళ స్టెల్లా చెప్పినట్టు ఎవరయినా కావాలని యిలా చేస్తున్నారా?

ఆఫీస్‌లో ఎక్కువసేపు కూర్చోలేకపోయింది. సాయంకాలమే తన ఫ్లాట్‌కి తిరిగి వచ్చేసింది. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి, తన బెడ్‌రూంలోనే వుండిపోయింది. ఈ విషయంగా నిరంజన్ రియాక్షనేమిటో తెలీలేదు. ఉదయం నుంచీ ఫోన్‌కూడా చేయలేదు.

చీకటిపడిన కాస్సేపటికి నిరంజన్‌తో మాట్లాడాలనిపించింది. సెల్ స్విచ్ ఆన్‌చేసి నిరంజన్ సెల్‌కి ఫోన్‌చేసింది.

"మైగాడ్. వెన్నెలా... ఎక్కడున్నావ్. స్టెల్లాకు ఫోన్‌చేస్తే మధ్యాన్నం తర్వాత వెళ్ళిపోయావని చెప్పింది. మారియాకి ఫోన్‌చేస్తే నువ్వు ఎక్కడున్నావో తెలీదంటోంది. నీ సెల్ స్విచ్చాఫ్. వాటీజ్ దిస్. ఏమైపోయావ్?" నిరంజన్ హడావుడిగా మాట్లాడేస్తుంటే చిన్నగా నవ్వింది వెన్నెల.

"నేనేమీ అయిపోలేదు. ప్రస్తుతం నా ఫ్లాట్‌లోనే వున్నాను. మనసు బాగాలేదు. పనిగట్టుకుని మన గురించి బేడ్‌గా ప్రచారం చేస్తున్నారు మీడియా వాళ్ళు. అదే అర్థంగావటంలేదు" అంది.

"మీడియా అంతాకాదు. కొన్ని పత్రికలు తెలుగు టైమ్స్ న్యూస్ ఛానల్ వాళ్ళే."

"తెలుగు టైమ్స్ ఛానల్ మీదేగా. ఇందులో మీ హేండేమన్నా వుందా?"

"షిట్... అనుకున్నాను నువ్విలా అపార్థం చేసుకుంటావని భయపడే ఫోన్ చేస్తున్నాను. నువ్వు అందుబాటులో లేవు. డైరక్ట్‌గా వద్దామంటే వేరేపనుల్లో హెల్డప్ అయ్యాను. ఇందులో నా ఇన్‌వాల్వ్‌మెంట్ ఏమీలేదు.

అయినా ఇలాచేస్తే నీ పేరుతోబాటు, నా పేరూ చెడిపోతుందిగదా. డాడీ న్యూస్ ప్రొడ్యూసర్‌మీద మండిపడుతున్నారు. వివరాలు సేకరించే పనిలో వున్నారు."

"నేను పరువునష్టం దావావేస్తే ఎలా వుంటుందాని ఆలోచిస్తున్నాను."

"నువ్వు అలాంటి పిచ్చిపని చేయవని నాకు తెలుసు. ముందు నీ అన్న శరత్‌చంద్ర వ్యవహారం చూడు. ఎందుకోగాని అతను అనవసరంగా నీమీద నోరు పారేసుకుంటున్నాడ నుకుంటాను."

నిరంజన్...." చివరి మాటలు పలుకుతున్నప్పుడు ఎందుకో తడబడింది. కళ్ళు చెమర్చాయి.

"వెన్నెల ప్లీజ్... నువ్వు ఒంటరిదానివనే ఫీలింగ్ ఎందుకొస్తోంది నీకు? మేమంతా లేమా? నువ్వు టైగర్ కూతురువన్న సంగతి మర్చిపోయి ఇలా బేలగా మాట్లాడ్డం ఏమీ బాగలేదు."

"నీకు తెలీదు నిరంజన్. ఇలాంటి సమస్యను ఫేస్‌చేయటం నాకిదే ఫస్ట్‌టైం. వ్యాపారంలో పోటీ అయినా ఛాలెంజ్‌గా తీసుకుని పోరాడగలను. కాని ఇదేమిటి. ఒక మనిషిని కించపరిచే విధంగా పరువు, ప్రతిష్టల్ని దెబ్బతీసే విధంగా పనిగట్టుకుని ప్రచారంచేస్తూ, నా కేరక్టర్‌ని దెబ్బతీస్తున్నారు. అదే బాధగా వుంది."

"డోన్ట్‌వర్రీ. యుద్ధమంటూవస్తే పోరాటానికి సిద్ధమేనంటూ కబుర్లు చెప్పేదానివి. ఈ మాత్రానికే ఫీలయిపోతే ఎలా. ఇంట్లో వుంటే ఇలాగే పిచ్చి పిచ్చి ఆలోచనలొస్తాయి. నేను వస్తున్నాను. కాస్సేపు అలా బయటకు పోదాం."

"ఎక్కడున్నావో చెప్పు. నా కారు తీసుకొస్తా."

"నోనో... నా కారులో వెళదాం. పావుగంటలో అక్కడుంటాను. ఈలోపల రెడీకా. ఓ.కె" అవతల లైన్ కట్‌చేసాడు నిరంజన్.

నిరంజన్ చెప్పింది కరక్టే.

మనసు ప్రశాంతంగా వుండాలంటే కాస్సేపు అలా బయట తిరిగి రావటం మంచిది. అయినా ఇదేమిటి? ఒకరికి చెప్పటమేకాని ఒకరు చెపితే

వినే మెంటాలిటీ కాదు తనది. కాని నిరంజన్ ఏం చెప్పినా వింటోంది ఎందుకిలా? మానసికంగా అతనికి తను దగ్గరవుతోందా...?

అనూప్ తన లైఫ్ నుంచి డ్రాప్అయి, సుమకు దగ్గరగావటంతో ఇక ఇప్పట్లో ప్రేమ, పెళ్ళివంటి ఆలోచనలు లేవనుకుంది. డ్రీమ్‌లాండ్ ప్రాజెక్ట్ పనులు సూపర్‌వైజ్ చేసేలా అనూప్‌కి బాధ్యతలు నప్పగించి, అతను ఆర్థికంగా స్థిరపడేలా ఒక ఫ్రెండ్‌గా అతనికి తను చేయాల్సింది చేసింది.

కాని ఇంతలోనే నిరంజన్ తిరిగి తన జీవితంలోకి వస్తాడనుకోలేదు. అతడి మనసులో ఏముందో తెలీదుగాని, తను దగ్గరయిపోతున్నట్టు అన్పిస్తోంది.

ఆలోచిస్తూనే చకచకా రెడీ అయింది వెన్నెల. సింపుల్‌గా చీరజాకెట్‌లో ప్రీపేరయి ఎదురుచూసేలోగ నిరంజన్ కూడా వచ్చేసాడు. అతని కార్లోనే బయలుదేరింది. అతనే కారు డ్రయివ్ చేస్తున్నాడు.

"ఎక్కడికి వెళదాం?" దారిలో అడిగాడు.

"నీయిష్టం...."

"స్త్రీలు కుసుమకోమలమైన వారు అని కవులు ఎందుకు వర్ణిస్తారో నిన్ను చూస్తుంటే అర్ధమవుతోంది." అన్నాడు దరహాసంతో.

"నువ్వు నా అందాన్ని పొగుడుతున్నావా?" చెదిరిన ముంగురుల్ని సరిచేసుకుంటూ అడిగింది.

"లేని అందాన్ని ఆపాదిస్తూ చెప్పటం పొగడ్త అవుతుంది. నీది సహజమైన అందం. వేరే పొగడాలా... నా మాటలకి అర్థం పొగడ్తకాదు. నీ మానసిక స్థితిని చెప్పాను. జరిగినదాన్ని ఎందుకింత సీరియస్‌గా తీసుకుంటావ్? మరోసారి పొరబాటు జరక్కుండా జగ్రత్తపడదాం" అంటూ నచ్చచెప్పాడు.

అతడు పక్కనుంటే ఏదో దీమా–

తెలీని ఊరట.

ప్రశాంతంగా కళ్ళు మూసుకుంటూ–

మౌనంగా వుండిపోయింది.

తమ కారుని అనుమానం రానంత దూరంలో ఒక పోలీస్‌జీప్ ఫాలోఅవుతున్న విషయాన్ని నిరంజన్‌గాని, వెన్నెలగాని గమనించలేదు.

ఆ జీప్‌లో వస్తోంది సర్కిల్ ఎమ్.డి. గౌస్. అతని వెంట ఇద్దరు కానిస్టేబుల్స్ మాత్రమే వున్నారు. మేయర్ రాంరెడ్డి తనకు వప్పగించిన పనిని సక్రమంగా నెరవేర్చే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు గౌస్. అందుకే దారిలో నిరంజన్ కారుని, అతని పక్కన వెన్నెలని చూడగానే జీప్‌ని వెనక్కితిప్పి అనుసరించాడు.

నిరంజన్ కారు ఒక స్టార్ హోటల్ రెస్టారెంట్ పార్కింగ్‌లో ఆగటంచూసి గేటు బయటే జీప్‌ని ఆపాడు. వెన్నెల, నిరంజన్‌లు రెస్టారెంట్‌లోకి వెళ్ళటం చూసాక తన జీప్‌ను గేట్‌లోకి పోనిచ్చి పార్కింగ్‌లో ఆపి కిందకు దిగాడు.

హోటల్ ఎయిర్‌కండిషన్ సెక్షన్‌లోకి వెళ్ళి డిమ్‌లైట్లకింద కార్నర్ టేబుల్‌వద్ద కూర్చున్నారు వెన్నెల, నిరంజన్‌లు. ముందుగా లైట్‌ఫుడ్ ఆర్డర్ చేసారు. చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

చిన్న చిన్న జోకులతో ఆమెను నవ్విస్తూ సరదా కబుర్లతో ఆమెను మానసికంగా సాధారణ స్థితికి తీసుకొచ్చే ప్రయత్నం చేసాడు. బయలుదేరే ముందు వెనిలా ఐస్‌క్రీం తీసుకున్నారు. బిల్లు పేచేసి బయటికి వచ్చేసారు.

అప్పటికి ఎనిమిది దాటింది సమయం.

కారులో కూర్చోగానే సంథింగ్ రాంగ్ అన్పించింది నిరంజన్‌కి. తను డ్రింక్ చేయలేదు. అయినా మందుకొట్టిన ఎఫెక్ట్ కన్పిస్తోంది. ఏం జరిగింది?

ఐస్‌క్రీం తినటానికి ముందువరకు బాగానే వుంది. తర్వాత నుంచే ఏదో తేడా కన్పిస్తోంది. వెన్నెలతో చెప్తే ఏమనుకుంటుందోనని కారు స్టార్ట్ చేసాడు. నిజానికి వెన్నెల పరిస్థితి కూడా అతడికి భిన్నంగా ఏమీ లేదు. ఒళ్ళంతా మత్తు ఆవరించుకున్నట్టు, శరీరం గాల్లో తేలిపోతున్నట్టు ఏదోలా వుందామెకు.

"నిరంజన్! మనం డ్రింక్ చేయలేదుకదా? ఏమిటి నాకు అదోలా వుంది?" దారిలో తనను తాను కంట్రోల్ చేసుకోడానికి ప్రయత్నిస్తూ అడిగింది.

"అదే అర్థంగావటంలేదు. నాకూ అలాగే వుంది...." జాగ్రత్తగా డ్రయివ్‌చేస్తూ చెప్పాడు నిరంజన్.

అతడికి కొంచెం కొంచెం అర్థమవుతోంది.

కొంతకాలం కిందటివరకు తను డ్రగ్ ఎడిక్ట్స్.

దాని ప్రభావం ఎలా వుంటుందో తెలుసు.

కావాలని చేసారో పొరపాటున జరిగిందోగాని తాము బయలుదేరే ముందు తీసుకున్న ఐస్‌క్రీమ్‌లో కోకయిన్ లాంటి పదార్థం ఏదో కలిసింది. ఆలోచిస్తూనే కారును వెన్నెల ఫ్లాట్ దిశగా పోనిస్తున్నాడు. మత్తుమైకంతో కారు వేగంగా పరుగుతీస్తోంది.

అంతలో సైరన్ మోగించుకుంటూ దూసుకొచ్చింది పోలీస్‌జీప్. కారుని ఆపమని సిగ్నలిస్తూ ఓవర్‌టేక్ చేసి కారును అడ్డం కొట్టింది. జీప్ సమీపంలో కారాపాడు నిరంజన్.

జీప్ దిగి లాఠీ వూపుకుంటూ నిరంజన్ పక్కకొచ్చాడు సర్కిల్ గౌస్. నిరంజన్ ఫేమస్ పర్సన్ గాబట్టి గౌస్‌కి తెలుసు. కాని గౌస్‌తో నిరంజన్‌కి పరిచయంలేదు.

"ఏమైంది? కారెందుకు ఆపారు?" తనను తాను కంట్రోల్ చేసుకుంటూ అడిగాడు నిరంజన్.

"ఏమిటీ? పక్కన అమ్మాయుంటే అంత ఫాస్ట్‌గా వెళ్ళాలా? ఇదే స్పీడ్‌లోవెళితే ఇంటికెళ్ళాదు. సరాసరి పైకిపోతారు. తాగి డ్రయివ్‌చేయటం ఒక నేరం, ఓవర్‌స్పీడ్ మరో నేరం. దిగండి. కారు దిగండి" కటువుగా హెచ్చరించాడు.

"సర్కిల్. నేనెవరో తెలీకుండా మాట్లాడకు."

"వద్దు. చెప్పొద్దు. ఎవరయినా ఎంత పెద్దవాళ్ళయినా చట్టం ముందు సమానమే. చట్టాన్ని అతిక్రమించే వాళ్ళు శిక్షార్హులు. ప్లీజ్. మా డ్యూటీ మేం చేయనీయండి. దిగండి."

వెన్నెల మత్తులోవున్నా స్పృహలోనేవుంది.

ఏం జరుగుతుందో అర్థంగాక కంగారుపడుతోంది.

తప్పని పరిస్థితిలో యిద్దరూ కారు దిగారు. గౌస్ వాళ్ళిద్దరినుంచి సెల్‌ఫోన్‌లు తీసేసుకున్నాడు.

అదే సమయంలో ఒక కానిస్టేబుల్ తెల్లటి పౌడర్ వున్న పాకెట్‌ని చించి ఎవరూ చూడకుండా సీటుమీద పడేసాడు. కారును సోదాచేస్తున్నట్టు నటిస్తూ జేబురుమాలుతో పౌడర్ పాకెట్టును భద్రంగా తీసి కానిస్టేబుల్‌కు అందించాడు గౌస్.

సరిగ్గా అదే టైంలో ఒక ప్రముఖ టీ వీ ఛానల్ వ్యాన్ అటుగా వస్తూ పోలీసుల్ని చూసి ఆగింది. నిరంజన్, వెన్నెలను చూడగానే ఫోటోగ్రాఫర్ వీడియో కవరేజ్ ఆరంభించాడు. ఇంతలో కొందరు పత్రికావిలేకర్లు వచ్చిచేరారు.

ఇదంతా కలలో జరుగుతున్నట్టుంది నిరంజన్‌కి.

తను ఎమ్మెల్యేనని చెప్పాడు. కోప్పడ్డాడు.

తనుగాని వెన్నెలగాని డ్రగ్స్ తీసుకోలేదని అరిచిచెప్పాడు.

“మీరు చెప్పదలుచుకున్నది ఏమన్నావుంటే రేపు కోర్టులో చెప్పుకోండి. కమాన్. జీప్ ఎక్కండి” అన్నాడు గౌస్.

అప్పటికే జరుగుతున్నది ఏమీ తెలీని మత్తులోకి సోలిపోయింది వెన్నెల. నిరంజన్‌కి కూడా కళ్ళు మూతలు పడుతున్నాయి. ఇద్దర్నీ తన జీప్‌లో ఒక ప్రముఖ ఆస్పత్రికి తీసుకెళ్ళాడు గౌస్.

అక్కడ డాక్టర్ల చేత యిద్దర్నీ టెస్ట్ చేయించారు. తర్వాత ఇద్దర్నీ జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చాడు. అప్పటికే ఒక కానిస్టేబిల్ నిరంజన్ కారుని తీసుకొచ్చి స్టేషన్ ఆవరణలో పార్క్‌చేసాడు.

మీడియా గౌస్‌ని ఫాలోఅవతూనేవుంది.

నిరంజన్ వెన్నెలలు సాధారణ పౌరులుకాదు.

సిటీలోనే అత్యధిక ధనవంతమైన రెండు కుటుంబాలకు వారసులు. పైగా నిరంజన్ రెడ్డి ఒక టి వి ఛానల్‌కి ఓనర్.

మీడియాలో కూడా మంచివాళ్ళు చెడ్డవాళ్ళు వున్నారు. వెన్నెల నిరంజన్‌ల సెల్‌ఫోన్‌లు గౌస్ హాండోవర్ చేసుకున్నా వెళ్ళాల్సిన వాళ్ళకి ఫోన్‌కాల్స్ వెళ్ళిపోయాయి.

సర్కిల్ గౌస్ నిరంజన్, వెన్నలలను ఒకే సెల్‌లో బంధించి కాపలాగా యిద్దరు లేడీ కానిస్టేబిల్స్‌ని వుంచాడు. సెల్‌లో వెన్నెల పక్కనే తనూ మత్తులోకి జారిపోయాడు నిరంజన్.

విషయం తెలీగానే మధుసూదన్‌రెడ్డి తమ లాయరును తీసుకుని బయలుదేరాడు. ఇటు వెన్నెల సెక్రటరీలు స్టెల్లా, అనూరాధ యిద్దరూ తమ లాయర్లతో హడావుడిగా వేచ్చేసారు.

పోలీస్‌స్టేషన్ వద్ద మీడియా ప్రతినిధులతోబాటు కార్లసందడి. మధుసూదన్‌రెడ్డి స్టెల్లా, అనూ అంతా స్టేషన్‌లోకి వచ్చేసరికి సర్కిల్ గౌస్ ఇంకా స్టేషన్‌లోనే వున్నాడు.

"సారీ. యిది డ్రగ్స్‌కేసు. స్టేషన్ బెయిల్ యివ్వటం సాధ్యంకాదు" అంటూ తెగేసి చెప్పాడు.

నిరంజన్ డ్రగ్స్ తీసుకోవడం మానేసి చాలారోజులయింది. తిరిగి వాటి జోలికి పోనని ఒట్టు పెట్టుకున్నాడు. ఇక వెన్నెలకి డ్రగ్స్ వాడే అలవాటూలేదు అవసరం కూడా లేదు.

మధుసూదన్‌రెడ్డికి ఆ విషయం బాగా తెలుసు. ఎక్కడో పొరబాటు జరిగిందని ఆయన వూహిస్తూనే వున్నాడు.

"వీళ్ళద్దరూ ఎవరో తెలిసే అరెస్ట్ చేసావా?" సీరియస్‌గా గౌస్‌ని అడిగాడు మధుసూదన్‌రెడ్డి.

"తెలిసినా అరెస్ట్ చేసేవాడ్ని. కాని నిజానికి ఈ ఇద్దరూ ఎవరో నాకు తెలీదు. ఓవర్‌స్పీడ్‌గా వస్తుంటే ఆపాను. చూస్తే తాగి వున్నారనుకున్నాను. లోన పౌడర్‌తో కూడిన పాకెట్ దొరికింది.

చూస్తే పెళ్ళయిన జంటలాలేదు. డ్రగ్స్ తీసుకోవడం, ఓవర్‌స్పీడ్‌గా కారు నడపటం రెండూ నేరమే, సో... నా డ్యూటీ నేను చేసాను.

ఈ కేసు డ్రగ్‌యాక్ట్ కిందకి వస్తుంది గాబట్టి వీళ్ళిద్దరికీ బెయిలు దొరక్కపోవచ్చు. రేపు కోర్టులో ప్రయత్నించండి. సారీ. నేను చేయగలిగింది ఏమీలేదు" అన్నాడు గౌస్.

ఒ.కె. మిస్టర్ గౌస్. తప్పుచేసావ్. తెలిసీ కరెంట్ తీగను ముట్టుకున్నావ్. మావాళ్ళ తప్పులేదని తేలితే తర్వాత నువ్వు విచారించే అవకాశం కూడా వుండదు. రేపు కోర్టులో కలుసుకుందాం." అంటూ హెచ్చరించి లాయర్లతో వెనుతిరిగి వెళ్ళిపోయాడాయన.

వర్షంకురిసి వెలిసినట్టయింది పోలీస్‌స్టేషన్‌లో.

వెళుతున్న మధుసూదన్‌రెడ్డిని చూస్తూ చిన్నగా నవ్వుకున్నాడు గౌస్. తను తప్పు చేసాడు గాబట్టి లక్షల్లో సొమ్ము ముట్టింది. ఆమాత్రం డేర్ చేయకపోతే బాగుపడేదెట్టా.

రెస్టారెంట్‌లోని సర్వర్ ద్వారా ఐస్‌క్రీమ్‌లో కొకయిన్ కలిపి నిరంజన్ వెన్నెలకు సర్వ్ చేయించాడు. డబ్బుండాలేగాని ఎలాంటి దగుల్బాజీపని చేయటానికయినా మనుషులు దొరుకుతారు.

అలాగే టీ వీ ఛానల్‌వాళ్ళు వేన్‌గాని పత్రికా విలేఖరులుగాని కాక తాళీయంగారాలేదు. అంతా ముందుగా వేసుకున్న పధకం ప్రకారమే జరిగింది. పధకం రచన మేయర్ రాంరెడ్డి. రవీందర్‌లది. ఆ పధకాన్ని పక్కాగా అమలుచేసింది సర్కిల్ గౌస్.

అప్పటికే టీ వీ న్యూస్ ఛానల్స్‌లో నిరంజన్ వెన్నెలల అరెస్ట్‌కు సంబంధించి సిటీఅంతా ఫ్లాష్‌న్యూస్‌లో ప్రసారం జరిగిపోయింది. ఆ న్యూస్ చూస్తూ మేయర్ రాంరెడ్డి, రవీందర్‌లతోబాటు మరికొందరు ఖుషీగా పార్టీచేసుకున్నారు.

❈ ❈ ❈ ❈ ❈

మరునాడు ఉదయం ఎనిమిదిగంటలకుగాని జైలుగదిలో వున్న నిరంజన్, వెన్నెలకు కోకయిన్ మత్తు వీడలేదు. తామిద్దరూ రాత్రంతా జైలు గోడలమధ్య వున్నారు.

పైగా డ్రగ్స్ యాక్ట్‌కింద తమను అరెస్ట్ చేసాడు సర్కిల్. ఇది సాధారణ విషయంకాదు. తమ కెరీర్‌ని దెబ్బతీయటానికి ఎవరో పన్నిన కుట్ర.

వెన్నెల అయితే చాలాసేపు ఏడుస్తూనేవుంది. నిరంజన్ ధైర్యం చెప్పినా ఆమె తేరుకోలేకపోయింది.

"సారీ వెన్నెలా. నిన్ను బయటకు పిలిచి పొరబాటు చేసాననిపిస్తోంది. నిన్నటి సంఘటన ఏదో మీడియావాళ్ళ పొరబాటే అనుకున్నాను గాని మనల్ని దెబ్బతీయటానికి ఇంత పెద్ద కుట్ర జరగుతుందని వూహించలేదు" అన్నాడు.

"ఇప్పుడెలా? ఏం చేయాలి?" కళ్ళు తుడుచుకుంటూ అడిగింది వెన్నెల.

"డోన్ట్ వర్రీ. ముందు మనం బెయిలుమీద బయటపడితే తర్వాత ఈ కుట్రవెనక ఎవరు వున్నారో తేల్చుకుందాం. నువ్వు ఇలా డీలా పడిపోతే లాభంలేదు. ధైర్యంగా వుండు" అంటూ నచ్చచెప్పాడు.

కోర్టు టైం గావటంతో ముఖాలు కడుక్కుని పోలీసులు వెంటబయల్దేరారు. ఈలోపల కోర్టు వద్ద చాలా హడావుడిగా వుంది. నిరంజన్, వెన్నెలల అరెస్ట్ విషయం మీడియాలో రావటంతో కోర్టు వద్ద పెద్ద ఎత్తున జనం చేరారు.

పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేసారు. నిరంజన్, వెన్నెల తరపున డజనుమంది లాయర్లు మధుసూదన్‌రెడ్డి, స్టెల్లా, అనూరాధ, రవీందర్ ఇంకా అనేకమంది కోర్టు టైంకి ముందే అక్కడ రెడీగా వున్నారు.

ముఖ్యంగా టైగర్ యుగంధర్ మిత్రుడు, కంపెనీ లీగల్ అడ్వయిజరయిన లాయరు ధర్మారావు నిరంజన్, వెన్నెల తరపున వాదించటానికి బరిలోకి దిగటం విశేషం.

కోర్టు ఆరంభమైంది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి కేసు పూర్వాపరాల్ని జడ్జిగారికి వివరించాడు.

తర్వాత లాయరు ధర్మారావు లేచి తన వాదన విన్పించాడు.

"యువరానర్! నా క్లయింట్ వెన్నెలతో బాటు ఎమ్మెల్యే నిరంజన్‌లను ఎన్.ఏ.పి.డి. యాక్ట్ కింద అరెస్ట్ చేసారు సర్కిల్ ఎం.డి.గౌస్‌గారు. డ్రగ్స్ ఉపయోగించటం, అమ్మటం రెండూ నేరమే.

అయితే రెంటికీ వ్యత్యాసం ఉందిగాబట్టి ఈ చట్టం రెండుగా విడగొట్ట బడింది. సర్కిల్ గౌస్‌గారు ఈ రెంటిలో ఏ చట్టం కింద నా క్లయింట్లను అరెస్ట్ చేసారో వివరించలేదు.

ఒక కారులో డ్రగ్స్ పాకెట్ కనిపించినప్పుడు ప్రైవేట్ విట్‌నెస్ సమక్షంలోనే ఆ పాకెట్‌ని స్వాధీనపరుచుకోవాలి. ఇక్కడ అలా జరగలేదు.

ఇక డాక్టర్స్ రిపోర్ట్ ప్రకారం నిరంజన్, వెన్నెల బ్లడ్‌లో 0.25 ఎంపి కంటే తక్కువ స్థాయిలోనే కొకైన్ ట్రేసెస్ ఉన్నట్లు తెలుస్తోంది. యూజర్స్ యాక్ట్ ప్రకారం నిందితుని బ్లడ్‌లో రెండు గ్రాముల వరకు డ్రగ్ ట్రేసెస్‌కి శిక్ష కఠినంగా వుండదు.

అదే వ్యాపారం కోసం వందగ్రాముల డ్రగ్స్ పట్టుబడితే, ఆ వ్యక్తికి ఒకటి నుండి పదేళ్ళ వరకు కారాగార శిక్షతో బాటు ఒకటి లేదా రెండు లక్షల ఫైన్ విధించే అవకాశం వుంది.

ఈ విషయాలు నేను కోర్టు వారికి విన్న వించటానికి కారణం ఒక్కటే. డ్రగ్స్ యాక్ట్ కింద అరెస్టయితే బెయిలుండదు. కాని ఇక్కడ పరిస్థితి వేరు.

సర్కిల్ గౌస్‌గారు నా క్లయింట్ల కారులో పట్టుకున్నట్టు చెప్తున్న పాకెట్‌లోని పౌడరు అది చరసా కొకైనా, బ్రౌన్‌షుగరా? ఏ విషయం లాబ్ రిపోర్ట్ అందేవరకు తెలీదు.

నా క్లయింట్లు తమ కారులోకి ఆ పాకెట్ ఎలా వచ్చిందో తెలీదంటున్నారు. రెస్టారెంట్‌లో ఐస్‌క్రీమ్ తిన్న తర్వాతనే తమకు మైకం లాంటిది ఏర్పడిందని చెప్తున్నారు.

నా క్లయింట్‌లకు మాదకద్రవ్యాల వ్యాపారం చేయాల్సిన అవసరంలేదు. వారికి ఎన్నో వ్యాపారాలున్నాయి. రాష్ట్రంలోని టాప్ టెన్ రిచ్‌ఫ్యామిలీస్‌లో రెండు కుటుంబాలకు వారసులు వీళ్ళు. ఇక వీళ్ళు డ్రగ్ ఎడిక్ట్సుకారు.

ఒకరు ఎమ్మెల్యే. ఒకరు పారిశ్రామికవేత్త. మాదకద్రవ్యాలు సేవించేంత మానసిక బలహీనత వారికి లేదు. ఆ అవసరం కూడా లేదు. యూజర్స్ యాక్ట్ కింద వీరిని అరెస్ట్ చేసారనుకున్నా, వారు తాము డ్రగ్స్

యూజ్ చేయలేదని, తమ ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్రలో భాగంగా ఎవరో కావాలని ఇదంతా చేసారని చెప్తున్నారు.

విచారణ తర్వాత గాని అసలు నిజం బయటపడదు. కాబట్టి యువరానర్? బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద నా క్లయింట్‌లు నిరంజన్, వెన్నెలలకు బెయిల్ మంజూరు చేయవలసిందిగా కోరుతున్నాను" అంటూ తన వాదన విన్పించాడు.

బెయిలు మంజూరు గాకుండా చూడాలని పి.పి. అడ్డుగోలుగా కొన్ని వాదనలు వినిపించాడు గాని, జడ్జీగారు పట్టించుకోలేదు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద కేసును ట్రీట్ చేస్తూ చెరో పదివేల రూపాయల పూచీకత్తు మీద ఇద్దరికీ బెయిలు మంజూరు చేసారు.

* * * * *

విజృంభన లోనకొచ్చేసరికి శరత్‌చంద్ర సీరియస్‌గా ఏదో వ్రాసుకుంటూ కన్పించాడు.

"నా దగ్గరో ముఖ్య సమాచారం వుంది శరత్!" అంటూ వచ్చి అతడి సమీపంలో కూర్చుంది.

"ఏమిటది?" కాస్త చికాగ్గా అడిగాడు శరత్.

"వెన్నెల గురించి. అయినా నా గురించే నువ్వు పట్టించుకోవు. ఇక చెల్లెల గురించి ఏం పట్టించుకుంటావు...."

"స్టాపిట్ ప్లీజ్! విషయం ఏమిటో చెప్పు?"

"నిన్న హెచ్.ఎస్. క్లబ్ వాళ్ళు ప్రత్యేక సమావేశం జరిపారు. వెన్నెలని పదవి నుంచి తొలగించబోతున్నారు. సభ్యత్వం కూడా రద్దుచేసే అవకాశం వుంది."

"ఇది రహస్య సమాచారం. క్లబ్ అంతర్గత విషయాలు బయటకు పొక్కవు. నీకెలా తెలుసు?"

"తెలుసు. ఎలా అని అడక్కు. నా కాంటాక్ట్‌లు నాకుంటాయి. అవునూ. నువ్వేమిటి అంత సీరియస్‌గా రాస్తున్నావ్?"

"ప్రసంగ పాకం. నేను మిడాన్ గ్రూప్ హెడ్‌గా ఎన్నిక కాగానే చేయాల్సిన మొదటి ప్రసంగ పాకం రెడీ చేసుకుంటున్నాను."

విజృంభన కళ్ళలో ఆశ్చర్యం తొంగిచూసింది.

"నమ్మలేకపోతున్నాను. అదెలా సాధ్యం శరత్?" అనడిగింది.

"తలచుకుంటే సాధ్యమే. తెలివితేటలు నా చెల్లెలు వెన్నెలకే కాదు నాకూ వున్నాయి. రేపు మిడాన్ గ్రూప్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ వుంది. వెన్నెలని పదవినుంచి తొలగించి ఆ స్థానంలో నన్ను ఎన్నుకోబోతున్నారు.

వెన్నెల అరెస్ట్ కాకముందునుంచే రవీందర్ ప్లాన్ చేసాడు. వెన్నెల అరెస్ట్ గావటంతో నా పని సులువయింది. పదవులు, బాధ్యతల్లో వున్నవాళ్ళు రొమాన్స్‌లో పడితే ఇలానే వుంటుంది. నిరంజన్ ప్రేమలోపడి తన కెరీర్‌ను నాశనం చేసుకుంది వెన్నెల."

"అయితే నేను వూహించింది నిజమేనన్నమాట. వాళ్ళిద్దరిమధ్యా ఏమీ లేకపోతే కలిసి పార్టీలు, షికార్లు ఎందుకుంటాయి? డ్రగ్స్ కూడా కలిసే తీసుకుని కటకటాలు చూసారు. అయితే నువ్వు, మీ డాడీ సీట్లో కూర్చోవటం ఖాయమన్నమాట. నాకు చాలా ఆనందంగా వుంది శరత్."

"ఇంతకీ నీ సమాచారం పక్కానా?"

"నూటికి నూరుశాతం కరక్ట్. ఏమో, హెచ్.ఎస్. క్లబ్‌లో కూడా నీకు స్థానం రావచ్చు. అయాం హేపీ శరత్. అర్జంట్‌గా ఈ ఆనందాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి" అంటూ రాక్‌లోంచి విస్కీ బాటిల్ అందుకుంది.

* * * * *

ఆ రోజు మిడాన్ గ్రూప్ ఆఫీస్‌కి రాలేదు వెన్నెల.

వెన్నెల, నిరంజన్‌ల అరెస్టు బెయిలుపై విడుదల కావటం మొదలయిన విషయాల గురించి మీడియాలో విస్తృతంగా వార్తలు కథనాలు వచ్చాయి. పబ్లిక్‌లో ఇది రచ్చనీయాంశమైంది. బయటకు రావటానికి ముఖం చెల్లక వెన్నెల ఆఫీస్‌కు రాలేదా, మరేదన్నా కారణమా? అర్థంకాక కంగారుపడుతోంది స్టెల్లా.

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆమె వెన్నెల గురించి ఫోన్లు చేస్తూనే వుంది. మధ్యాహ్నం మూడు గంటలకు తమ ఆఫీస్‌లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం వుందని తెలిసి ఆమెలో ఆతృత మరీ ఎక్కువైంది ఆ మీటింగ్ ప్రాధాన్యత ఏమిటో ఆమెకు తెలుసు.

వెన్నెల మొబైల్ స్విచ్ ఆఫ్ చేయబడివుంది.

ఇంట్లో ఆయాకూడా వెన్నెల గురించి కంగారుపడుతోంది. ఉదయం నుంచీ వెన్నెల కన్పించటంలేదని కారు ఇంటిదగ్గరే వుందని ఎవరికీ కనబడకుండా ఆమె ఎప్పుడు ఎలా బయట ఎక్కడికి వెళ్ళిందో అంతుచిక్కటంలేదని చెప్పింది. సెక్రటరీ మారియా గాని, నిరంజన్‌గాని ఆమె ఆచూకీ చెప్పలేకపోతున్నారు.

రెండున్నర గంటలకే లోకల్ నేషనల్ మీడియా ప్రతినిధులు కవరేజ్ కోసం వచ్చి ఆఫీస్ హాల్లో కూర్చునున్నారు. వెన్నెల గురించి వారు అడిగే ప్రశ్నలకు తను బదులుచెప్పలేక పోతోంది.

ఈలోపల ఫుల్‌సూట్‌లో ట్రీమ్‌గా తయారయి వచ్చిన శరత్‌చంద్ర రవీందర్ ఆఫీస్‌లోకి వెళ్ళటం చూసింది స్టెల్లా. ఆమెకు విషయం అర్థమైపోయింది.

వెన్నెలమీద దారుణమయిన కుట్ర జరుగుతోంది. వాళ్ళ కుట్ర ఫలిస్తే మిడాన్ గ్రూప్ హెడ్‌గా వెన్నెలకి ఇవాళే ఆఖరిరోజు అవుతుంది. వెన్నెల పక్కన చేరినందుకు కక్ష గట్టిన రవీందర్ తనను డిస్మిస్ చేయించినా ఆశ్చర్యంలేదు.

ఇంతలో రవీందర్ అతడి వెనకే శరత్‌చంద్ర ఇద్దరూ బయటికొచ్చారు. రవీందర్ కాస్త దూరంనుంచే స్టెల్లాను అడిగాడు. "వెన్నెల జాడ తెలిసిందా?" అంటూ.

"లేదు... ఆమె కాల్‌కోసమే వెయిట్ చేస్తున్నాను."

"ఓ.కె!"

శరత్‌చంద్రను తీసుకుని మీటింగ్ హాలువైపు వెళ్ళిపోయాడు. రవీందర్.

అలా వెళుతూ అతను చూసిన చూపులు అతడి పెదవులమీది వంకర నవ్వు స్టెల్లాను కలవరపెట్టాయి.

"ఓ మైగాడ్! వెన్నెలా వేరార్ యూ" అనుకుంటూ తల పట్టుకుంది బాధగా స్టెల్లా.

❈ ❈ ❈ ❈ ❈

సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో తను భవంతి లాన్‌లో చిన్న పార్టీ ఏర్పాటుచేసింది విజృంభన. అదీ తన భర్త మిడాన్ గ్రూప్‌కి హెడ్ అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని.

ఆ పార్టీకి పరిమితంగా కొద్దిమంది ముఖ్యుల్ని మాత్రమే ఆహ్వానించింది. అయితే వారిలో మహేష్‌కేల్కర్ లేడు. అతనికి బదులుగా నటరాజ్‌ని పిలిచింది.

ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ మెహబూబ్ ద్వారా ఆమెకు నటరాజ్ పరిచయమయ్యాడు. బాగా డబ్బున్న లేడీకోసం అన్వేషిస్తున్న నటరాజ్‌కి విజృంభన బంగారు బాతులా దొరికింది.

విజృంభన భర్త శరత్‌చంద్రను మొదటిసారిగా చూడబోతున్న ఆతృత నటరాజ్‌లో వుంది. పార్టీ ఆరంభమైన కొద్దిసేపటికే కారు దిగి లోనకొస్తూ కన్పించాడు శరత్‌చంద్ర.

అతడి ముఖంలో ఆనందం లేదు.

ముఖం కందగడ్డలా వుంది.

కళ్ళలో కోపం. అవమాన భారం.

అయితే మందు మైకంలో వున్న విజృంభన అతని మూడ్ గమనించకుండా దగ్గరకెళ్ళి ఉత్సాహంగా అడిగింది.

"కంగ్రాట్స్ శరత్! మిడాన్ గ్రూప్ హెడ్‌గా నీ స్థానం దక్కించుకున్నందుకు చాలా ఆనందంగా వుంది. మొదటిరోజు ఎలా వుంది?"

ఒకసారి విసుగ్గా భార్యను చూసాడు శరత్‌చంద్ర.

"ఆ విషయం ఆ రాస్కేల్ రవీందర్‌ని అడుగు" అన్నాడు కసిగా.

"ఏమైంది?" షాకవుతూ అడిగింది.

"వాడు నన్ను మోసం చేసాడు. నన్ను అడ్డం పెట్టుకుని నా స్థానంలో వాడు కూర్చున్నాడు. వెన్నెలని తప్పించి నన్ను ఆ స్థానంలో కూచోబెడితే, నా కంపెనీ షేర్లు పతనమవుతాయట.

అందుకని టైగర్ వారసులు ఎవరూ వుండకూడదని రవీందర్‌కి పట్టంగట్టారు. తన ఏర్పాట్లు తను చేసుకుని చివరి క్షణం దాకా నాటకం

ఆడి నన్ను దెబ్బతీసాడు. ఐయామ్ హెల్ప్‌లెస్" అంటూ బాటిల్ ఎత్తి రా సరుకు గటగటా నాలుగు గుక్కలు తాగేసాడు.

అంతే–

ఒక్కసారిగా విజృంభన ముఖంలో రంగులు మారిపోయాయి.

"నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నిజానికి నేను ఫూల్‌ని. నువ్వు చేతకాని వాడివి. ఐ హెట్ యు. డైవర్స్‌కి అప్లయ్ చేస్తాను. బి రెడీ. నీ ఆస్థిలో నాకు చాలా యివ్వాల్సి వుంటుంది" అంది ఆవేశంగా.

"నో ప్రాబ్లం. నీ తల నొప్పి నాకు వదులుతుందంటే, ఎంత ఆస్థిపోయినా పరవాలేదు. గెట్ లాస్ట్." తనూ ఘాటుగానే సమాధానమిచ్చాడు శరత్‌చంద్ర.

ఎక్కడి వాళ్ళక్కడ ఆశ్చర్యంతో శిలా విగ్రహాల్లా నిలబడి చూసారు.

వాళ్ళందరి ముందే విజృంభన నటరాజ్ చేయి అందుకుని విసవిసా వెళ్ళి కార్లో కూర్చుంది.

ఆ కారు వెళ్ళిపోగానే–

వచ్చిన గెస్ట్‌లు కూడా నెమ్మదిగా జారుకున్నారు.

ఎక్కడన్నా ఒంటరిగా కూర్చుని ఏడవాలనుంది శరత్‌చంద్రకి. అక్కడే ఛైర్‌లో కూర్చుని మందుకొడుతూ ఆలోచిస్తున్నాడు. ఇప్పుడిప్పుడే కనువిప్పు కలుగుతోంది అతడికి.

ఎంతపని చేసాడు తను? ఎందుకిలా చేసాడు? ఆడపిల్ల అధికారంలోకి రావటం భరించలేక గుడ్డిగా రవీందర్ చేతిలో కీలుబొమ్మ అయ్యాడు.

సొంత చెల్లెలకే ద్రోహంచేసి తను బాగుపడింది మాత్రం ఏముంది? పిల్లి పిల్లి తగవు కోతి తీర్చిన సామెతగా, అన్నా చెల్లెళ్ళయిన తామిద్దరినీ దెబ్బకొట్టి మిడాన్ గ్రూప్‌కి హెడ్ అయ్యాడు రవీందర్.

కాదు... అతడికి చేజేతులా తనే ఆ అవకాశం కల్పించాడు. ఇంతకన్నా మూర్ఖత్వం మరొకటి వుండదు. డాడీ అంచనా కరక్టే. తెలివితేటల విషయంలో వెన్నెల ముందు తను ఎందుకూ పనికిరాడు. ఇప్పుడు తను ఏం చేయాలి?

ఏం చేయాలో ఆలోచించే లోపలే మందు ఎక్కువై అక్కడే నిద్రలోకి జారుకున్నాడు శరత్‌చంద్ర.

✻ ✻ ✻ ✻ ✻

సాయంకాలమైనా వెన్నెల తిరిగి రాకపోవటం అందరిలోనూ పలు అనుమానాలకు అస్కారం కలిగించింది.

ఆమె విషయంలో అయోమయ పరిస్థితి నెలకొంది.

ఆమె ఎక్కడికెళ్ళినా మధ్యాహ్నం భోజనం టైంకయినా ఇంటికి తిరిగి వస్తుంది అనుకున్నాడు నిరంజన్. అలా జరగలేదు దాంతో నిరంజన్‌లో ఆందోళన మొదలయింది. అందుకు తగ్గట్టే–

మిడాన్ గ్రూప్‌లో డైరక్టర్ల బోర్డ్ మీటింగ్ జరుగుతోందనీ వెన్నెలని దించేసి, శరత్‌చంద్రను తెరపైకి తెచ్చేప్రయత్నాలేవో రవీందర్ చేస్తున్నాడని ఫోన్‌లో స్టెల్లా చెప్పగానే నిరంజన్‌లో సరికొత్త అనుమానాలు తలెత్తాయి.

వెన్నెల బోర్డ్ మీటింగ్‌కి హాజరయితే తన ప్రయత్నం బెడిసికొడుతుందన్న ఉద్దేశంతో రవీందర్ ఆమెను కిడ్నాప్ చేసి ఎక్కడన్నా దాచివుండొచ్చు అన్పించింది. వెన్నెలని వెదుకుతూ స్వయంగా తనే కారులో బయలుదేరాడు.

మరో పక్క లాయర్ అనూప్, సెక్రటరీ మరియా మరి కొందరు వెన్నెలని గాలిస్తూ సిటీ వీధుల్లో అప్పటికే తిరుగుతున్నారు. అయిదు గంటల తర్వాత తన స్కూటీ మీద స్టెల్లా కూడా వెన్నెల అన్వేషణకు బయలుదేరింది.

బయలుదేరే ముందు నిరంజన్‌కి ఫోన్ చేసి అక్కడ ఆఫీసు పరిస్థితి చెప్పింది.

శరత్‌చంద్రను కూడా తప్పించి, బోర్డ్ డైరక్టర్లను కవర్ చేసి, రవీందర్ మిడాన్ గ్రూప్‌కి హెడ్ అయిన సంగతి ఆమె మూలంగానే నిరంజన్‌కు తెలిసింది. దాంతో అతడి అనుమానాలకి మరింత బలం చేకూరింది.

రవీందర్ వెన్నెలని కిడ్నాప్ చేయించి వుండాలి లేదా అడ్రస్ గల్లంతు చేయించి వుండాలి. ఇదే విషయాన్ని తన తండ్రి మధుసూదన్‌రెడ్డికి ఫోన్ చేసి వివరించాడు నిరంజన్. పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలనుకుంటున్నట్టు కూడా చెప్పాడు.

"తొందరపడి రిపోర్టివ్వకు. మీ ఇద్దరి గురించి మీడియాలో వచ్చిన వార్తలకు ఆ అమ్మాయి హర్టయి ఎక్కడో మనశ్శాంతి కోసం ఒంటరిగా వుండిపోయినా ఆశ్చర్యంలేదు. ఈ రాత్రికి రాకపోతే ఏం చేయాలో ఆలోచిద్దాం" అంటూ సలహా యిచ్చాడాయన.

వెన్నెల కన్పించటం లేదన్న వార్త ఇంకా మీడియా చెవులకు చేరలేదు. చేరితే ఈపాటికే అది ఫ్లాష్ న్యూస్ అయ్యేది.

వెన్నెల మనసులో ఏముందో గాని, తన మనసులో ఇప్పటికే ఆమె స్థిరపడిపోయిందని నిరంజన్ గ్రహించాడు. తను ఆమె పట్ల ఆకర్షితుడు కావటానికి ఆమె అందం ఒక్కటే కారణం కాదు.

అసాధారణమైన ఆమె తెలివితేటలు, పట్టుదల, మాట తీరు ఒక్కటి కాదు. ఇలా ఎన్నో విషయాల్లో ఆమె తనకు నచ్చింది. ఊహించని సంఘటనలు సుడిగాలిలా చుట్టుకోవటంతో ఆమెకే కాదు. తనకీ బాధగానే వుంది.

రవీందర్ స్వార్ధంతో డబుల్‌క్రాస్ చేసి, ఇటు వెన్నెలని అటు శరత్‌చంద్రని కూడా మోసం చేసాడు.

అసలు సర్కిల్ గౌస్‌ని ప్రయోగించి, మాదకద్రవ్యాల కేసులో తమను ఇరికించింది కూడా రవీందరే అయివుండాలి. నిజా నిజాలు వెలుగుచూసే లోగా యిలా వెన్నెల కనిపించకుండా పోవటం ఆందోళనకు గురిచేస్తోంది.

సాయంకాలం నుంచి సుమారు అయిదు గంటలపాటు నిర్విరామంగా అన్వేషిస్తూనే వున్నారు. మధ్య మధ్య కారాపి అటు స్టెల్లా, అనూప్ మారియాలని ఫోన్‌లో అడుగుతూనే వున్నాడు.

రాత్రి ఎనిమిది గంటలయిపోయింది.

కారులో తిరిగి తిరిగి అలసిపోయాడు.

ఎనిమిది పది నిముషాల ప్రాంతంలో అతడి కారు పంజాగుట్ట స్మశానవాటిక ప్రాంతాలకు చేరుకుంది. అక్కడ హెడ్‌లైట్ల కాంతిలో ఒక దృశ్యం అతడి కంటపడింది.

స్మశానవాటిక ఎంట్రన్స్ సమీపంలో ఒక జీప్ ఆగి వుంది. దాని హెడ్ లైట్లు ఆన్‌లోనే వున్నాయి.

నలుగురు యువకులు బీర్‌కొడుతూ కేర్‌లెస్‌గా నిలబడి ఏవో మాట్లాడుతున్నారు. వాళ్ళకి ఎదురుగా కొంచెం దూరంలో ఒక యువకుడు నిలబడున్నాడు.

అతడి చేతిలో రివాల్వరుంది. రివాల్వర్‌తో ఆ యువకులు తనను సమీపించకుండా కవర్ చేస్తున్నాడతను.

నిజానికి అతను అతను కాదు. ఆమె... జీన్స్ ప్యాంటు, టీ షర్టులో వుండటంలో దూరం నుంచి చూసి యువకుడని పొరబాటు పడ్డాడు నిరంజన్. సమీపంలోకి రాగానే అర్థమైంది ఆమె వెన్నెల అని.

ఆమెను చూసిన ఆనందం ఒక పక్క, ఆమె ప్రమాద పరిస్థితిలో కన్పించటం మరో పక్క నిరంజన్‌ని ఆందోళకే గురిచేసాయి. ఏంజరుగుతుందో వూహించగలిగాడు.

తాగిన మత్తులో వున్న ఆ యువకులు ఒంటరిగా కన్పించిన వెన్నెలని చూసి సాధారణ యువతిగా భావించి, పిచ్చి వేషాలేస్తున్నట్టున్నారు.

వాళ్ళకి సమీపంలో సెడన్‌బ్రేక్‌తో కారాపాడు నిరంజన్. తన రివాల్వర్ అందుకుంటూ కారు దిగాడు. హెడ్‌లైట్లు ఆన్‌లోనే వుంచి ముందుకెళ్ళాడు.

"ఏయ్- ఎవర్రా మీరు? తక్షణం వెళ్ళిపొండి. లేదంటే ఆమె కాదు. నేనే మిమ్మల్ని కాల్చిపారేస్తాను. రాస్కెల్స్" అంటూ రివాల్వర్‌తో గాల్లోకి కాల్పులు జరిపాడు.

దాంతో ఆ కుర్రాళ్ళు కంగారుపడి పరుగెత్తి జీప్ ఎక్కేసారు. కన్నుమూసి తెరిచేలోనే ఆ జీప్ అక్కడ్నుంచి అదృశ్యమైంది.

రివాల్వర్ జేబులోకి తోస్తూ-

వెన్నెలకి పదడుగుల సమీపంలోకి వెళ్ళాడు.

హెడ్‌లైట్లు కాంతిలో ఒకరినొకరు స్పష్టంగా కన్పిస్తున్నారు. ఒక్కసారిగా ముందుకు పరుగెత్తుకొచ్చింది వెన్నెల. అతడి ఛాతీని తన చేతులతో చుట్టేస్తూ గుండెల్లో ముఖం దాచుకుని ఏడ్చేసింది. తనకు తెలీకుండానే ఆమె నడుంని చుట్టేసాయి అతడి చేతులు. వెంటనే ఏమడిగినా ఆమె బదులు చెప్పే స్థితిలో లేదని తెలుసు. కాస్సేపు ఏడవనిచ్చాడు.

"థాంక్‌గాడ్. క్షేమంగా దొరికావ్ చాలు. ప్లీజ్ వూరుకో. కమాన్" అంటూ ఆమె నడుం పుచ్చుకుని నడిపించి తీసుకెళ్ళి కారు ఫ్రంట్ సీట్లో కూర్చుండజేసాడు.

"అలసిపోయినట్టున్నావ్. ముందు ముఖం కడుక్కో" అంటూ వాటర్‌బాటిల్ అందించాడు.

ఆమె పరిస్థితి బాగాలేదని అర్థమవుతూనే వుంది.

జుత్తు రేగింది. దుస్తులు మట్టికొట్టుకొని వున్నాయి. ఆ పరిస్థితిలో మరొకరెవరన్నా చూసినా వెన్నెలని గుర్తుపట్టలేరు.

"ఆరుగంటలుగా నీకోసం గాలిస్తూనే వున్నాను తెలుసా. నేనే కాదు. నీ ఫ్రెండ్ అనూప్, నీ సెక్రటరీ స్టెల్లా, అనూరాధలు ఇంకా కొంతమంది... డామిట్. ఏమైంది నీకు? రోజంతా ఎక్కడున్నావ్?" కారుకు జేరబడి సిగరెట్ ముట్టించుకుంటూ అడిగాడు.

"ఇక్కడే ఉన్నాను" అంది నీళ్ళతో ముఖం కడుక్కుంటూ.

"ఇక్కడే అంటే?"

"ఇక్కడే... స్మశానంలో... డాడీ సమాధి దగ్గర."

"మైగాడ్... ఆర్ యు క్రేజీ... ఎందుకలా?"

ఆమె బదులు చెప్పకుండా బాటిల్ ఎత్తి మంచినీరు త్రాగి, టవల్‌తో ముఖం తుడుచుకుని రిలాక్స్‌గా సీట్‌కు జేరబడి కళ్ళు మూసుకుంది.

సిగరెట్ అవతలపడేసి వచ్చి స్టీరింగ్ వెనక కూర్చుని డోర్ మూసాడు. సెల్ అందుకుని స్టెల్లాకు ఫోన్‌చేసి వెన్నెల దొరికిందని, ఫ్లాట్‌కి తీసుకొస్తున్నానని మిగిలిన వాళ్ళకి ఫోన్‌లు చేసి చెప్పమని మెసేజ్ పాస్ చేసాడు.

"ఆకలిగావుంది నిరంజన్. తినటానికేమైనా వుందా?" హీనస్వరంతో అడిగింది.

"ఉదయం నుంచీ ఏమీ తినలేదా?" కారు ఫ్రిజ్‌లోంచి రెండు ఆపిలు పళ్ళు కొన్ని అరటిపళ్ళు తీసి యిస్తూ అడిగాడు.

"లేదన్నట్టు తల అడ్డంగా వూపింది.

"మైగాడ్. ఏం పిచ్చిపనిది...? ఉదయం నుంచీ స్మశానంలోనే వున్నావా?" కారు స్టార్ట్‌చేస్తూ అడిగాడు.

"లేదు... మనసు బాగోక ఉదయమే నడుచుకుంటూ బయటికొచ్చేసాను. ఓటమిని అంగీకరించలేని మనస్తత్వంనాది. అలానే నిందను భరిచటం కూడా చేతకాదు. ఒక రాత్రంతా పోలీస్‌స్టేషన్ సెల్‌లో పడివుండటం కోర్టు మీడియా ప్రచారం, ఇవన్నీ తట్టుకోలేకపోయాను. బంజారాహిల్స్ రోడ్ల వెంట పిచ్చిదానిలా ఎన్నిసార్లు, ఎంతదూరం తిరిగానో తెలీదు. మధ్యాహ్నానికి అలసిపోయి, మనశ్శాంతి కోసం డాడీ సమాధివద్దకి పోయి కూర్చుని చాలాసేపు ఏడుస్తూనే వున్నాను.

అలాగే నిద్రపోయాను. మెలుకూ వచ్చేసరికి చీకటిపడింది నీరసం పాదాలు వాచిపోయి, కాళ్ళు నడవనని మొరాయించాయి. ఎలాగో ఓపిక తెచ్చుకుని రోడ్డుమీదకి వచ్చేసరికి ఆ పోకిరి కుర్రాళ్ళు నన్ను చూసి జీప్ ఆపారు.

సమయానికి నువ్వు రాకపోతే, ఖచ్చితంగా ఒకరిద్దర్ని కాల్చిపారేసే దాన్ని...." అంటూ బాధగా కళ్ళు మూసుకుంటూ జరిగింది చెప్పింది.

మిడాన్ గ్రూప్‌లో జరిగిన పరిణామాలు ఇప్పుడున్న పరిస్థితిలో ఆమెకు చెప్పాలా వద్దా, అర్థంకాలేదు నిరంజన్‌కి. చెప్పకుండా వుంటేనే మంచిదనిపించింది.

కారు స్మూత్‌గా సిటీవీధుల్లో పరుగుతీస్తోంది. ఈలోపల వెన్నెల ఒక ఆపిలు, రెండు అరటిపళ్ళు తిని కళ్ళుమూసుకుంది.

"వెన్నెలా...." పిలిచాడు.

ఆమె పలకలేదు.

తట్టి పిలిచినా ఆమె బదులివ్వకపోవటంతో డౌటు వచ్చి కారాపి చూసాడు.

చాలా ఆకలిమీద వుండి పండ్లు తీనటంవల్లనో, లేక నీరసంవల్లనో గాని ఆమె నిద్రలోకి జారుకుని వుండాలి. లేదా తెలివితప్పి వుండాలి. ప్రస్తుత పరిస్థితిలో ఆమెను ఆమె ఫ్లాట్‌కి తీసుకెళ్ళటం మంచిదికాదన్పించింది.

సెల్‌ఫోన్ అందుకుని తండ్రి మధుసూదన్‌రెడ్డికి ఫోన్‌చేసి వెన్నెల క్షేమంగా వుందని చెప్పాడు. తర్వాత స్టెల్లాకు ఫోన్‌చేసాడు.

"స్టెల్లా! ఓపని చెయ్యి. వెన్నెల పరిస్థితి బాగాలేదు. నా ఆఫీస్‌కి తీసుకెళుతున్నాను. నువ్వు వెన్నెల ఫ్లాట్‌కెళ్ళి వెన్నెలకి అవసరమయిన దుస్తులు కొన్ని తీసుకుని నా ఆఫీస్‌కి రాగలవా? ఆయా ఇంకా ఫ్లాట్‌లోనే వుందనుకుంటాను."

"ఉంది... ఇంతకుముందే ఫోన్‌చేసింది."

"ఓ.కె. త్వరగా వచ్చెయ్" అంటూ లైన్ కట్‌చేసాడు.

పావుగంటలోపలే కారు నిరంజన్ ఆఫీస్‌కి చేరుకుంది.

ఆఫీస్ సెకండ్‌ఫ్లోర్‌లో అన్ని వసతులతో కూడిన గెస్ట్‌రూం వుంది. వెన్నెలని ఆ గదిలోకి తనే ఎత్తుకు తీసుకెళ్ళి పరుండజేసాడు నిరంజన్. కాస్సేపటికి వెన్నెల దుస్తులు తీసుకుని స్టెల్లా కూడా అక్కడికి చేరుకుంది.

* * * * *

ఉదయం లేవగానే ఆ రోజు వార్తాపత్రికలు చూడటం మధుసూదన్‌రెడ్డికి అలవాటు.

మిడాన్‌గ్రూప్‌లో కలకలం గురించి గ్రూప్ హెడ్‌గా రవీందర్ ఎన్నికయిన విషయం అన్ని పత్రికలూ కవర్‌చేసాయి.

వెన్నెల, నిరంజన్‌ల డ్రగ్స్ కేసు ఉదంతం గురించి కొన్ని పత్రికల్లో ఈరోజు కూడా వార్తలొచ్చాయి.

కాస్సేపు ఆలోచించాక తన మొబైల్ అందుకున్నాడాయన. తన తెలుగు టైమ్స్, టి.వి. న్యూస్ ఛానల్ ఎడిటర్ రమణకి ఫోన్‌చేసాడు. వెంటనే ఆయన లైన్లోకొచ్చాడు.

"రమణా... పరిస్థితి గమనిస్తున్నావనే అనుకుంటాను. జరిగిన విషయాలు చూస్తుంటే వెన్నెలమీద ఎవరో కుట్రచేస్తున్నట్టు అర్థమవుతోంది కదూ?" చాలా హుందాగా అడిగాడు మధుసూదన్‌రెడ్డి.

"నాకు నిన్ననే ఈ డౌటు వచ్చింది సార్. మనవాళ్ళు కొందర్ని ఆ పనిమీదే పంపించాను. కొన్ని క్లూలు లభించాయి. ఇంకా తీగంతా లాగాలి."

"అంత టైంలేదు. ఆ బాధ్యతని బి.వి.రావ్‌కి వప్పగించు. నేను చెప్పినట్టు చెప్పు. ఖర్చు గురించి వెనుకాడనక్కర్లేదు. తెరవెనుక సూత్రదారుల గుట్టుకావాలి. ఇదంతా ఆ రవీందర్ చేయించాడని డౌటు.

"అంతేకాదు... ఇప్పటికి నాకు తెలిసిన సమాచారం మేరకు ఆ సర్కిలు గౌస్ నగర మేయరు రాంరెడ్డికి నమ్మినబంటు. అలాగే రాంరెడ్డికి మిత్రుడు రవీందర్. రాంరెడ్డి సికింద్రాబాద్ ఎం.పి. సీటు కోసం ప్రయత్నిస్తున్నాడు.

మీరు ఆ సీటు నిరంజన్‌కోసం అదిస్థానంతో మాట్లాడారు. నిరంజన్‌కి పబ్లిక్ బేడ్‌చేసి అన్‌ఫిట్‌గా చూపిస్తే ఆ సీటు తనకే వస్తుందని రాంరెడ్డి డ్రగ్స్ నాటకం ఆడించినట్టు తెలుస్తోంది. ఇక రవీందర్‌కి కావలసింది వెన్నెలని మిడాన్‌గ్రూప్ నుంచి తప్పించటం.ప్రస్తుతానికి వాళ్ళ ఆశయం నెరవేరినట్టే...."

"ఓ.కె... మనకి పక్కా సమాచారం వీలయితే సాక్ష్యాలతో కావాలి. బి.వి.రావ్‌కి వివరంగా చెప్పి రంగంలో దించు" అంటూ ఆర్డర్‌వేసి ఫోన్ పక్కన పడేసాడు.

మధుసూదన్‌రెడ్డి మనసులో ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి. వెన్నెలకి తన వంతుసాయం తను చేస్తాడు. ఎందుకంటే తన కొడుకు నిరంజన్ భవిష్యత్తు ఆమెతో ముడిపడివుంది.

మరి అటు హెచ్.ఎన్. క్లబ్ వాళ్ళు కూడా తమవంతు సాయంచేస్తారా...?

ఆ భువనచంద్రకి మొదటినుంచి వెన్నెలని మీద ఆమాటకొస్తే ఆడవాళ్ళమీదే సదభిప్రాయంలేదు. వెన్నెలని అక్కడకూడా పదవినుంచి దించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. నిరంజన్‌తో మాట్లాడాలి అనుకుంటూ లేచి స్నానానికి బయలుదేరాడు.

❈ ❈ ❈ ❈ ❈

మరునాడు ఉదయం వెన్నెలకి మెలకువ వచ్చేసరికి ఏడుగంటలు దాటింది సమయం. తన పి.ఎ. అక్కడే కూర్చుని ఆరోజు న్యూస్ పేపర్

చదువుతూ కన్పించింది. అది తన బెడ్‌రూం కాదని గ్రహించింది. కాసేపు ఏం జరిగిందీ, తను ఎక్కడుందో కూడా ఆమెకు అర్థంకాలేదు. ఒళ్ళంతా పెయిన్స్. ఆకలి కూడా విపరీతంగా వుంది. క్రమంగా జరిగిందంతా గుర్తుకొచ్చింది.

ఆమె కళ్ళు తెరవటం గమనించి పేపర్ పక్కన పడేసి లేచి దగ్గరకొచ్చింది స్టెల్లా. "గుడ్ మార్నింగ్ వెన్నెల"' అంది చిరునవ్వు నవ్వుతూ.

"ఎక్కడ వున్నాం?" హీనస్వరంతో అడిగింది.

జరిగింది చెప్పింది స్టెల్లా.

"రాత్రి నిరంజన్ ఇంటికెళ్ళిపోయాడు. కాసేపట్లో రావాలి. లేవగలవా?"

"ఫరవాలేదు."

శక్తి కూడదీసుకుని లేచింది వెన్నెల.

ఆమె బాత్‌రూంకెళ్ళి బ్రష్‌చేసుకుని హాట్ వాటర్‌తో ఫ్రష్‌గా స్నానంచేసి వచ్చేవరకూ స్టెల్లా ఏమీ మాట్లాడలేదు. ఆఫీస్‌బోయ్ ఒకడు, సెక్యూరిటీగార్డ్ ఒకడు ఆఫీస్‌ని కనిపెట్టుకుని అక్కడే వుంటారు. బోయ్‌ని పంపించి వెన్నెల కోసం టిఫిన్ తెప్పించింది స్టెల్లా. ఆమెతోబాటు తనూ టిఫిన్ చేసింది.

"నువ్వు ఈ రోజంతా విశ్రాంతి తీసుకుంటే మంచిది." సలహాయిచ్చింది స్టెల్లా.

"అంత టైంలేదు. మన ఫ్లాట్‌కి వెళ్ళిపోదాం. నిన్న విశేషాలేమటి? అడిగింది వెన్నెల.

"రవీందర్ మోసం చేశాడు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేశాడు. నిన్ను కంపెనీ బాధ్యతలనుంచి తప్పించేసారు."

"వూహించిందే... శరత్‌చంద్రని ఎన్నుకున్నారా? పోన్లే! అన్నయ్య కోరిక అదేగా?"

"లేదు వెన్నెల. అలా జరగలేదు. రవీందర్ శరత్‌నీ వంచించాడు. ఇప్పుడు మిడాస్ గ్రూప్ హెడ్ రవీందర్. శరత్‌చంద్ర కోపంతో మధ్యలోనే లేచి వెళ్ళిపోయాడు."

"అంటే అందరిముందు అన్నయ్యని జోకర్‌ని చేసాడా రవీందర్? వాడి సంగతి నేను చూస్తాను. నా కారు ఫ్లాట్ దగ్గరే వుందా?"

"అవును. నీకో విషయం చెప్పాలి. రవీందర్ నన్ను డిస్మిస్‌చేసాడు. నాకిప్పుడు జాబ్‌లేదు."

"నేనుండగా నీకు జాబ్ సమస్యా? నా సెల్ ఎక్కడ?" అంటూ తన మొబైల్ అందుకుని ముందుగా నిరంజన్‌కి ఫోన్‌చేసి థాంక్స్ చెప్పింది. కాస్త లేటవుతుంది రావటానికి చెప్పాడు నిరంజన్.

"నా ఫ్లాట్‌కి వెళ్ళిపోతున్నాను. సాయంత్రం కలుద్దాం" అంటూ లైన్ కట్‌చేసి ఒక నంబర్ కోసం సెల్‌లో సెర్చ్ చేసింది. ఆ నంబర్ లేదు. అంకెలు గుర్తపెట్టుకోడంలో వెన్నెల దిట్ట. కొంచెం ఆలోచించగానే నంబర్ గుర్తుకొచ్చింది ఆ నంబర్‌కి ఫోన్ చేసింది.

ఆ నంబర్ తన అన్న శరత్‌చంద్రది.

ఇరవై సెకండ్ల తర్వాత అవతల శరత్ గొంతు బొంగురుగా విన్పించింది. "అన్నయ్యా...." పిలిచింది.

అవతల కొద్దిసేపు నిశ్శబ్దం.

"అన్నయ్యా! నేను వెన్నెలని. నీతో మాట్లాడాలి. ప్లీజ్" రిక్వెస్ట్ చేసింది.

"నీమీద పగ సాధించానని తిట్టాలనుకుంటున్నావా?" శరత్ గొంతు బాధగా విన్పించింది.

"పూలిష్‌గా మాట్లాడకు. మనిద్దరం అన్నాచెల్లెళ్ళం. ఒకే రక్తం పంచుకుని పుట్టినవాళ్ళం. కొట్టుకుంటాం, తిటుకుంటాం. అది మన సమస్య. కాని బయటివాడు మనల్ని వెర్రివెంగళప్పల్ని చేసాడు. అది నీకు బాధగా లేదా? డాడీ సీట్లో నువ్వు కూర్చుంటే నాకు సంతోషమే. కాని రవీందర్ నిన్ను మోసం చేసాడు. మనం ఒకటయితే పరిస్థితి చక్కదిద్దుకోవచ్చు. నేను నిన్ను కలవాలనుకుంటున్నాను. ఈరోజే...."

"బయట ముఖం చూపించలేకపోతున్నాను చెల్లాయ్. అయాం సారీ! ఎక్కడికీ రాలేను. నువ్విక్కడికి వస్తావా?"

"వద్దు. ఇంటిదగ్గర కాదు హోటల్ కామత్‌లో కలుసుకుందాం. ఒక అరగంటలో నువ్వు అక్కడికి రావాలి. ఎదురుచూస్తుంటాను." అంటూ లైన్ కట్‌చేసింది వెన్నెల.

"శరత్‌ని కలవబోతున్నారా?" ఆశ్చర్యంగా అడిగింది స్టెల్లా.

"ఇప్పుడు మేమిద్దరం ఒకటవటం చాలా ముఖ్యం. శతృవుకి శతృవు మిత్రుడు అంటారు. శరత్ మిత్రేడే కాదు. నా అన్న కూడా. రవీందర్ వార్ డిక్లేర్ చేసాడు. మేం అటాక్‌కి సిద్ధం కావాలి గదా. పద" అంటూ బయలుదేరింది వెన్నెల.

గెస్ట్‌రూం లాక్‌చేసి కీస్‌ని అక్కడి బోయ్‌కి అందజేసి తమ ఫ్లాట్‌కి టాక్సీలో బయలుదేరారు యిద్దరూ. ఫ్లాట్‌కు చేరుకున్న పది నిముషాల్లోనే స్టెల్లాను అక్కడే వుంచి తన బెంజికారులో శరత్‌కోసం బయలుదేరింది వెన్నెల.

* * * * *

లకడీకాపూల్ రిజర్వ్ బ్యాంక్ కార్యాలయం దగ్గర వున్న కామత్ హోటల్‌లో కలుసుకున్నారు శరత్‌చంద్ర, వెన్నెలలు.

ఎన్నో ఏళ్ళుగా వున్న ఆ హోటల్' కంటే పెద్దదయినా, అక్కడయితే తనపై మీడియా దాడి చేయదని వెన్నెలయే ఆ హోటల్ పేరు చెప్పింది. హోటల్ రూఫ్‌గార్డెన్‌లో ఏకాంతంగా ఎదురుబొదురుగా టేబిల్ ముందు కూర్చున్నారిద్దరూ.

శరత్‌చంద్ర కళ్ళకింద నల్లటి చారలు అతడెంత దిగులుతో వున్నాడో చెబుతున్నాయి.

"వెన్నెలా! నీమీద కసితో నా గోతిని నేనే తవ్వుకుని అందులో పడ్డాను. అన్నాడు శరత్‌చంద్ర బాధగా.

అతడు తాగివున్నాడని వాసనబట్టి గ్రహించింది వెన్నెల.

శరత్‌చంద్ర మళ్ళీ చెప్పాడు. 'ఉదయమే నా లాయర్లను పిలిచి నీపై కేసును విత్‌డ్రా చేయించాను. అలాగే మీడయా ముందు నీకు సారీ చెప్పాలనికూడా ఆదేశించాను."

వెన్నెలా కాసేపు ఆలోచించి అంది. "శరత్! ప్రస్తుతం బాగా డిప్రెషన్‌లో వున్నావు... కదూ?"

శరత్ కాస్త నిదానంగా అన్నాడు.

"ఫ్రాంక్‌గా చెప్పాలంటే మనం అన్నా చెల్లెళ్ళం. వయసులో తేడా ఎక్కువ లేదు. కాని మనం అన్నా చెల్లెళ్ళలా లేము. ఫ్రెండ్స్‌గానూ లేము. ఒకరికొకరు పోటీగా వుంటూ వచ్చాం. ధనికుల కుటుంబాల్లో ఇలాంటి పోటీలు మామూలే. కానీ నేను 'అతి' ప్రదర్శించాను. జెలసీ కావచ్చు. లేదా మేల్ హిపోక్రసీ కావచ్చు. ప్రస్తుతం నువ్వు సమస్యల్లో చిక్కుకున్నావని తెలిసింది. అందుకు బాధగా వుంది. సారీ!"

"ఆ రవీందర్ నిన్న బోర్డు మీటింగ్‌లో నిన్ను చాలా అవమానించాడనితెలిసింది" అని ఆగింది వెన్నెల.

"అవును. ఆ రవీందర్ చెప్పినది నిమ్మి నిన్ను గోతిలోకి నెడదామనుకున్నాను. కానీ నేనే పడ్డాను... కాదు రవీందర్ తోశాడు. అఫ్‌కోర్స్! నీ స్థానంలో ఎన్నిక అయివుంటే గర్వంగా వుండేదనుకో" తలదించుకునే చెప్పాడు శరత్‌చంద్ర.

"సరే, విజృంభన ఏమంటోంది?"

శరత్‌చంద్ర కాసేపు మౌనంగా వున్నాక మెల్లిగా చెప్పాడు.

"జరిగిన సంగతి తెలియగానే ఎవడో స్మార్ట్ రాజకుమారుడు, వాడితో నా ఎదురుగానే వెళ్ళిపోయింది... కాదు... లేచిపోయింది. త్వరలో విడాకుల నోటీసు రావచ్చు. నాకిప్పుడు మనఃశ్శాంతి."

ఒక్కసారి తన అన్నపట్ల కాస్త జాలి కలిగింది వెన్నెలకి.

'తనే అతడి స్థానంలో ఉంటే?' ఊహే భయంకరంగా వుంది.

ఇక అనుభవించేవారికి?

సరైన భార్య దొరకకపోవడం కూడా అతడి దురదృష్టం. అనుకుంటూ అడిగింది. "ఇంత ఉదయమే డ్రింక్ చేయాలా?" అని.

శరత్‌చంద్ర నవ్వి అన్నాడు.

"రాత్రినుండి నాన్‌స్టాప్‌గా తాగుతూనే వున్నాను. ఇక ఆపాలన్న ఆశ కూడా లేదు... అయితే బాధల్ని దూరంచేస్తే శక్తి డ్రింక్స్‌కి లేవు. కాని తాత్కాలికంగానైనా హెల్ప్ చేస్తాయి కదా? నా ఉద్దేశంలో బాధని మరపించగల శక్తి మందుకి మాత్రమే వుంది."

"అదే తప్పు. సమస్యలకి పరిష్కారం త్రాగుడే అయితే, ఈ ప్రపంచంలోని నదులన్నిటినీ విస్కీగా మార్చేసేవారు సైంటిస్ట్‌లు. అతిగా తాగితే ఆరోగ్యం నాశనమవుతుంది. సరే! నీ భవిష్యత్ ప్లాన్స్ ఏమిటి?"

శరత్‌చంద్ర కాస్త ఆలోచించాక చెప్పాడు" ప్రస్తుతానికి అయితే ఏ ఐడియాలేదు. కాని ఏ పోర్చుగల్‌లో, ఆస్ట్రేలియాకో వెళ్ళి, పోదామనివుంది. ఇక నాకు ఏ లక్ష్యమూలేదు. సూసైడ్ మాత్రం చేసుకోను... ఎందుకో తెలుసా? చావడానికీ చాలా ధైర్యం కావాలి... అదేలేదు నాలో."

"శరత్! మనం కలవాలని ఎందుకు కోరావో తెలుసా?"

"అసలు ఆలోచించే శక్తిలేదు నాలో" చెప్పాడు శరత్‌చంద్ర.

"నువ్వు సెల్ఫ్-సిటీలో టైటానిక్‌లా మునిగిపోతున్నావు. కాని ఓ విషయం గుర్తుంచుకో... టైటానిక్ ఓడ మునిగిపోవడం. వేయికి పైగా మరణించడం దురదృష్టమే. కాని అదే టైటానిక్ కథ. ఆర్థికంగా దివాళా దిశగా వున్న ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్ సినిమా కంపెనీకి అఖండ లాభాంతో స్టూడియోని గట్టెక్కించింది. టన్నల్ చివర తప్పక వెలుగువుంటుంది.

కావలసిందల్లా అడుగులేసే ఆశ... ధైర్యం... నా సంగతి చూడు. నిన్న మిడాన్ గ్రూప్ హెడ్‌గా నన్ను తొలగించారు. మీడియాలో డ్రగ్స్ విషయం... నా స్థానంలో నువ్వు ఊహించుకో... అయితే నిరాశ నీడలో విశ్రాంతి తీసుకోను...."

"ఆ ధైర్యం నీకు వుంది... నాకులేదు. గెలుపుమీద కోరిక వుంటే చాలదు. పోరాడే ఆత్మబలం కూడా వుండాలి. ఈ రెండోదే నాకు లేదు."

"అలాగని ఆస్ట్రేలియాలో ఏ మారుమూల గ్రామానికో వెళ్ళి, రోజంతా తాగుతూ, తొందరగా చనిపోవాలనుకుంటున్నావా? కాని నాన్న టైగర్ బిరుదు నాకేకాదు, నీకూ వర్తిస్తుంది.

ఆయన సంతానం ఇలా నెగిటివ్‌గా అవ్వాలని టైగర్ ఏనాడైనా కోరుకున్నారా? ఇన్ని సమస్యలున్నా మనకి ఒక అదృష్టం వుంది. మన దగ్గర కోట్లు వున్నాయి...."

"వెన్నెలా! నిజమే... కాని స్టాక్ కంట్రోల్. ఓటింగ్ హక్కు నాకు ఉంది... అదీ నన్ను బాధించింది. అయిందేదో అయింది. ఇప్పుడు ఏం చేయాలని?"

"శరత్! ఇప్పుడే మనం ఒకరికొకరం తోడుగా వుండాలి. అలాగే ఆత్మన్యూనత వదిలిపెట్టు. ఇది యుద్ధ సమయం. ఫైట్ చేయాలి. మనల్ని ఓడించే శక్తి ఒకటే.... అది మనమే...

శరత్‌చంద్రపై వెన్నెల మాటలు ప్రభావం చూపిస్తున్నాయి.

"ఆ రవీందర్ ముఖంపై ఒక్కగుద్దు గుద్దే ఛాన్స్‌వస్తే ఎలా వుంటుంది నీకు?" అడిగింది వెన్నెల.

"అంతకంటేనా?" అన్నాడు శరత్‌చంద్ర. అతడి గొంతులోని కసిని గమనించింది వెన్నెల.

"శరత్! విదేశాలకు పారిపోకుండా, మనిద్దరం కలిసి ఆ రవీందర్ అండ్ కోమీద ఎదురు దాడి చేస్తే" అడిగింది.

"ఓ.కె... కాని ఎలా?"

"ఎలాగో నేను చెప్తాను. జాగ్రత్తగా విను. మనిద్దరి స్టాక్ కలిపితే చాలా భారీది. వార్షిక సమావేశంలో రవీందర్‌ని ఓటింగ్‌తో దించేయవచ్చు పైగా ప్రజల్లో మనం కలిస్తే అది మరో సంచలనం అవుతుంది."

"ఈ పాయింటే తట్టలేదు. ఆ రవీందర్‌కి కూడా... నిన్ను దించి నేను హెడ్ అవుదామను కున్నాను. కాని వచ్చే ఏడాది బోర్డు మీటింగ్‌లో నన్ను నీవు దించేదానివే...." అన్నాడు ఆశ్చర్యంగా శరత్‌చంద్ర.

"రవీందర్‌కి ఆ సంగతి తెలుసు. నేను జైలుకెళ్ళి నా స్టాక్ ఫాక్సీపవర్‌తో అతడ్ని దించుతానని తెలుసు. సో... అతడివద్ద ప్లాన్ వుందని నా అనుమానం."

"అంటే?"

"బహుశా ఈలోగా కొన్ని కంపెనీలను అమ్మేస్తాడు. తరువాత మిడాన్ గ్రూప్ అనేదే వుండదు. ఆ తరువాత ఏ పెద్ద కంపెనీలకు అమ్మాలో వాటిల్లో తన స్టాక్ పెంచుకుంటాడు.

"వెన్నెలా! అలాగయితే మన షేర్ల విలువ కూడా పెరుగుతుంది కదా!"

"మనది భారీస్టాక్ కావచ్చు. కాని వాటి విలువని రవీందర్ తగ్గించవచ్చు. మనం రోడ్డున పడం...."

"మైగాడ్! రవీందర్‌ది అదే ప్లాన్... నో డౌట్! అతడు గుంటనక్క... పులులు నక్కతో ఫైటింగేమిటి? బేడ్ అంటే యిదే!" అన్నాడు శరత్‌చంద్ర.

వెన్నెల అందుకుంది. "ఫైట్ చేయాలి తప్పదు, మనల్ని సమర్ధించే వారూ వున్నారు. బోర్డులో కొందరిపై మంచి ప్రభావం చూపగల వ్యక్తి కడియంలో వున్నారు. రామకృష్ణంరాజని. నాన్నగారికి మంచి ఫ్రెండ్! ఆయనతో మన ప్లాన్ మొదలుపెడదాం."

"కాని రవీందర్...."

"అతడ్ని కోర్టు కేసుల్లో ఇరుకున పెడదాం. చివర్లో గెలవచ్చు. కాని ఇమేజ్ డామేజ్ అవుతుంది."

వెన్నెలా మాటల్ని జాగ్రత్తగా వింటున్నాడు శరత్‌చంద్ర. చెల్లెలు పైకొస్తే ఆనందపడాలి. కానీ ఏమిటీ? రక్తబంధంకంటే గొప్పది ఏముంది...? తొలిసారిగాపాజిటివ్‌గా ఆలోచించాడు శరత్‌చంద్ర.

అతడు నవ్వి అన్నాడు... "కోర్టు కేసుల్లో సగం నాకు నష్టమయినా మిగతా సగం విజృంభనకి నష్టం. పాయింట్ నచ్చింది."

"అంటే మనం కలిసి రవీందర్‌ని దెబ్బ కొడుతున్నాం...." అంది ఉత్సహంగా వెన్నెల.

"వినడానికి బాగుంది. నువ్వే లీడ్‌చెయ్యి... కావల్సినది నేను నీ వెనకుండే చేస్తాను. పారిపోయే స్థితినుంచి ఎదిరించే స్థితికి తెచ్చావు... లక్ కూడా కలిస్తే మనదే విజయం."

"ష్యూర్! కాకపోతే డ్రింక్స్ తగ్గించాలి అన్నయ్య. ప్రామిస్ చెయ్యి."

"ప్రామిస్!" అంటూ చెల్లెలి చేతిలో చేయి వేసాడు.

శరత్‌చంద్రతో ఆప్యాయంగా ఎవరైనా మాట్లాడి చాలరోజులు అయినందున... అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

* * * * *

శరత్‌చంద్ర వెన్నెలా... అన్నా చెల్లెళ్ళూ ఇద్దరూ తిరిగి దగ్గరయ్యాక వూహించని సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. అందులో మొదటిది మిడాన్ గ్రూప్ హెడ్‌గా తనను తప్పించిన విధం సరికాదని, ఆమాటకొస్తే తప్పించే అధికారం కూడా బోర్డు మెంబర్స్‌కి లేదని హైకోర్టులో రవీందర్ మీద కేసు వేసింది వెన్నెల.

మరొపక్క డాక్టర్ భువనచంద్ర ప్రోదల్బంతో, ఇండీ బ్యాంకు డైరెక్టర్ కిరణ్‌కుమార్, వెన్నెల డ్రీమ్‌లాండ్ ప్రాజక్టుకు అప్పులిస్తున్న మరికొన్ని బ్యాంకు వాళ్ళను కలుపుకుని, ప్రాజక్టు పనులకు ఫండ్స్ రిలీజ్ చేయటం ఆపేసారు.

అంతేకాదు-

ప్రాజెక్టుమీద, వెన్నెలామీద నమ్మకంపోయింది. గాబట్టి ఇంతవరకు తాము పెట్టిన డబ్బుని వెనక్కి చెల్లించి, అగ్రిమెంటు కేన్సిల్ చేసుకోవాలని వత్తిడి తెచ్చాయి. దాంతో వెన్నెల తన బాంకర్స్‌మీద కోర్టులో కేసువేసింది.

ఓ పక్క కోర్టులో కేసు నడుస్తుండగా-

మిడాన్ గ్రూప్‌లోని ఒక భాగమైన ఫిలిం కంపెనీని అమ్మకానికి పెట్టాడు రవీందర్. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకునే ఉద్దేశంతో గ్రూప్‌లోని కొన్ని కంపెనీల ఆస్తుల్ని అమ్మేసి, ఆ డబ్బుల్నిఅమ్మేసి, ఆ డబ్బుని షేర్లరూపంలో వేరే బయటి కంపెనీల్లో పొదుపుచేస్తే, వెన్నెలని ఆర్థికంగా దెబ్బ తీయవచ్చని అతడి ప్లాన్.

ఇలా వుండగా-

టీవిల్లోను, న్యూస్‌పేపర్స్‌లోను టైగర్ కుటుంబం గురించి... వెన్నెల, శరత్‌చంద్రల గురించి వచ్చిన వార్తలను చూసాక అక్కడి కడియంలో వుంటున్న రామకృష్ణంరాజుగారు ఒక నిర్ణయానికి వచ్చేసారు. కొంతకాలం హైదరాబాద్‌లో వుండేలా నిర్ణయించుకుని తన మనవరాలితో కలిసి హైదరాబాద్ వచ్చేసాడాయన.

వచ్చినరోజే ఆయన మధుసూదన్‌రెడ్డిని మీడియా మొగల్ రాజేంద్రరెడ్డిని కలిసి పరిస్థితుల్ని చర్చించాడు. కోర్టుపనుల్లో బిజీగా వున్న వెన్నెలని రెండ్రోజుల తర్వాతగాని కలవటం ఆయనకు సాధ్యంకాలేదు. రామకృష్ణంరాజుగారు తనకు సహాయంగా వచ్చి చేరటంతో వెన్నెలకి కొంత ధైర్యం చిక్కింది.

ఈలోపల హెచ్.ఎస్. క్లబ్ వ్యవహారంలో ఒక విశేషం జరిగింది. అదేమిటో చూద్దాం.

డావిన్సీ ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్ మెహబూబ్‌కి సెక్రటరీ రాధికా! ఆరోజు ఉదయం ఎందుకో డౌట్‌తో అక్కడి అక్కౌంట్లు చెక్‌చేసి కంగారు పడింది.

వూరుపేరులేని వర్ధమాన చిత్రకారుల పెయింటింగ్స్ కోసం మెహబూబ్ లక్షలు పోసి కొన్నట్టు లెక్కలు చూపుతున్నాయి. ఆ పెయింటింగ్స్ తనకీ తెలుసు. వాటికి అంత ధర నిజంగా చెల్లించాడా చెల్లించినట్టు చూపిస్తున్న కాకిలెక్కలా అవి అర్ధంగాక ఆయన్నే అడిగింది.

"సారీ రాధికా! నీ పరిధి మించి అడగకు. ఆ పెయింటింగ్స్ విలువ నాకు తెలుసు. డైరెక్టర్‌గా కొన్ని నిర్ణయాలు నేనే తీసుకోక తప్పదు" అన్నాడు మెహబూబ్.

"కావచ్చు, కాని బడ్జెట్‌ను మించి ఖర్చుచేసారు. ట్రస్ట్ ఆదుకోపోతే జీతాలు కూడా ఇవ్వలేం."

"ఇకనుంచి ట్రస్ట్ కూడా ఆధుకుంటుందని అనుకోను, అందుకే నేను వేరేచోట జాబ్ కోసం ట్రయ్‌చేస్తున్నాను. నువ్వు అలా చేస్తే బెటర్. ఎందుకంటే త్వరలోనే ఈ ఆర్ట్స్‌గ్యాలరీ మూతపడొచ్చు."

"ఏమిటి సర్! జోక్ చేస్తున్నారా? మన్సూర్ సాబ్‌కి ఇది ప్రాణంతో సమానం. హెచ్.ఎస్. క్లబ్ వారు కూడా దీనికి ప్రాముఖ్యత యిస్తారు."

"కరక్టే... కాని పరిస్థితులు మారుతున్నాయి. హెచ్.ఎస్. క్లబ్ ప్రముఖుడు చాలామంది తను వ్యాపారాలను ఇక్కడినుంచి అమరావతికి తరలించే వుద్దేశంలో వున్నారు."

"ఈ సంగతి మీకెలా తెలిసింది?" ఆశ్చర్యంగా అడిగింది రాధిక.

"తెలిసింది. ఎలాని అడక్కు. అదో సీక్రెట్. ఈ విషయంలో అనవసరంగా బుర్ర పాడుచేసుకోకు" అంటూ తన చాంబర్‌లోకి వెళ్ళిపోయాడు మెహబూబ్.

రాధికకు అనుమానం కలిగింది. మెహబూబ్ ఈ విషయాన్ని తమాషాకు చెప్పలేదని అర్థమైంది. నిజానికి రాధికకు జాబ్ చేయాల్సిన అవసరంలేదు చదువుకుని ఖాళీగా వుండలేక ఉద్యోగం చేస్తోంది. హెచ్.ఎస్. క్లబ్ మాజీసభ్యుడు మధుసూదన్‌రెడ్డికి వరసకు మేనకోడలు అవుతుంది.

ఆమె వెంటనే మధుసూదన్‌రెడ్డికి ఫోన్‌చేసి మెహబూబ్ మాటల్లో నిజానిజాల్ని ఎంక్వయిరీ చేసింది. అతడు చెప్పింది నిజమేనని తెలిసింది. అదే క్షణంలో అవతల మధుసూదన్‌రెడ్డి కూడా ఈ సమాచారం విని ఖంగుతిన్నాడు. ఎందుకంటే-

ఎంతో సీక్రెట్‌గా జరిగే హెచ్.ఎస్. క్లబ్ సమావేశాల సంగతులు లీకవటం ఎంత ప్రమాదమో ఆయనకు తెలుసు. ముందుగా కొడుకు నిరంజన్‌కి ఫోన్‌చేసి ఈ విషయాన్ని మాట్లాడాడు. తర్వాత మన్సూర్ అలీఖాన్ సాబ్‌కి ఫోన్ చేసాడు.

* * * * *

ఎప్పటిలాగే మరునాడు ఉదయం ఆర్ట్స్ గ్యాలరీలోని తన ఆఫీస్‌కు మెహబూబ్ వచ్చేసరికి అక్కడ సెక్రటరీ రాధిక కన్పించలేదు. ఆఫీస్‌లో అడుగుపెట్టగానే ఆమెకు బదులు తన సీట్లో ప్రశాంతంగా కూర్చునున్న మన్సూర్ అలీఖాన్ కన్పించాడు.

మెహబూబ్ వూహించని విషయం ఇది.

పైగా ఆయన ఎదురుగా మరో అపరిచితవ్యక్తి కూర్చునున్నాడు. వాళ్ళిద్దరూ ఎందుకు వచ్చారో అర్థంకాక ఎప్పటిలాగే మన్సూర్ సాబ్‌ని విష్ చేసాడు మెహబూబ్.

"ఈయన రంగనాథ్‌గారు. ప్రయివేట్ డిటెక్టివ్. మా ట్రస్ట్ పనులు వీరే చూస్తుంటారు. నీకు ముంబయి స్మగ్లర్ మాహేష్ కేల్కర్‌కి గల సంబంధాలు బయటడిపోయాయి. మా హెచ్.ఎస్. సమావేశాల కీలక

సమాచారాన్ని నువ్వు మేయర్ రాంరెడ్డికి, శరత్‌చంద్ర భార్య విజృంభనకి ఇంకా కొందరికి అమ్మి ఎలా కేష్ చేసుకున్నారో మహేష్‌కేల్కర్ బయటపెట్టాడు. అతనిప్పుడు పోలీస్ కష్టడీలో వున్నారు" అంటూ తమాషాగా నవ్వాడు మన్సూర్ అలీఖాన్.

ఆయన మాటలు వింటుంటే కళ్ళకింద భూమి కృంగిపోతున్నట్టు అన్పించింది మెహబూబ్‌కి.

అయినా ధైర్యం తెచ్చుకుని-

"మీరేం చెప్తున్నారో నాకు అర్దంకావటంలేదు" అన్నాడు.

"అర్థం కావటానికి కొంచెం టైం పడుతుంది. అటు చూడు" అన్నాడు మన్సూర్.

రంగనాథ్ కొన్ని వస్తువుల్ని తీసి టేబిల్‌మీద వుంచాడు.

అది బగ్గింగ్ పరికరాలు. తను కాన్ఫరెన్స్ హాల్లో పెట్టించిన మైక్రోఫోన్ తన టేబుల్‌లో దాచిన రిసీవింగ్ సిష్టం...

అనుమానం రావటంతోనే వెదికి వాటిని పట్టుకున్నారని మెహబూబ్‌కి అర్థమైపోయింది.

"ఇవేమిటో నీకు తెలుసుగదా? నిన్నిక్కడ డైరక్టర్‌గా నియమించినప్పుడే నిన్ను హెచ్చరించాను. నువ్వు ద్రోహానికి పూనుకున్నావ్... ఇప్పుడు నాక్కావలసింది ట్రస్ట్‌సొమ్ము నువ్వు తిన్న దానితోబాటు హెచ్.ఎస్. క్లబ్ సమాచారంతో బయట నువ్వు సంపాదించుకున్న డబ్బు కలిపి పైసలతో సహా అప్పగించాలి.

అలా చేయకపోతే పోలీసులు వస్తారు. కోర్టుకెళతావ్. కోర్టు కేసు ఇప్పట్లో తేలకపోవచ్చు. కాని కేసు తేలేవరకు నువ్వు ప్రాణాలతో ఉంటావన్న గార్యంటీ నేనివ్వలేను.

ద్రోహుల్ని చాలా తీవ్రంగా పరిగణిస్తుంది హెచ్.ఎస్. క్లబ్. సో... నిర్ణయం నీది... రీజనబుల్‌గా డబ్బుల చెల్లింపుచేసి ఉద్యోగానికి రిజైన్‌చేసి నీ అంతట నువ్వు వెళ్ళిపోతావా, పోలీసుల్ని పిలమంటావా... నిర్ణయం నీదే" అంటూ చిన్నగా నవ్వాడు మన్సూర్ అలీఖాన్.

తను పూర్తిగా మునిగిపోయాడని అర్థమైపోయింది మెహబూబ్‌కి. ఈ ప్రపంచంలో ప్రాణంకన్నా తీపివస్తువు మరోటిలేదు. ప్రాణాలతో వుంటే బలుసాకు తిని బ్రతకొచ్చు అన్నారు. అందుకే రాజీకి వచ్చేసాడు మెహబూబ్.

రెండు కోట్లు చెల్లించి ఆర్ట్స్ గ్యాలరీనుండి ప్రాణాలతో బయటపట్టాడు మెహబూబ్.

❈ ❈ ❈ ❈ ❈

కోర్టు పనుల్లో వెన్నల బిజీగా వుంది.

తను వేసిన రెండు కేసుల్లోనే తనే లాయర్‌గా పోరాటం సాగిస్తోందామె. రెండు కేసులు తొందరగానే ఫైనల్‌కు వచ్చేసాయి. మొదటి కేసులు తొందరగానే ఫైనల్‌కు వచ్చేసాయి. మొదటి కేసు మిడాన్ గ్రూప్‌కి హెడ్‌గా రవీందర్ ఎంపిక చెల్లదంటూ వేసిన కేసు.

ఈ కేసులో తీర్పు వెన్నెలకి వ్యతిరేకంగా వచ్చింది. ఇది కోర్టు పరిధిలోకి రాదని, తమకు ఎవరు కంపెనీ హెడ్‌గా వుండాలో ఎంచుకునే అధికారం బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్‌కు వుంది గాబట్టి ఆ కోర్టు అధికారాన్ని కోర్టు ప్రశ్నించజాలదనీ పేర్కొంటూ కేసు కొట్టివేయబడింది.

కేసు కొట్టివేసినందుకు వెన్నెల బాధపడలేదుగాని కంపెనీ ఆస్తుల్ని అమ్మకుండా రవీందర్ మీద ఇంజక్షన్ ఆర్డర్ తీసకురావటం కూడా సాధ్యపడకపోవటం ఆమెకు బాధ కలిగించింది.

ఇక రెండో కేసు బ్యాంకులకు సంబంధించింది.

డ్రీమ్‌లాండ్ ప్రాజక్ట్‌మీద తమకు విశ్వాసం పోయిందంటూ బ్యాంకర్సు ప్రాజక్టు పనులు సగంలో వుండగానే ఫండ్సు నిలిపివేయటమే గాక తమ బాకీ మొత్తం చెల్లించాలంటూ వత్తిడి తేవటంతో వాళ్ళమీద కేసువేసింది వెన్నెల.

మొదటి కేసులో అపజయం పాలయినా ఈ కేసులో మాత్రం వెన్నెల విజయం సాధించింది. అగ్రిమెంటు ప్రకారం ఫాలో గాకుండా మధ్యలో కుంటిసాకులు చూపి అడ్డం తిరిగిన బ్యాంకర్స్ మీద అక్షింతలు వేస్తూ ప్రాజక్ట్ త్వరగా పూర్తికావటానికి అనువుగా ఫండ్స్ రిలీజ్ చేయలని బ్యాంకర్స్‌ను ఆదేశించింది.

ఈ కేసు విజయంలో వెన్నెల ముఖంలో తిరిగి కాంతిరేఖలు విరిసాయి, రామకృష్ణంరాజు, మధుసూధన్‌రెడ్డి, నిరంజన్ అంతా ఆమెను అభినందించారు.

శరత్‌చంద్రలో ఇప్పుడు. ఒంటరితనం పోయింది. తాగుడు కూడా తగ్గించాడు విజృంభన బయటకు పోవడంతోనే తనకు సగం తలనొప్పి తీరిందని హేపీ ఫీలవుతున్నాడు.

ఇప్పుడు చెల్లెల్ని ఆప్యాయంగా చూసుకుంటున్నాడు. ఆమెతో వెన్నంటి వుండటానికి ఇప్పుడు ఎక్కువ సమయం కేటాయిస్తున్నాడు. కోర్టు కేసుల సమయంలోనూ అతడు చెల్లెలి వెంటే వున్నాడు. అన్నా చెల్లెళ్ళు యిద్దరూ ఒకటి గావటంలో మీడియాలో అదో సెన్సేషనల్ న్యూస్ అయింది.

మరో ముఖ్య విషయం కూడా ఏమంటే, అతను స్టెల్లాతో క్లోజ్‌గా వుండటం. ఆమె కూడా అతనిపట్ల స్నేహంగా వుండటం. ఎంత బిజీగా వున్నా ఆ ఇద్దర్నీ గమనిస్తూనే వుంది వెన్నెల. వాళ్ళిద్దరినీ అడిగి చూడాలి అనుకుంది.

డ్రీమ్‌లాండ్ పనులు తిరిగి ఆరంభం గావటంతో-

తేలిగ్గా వూపిరి తీసుకుంది వెన్నెల.

లాయర్ వెన్నెల. నిరంజన్‌ల మీద డ్రగ్స్‌కి సంబంధించిన కేసుకోర్టు ట్రయల్స్‌లో వుంది. లాయరు ధర్మారావు కేసు వాదిస్తున్న సంగతి తెలిసిందే.

మధుసూదన్‌రెడ్డి ఈ విషయంలో చేతులు ముడుచుకు కూచోలేదు. సర్కిల్ గౌస్ మీద బి.వి. రావ్‌ని నిఘా వుంచాడు. ఆ బి.వి. రావ్ అసాధ్యుడు. పొరబాటున మీడియాలోకి వచ్చాడు గాని, సి.బి.ఐ.లో వుంటే ఎంతో సాధించేవాడు.

ఆ రోజు వెన్నెల, నిరంజన్‌లు ఐస్‌క్రిం తిన్న రెస్టారెంట్‌లోని వెయిటర్స్‌ని పచ్చనోట్లతో కొట్టి విషయం సేకరించాడు. ఒక వెయిటర్ గౌస్‌కి సహకరించాడు.

గౌస్ స్వయంగా తనే ఐస్‌క్రీమ్స్ మీద కొకైన్ పౌడర్ చల్లి వెన్నెలని, నిరంజన్‌లకు సప్లయ్ చేయించాడు.

అనవసరమైనప్పుడు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పేలా వెయిటర్‌ని లోబరుచుకున్నాడు బి.వి.రావు. ఆ తర్వాత నీడలా గౌస్‌ని షాడో చేస్తూ వచ్చాడు.

పాపం పండితే ఒక రోజు గాకపోతే-

మరో రోజు దొరికిపోడం ఖాయం.

అదే జరిగింది.

గౌస్ తరచూ వెళ్ళే బార్‌లోని వెయిటర్స్‌కి డబ్బులిచ్చి మేనేజ్ చేసాడు బి.వి.రావు.

ఆ రోజు రాత్రి తొమ్మిదిగంటలకి దిల్‌షుఖ్‌నగర్‌లోని శిల్పబార్ నుంచి ఒక వెయిటర్ బి.వి.రావుకి ఫోన్ చేసాడు. సివిల్ డ్రస్‌లో వున్న సర్కిల్ ఎం.డి. గౌస్ కొంతమంది ఫ్రెండ్స్‌తో బార్‌లో తప్పతాగి వాగుతున్నట్టు ఆ ఫోన్ సారాంశం.

పది నిమిషాల్లో బార్‌కి చేరుకున్నాడు బి.వి.రావు. అతను బైక్‌మీద వచ్చాడు. బట్టతల వచ్చినా తను కాలేజి స్టూడెంట్‌లా ఫీలవుతాడు రావ్. వయసు శరీరానికే గాని, మనసుకు కాదని అతడి నమ్మకం.

గౌస్ బృందాన్ని వీడియో తీస్తూ, కొద్ది కొద్దిగా మందు సిప్ చేస్తున్నాడు. రావ్ ప్రయోగించిన వెయిటర్ గౌస్‌ని రెచ్చగొట్టి వదిలాడు.

మందు ఎక్కువైన గౌస్ ఆ విషయం ఈ విషయంతో బాటు తనకు ఎవరెవరితో ఎలాంటి లింకులు వున్నాయో తన గొప్పతనాన్ని వివరించటం ఆరంభించాడు.

అందులో మేయర్ రాంరెడ్డి, డాక్టర్ భువనచంద్ర, రవీందర్ ల పేర్లు దొర్లాయి. రాంరెడ్డి నుంచి పాతికలక్షలు తీసుకుని నిరంజన్, వెన్నెలలను తను డ్రగ్స్ కేసులో ఎలా ఇరికించిందీ కూడా చెప్పాడు.

తన సికింద్రాబాద్ ఎం.పి. సీటుకు నిరంజన్ పోటీ వస్తున్న కారణంగా రాంరెడ్డి, పదవి నుంచి వెన్నెలని దించాలనే ఉద్దేశంతో రవీందర్ ఇద్దరూ ఈ పథక రచన చేసి తనకు డబ్బిచ్చారని కూడా చెప్పాడు. అంతా నీట్‌గా వీడియో తీసుకుని ఏమీ తెలీనట్టు బయటకు వచ్చేసాడు రావ్. బయటకు రాగానే ఒకసారి సెల్‌ఫోన్ రికార్డింగ్‌ని చెక్ చేసాడు.

చాలా బాగా రికార్డయింది. బొమ్మ, మాటలు కూడా స్పష్టంగా వున్నాయి. ఇది చాలు– గౌస్‌తో బాటు రాంరెడ్డి మునిగిపోడానికి.

ఉత్సాహంగా బైక్ స్టార్ట్ చేసాడు బి.వి.రావు.

కోర్టు వాయిదాకి నిరంజన్, వెన్నెలతో బాటు సర్కిల్ గౌస్, మరికొందరు అంతా వచ్చారు. లాయరు ధర్మారావు కోర్టు మొదలవటానికి ముందే ప్రత్యేక అనుమతితో జడ్జిగారిని కలుసుకుని బి.వి. రావ్ రికార్డ్ చేసిన వీడియోని ఆయనకు చూపించాడు.

కోర్టు సమయంలో అక్కడ టి.వి.లో ఈ రికార్డింగ్ వచ్చేలా ఏర్పాటు చేయించాడు జడ్జిగారు.

యథాప్రకారం కోర్టు ఆరంభమైంది.

వాదోపవాదాల అనంతరం గౌస్‌ని ఇప్పుడయినా ఏం జరిగిందో కోర్టుకి చెప్పమని గౌస్‌ని అడిగాడు జడ్జి.

కాని గౌస్ మాత్రం తన విధి నిర్వాహణ సక్రమంగా చేసానని చెప్పాడు.

అప్పుడు బి.వి.రావ్ రికార్డ్ చేసిన వీడియో క్లిప్పింగ్స్‌ని టి.వి.లో ప్రసారం చేయించారు జడ్జి.

కోర్టు మొత్తం ఆ దృశ్యాలు చూసి నివ్వెరపోయింది. తను తప్ప తాగి బార్‌తో వాగిందంతా రికార్డయిందని తెలీగానే ఇక తను బుక్కయి పోయాడని గౌస్‌కి అర్థమైపోయింది. తలదించు కున్నాడు.

పైగా ఆ రోజు ఐస్‌క్రీం సప్లయ్ చేసిన వెయిటర్ కోర్టుకు వచ్చి సాక్ష్యం కూడా చెప్పాడు.

దాంతో–

చాలాఘాటు పదజాలంతో గౌస్‌ని హెచ్చరించారు జడ్జి. జరిగిన దాంట్లో నిరంజన్, వెన్నెలల తప్పు లేదని నిర్ధారిస్తూ వాళ్ళిద్దరినీ విడుదల చేస్తున్నట్టు ప్రకటించిన జడ్జిగారు గౌస్, రాంరెడ్డిలను సస్పెండ్ చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచిస్తూ తీర్పు చెప్పారు.

కేసు నుంచి బయటపడటం వెన్నెలకి ఇది రెండో విజయం. ఆ ఆనందాన్ని తన అన్న శరత్‌చంద్రతోను, నిరంజన్‌తోను షేర్ చేసుకుంది. ముఖ్యంగా ఈ కేసులో తమకు సహకరించిన బి.వి.రావ్‌ని అభినందించారు.

* * * * *

అందమైన రాజప్రాసాదంలాంటి ఆ భవంతి ఆవరణలోకి కారుని పోనిచ్చి పోర్టికోలో ఆపింది వెన్నెల.

సింపుల్‌గా చీర జాకెట్లో చాలా హుందాగా ఇవాళ మరింత అందంగా మెరిసిపోతోంది వెన్నెల.

ఆ భవంతి రామకృష్ణంరాజుగారిది.

ఆయన కడియం నుంచి సిటీకి వచ్చినా తను కోర్టు గొడవల్లో పడి తీరికలేక ఆయనతో సరిగా మాట్లాడే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇప్పుడు కోర్టు కేసుల్లో విజయంతో ఆమె ముఖంలో ఆనందం తొంగిచూసింది. తీరికా ఏర్పడింది.

అందుకే తను వస్తున్నట్టు ఫోన్ చేసి చెప్పి, ఉదయమే ఇటువచ్చింది వెన్నెల.

ఆమె కోసం స్వయంగా రామకృష్ణంరాజు బయటకొచ్చి వెయిట్ చేస్తున్నాడు.

కారు దిగిన ఆమెను చూడగానే చిరునవ్వుతో పలకరించి అప్యాయంగా లోనకు తీసుకెళ్ళాడు. తన మనవరాలు ప్రియాంకను కూడా పరిచయం చేసాడు.

ప్రియాంక చాలా అందంగా వుంది.

వెన్నెలకన్నా వయసులో నాలుగేళ్ళు చిన్నది. సౌమ్యురాలు, మితభాషిణి. ఆమెలో మన సాంప్రదాయం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అష్టయిశ్వర్యాలు వున్నా తన మనవరాల్ని ఒక తెలుగింటి ఆడపిల్లగానే చక్కగా పెంచారాయన.

తీరిగ్గా కూర్చుని కాఫీ తాగాక రామకృష్ణంరాజు ఉత్సాహంగా చెప్పాడు–

"ఇప్పుడు మీ డాడీ బ్రతికుంటే చాలా సంతోషించేవాడు వెన్నెల. నీ కేసులు నువ్వు వాదించుకున్నావ్. ఒక్క రవీందర్‌ని గద్దె దించే విషయంలో కోర్టు తీర్పు నీకు వ్యతిరేకంగా వచ్చినా, మిగిలిన రెండు కేసుల్లోనూ విజయం నిన్నే వరించింది. కంగ్రాట్స్!" అంటూ అభినందించాడు.

"థాంక్యూ ఆంకుల్! ఇదంతా డాడీ ఆశీస్సుల ఫలితం. మీలాంటిపెద్దల అనుగ్రహం...నా సమస్యల్లో పడి మీరు సిటీకి వచ్చారని తెలిసినా రాలేకపోయాను. సారీ!" అంది.

"నోనో... నాకంతా తెలుసు. డోంట్‌వర్రీ. నీకో విషయం చెప్పనా? మీ డాడీ టైగర్ లాగే నేనూ అత్యున్నత పదవుల్లో స్త్రీలు రాణించలేరనే అభిప్రాయంతోనే వుండేవాడ్ని. ఎక్కడో అరుదుగా కొందరు స్త్రీలకే తప్ప అందరికీ అది సాధ్యం కాదనుకునేవాడిని. ఇదిగో... నిన్ను చూసాకే నా అభిప్రాయం తప్పని అర్థం చేసుకున్నాను. ఇప్పుడు నా వారసత్వాన్ని నా మనవరాలు ప్రియాంకకే యివ్వాలని నిర్ణయం తీసుకున్నాను మా ప్రియాంక కూడా నీలాగా తెలివైనది, చురుకైనది, మన సాంప్రదాయాల పట్ల గౌరవం వున్న అమ్మాయి."

"మీరు మంచి నిర్ణయం తీసుకున్నారు అంకుల్... అన్నట్టు మీరు హెచ్.ఎస్. క్లబ్‌లో సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్నారని విన్నాను?"

"ఆ మాట కరక్టే. ఈ విషయంగా కొందరు పెద్దల్ని కూడా కలిసాను. వాళ్ళు నిర్ణయాన్ని మీకే విడిచిపెట్టారు."

"అక్కడ నా పదవే వుంటుందో, వూడుతుందో తెలీలేదు. వుంటే మాత్రం తప్పకుండా మీకా అవకాశం ఇప్పిస్తాను" అంది నవ్వుతూ.

"వూడిపోతుందని ఎలా అనుకున్నావ్?" తనూ నవ్వుతూనే అడిగాడు రామకృష్ణంరాజు.

"వెన్నెలా! నీ పదవి హెచ్.ఎస్. క్లబ్‌లో సురక్షితంగా వుంది. మరో విశేషం ఏమంటే, డాక్టర్ భువనచంద్ర రాజీనామా చేసాడు. బ్యాంకర్స్‌ను దెబ్బకొట్టి నిన్ను ఆర్థికపరమైన చిక్కుల్లో పడేస్తే నీవుగా హెచ్.ఎస్.క్లబ్ నుంచి తప్పుకుంటావని ప్లాన్ చేసాడాయన. అది కాస్తా బెడిసికొట్టడంతో

కోర్టులో నువ్వు గెలవగానే పరువు పోగొట్టుకుని క్లబ్ నుంచి ఆయనే తప్పుకున్నాడు” అంటూ వివరించాడు.

“ఇవాళ మార్నింగ్ న్యూస్ చూసావా?” తిరిగి తనే అడిగాడు.

“లేదు. టీ.వీ అన్నా, న్యూస్‌పేపర్స్ అన్నా భయం పట్టుకుంది” అంది.

“భయం అనకు. ఆపదానికి అర్ధం తెలీని మనిషి టైగర్. నువ్వు ఆయన కూతురివి. తప్పుచేసినవాళ్ళు మీడియాకి భయపడతారు. నీకు భయం ఏమిటి? బయట సంగతులు నీకింకా తెలిసినట్టు లేదు. కోర్టు ఆదేశానుసారం డ్రగ్స్ కేసులో ఇరికించిన గౌస్‌ని ఉద్యోగం నుంచి తొలగించారు.”

ఆయన మాటల్ని జాగ్రత్తగా వింటోంది వెన్నెల.

“నిరంజన్ ఫోన్ చేశాడా?” చివరగా అడిగాడాయన.

“ఓ.....సారీ అంకుల్. నా సెల్ ఆఫ్‌లో వుంది” అంటూ సెల్ అందుకుని ఆన్ చేసింది.

“ఇలా స్విచాఫ్‌లు చేస్తే మొబైల్ కంపెనీ వాళ్ళు బ్రతికేదెలా తల్లీ. ఎనీవే! ఒక గొప్ప అందగత్తెని చంచల్‌గూడ జైలు మిస్సయింది. మోనికాబేడీ కథ తెలుసుగా?” అంటూ నవ్వాడు రామకృష్ణంరాజు.

తనూ నవ్వింది వెన్నెల.

“ఒక విషయం అడుగుతాను చెప్తావా?” అడిగాడాయన.

“అడగండి.”

“నిరంజన్‌కి నువ్వంటే చాలా ఇష్టమనీ, నువ్వు కూడ అతన్ని ఇష్టపడుతున్నావనీ బిజినెస్ సర్కిల్లో కొందరు చెవులు కొరుక్కోడం నా వరకూ వచ్చింది. నిజమేనా?”

“అదేంలేదు అంకుల్! మేం జస్ట్ ఫ్రెండ్స్ మాత్రమే” వెంటనే బదులిచ్చింది వెన్నెల. కానీ ఆమె కళ్ళలో, బుగ్గల్లో నునుసిగ్గుల్ని రామకృష్ణంరాజు పసిగట్టేసాడు.

"నీ మనసులో ఏమీ లేకపోతే నో ప్రాబ్లమ్. నా మనవరాలు ప్రియాంకను నిరంజన్ చేసుకుంటాడేమో ఓ మాట మధుసూదన్‌రెడ్డిని అడగాలనుకుంటున్నాను. నీకు అభ్యంతరం లేదుగా?" మరో రాయి విసిరి చూశాడు. ఈసారి ఆమె పూర్తిగా సిగ్గుపడింది.

"అంకుల్! ప్లీజ్!" అంటూ నవ్వేసింది.

ఆ నవ్వు చాలు-

ఆమె మనసులో ఏముందో తెలుసుకోడానికి.

నిరంజన్ కోసం ఫోన్ చేసింది.

అవతల స్విచాఫ్ చేసుంది.

"సర్కిల్ గౌస్‌ని అరెస్ట్ చేసారట... అతనికి శిక్ష పడొచ్చు" అంది సెల్ పక్కన పెట్టి.

"నాలుగేళ్ళకు తగ్గకుండా శిక్షపడే అవకాశం వుంది... చర్లపల్లి జైల్లో వుండేకన్నా నెక్లెస్ రోడ్‌లో పల్లీలమ్ముకోవడం మంచిది. పాపం పూర్తిగా బుక్కయిపెయాడు గౌస్."

అరగంట వరకూ అక్కడే రామకృష్ణంరాజు, ప్రియాంకలతో గడిపి తన ఫ్లాట్‌కి బయలుదేరింది వెన్నెల.

ఎందుకోగాని ఆమె మనసు-

వెంటనే నిరంజన్‌ను చూడాలని తొందర చేస్తోంది.

కార్లో వస్తూ నిరంజన్ కోసం తిరిగి తిరిగి ఫోన్ చేస్తూనే వుంది. కాని అతను ఎక్కడున్నాడోగాని సెల్ స్విచాఫ్ చేసి కూర్చున్నాడు. ఆమెకు చాలా కోపంగా వుంది. ఎలాగయినా నిరంజన్‌ని కలవాలని పట్టుదల ఏర్పడింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు కూడా లేవు. స్విచాఫ్ చేసి కూర్చునేంత బిజీ పనులు ఏమున్నాయని?

మధుసూదన్‌రెడ్డికి ఫోన్ చేసింది.

వెంటనే లైన్‌లో కొచ్చాడాయన.

"అంకుల్! నేను వెన్నెలని...." చెప్పింది.

"చెప్పమ్మా.... ఎనీ ప్రాబ్లమ్?" ఆదరంగా అడిగాడాయన.

"లేదంకుల్! నిరంజన్ సెల్ ఆపి కూర్చున్నాడు. ఎక్కడున్నాడో తెలీదు. వెంటనే కలవారి."

"అది... ఎక్కడో పార్టీ మీటింగ్‌కు వెళ్ళి తెల్లవారుజామనే వచ్చాట్ట. ఇంటిదగ్గర డిస్ట్రిబ్ చేస్తారని తన ఆఫీస్‌లోనే నిద్రపోతున్నాడు. బహుశా ఇంకా లేవలేదేమో?"

"థాంక్యూ అంకుల్!"

తన కారును నిరంజన్ ఆఫీసుకు పోనిచ్చింది.

ఆమె ఆఫీస్‌లో అడుగుపెట్టేసరికి–

ఆఫీస్ నిశ్శబ్దంగా వుంది.

అది పేరుకు ఆఫీస్ గాని, అక్కడ నలుగురు ఎంప్లాయీస్ మాత్రమే వుంటారు. అదీ అకౌంట్లు, ఇతర పనులు చూసేవాళ్ళు. అన్నీ పార్టీకి సంబంధించినవ్యవహారాలు. నిరంజన్‌ని కలుసుకోవాలనే పార్టీ ముఖ్యులు, నియోజకవర్గ ప్రజలు అక్కడికి వచ్చిపోతూంటారు. ఆఫీస్ బోయ్ వెన్నెలని మేడమీదకు తీసుకెళ్ళి హాల్లో కూర్చోబెట్టి నిరంజన్ గదిలోకి వెళ్ళాడు. కాస్సేపటికి బయటికొచ్చి– "అయ్యగారు లేచారండి. మిమ్మల్ని లోనకి రమ్మని చెప్పమన్నారు" అని చెప్పి కిందకు వెళ్ళి పోయాడు.

వెన్నెల నిరంజన్ గదిలోకి వెళ్ళింది.

ఆమె వెళ్ళేసరికి నిరంజన్ లుంగీ, బనియన్‌తోనే వున్నాడు. అప్పుడే ముఖం కడుక్కుని బాత్‌రూమ్‌లోంచి వస్తున్నాడు.

"గుడ్‌మార్నింగ్!" అంటూ నవ్వాడు.

"ఏమిటీ... నువ్వు గుడ్‌మార్నింగ్‌లు చేస్తే సంతోషపడను. నువ్విక్కడ సెల్ స్విచ్చాఫ్ చేసి నిద్రపోతుంటే నాకెలా తెలుస్తుంది? ఉదయం నుంచి ఫోన్ చేస్తూనే వున్నాను" అంటూ నిష్టూరంగా వచ్చి సోఫాలో కూర్చుంది.

"నువ్వు కోపంగా వున్నట్టున్నావ్. సారీ! రాత్రంతా నిద్రలేదు. అందుకే... ఓ.కె. కాఫీ తాగుదాం" అంటూ ఫ్లాస్కులో కాఫీని రెండు కప్పుల్లోకి వంచి ఒకటి వెన్నెల ముందుంచి ఒకటి తను తీసుకున్నాడు.

"ఏమిటలా చూస్తున్నావ్?" కాఫీ సిప్‌చేస్తూ అడిగింది.

"సమస్యలు మనిషిని కృంగదీస్తాయి. నిన్నటి వరకూ నీముఖంలో అప్రసన్నత, ఆతృత చూసి చాలా బాధ పడేవాడ్ని. ఇప్పుడు ఇబ్బందులనుంచి

చాలావరకూ బయట పడిపోయావ్. అందుకే మబ్బులు తొలగిన చంద్రుడిలా ఇప్పుడు నీ ముఖం చాలా ప్రసన్నంగా, మరింత అందంగా వుంది. అందుకే చూస్తున్నాను" అన్నాడు.

"థాంక్యూ" అంది ముచ్చటగా.

"దేనికీ?"

"నేను అందంగా వున్నానని పొగడినందుకు రాజకీయ నాయకులకు సౌందర్యారావు తెలీదనుకునేదాన్ని. ఫరవాలేదు. నీలోనూ ఒక కళారాధకుడు వున్నాడనిపిస్తోంది."

"నా సంగతి అలావుంచు. నీ సంగతేమిటి?" ఖాళీకప్పు టీపాయ్ మీద వుంచుతూ అడిగాడు.

"ఏ సంగతి?" తనూ పక్కన పెడుతూ అడిగింది.

"అదే... అనూప్‌తో నీ ప్రేమ విషయం?"

అతడు ఎంత సాదాగా అడిగినా–

అతడి ప్రశ్న ఆమె గుండెల్లో సూటిగా నాటిన బాణంలా అన్పించింది. అనూప్‌తో తనది ముగిసిపోయిన ప్రేమకథ. అతను సుమకు దగ్గరయ్యాడు. రేపో మాపో పెళ్ళి చేసుకోబోతున్నాడు. ఇప్పుడు తామిద్దరూ జస్ట్ ఫ్రెండ్స్ మాత్రమే. ఆ విషయం తకు తెలుసు. అనూప్‌కి తెలుసు. కాని నిరంజన్ ఈ విషయం ఇప్పుడు అడగటం ఏమిటి? అంటే...

తన గతం గురించి ఎంక్వయిరీ చేసి తెలుసుకున్నాడా?

తెలుసుకోవడంలో తప్పులేదుగాని–

అతను అడిగిన తీరు ఆమెని హర్ట్ చేసింది.

"మేం ప్రేమించుకున్నామని నీతో ఎవరు చెప్పారు?" కాస్త సీరియస్‌గానే అడిగింది.

"ఎవరు, ఏమిటని వద్దు. నేనూ నీ ఫ్రెండ్‌నేగదా. నీ గురించి తెలుసుకోవాలను కోవడం తప్పా? అనూప్ లాయర్. నువ్వూ లాయర్. అనూప్ నీ దగ్గర పనిచేస్తున్నాడు. పైగా నీ డ్రీమ్ ప్రాజక్ట్ మొత్తం అతని

పర్యవేక్షణలో సాగుతోంది. మీ ఇద్దరూ ఒకటయితే నాకూ సంతోషమే గదా?"

"నాకు సంతోషంకాదు. నువ్విలా చెప్పటంగాని, అనూప్ గురించి అడగటంకాని సంతోషంకాదు. నా మనసులో ఎవరున్నారని నువ్వు అడిగివుంటే సంతోషంగా చెప్పేదాన్ని. కనీసం నీ మనసులో ఎవరున్నారని నేను నిన్ను అడిగేవరకు కూడా నువ్వు ఆగలేదు. ఓ.కె. ఇప్పుడు అనూప్ గురించి అడిగావు గాబట్టి చెప్తాను.

మేం ఒకే కాలేజిలో లా చదివాం. ఒకర్నొకరు అప్పట్లో ఇష్టపడ్డాం. కాని పరిస్థితులు అనుకూలించలేదు. మా మధ్య స్నేహం తప్ప, మరేంలేదు. ఇప్పటికీ మేం బెస్ట్‌ఫ్రెండ్స్ మాత్రమే. అందుకే నా డ్రీమ్ ప్రాజక్టు బాధ్యతల్ని అతని చేతిలో పెట్టాను.

త్వరలో సుమఅనే అమ్మాయిని అనూప్ పెళ్ళిచేసుకోబోతున్నాడు. నువ్వు విన్నట్టు లేదా, అనుకుంటున్నట్టుగా మా మధ్య ప్రేమవుంటే ఈ పాటికి నీకు శుభలేఖ అందించేదాన్ని. ఇదంతా మా మధ్య ఏమీలేదని నిన్ను నమ్మించడానికి చెప్పటంలేదు. జస్ట్ అడిగావు గాబట్టి చెప్తున్నాను. నువ్వే చెప్పావ్‌గా.

మనిద్దరం కూడా బెస్ట్‌ఫ్రెండ్స్ అని. ఓ.కె. మనం యిలాగే మంచి స్నేహితులుగానే మిగిలిపోదాం. థాంక్యూ నిరంజన్. వస్తా" అంటూ చివ్వున లేచి నిలబడింది.

ఆమె హర్టయిందని–

నిరంజన్ గ్రహించాడు.

తనూ లేచి నిలబడుతూ బాధగా చూసాడు.

"నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావ్ వెన్నెలా...." అంటూ ఏదో చెప్పబోయాడు.

"వద్దు నిరంజన్. ఇంకేమీ చెప్పకు. నేను అపార్థం చేసుకోలేదు. వాస్తవాన్ని అర్థం చేసుకున్నాను. ఆడపిల్లగదా... నువ్వు అడగటం సహజం. నేను బదులు చెప్పటం కూడా సహజమే. వస్తాను...." అంటూ మరోమాటకి

అవకాశం ఇవ్వకుండా గిరుక్కున వెనుతిరిగి బయటికెళ్ళిపోయింది వెన్నెల.

అసలు తను ఇక్కడికి ఎందుకొచ్చింది. ఇక్కడ జరిగిందేమిటి? ఆలోచిస్తే ఆమెకే ఆశ్చర్యంగా వుంది. మనసును అదుపు చేసుకుంటూ బయటకొచ్చి తన కార్లో వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయిన చాలా సేపటివరకు నిరంజన్ ఆలోచిస్తూనే వున్నాడు. తనదే తప్పా?

అనూప్ గురించి అడిగి వుండకూడదా? తన మనసులో వెన్నెల వుంది. ఎప్పటికప్పుడు ఆమెతో ఐలవ్‌యూ చెప్పాలనుకుంటూనే వాయిదా వేస్తూ వచ్చాడు.

అనూప్ విషయంలో తను అనుమానిస్తూనే వున్నాడు. అది నిజమని, ఒకప్పుడు వాళ్ళిద్దరూ బెస్ట్‌ఫ్రెండ్స్ మాత్రమేకాదు, ప్రేమికులని పెళ్ళికూడా చేసుకోవాలనుకుని ఆగిపోయారని విన్నాడు. ఇప్పటికీ ఆమె మనసులో అనూప్ వుంటే ఇద్దర్నీ ఒకటి చేయాలనే సదుద్దేశంతోనే తను అడిగాడు.

కాని వెన్నెల మరోలా వూహించినట్టుంది. నిజంగా ఆమె మనసులో ఇప్పుడు అనూప్ లేకపోతే తనలా అడగటం ఖచ్చితంగా అది తన తప్పే... ఈ పరిస్థితిలో తను మాత్రం ఏమఖం పెట్టుకుని ఆమెకు ఐలవ్‌యూ చెప్పగలడు.

డామిట్. అంతా గడబిడ అయిపోయింది.

ఏంచేస్తే బాగుంటుంది?

ఎం.పి.బై ఎలక్షన్‌కి ఇంకా నోటిఫికేషన్ రాలేదు. నామినేషన్ వేయటానికి ఇంకా టైముంది. ఈలోపల కొద్దిరోజులు ఎటన్నా వెళ్ళిపోయి ఒంటరిగా, ప్రశాంతంగా గడపటం మంచిదేమో... యస్ అదే కరక్ట్...

అతను ఒక నిర్ణయానికి వచ్చేలోగ–

లంచ్ టైం అయింది.

* * * * *

ఒకపక్క కోర్టు కేసులో వెన్నెలని విజయం వరించగా, మరోపక్క ఆమె విజయాలకు మార్గం సుగమంచేస్తూ మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణంరాజులు రంగంలో దిగారు.

వెన్నెలపట్ల హెచ్.ఎస్. క్లబ్ ఆదరణని కూడగట్టడంలో మధుసూదన్ రెడ్డి సఫలంకాగా, అటు రామకృష్ణంరాజు మిడాన్‌కి చెందినబోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ని కలిసి రవీందర్‌కి వ్యతిరేకంగా వాళ్ళని కూడగట్టే ప్రయత్నాలు ఆరంభించాడు. వెన్నెల విషయంలో రాజేందర్ చేసిన మోసాన్ని వారికి వివరించాడు.

ఈలోపల వెన్నెలని దెబ్బతీయటానికి తనే బ్యాంకర్స్‌ని రెచ్చగొట్టిన విషయం బయటకు పొక్కటంతో వ్యాకులపడిన డాక్టర్ భువనచంద్ర హెచ్.ఎస్. క్లబ్‌లో తన సభ్యత్వానికి అనారోగ్య కారణాలు చూపిస్తూ రాజీనామా చేసాడు.

అదేరోజు అర్ధరాత్రి–

రవీందర్ పర్సనల్ ఫోన్ మోగింది. ఫోన్ చేసింది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఒకడయిన నరసింహన్.

"ఈ టైంలో ఫోన్ చేసారు. ఏమైంది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"జరగాల్సిందే జరిగింది. నా ఉద్యోగం పోయింది. ఇంతకుముందే మా కంపెనీ బోర్ట్ మీటింగ్‌పెట్టి, నా పనితీరు నచ్చలేదంటూ నన్ను పదవినుంచి తప్పించారు" చెప్పాడతను.

"పనితీరు నచ్చకపోవటం ఏమిటి నాన్సెన్స్. అసలేం జరిగింది?"

"అదే నాకూ అర్ధంకాలేదు. ఛైర్మన్ ముఖంలో కంగారుచూస్తే నా విషయంలో ఏదో పెద్ద వత్తిడి వచ్చిందనే అనుకుంటున్నాను. అనఫీషియల్‌గా తెలిసిందేమంటే నామూలంగా కొందరు పెద్దలతో విరోధం ఏర్పడే ప్రమాదం వుందని తెలిసిందట.నన్ను తొలగించారు. నా స్టాక్ హోల్డింగ్స్ కంపెనీలోనే వుంటుంది. కాని నేనక్కడ వుండను."

"కేసువేసి ఫైట్ చేయొచ్చుగా."

"వాళ్ళు చాలా హుందాగా నన్ను బయటకు తోసారు. కేసువేసి ఇష్యూని పెద్దది చేయటం నాకిష్టంలేదు. మరో విషయం కూడా వుంది. ఇతర కంపెనీల్లోని నా డైరెక్టర్ హోదాకి రాజీనామా చేయకపోతే పరిస్థితి దారుణంగా వుంటుందని హెచ్చరించారు."

"అంటే మా మిడాన్ గ్రూప్‌కి...."

"ముందుగా అదే అడిగారు. రాజీనామా రాసిచ్చాను. అది రేపు మీ టేబిల్‌మీద వుంటుంది."

రవీందర్‌లో ఆతృత ఆరంభమైంది.

ఏం జరుగుతుందో అర్థంకాలేదు.

పెద్ద మనుషులంటే... ఎవరు వాళ్ళు? కొంపదీసి వెన్నెల తరుపున హెచ్.ఎస్. క్లబ్ రంగంలోకి దిగలేదుకదా? అదెలా సాధ్యం. మీడియాలో వచ్చిన బేడ్ పబ్లిసిటీకి హెచ్.ఎస్. క్లబ్బు వాళ్ళు కలతచెంది ఆమెను క్లబ్‌నుంచి బయటకు పంపించేయాలనుకుంటున్నట్టు విన్నాడు. ఇంతలోనే ఏమైంది?

"మీరు తొందరపడ్డారేమో" అన్నాడు నరసింహన్‌తో.

"తొందరపడలేకపోతే తర్వాత నేనుండను. అర్థం చేసుకోండి. బై" అవతల లైన్ కట్‌చేసాడు సరసింహన్.

రవీందర్ డౌట్ తీరిపోయింది.

హెచ్.ఎస్. క్లబ్ వెన్నెలకి సాయం వస్తున్నట్టుంది. తాను ఇటు నుంచి మిడాన్ గ్రూప్‌ని గుప్పిట్లోకి తీసుకున్నాడు. వాళ్ళు అటునుంచి ఒక్కోవేలు నరుక్కొస్తున్నారు. రేపు తన పరిస్థితి ఏమిటి?"

తనకు సాయంవచ్చే మిత్రులు కొంతమందికి ఫోనులు చేసాడు. ఒక్కడూ లైన్‌లోకి రాలేదు. ఎవరిచేతో బదులు చెప్పించి తప్పించుకుంటున్నారు.

చిరాకుతో విస్కీబాటిల్ ముందేసుకుంటూ పెళ్ళాం శ్వేతవైపు చూసాడు. ఆమె బెడ్‌మీద నిశ్చింతగా నిద్రపోతోంది. ఆ రాత్రంతా అశాంతిగానే గడిపాడు రవీందర్.

మరునాడు ఉదయం మరో షాకింగ్ వార్త రవీందర్‌కి. కోర్టు ఆదేశానుసారం మేయర్ రాంరెడ్డి తన పదవికి రాజీనామా చేసాడు. సికిందరాబాద్ ఎం.పి. స్థానానిక్కూడా పోటీగా నిలవటం లేదుట.

ఈ వార్త తెలీగానే రాంరెడ్డి కోసం ఫోన్‌లో ట్రయ్ చేసాడు రవీందర్. ప్రస్తుతం అతను సిటీ వదిలి ఎక్కడికో వెళ్ళిపోయినట్టు తెలిసింది.

మిడాన్ గ్రూప్ ఆఫీస్‌లో చాలాసేపు ఒంటరిగానే గడిపాడు రవీందర్. నరసింహన్‌తో బాటు తనను సపోర్ట్ చేసిన మరో డైరెక్టర్ రాజీనామా లేఖ కూడా టేబిల్‌మీద వుంది.

వాటిని ఆమోదిస్తున్నట్టు సంతకాలు చేసాడు. మరో గంట తర్వాత తను బేరం పెట్టిన ఫిలిం కంపెనీని కొనడానికి ముందుకు వచ్చిన వాళ్ళు డ్రాప్ అవుతున్నట్టు ఫోన్ చేసారు.

ఒకటొక్కటిగా ప్రతికూలించటంతో హెచ్.ఎస్. క్లబ్ సునామీలా తనమీద నిశ్శబ్దంగా విరుచుకుపడబోతుందని అర్థమైంది.

ఇదిలా వుంటే ఒంటిగంటకు రామకృష్ణంరాజుగారు ఫోన్ చేసారు. ఇంతవరకు సిటీలో లేడుగాని ఆయనా మిడాన్‌లో ఒక డైరెక్టర్. మరణించిన టైగర్‌కి క్లోజ్‌ఫ్రెండ్.

"ఏమయ్యా రవీందర్... ఎలా వున్నావ్. చాలా పెద్దవాడివయ్యావ్." అంటూ పలకరించాడాయన. ఆ పలకరింపులో వెక్కిరింపు ధ్వనించింది.

"మీరు సిటీకి వచ్చారని విన్నాను" పొడిగా చెప్పాడు.

"సర్లే వయసవుతోంది. కొద్దిరోజులు ఇక్కడే వుండిపోదామని వచ్చాను గాని, నాలుగు గంటలకి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ వుంది. చాలా ఇంపార్టెంట్. ప్రసిడెంట్, ఛైర్మన్‌వి నువ్వే గాబట్టి ఇది నువ్వు ఏర్పాటుచేస్తే బాగుంటుంది. నీ యిష్టం. మేం నాలుగు గంటలకి ఆఫీస్‌కి వస్తున్నాం' అంటూ విషయం చెప్పి మరో మాటకి అవకాశం ఇవ్వకుండా లైన్ కట్ చేసాడాయన.

రవీందర్ ముఖం తెల్లగా పాలిపోయింది.

తనకి వ్యతిరేకంగా రామకృష్ణంరాజు డైరెక్టర్లని కూడగట్టే పనిలో వున్నాడని అర్థమైంది. ఖచ్చితంగా ఇది తనను దించే ప్రయత్నమే. దిగకపోతే హెచ్.ఎస్. క్లబ్ వాళ్ళ అదృశ్యహస్తం రంగంలోకి దిగుతుంది.

పరిస్థితులు వేగంగా మారిపోతూండటం గమనించగానే శ్వేతకు ఫోన్ చేసాడు. ఆ సమయంలో ఆమె ఎక్కడో పార్టీలో వుంది.

"హాయ్ రవీందర్! ఎక్కడున్నావ్?" అడిగిందామె. బహుశడాన్స్ చేస్తుండాలి. వెనకనుంచి మ్యూజిక్ వినబడుతోంది. కలగాపులగంగా పార్టీలో మాటలు విన్పిస్తున్నాయి.

"ఆఫీస్‌లోనే వున్నాను. పరిస్థితులు మారుతున్నాయి. నాలుగు గంటలకి బోర్డ్ మీటింగ్ వుంది. బహుశ నన్ను తొలగించవచ్చు."

"జోకా... ఇంతలోనే ఏమైంది? ఒకవేళ అదే నిజమైతే పదవి నిలువుకోవడం నీకు తెలిసిన విద్యేగా. ఆ వెన్నెల రెండు కేసుల్లోనూ విన్‌చేసింది. డ్రగ్స్ కేసులోంచి బయటపడింది. జాలిపడి తిరిగి పైకి తీసుకురావాలని చూస్తున్నట్టున్నారు."

"కావచ్చు. నాకో నిజం కావాలి."

"ఏ నిజం?"

"టైగర్‌తో నీ సంబంధం నిజమేనా? ఆయన మోసం చేసాడనుకునేగా నన్ను చేసుకున్నావ్?"

అవతల శ్వేత నవ్వు విన్పించింది.

"ఈపాటికే నువ్వు గ్రహించి వుండాలి. ఇంత లేటా డియర్! నిజానికి ఆయన పెళ్ళి చేసుకుంటానని నాకేమీ ప్రామిస్ చేయలేదు. నేనే వెంటపడ్డాను. పని కాలేదు. దాంతో ఆయనమీద కసి పెంచుకుని నిన్ను చేసుకున్నాను.

ఓ.కె. అయిందేదో అయింది. ఇప్పుడు నీ పడవ మునిగిపోతోందని అర్థమవుతోంది. మనం విడిపోదాం. త్వరలోనే డైవర్స్‌కి కాగితాలు పంపిస్తాను. పార్టీలో బిజీగా వున్నాను. సారీ" అంటూ లైన్ కట్ చేసింది శ్వేత.

ఆమె మాటలు వినగానే నిస్సత్తువతో ఛైర్‌లో కూలబడ్డాడు రవీందర్. తను చేసిన తప్పులు కంటిముందు నిలబడి వెక్కిరిస్తున్నట్టున్నాయి. బాధగా నిట్టూర్చాడు. రెండు పెగ్గులు రా విస్కీ తాగాడు. ఎక్కడో మంట.

సెడెన్‌గా ఛాతీలో నొప్పి ఆరంభమైంది.

ఎసిడిటీ అనుకున్నాడు.

టాబ్లెట్ వేసున్నాడు.

కొంచెం రిలీఫ్‌గానే అన్పించింది.

నిమిషం తర్వాత తిరిగి నొప్పి ఆరంభమైంది. రవీందర్‌కి అర్థమైపోయింది. అది గుండెనొప్పి... దారుణమైన హార్ట్ అటాక్. వెంటనే మొబైల్ అందుకుని 108కి ఫోన్ చేయబోతూ సాధ్యంగాక అలాగే కుప్పగూలిపోయాడు. తెలివి తప్పాడు.

గుండెనుంచి రక్తం సరఫరా ఆగిపోవటంతో రక్తంతోపాటు ఆక్సిజన్ మెదడుకి అందక అది పనిచేయటం మానేసింది. ఈ దశలో ఎమర్జెన్సీగా లేకపోడంతో కుప్పకూలిన మూడో నిముషంలోనే అతను ప్రాణంవదిలాడు.

* * * * *

రవీందర్ మరణంతో పరిస్థితులు పూర్తిగా–

ఇప్పుడు వెన్నెలకి అనుకూలంగా మారిపోయాయి.

రవీందర్ మరణంతో బోర్డుమీటింగ్ వారం రోజుల తర్వాతకు వాయిదా పడింది.

ఈలోపల–

వెన్నెల వూహించినట్టే స్టెల్లా శరత్‌చంద్రకు దగ్గరవటం గమనించింది వెన్నెల. స్టెల్లా తెలివయినది. అనుకూలమైనది. అన్నిటికి మించి తన తండ్రి దగ్గర పి.ఎ.గా పనిచేసింది.

ఆమెకు మిడాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ గురించి అంతా తెలుసు. రవీందర్ కుటిలబుద్ధితో నష్టాలబాట పట్టించిన కంపెనీలను తిరిగి లాభాలబాటకు తేవటం ఎలాగో ఆమెకు తెలుసు.

ఆమెను తన అన్నకు సెక్రటరీగా చేసి శరత్‌చంద్రకే కంపెనీ బాధ్యతలు వప్పగిస్తే ఎలా వుంటుందాని ఆలోచించింది వెన్నెల. కాని అంత కన్నా మరో పథకం ఆమె మనసులో రూపుదిద్దుకుంది.

ఇది ఆమె విశాల దృక్పధానికి, వ్యాపారదక్షతకు అద్దంపట్టే నిర్ణయం.

చివరి క్షణం వరకూ ఆమె మనసులో ఏముందో ఎవరూ వూహించలేకపోయారు.

ఇదే సమయంలో తన పర్సనల్ విషయాల్లో ఓడిపోబోతున్న భావం ఆమెలో కలకలం సృష్టించనారంభించింది. ఆలోచించి చూస్తే ఆ రోజు నిరంజన్ ముందు అలా తొందరపడి మాట్లాడి వుండకూడదనిపించింది.

ఏమో... నిరంజన్ నిజంగానే తనను ప్రేమిస్తున్నాడేమో. అయినా అనూప్ గురించి తెలిసింది గాబట్టి డౌట్ క్లియర్ చేసుకోడానికి అడిగివుంటాడు.

అతని ప్రేమను తను ఆశిస్తున్నప్పుడు అతని డౌట్లు, క్లియర్ చేయాల్సిన బాధ్యత తనదేగదా... ఒకరికొకరు మనసు విప్పి మాట్లాడుకోనిదే అపోహలు ఎలా తొలగిపోతాయి?

రెండు మూడు రోజులు ఇదే విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూనే ఒక నిర్ణయానికొచ్చి నిరంజన్ కోసం ఫోన్ చేసింది. అతని ఫోన్ స్విచాఫ్. అతనికి తనమీద కోపం వచ్చుండాలి.

అందుకే ఫోన్ చేయలేదు అనుకుంది. ఆ తర్వాత విచారించగా తెలిసిందేమంటే నిరంజన్ బొంబాయి వెళ్ళాడనీ రావటానికి కొద్దిరోజులు పడుతుందనీ.

వారం రోజులయినా నిరంజన్ తిరిగి రాలేదు.

అతన్ని చూడాలి. మాట్లాడాలి అనే ఆతృత ఆమెలో అధికం కాసాగింది. నిజమైన విరహవేదన ఎలా వుంటుందో ఇప్పుడు ఆమెకు అర్థమవుతోంది.

ఈ పరిస్థితుల్లోనే–

కంపెనీ బోర్డాఫ్ డైరక్టర్ల మీటింగ్ ఏర్పాటయింది. ఆ రోజు తన అన్న శరత్‌చంద్ర, రామకృష్ణంరాజు, స్టెల్లా అందరితో కలిసి మీటింగ్‌కు హాజరయింది వెన్నెల.

ఆమె ప్రతిపాదన విని–

అంతా ఆశ్చర్యపోయారు.

"ఈ మీటింగ్‌కు ఒక ప్రత్యేకత వుంది. మీరంతా అనుకున్నట్టు తిరిగి ఇక్కడ ప్రెసిడెంట్ గానో, ఛైర్మన్‌గానో పదవిలో కూచునే ఉద్దేశ్యంతో

రాలేదు. బోర్డ్ మెంబర్‌గా మాత్రమే వచ్చాను. నా అన్న శరత్‌చంద్రను మిడాన్ గ్రూప్‌కి ఛైర్మన్‌గాను, ఇంతవరకు మా డాడీ దగ్గర ఆ తర్వాత నా దగ్గర పి.ఎ.గా పనిచేసిన మిస్ స్టెల్లాను ప్రెసిడెంట్‌గాను నేను నామినేట్ చేస్తున్నాను.

వీరిద్దరూ కలిసి మన కంపెనీని లాభాల దిశగా నడిపిస్తారన్న నమ్మకంతో ఈ ప్రతిపాదన చేస్తున్నాను" అంది.

ఆమె ప్రతిపాదనకి రామకృష్ణంరాజుతో బాటు అంతా ఆశ్చర్యపోయారు. శరత్, స్టెల్లాలా అసలు ఇలాంటి ప్రతిపాదన ఒకటి వెన్నెల మనసులో వుందని వూహించలేదు.

ఆమెను రామకృష్ణంరాజు బలపర్చాడు.

ఆ తర్వాత బోర్డు మెంబర్స్‌ని ఒప్పించటంతో సమస్యలు ఎదురుకాలేదు. కొద్దిసేపట్లోనే కంపెనీ ఛైర్మన్‌గా శరత్‌చంద్రా, ప్రెసిడెంట్‌గా స్టెల్లా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

"వెన్నెలా! ఇది నమ్మలేకపోతున్నాను. ఇంత బాధ్యతని నా భుజాలకు ఎత్తటం భరించలేకపోతున్నాను...." అంది స్టెల్లా వెన్నెల చేతులు పట్టుకుని.

"అప్పుడే ఏమైంది?" అంటూ శరత్, స్టెల్లాను చూసి నవ్వింది వెన్నెల.

"విజృంభనతో డైవర్స్ కాగానే నీకూ అన్నయ్యకూ పెళ్ళి జరిపిస్తాను. కంపెనీ భారంతోబాటు అప్పుడు కుటుంబ భారం కూడా నీపైపడుతుంది. ఇకనుంచి నువ్వు నా అన్న అదృష్టం కావాలని నా ఆశ... అంటూ వెన్నెల చెపుతుంటే శరత్, స్టెల్లాల కళ్ళలో ఆనంద భాష్పాలు నిలిచాయి.

ఆ రాత్రి ఎనిమిదిగంటలకి శరత్‌చంద్ర తను ఇంటివద్ద గ్రాండ్‌గా పార్టీ ఏర్పాటు చేసాడు.

ఆ పార్టీలో నిరంజన్ తన పక్కనుంటే బాగుండునని వెన్నెల ఆశ.

అతడి సెల్‌కు ఫోన్‌చేస్తే రెస్పాన్స్‌లేదు.

ఇంటికి ఫోన్‌చేస్తే నిరంజన్ ఇంకా తిరిగిరాలేదని తెలిసి చాలా బాధపడింది.

తనతో చెప్పకుండా నిరంజన్ బొంబాయి వెళ్ళటం వెన్నెల ఆశ్చర్యపరచింది. కాని పార్టీ హడావుడిలలో ఇక విషయం మర్చిపోయింది.

అర్ధరాత్రికి కాస్తా అటూ ఇటూ పార్టీలో ముగిసింది.

అంతా గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోతున్నప్పుడు స్టెల్లా మాత్రం శరత్‌చంద్రతో అక్కడే వుండిపోయింది.

✳ ✳ ✳ ✳ ✳

ఆ ఉదయం సడెన్‌గా మధుసూదన్‌రెడ్డి తన ఫ్లాట్‌కి రావటం వెన్నెలని ఆశ్చర్యపరిచింది. మర్యాదలు అయికూచున్నాక–

"నిరంజన్ ఎప్పుడొస్తున్నారు అంకుల్?" అడిగింది వెన్నెల.

"అదే నిన్ను అడగాలని వచ్చాను" అన్నాడాయన.

"నన్నా...."

"అవును. వాడు నిన్ను ప్రేమిస్తున్నాడు. ఆ విషయం నీతో చెప్పలేక ముంబయివెళ్ళి కూర్చున్నాడు. నీ మనసులో ఏముందో నాకు తెలీదు గాని, నువ్వు వాడికి తగిన జోడి అని నాకు తెలుసు. చెప్పమ్మా, నా కోడలిగా రావటం యిష్టమేగా?" సూటిగా అడిగాడాయన.

సిగ్గుపడింది వెన్నెల.

"నా మనసులో మాట చెప్పాలనుకునేలోగా నిరంజన్ ముంబయి వెళ్ళాడు. నేను వెళ్ళి తీసుకొస్తాను అంకుల్ అడ్రస్ యివ్వండి" అంది.

"సంతోషం" అంటూ ముంబయి అడ్రసిచ్చి వెళ్ళాడు మధుసూదన్‌రెడ్డి.

సాయంత్రం ఫ్లయిట్‌కే–

వెన్నెల ముంబయి బయలుదేరింది నిరంజన్‌కోసం.

**– : అయిపోయింది :–**

© Suryadevara Ram Mohan Rao
all novels are under Copy Right Act



నా ప్రియ మిత్రులు

శ్రీ కిషోర్ వెల్లం కి గార్కి,

వారి కుటుంబ సభ్యులకి,

ఆత్మీయాభినందనలతో...

- సూర్యదేవర రామ్ మోహనరావు

For My eNovels : www.kinige.com
Email : suryadevaranovelist@gmail.com